
www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
గురువారం | 31-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 145 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం, తిథి: సప్తమి తె 4:59 తదుపరి అష్టమి, నక్షత్రం: చిత్త రా.12:42 తదుపరి స్వాతి, వర్జ్యం: ఉ.6:49-8:36, దుర్ముహూర్తం: ఉ.10:13-11:04, మ.3:20-4:11, అమృతఘడియలు: సా.5:32-7:20, రాహుకాలం: మ.1:30-3:00, సూర్యోదయం: 5:57, సూర్యాస్తమయం: 6:45 | గుంటూరు సిటీ
Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రూ.378 కోట్ల సైబర్ దోపిడీ!

- దేశంలోనే అతిపెద్ద 'క్రిప్టో' సంస్థ నెబ్లియో టెక్నాలజీస్ సర్వర్ హ్యాక్
- సంస్థ ఉద్యోగి ల్యాప్‌టాప్ నుంచే 44 మిలియన్ యూఎస్‌డీటీ బదిలీ
- సంస్థ అంతర్గత భద్రతను లక్ష్యంగా చేసుకుని పేట్రేగిన సైబర్ ముఠా
- అసాధారణ మోసమేనన్న నెబ్లియో
- దేశంలోనే అతిపెద్ద ఘటన: పోలీసులు



బెంగళూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాల్లో ఇది పరాకాష్ఠ!. ఇప్పటి వరకు వ్యక్తులను డిజిటల్ అరెస్టు చేయడం, బెదిరించి సొమ్ము బదిలీ చేసుకోవడం తెలిసిందే. అలాగే ఇతర రూపాల్లోనూ మోసాలకు పాల్పడి నగదును దోచేస్తున్న సైబర్ నేరగాళ్లు.. ఇప్పుడు కంపెనీలను కూడా లక్ష్యంగా చేసుకుని పేట్రేగి పోతున్నారు. అత్యంత పటిష్ఠమైన అంతర్గత భద్రత ఉన్న బెంగళూరులోని

మిగతా 12వ పేజీలో...

భారత్‌పై 25% సుంకం

- రష్యా నుంచి ఆయుధాలు, చమురు కొంటున్నందుకు జరిమానా కూడా!
- సుంకాల అమలు రేపటి నుంచే.. ఈసారి గడువు పొడిగించే ప్రసక్తే లేదు
- ఇండియా మాకు మిత్రదేశమే అయినా.. భారీ సుంకాలు వేస్తోంది: ట్రంప్
- తాజా సుంకాల ప్రభావాన్ని పరిశీలిస్తున్నాం.. కేంద్ర ప్రభుత్వ వర్గాల వెల్లడి
- 2 దేశాలకూ లాభదాయకమైన ఒప్పందం కుదురుతుందని ఆశాభావం
- మోదీ, ట్రంప్ మధ్య స్నేహంతో ప్రయోజనం లేదని తేలింది: విపక్షాలు

వాషింగ్టన్, జూలై 30: రెండోసారి అధికారం చేపట్టినప్పటి నుంచి సుంకాల రంకెలేస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. భారత ఉత్పత్తులపై 25% సుంకం విధిస్తున్నట్టు తాజాగా ప్రకటించారు. శుక్రవారం (ఆగస్టు 1) నుంచే ఈ సుంకం అమల్లోకి వస్తుందని ప్రకటించారు. సుంకంతోనే సరిపెట్టలేదాయన.. రష్యా నుంచి చమురు, ఆయుధాలు కొనుగోలు చేస్తున్నందుకుగాను భారత్‌పై జరిమానా కూడా విధిస్తామని హెచ్చరించారు. అమెరికా విమోచన దినం పేరుతో ఈ ఏడాది ఏప్రిల్ 2న ఆయన భారత్‌పై 26% సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. అయితే.. భారత్ సహా పలు దేశాలపై సుంకాల అమలును 90 రోజులపాటు నిలిపివేస్తున్నట్టు ఆయనే ఏప్రిల్ 9వ తేదీన

మిగతా 2వ పేజీలో...



ఇరు దేశాలకూ నష్టమే! 2

- అమెరికాలో వినియోగదారులపై అధిక ధరల భారం
- ఆ దేశంలో పెరగనున్న స్మార్ట్‌ఫోన్లు, ఆభరణాలు, రెడీమేడ్ దుస్తులు, ఆటో విడిభాగాలు, ఔషధాల ధరలు
- మన ఆర్థిక వ్యవస్థపై రూ.2.5 లక్షల కోట్ల మేర ప్రభావం

బాక్సులు బద్దలు

లిక్కర్ స్కామ్ సొమ్ము 11 కోట్లు సీజ్

ఇంత భారీ నగదు పట్టుబడటం దేశ చరిత్రలోనే తొలిసారి

మద్యం కుంభకోణంలో ప్రధాన నిందితుడు రాజ్‌కసిరెడ్డి వసూళ్ల బృందంలో ఏ-40 వరుణ్ పురుషోత్తం కీలకం. కసిరెడ్డి ఆదేశాల మేరకు బూనేటి చాణక్య, వరుణ్ పురుషోత్తం మద్యం ముడుపుల ద్వారా వచ్చిన రూ.11 కోట్ల నగదును 2024 జూన్‌లో హైదరాబాద్ శివారులోని వర్ధమాన్ ఇంజనీరింగ్ కాలేజీకి తరలించారు. ఆ తర్వాత 2024 నవంబరులో సమీపంలోని ఫామ్‌హౌస్‌కు మార్చారు.

దుబాయ్‌కు పారిపోయిన వరుణ్ తిరిగి వస్తున్న విషయం తెలుసుకున్న సిట్ మంగళవారం రాత్రి శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అతన్ని అదుపులోకి తీసుకుంది. లోతుగా విచారించగా ఫామ్‌హౌస్‌లో నగదు డంప్ విషయం బయటపడింది. వెంటనే సోదాలు నిర్వహించి 12 అట్టపెట్టెల్లో దాచి ఉంచిన 11 కోట్ల నగదును సిట్ స్వాధీనం చేసుకుంది.

నగదు దాచిన ఫామ్‌హౌస్ రాజ్ కసిరెడ్డి భార్య దివ్యారెడ్డి భాగస్వామిగా ఉన్న ఆరేట్ ఆస్పత్రిలో మరో భాగస్వామి తీగల బాల్‌రెడ్డి కుటుంబానికి చెందినది. ఆయన భార్య సులోచన పేరు మీద ఈ ఫామ్‌హౌస్ ఉంది. బాల్‌రెడ్డి కుమారుడు తీగల విజయేందర్‌రెడ్డి వర్ధమాన్ ఇంజనీరింగ్ కాలేజీ యజమాని.



ఫాంహౌస్‌లో పట్టుబడ్డ నగదుతో సిట్ అధికారులు

- హైదరాబాద్ సమీపంలోని ఫామ్‌హౌస్‌లో స్వాధీనం
- 12 అట్ట పెట్టెల్లో నోట్ల కట్టలు
- దుబాయ్ నుంచి వస్తుండగా శంషాబాద్‌లో ఏ-40 వరుణ్ అరెస్ట్
- అతడిచ్చిన సమాచారంతో సోదాలు
- ఫామ్‌హౌస్ యజమాని కసిరెడ్డి మిత్రుడే
- విజయవాడకు నగదు, వరుణ్ తరలింపు
- ఏసీబీ కోర్టుకు సిట్ సమాచారం

అమరావతి/రంగారెడ్డిజిల్లా ప్రతినిధి/శంషాబాద్ రూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): దేశంలో ఎన్నో కుంభకోణాలు జరిగాయి. కానీ మొట్టమొదట సారిగా స్కామ్‌కు సంబంధించిన నగదు పెద్ద మొత్తంలో దర్యాప్తు అధికారులకు దొరికిపోయింది. కేసులో నిందితుడు ఇచ్చిన సమాచారంతో జరిపిన సోదాల్లో నోట్ల కట్టలు వెలుగు చూశాయి. జగన్ ప్రభుత్వంలో జరిగిన మద్యం కుంభకోణంలో ముడుపులు వసూలు చేసి దాచిన రూ.11 కోట్ల నగదు డంప్ బయటపడింది. హైదరాబాద్ శివారులోని ఓ వ్యవసాయ క్షేత్రంలో

మిగతా 14వ పేజీలో...



ఎస్ఎంబీసీ మేనేజింగ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాజీవ్ కన్నన్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు

అపార వనరులున్నాయ్..

పెట్టుబడులతో ఏపీకి రండి

- సింగపూర్ పర్యటన చివరి రోజు దిగ్గజ సంస్థలు, బ్యాంకర్లతో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ
- రాష్ట్రంలో ప్రాంతాలవారీగా పెట్టుబడుల అవకాశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్.. 4 రోజుల్లో 26 భేటీలు
- పలువురు పారిశ్రామికవేత్తలతో సమావేశాలు

అమరావతి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అపార వనరులున్నాయని, వ్యాపార అభివృద్ధికి పెద్దఎత్తున అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. పెట్టుబడులతో వచ్చి రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కావాలని సింగపూర్‌లోని పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. సింగపూర్ పర్యటనలో చివరిరోజు బుధవారం పలు దిగ్గజ సంస్థలు, పారిశ్రామికవేత్తలు, బ్యాంకర్లతో చంద్రబాబు వరుస భేటీలు నిర్వహించారు. రాష్ట్రంలో ప్రాంతాల వారీగా

మిగతా 13వ పేజీలో...

ప్రోత్సాహకాలిస్తే

తప్పేంటి?



- పెట్టుబడులను ఆకర్షించడం కోసమే టీసీఎస్‌కు నామమాత్ర ధరకు భూములు ఇచ్చి ఉంటారు
- రాష్ట్ర అభివృద్ధి ప్రారంభ దశలో ఉంది
- ఎంత రేటుతో భూమి కేటాయిస్తున్నారని కాదు.. ఆ సంస్థ రాకతో ఎంత లాభం అనేది చూడాలి
- ఐటీతో హైదరాబాద్, బెంగళూరు స్థితి చూస్తున్నాం కదా?
- హైకోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు.. లీజుకు కేటాయిస్తున్నామన్న ఎస్‌జీపీ.. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలుకు బెంచ్ ఆదేశం

అమరావతి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రోత్సాహకాలు ఇస్తే తప్పేముందని హైకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) లాంటి ప్రతిష్ఠాత్మక సంస్థను ఆకర్షించేందుకు నామమాత్రపు రేటుతో భూమిని కేటాయించి ఉండవచ్చని పేర్కొంది. టీసీఎస్ రూ.1,370 కోట్ల పెట్టుబడితో 12 వేల ఉద్యోగాలు కల్పిస్తుందని ప్రభుత్వ ఉత్తర్వుల్లో ఉందని గుర్తు చేసింది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు పెట్టుబడులను ఆకర్షించేందుకు నామమాత్రపు ధరకు భూమిని కేటాయించడంతో పాటు వివిధ ప్రోత్సాహకాలు ఇస్తున్నాయని గుర్తు చేసింది. రాష్ట్ర అభివృద్ధి ప్రారంభ దశలో ఉందని తెలిపింది. ఇలాంటి సమయంలో భూమిని ఎంత రేటుకు

మిగతా 13వ పేజీలో...

వాదనలు ఇవాళ వినిపించాల్సిందే!



- లేదంటే వేరే మార్గాలు చూసుకోండి
- సీఐడీ మాజీ చీఫ్ సంజయ్ తరఫు న్యాయవాదులకు సుప్రీం స్పష్టీకరణ
- ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరును సవాల్ చేసిన రాష్ట్ర ప్రభుత్వం 14
- సీనియర్ న్యాయవాది అందుబాటులో లేరంటూ వాయిదా కోరిన సంజయ్ తరఫు లాయర్
- విచారణలో జాప్యానికేనన్న ప్రభుత్వ న్యాయవాది





మోదీకి ధైర్యం లేదు

- ట్రంప్ అబద్ధాలాడుతున్నారని చెప్పలేకపోతున్నారు
- అలా చేస్తే ఆయన నిజం బయటపెడ్తారు: రాహుల్
- 2 గంటల ప్రసంగంలో ఒక్కసారీ ట్రంప్ పేరెత్తలేదు

2

పీవోకేను ఇచ్చింది మీరే

దానిని బీజేపీ ప్రభుత్వమే తిరిగి తీసుకొస్తుంది

కేంద్ర హోం మంత్రి అమిత్ షా

రాహుల్.. చైనా గురువు!

విదేశాంగ మంత్రి జైశంకర్ ఎద్దేవా

రాజ్యసభ చర్చలో నెహ్రూ, కాంగ్రెస్‌పై ధ్వజం

నింగిలోకి నిసార్

జీఎస్ఎల్వీ-ఎఫ్16 ప్రయోగం విజయవంతం

- అంతరిక్షంలోకి దూసుకెళ్లిన భూపరిశీలన ఉపగ్రహం
- ఇస్రో-నాసా ఉమ్మడి ప్రయోగం గ్రాండ్ సక్సెస్
- 19 నిమిషాల్లోనే నిర్దేశిత కక్ష్యలోకి నిసార్ ఉపగ్రహం
- జీఎస్ఎల్వీ ప్రయోగాల్లో మరోసారి ఇస్రో సత్తా
- సంస్థ చరిత్రలో ఇదొక మైలురాయి: నారాయణన్

సూళ్లూరుపేట, తడ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అంతరిక్ష రంగంలో ఇస్రో మరో అద్భుత విజయాన్ని అందుకుంది. అమెరికా అంతరిక్ష సంస్థ నాసాతో కలిసి చేపట్టిన భూపరిశీలన ఉపగ్రహం నిసార్ (నాసా-ఇస్రో సింథటిక్ అపార్చర్ రాడార్) ప్రయోగం విజయవంతమైంది. యావత్ ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన నాసా-ఇస్రో మిషన్ సక్సెస్ కావడంతో ఇస్రో ఉత్సాహం రెట్టింపైంది. ఇస్రో చరిత్రలో ఈ ప్రయోగం ఒక మైలురాయిగా

మిగతా 12వ పేజీలో...



నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్తున్న జీఎస్ఎల్వీ-ఎఫ్16 రాకెట్

MY HOME

మైహోమ్ నుంచి ఏ హోమ్‌కు!?

919 ఎకరాల సున్నపురాయి లీజు బదిలీ

- 2016లో మైహోమ్ సంస్థకు కేటాయింపు
- 'క్యాప్టివ్' కింద సిమెంట్ ఫ్యాక్టరీ పెట్టాలనే షరతు
- గడువులు దాటినా ఏర్పాటుకాని ఫ్యాక్టరీ
- ఇప్పుడు 'రాధాంగ ఇండస్ట్రీస్'కు లీజులు బదిలీ
- ఎన్సీఎల్టీ నుంచి ఉత్తర్వులు తెచ్చుకున్న మైహోమ్
- మైహోమ్ హబ్‌లోనే 'రాధాంగ' చిరునామా
- 'క్యాప్టివ్' పదం లేకుండానే ఉత్తర్వులు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

అవే భూములు! అవే సున్నపురాయి గనులు! కానీ... కంపెనీ మారింది! షరతులు మాయమయ్యాయి. సిమెంటు ఫ్యాక్టరీ పెట్టి, దానికోసమే సున్నపురాయి వాడాలంటూ 'మైహోమ్'కు కేటాయించిన గనులను... ఇప్పుడు 'రాధాంగ ఇండస్ట్రీస్' అనే మరో కంపెనీకి బదిలీ చేశారు. అందులో... 'క్యాప్టివ్' అనే షరతూ లేదు. మరో విశేషమేమిటంటే... రాధాంగ ఇండస్ట్రీస్ చిరునామా కూడా 'మైహోమ్ హబ్'లోనే ఉంది. అంటే... మైహోమ్ సంస్థకు షరతులతో కేటాయించిన సున్నపు రాయి గనులను అదే కంపెనీ ఏర్పాటు చేసుకున్న అనుబంధ సంస్థకు

మిగతా 14వ పేజీలో...

ఆయుధాలు అప్పగించి వైదొలగండి 2

- గాజా పాలన పాలస్తీనా అథారిటీకి..
- హమాస్‌కు తేల్చి చెప్పిన అరబ్ దేశాలు
- ఐరాస సదస్సులో 2 దేశాల సూత్రంపై చర్చ
- అరబ్ లీగ్, ఈయూ, 17 దేశాల మద్దతు

రుతుపవన విరామం?

- దక్షిణాదిలో కొనసాగనున్న వర్షాభావం
- ఖరీఫ్ పంటలపై తీవ్ర ప్రభావం 3
- పెరగనున్న ఎండ తీవ్రత: స్కైమెట్

నిండుకుండలా పులిచింతల

- వచ్చిన నీరు వచ్చినట్టే దిగువకు విడుదల
- ప్రకాశం బ్యారేజీ గేట్లు ఎత్తివేత 2

ఉచిత ప్రయాణానికి గుర్తింపు తప్పనిసరి

- రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా వెళ్లవచ్చు
- ఏపీ మహిళలకు మాత్రమే పథకం వర్తింపు
- పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రోల్లో అనుమతి 12
- ఆర్టీసీ ఎండీ తిరుమలరావు, చైర్మన్ కొనకళ్ల



12

టెన్త్ ప్రశ్నపత్రాల్లో మార్పులు

సృజనాత్మక ప్రశ్నలకు ప్రాధాన్యం



రష్యాలో 8.8 తీవ్రతతో భారీ భూకంపం

- ఊగిపోయిన కమ్చట్కా ద్వీపకల్పం.. పసిఫిక్ తీర ప్రాంత దేశాలకు సునామీ హెచ్చరిక
- రష్యా, జపాన్, అమెరికాలోని కొన్ని ప్రాంతాల్లో చిన్నపాటి సునామీలు 12
- ముందు జాగ్రత్తలతో తప్పిన ప్రాణ నష్టం.. తీర ప్రాంతాల నుంచి వేల మంది తరలింపు

ట్రంప్ పేరు చెప్పేందుకు
మోదీకి ధైర్యం లేదు

అందుకే ట్రంప్ చెప్పేదంతా అబద్ధం అనలేకపోతున్నారు: రాహుల్



న్యూఢిల్లీ, జూలై 30: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెబుతున్నదంతా అబద్ధమని ప్రధాన మంత్రి మోదీ చెప్పలేకపోతున్నారని కాంగ్రెస్ విమర్శించింది. భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణలో తాను కీలక పాత్ర పోషించానని ట్రంప్ ఇప్పటికి దాదాపు 30సార్లు ప్రకటించుకోవడంపై మోదీ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేసింది. ట్రంప్ అబద్ధం చెబుతున్నారని చెప్పే ధైర్యం మోదీకి లేదని ఎద్దేవా చేసింది. కాల్పుల విరమణ విషయంలో తన పాత్ర గురించి ట్రంప్ అబద్ధం చెబుతున్నారని మోదీ చెప్పలేరని, అలా చేస్తే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిజాన్ని బయట పెడతారని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ విమర్శించారు. 'ఒకవేళ ట్రంప్ చెప్పేది అబద్ధమని మోదీ చెబితే.. నిజం ఏమిటో ఆయనే బహిరంగంగా చెబుతారు. అందుకే ప్రధాని ఏమీ చెప్పలేకపోతున్నారు' అని వ్యాఖ్యానించారు. ట్రంప్ అబద్ధం చెబుతున్నారని చెప్పే ధైర్యం మోదీకి లేదని, ఈ వ్యవహారం మొత్తం అనుమానాస్పదంగా ఉందని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే అన్నారు. ఇదిలా ఉండగా, భారత తొలి ప్రధాని నెహ్రూను ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా లోక్‌సభలో విమర్శించడంపై కాంగ్రెస్ మండిపడింది.

127 ఏళ్ల తర్వాత భారత్‌కు బుద్ధుడి అవశేషాలు

న్యూఢిల్లీ, జూలై 30: బ్రిటిష్ పాలనలో భారత్ నుంచి తరలిపోయిన బుద్ధుడి పవిత్ర అవశేషాలను 127 ఏళ్ల తర్వాత తిరిగి స్వదేశానికి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఈ అద్భుత ఘట్టం మన దేశానికి, మన సాంస్కృతిక వారసత్వానికి గర్వకారణమని మోదీ పేర్కొన్నారు. ఈ పవిత్ర అవశేషాలు బుద్ధుడితో భారతదేశానికి గల అనుబంధాన్ని, ఆయన ఉన్నత బోధనలను ప్రతిబింబిస్తాయని అన్నారు. 1898లో ఉత్తరప్రదేశ్‌లోని పిపర్వాహలో (భారత్-నేపాల్ సరిహద్దుకు సమీపం) ఓ పురాతన బౌద్ధ స్తూపం తవ్వకాల్లో కొన్ని అవశేషాలు బయటపడ్డాయి. గౌతమ బుద్ధుడివని భావిస్తున్న అస్థి అవశేషాలు, విలువైన పేటికలు, బంగారు ఆభరణాలు, రత్నాలు వీటిలో ఉన్నాయి.

వేధించిన న్యాయమూర్తికి పదోన్నతి.. మధ్యప్రదేశ్‌లో మహిళా జడ్జి రాజీనామా

భోపాల్, జూలై 30: తనను వేధించిన ఓ న్యాయమూర్తికి పదోన్నతి లభించడాన్ని నిరసిస్తూ ఓ మహిళా జడ్జి రాజీనామా చేశారు. తన ఆవేదనను రాష్ట్రపతికి లేఖ రూపంలో వివరించినా.. ఫలితం లేదని వ్యాఖ్యానించారు. మధ్యప్రదేశ్‌లోని శహడోల్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న అదితికుమార్ శర్మ అనే జడ్జి సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. తనను వేధించిన న్యాయమూర్తి రాజేశ్‌కుమార్ గుప్తాకు మధ్యప్రదేశ్ హైకోర్టులో పదోన్నతి లభించడానికి నిరసనగా ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె ఓ సుదీర్ఘ లేఖను విడుదల చేశారు. గుప్తా పదోన్నతిని నిరసిస్తూ తాను రాష్ట్రపతికి, మధ్యప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి, సుప్రీంకోర్టుకు, రిజిస్ట్రార్ జనరల్, కొలీజియంకు లేఖలు రాసిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ లేఖలపై ఎలాంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

'అనధికార' న్యాయవాదికి ఝలక్

- సెంట్రల్ జైల్లో తరచూ కలుస్తున్న హుస్సేన్
- ఆంధ్రజ్యోతి కథనంతో కనిపించని లాయర్

రాజమహేంద్రవరం, జూలై 30(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డిని అనధికారికంగా ఓ న్యాయవాది కలుస్తున్నారనే విషయం అలజడి సృష్టించింది. మిథున్‌రెడ్డిని కలవడానికి ఏసీబీ కోర్టు నలుగురు న్యాయవాదులకు అనుమతివ్వగా, హుస్సేన్ అనే న్యాయవాది ములాఖత్‌లకు హాజరవుతున్నారనే విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. దీనిపై ఉన్నతాధికారులు ఆరా తీశారు. మిథున్‌రెడ్డి ప్రధాన న్యాయవాది టి.నాగార్జునరెడ్డి తరఫున హుస్సేన్ వస్తారని, ఆమేరకు ఆయన తమకు లేఖ రాశారని సెంట్రల్ జైలు అధికారులు చెబుతున్నారు. ఈ విషయాన్ని కోర్టుకు కూడా తెలియజేశామన్నారు. బుధవారం ఆ న్యాయవాది రాలేదని ఓ జైలు అధికారి చెప్పారు. ఏసీబీ కోర్టు ఫలానా న్యాయవాదులే వెళ్లాలని ఆర్డరు ఇచ్చినపుడు ఒక న్యాయవాది ఇచ్చిన లేఖను అధికారికంగా పరిగణించవచ్చా అనేది కూడా చర్చకు వచ్చింది. ఎవరు ములాఖత్‌కు వెళ్లినా వారితో ఆ న్యాయవాది వెళ్లడానికి వీలులేదు. మొత్తం మీద న్యాయవాది హుస్సేన్ జైలుకు వస్తుండడం వివాదాస్పదమైంది. బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంతో ఆ న్యాయవాది పత్తా లేరు. మిథున్‌రెడ్డి చిన్నాన్న జైలు వద్దకు వచ్చినా ఆయన వెంట రాలేదు.

మిథున్‌రెడ్డిని కలిసిన మండలి చైర్మన్

రాజమహేంద్రవరం జైలులో రిమాండులో ఉన్న వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డిని బుధవారం శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు కలిశారు. 40 నిమిషాలు మాట్లాడారు. నరసాపురం మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు కూడా జైలు లోపలికి వెళ్లడానికి ప్రయత్నించగా, జైలు అధికారులు ప్రధాన ద్వారం వద్ద నిలిపివేశారు. బయటకు వచ్చాక మోషేన్‌రాజు మీడియాతో మాట్లాడకుండానే వెళ్లిపోయారు. మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ తదితరులు మోషేన్‌రాజును కలిశారు. మిథున్‌రెడ్డి బాబాయి, ఎమ్మెల్యే ద్వారకానాథ్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు, లోకేశ్ తమ కుటుంబంపై కక్షతో తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆరోపించారు.

నిండుకుండలా పులిచింతల

- వచ్చిన నీరు వచ్చినట్టే దిగువకు విడుదల
- ప్రకాశం బ్యారేజీ గేట్లు ఎత్తివేత



పూర్తిగా నిండిన పులిచింతల రిజర్వాయర్
(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఎగువన నాగార్జునసాగర్ నుంచి వస్తున్న వరదతో పులిచింతల ప్రాజెక్టు నిండు కుండలా మారింది. 41.58 టీఎంసీల నీరు చేరడంతో 12 గేట్లను మూడు అడుగులకు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్టు దిగువనున్న ప్రకాశం బ్యారేజీకి విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో 3,01,167 క్యూసెక్కులు ఉంది. గంట గంటకూ సాగర్ నుంచి ప్రవాహం పెరుగుతోందని పులిచింతల ప్రాజెక్టు డీఈ వెంకట్ తెలిపారు. జూలై ఆఖరుకే పులిచింతల ప్రాజెక్టు నిండటం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భారీగా వరద వస్తుండటంతో ప్రకాశం బ్యారేజీ 70 గేట్లను ఎత్తి సముద్రంలోకి నీటిని విడుదల చేస్తున్నారు. నదీ తీరాల గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. ప్రస్తుతం ప్రకాశం బ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 94,679 క్యూసెక్కులు ఉందని, ఇది 3 లక్షల క్యూసెక్కులకు చేరే అవకాశం ఉందని తెలిపింది. కాగా.. శ్రీశైలం డ్యాంకు వరద పోటెత్తుతోంది. జూరాల, సుంకేసుల నుంచి 2,89,670 క్యూసెక్కుల వరద శ్రీశైలంలోకి వచ్చి చేరుతోంది. దీంతో 8 స్పిల్‌వే గేట్ల ద్వారా దిగువకు 2,16,520 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 20 వేల క్యూసెక్కులు, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం ద్వారా 33,315 క్యూసెక్కులు, కుడి గట్టు విద్యుత్ కేంద్రం ద్వారా 30,643 క్యూసెక్కులు మొత్తం 3,02,478 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 882.80 అడుగులకు చేరుకుంది. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 2,82,364 క్యూసెక్కుల వరద చేరుతోంది. 26 గేట్ల ద్వారా 2,65,816 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

రాహుల్.. చైనా గురువు!

బీజింగ్ ఒలింపిక్స్‌కు వెళ్లి ఆ దేశం నుంచి పాఠాలు నేర్చుకున్నారు

- అవి చాలక చైనా రాయబారితో ట్యూషన్లు
- విదేశాంగ మంత్రి జైశంకర్ ఎద్దేవా
- రాజ్యసభ చర్చలో నెహ్రూ, కాంగ్రెస్‌పై ధ్వజం



న్యూఢిల్లీ, జూలై 30: విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ రాజ్యసభలో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీని, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్‌ను చైనా గురువులుగా అభివర్ణించారు. దౌత్యవేత్తగా పనిచేసిన తనకు చైనా గురించి పెద్దగా తెలీదని.. రాహుల్, ఆయన కుటుంబ సభ్యులు మాత్రం బీజింగ్ ఒలింపిక్స్‌కు వెళ్లి చైనా గురించి తెలుసుకున్నారని.. ఇక్కడి చైనా రాయబారి నుంచి ప్రత్యేకంగా ట్యూషన్లు చెప్పించుకున్నారని ఎద్దేవాచేశారు. తాను ఇటీవల ఆ దేశాన్ని సందర్శించినప్పుడు సదరు చైనా గురువుల్లా రహస్య భేటీలు జరుపడం గానీ, రహస్య ఒప్పందాలు కుదుర్చుకోవడం గానీ చేయలేదన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై బుధవారం రాజ్యసభలో చర్చ సందర్భంగా.. ప్రథమ ప్రధాని నెహ్రూ, గత కాంగ్రెస్ ప్రభుత్వాలపై జైశంకర్ విరుచుకుపడ్డారు. ఏ దేశమైనా తనకు మేలు జరిగేలా, తన రాష్ట్రాలకు ఎక్కువ నీరు అందేలా ఒప్పందాలు చేసుకుంటుందని.. కానీ నెహ్రూ కుదుర్చుకున్న సింధూ జలాల ఒప్పందంతో నీళ్లపై మనకు హక్కే లేకుండా చేశారని.. పాకిస్థాన్‌లోని పంజాబ్‌కు 80% నీరివ్వడమే గాక ఆర్థిక సాయం కూడా అందించారని ధ్వజమెత్తారు. పాకిస్థాన్-చైనా బంధం గురించి రాహుల్ మాట్లాడుతున్నారని.. ఇది రాత్రికి రాత్రి ఏర్పడిన బంధం కాదని.. 1960ల నుంచే ఆ దేశాల నడుమ పరస్పర సహకారం ప్రారంభమైందన్నారు. తాను 41 ఏళ్లు దౌత్యవేత్తగా ఉన్నానని.. దీర్ఘకాలం చైనాలో రాయబారిగా కూడా పనిచేశానని.. అయినా తానేమీ చేయడం లేదని కొందరు అంటున్నారని ఆక్షేపించారు. 'ఇప్పుడు కొందరు చైనా గురువులు ఉన్నారు. వారికి ఆ దేశమంటే వల్లమాలిన అభిమానం. వారిలో ఒకరు (జైరాం రమేశ్) ఈ సభలో నా ముందే కూర్చుని ఉన్నారు. ఏకంగా 'చిండియా' అనే పదాన్నే కనిపెట్టారు. ఇంకో చైనా గురువు (రాహుల్) ఉన్నారు. ఆయనలా నేను ఒలింపిక్స్‌కు వెళ్లి చైనా నుంచి పాఠాలు నేర్చుకోలేదు. ప్రత్యేకమైన వ్యక్తిని కాకపోవడంతో ఆహ్వానం కూడా లేదు (యూపీఏ-1 హయాంలో 2008లో రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ బీజింగ్ ఒలింపిక్స్‌కు ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు). అక్కడ వారెవరిని కలిశారు? చైనా వాళ్లనే కాదు.. ఇతరులతోనూ (పాకిస్థాన్ నేతలు) భేటీ అయ్యారు. ఒలింపిక్స్ క్లాస్‌రూంలో అన్నీ నేర్చుకున్నట్లు లేరు. దీంతో ఢిల్లీలో చైనా రాయబారి ఇంటికి వెళ్లి ప్రైవేటు ట్యూషన్లు చెప్పించుకున్నారు. పాక్, చైనా చేరువయ్యాయని ఈ చైనా గురువు అంటున్నారు. పాక్ ఆక్రమిత కశ్మీరును వాళ్లు వదిలేయడం వల్లే ఆ రెండు దేశాలూ సన్నిహితమయ్యాయి' అని తూర్పారబట్టారు. రాహుల్ తమకు వార్నింగ్ ఇస్తున్నారని.. చరిత్ర పాఠం చెబుతున్నప్పుడు ఆయన నిద్రపోయారేమోనని.. యూపీఏ హయాంలోనే చైనాతో వ్యూహాత్మక భాగస్వామ్యం పెరిగిందని.. పెట్టుబడుల కోసం చైనా కంపెనీలను ఆహ్వానించారని గుర్తుచేశారు. జాతీయ భద్రత గురించి మాట్లాడుతున్నారని.. వారి హయాంలోనే శ్రీలంకలో హంబంటోటా పోర్టును చైనా కైవసం చేసుకుందని.. అప్పుడే భారత భద్రతకు చెప్పుకోలేనంత నష్టం వాటిల్లిందని స్పష్టంచేశారు. చైనాపై లెక్చర్లు దంచే చైనా గురువు ఇదంతా వారి హయాంలోనే జరిగిందనేది తెలుసుకోవాలని సూచించారు. పహల్గాంలో ఉగ్రవాద దాడి జరిగిన ఏప్రిల్ 22 నుంచి జూన్ 16 నడుమ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రధాని మోదీ మధ్య ఒక్కసారి కూడా ఫోన్ చర్చలు జరుగనేలేదని తేల్చిచెప్పారు. సింధూ జలాల ఒప్పందం గురించి మాట్లాడుతూ.. 'అసలు ఇలాంటి ఒప్పందం ఉంటుందని ఆలోచించలేం కూడా. ఒక దేశం తన ప్రధాన నదులు వేరే దేశంలో ప్రవహించడానికి అనుమతించడం.. అది కూడా ఆ నదులపై హక్కులు లేకుండా! నాటి ప్రధాని నెహ్రూ 1960 నవంబరు 30న పార్లమెంటులో మాట్లాడుతూ.. పాకిస్థానీ పంజాబ్ ప్రయోజనాల కోసం ఈ ఒప్పందం కుదుర్చుకోనివ్వాలని కోరారు. కశ్మీరు, పంజాబ్ రైతుల గురించి ఒక్క ముక్క మాట్లాడలేదు. సింధు జలాల ఒప్పందం, 370 అధికరణకు సంబంధించి నెహ్రూ చేసిన తప్పులను ప్రధాని మోదీ సరిదిద్దారు' అని తెలిపారు. కాగా, కాంగ్రెస్ హయాంలో ఉగ్రదాడులకు పాల్పడినవారికి బిర్యానీ పెట్టారని నడ్డా విమర్శించారు.


పీవోకేను ఇచ్చింది మీరే
దానిని బీజేపీ ప్రభుత్వమే తిరిగి తీసుకొస్తుంది: అమిత్ షా

న్యూఢిల్లీ, జూలై 30: 'పీవోకేను మీరే ఇచ్చారు. బీజేపీ ప్రభుత్వం మాత్రమే దాన్ని తిరిగి తీసుకొస్తుంది' అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా కాంగ్రెస్ పార్టీకి స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం రాజ్యసభలో ఆయన సవాల్ చేశారు. ఆపరేషన్ సిందూర్‌పై జరిగిన చర్చకు ఆయన బుధవారం సమాధానం ఇచ్చారు. "ఎవరో కోరారని ఆపరేషన్ సిందూర్‌ను ఆపేయలేదు. పాకిస్థాన్ మన ముందు మోకరిల్లింది. దయచేసి ఇంతటితో ఆపేయండి... అని వారి డీజీఎంవో మనకు ఫోన్ చేసి అభ్యర్థించారు. పాక్ మన దేశంలోని పౌరులు నివసించే ప్రాంతాలపై దాడులకు పాల్పడింది. కానీ భారత్ మాత్రం వారి 11 ఈ సభ ద్వారా ఉగ్రవాదులకు నేను ఒకటే చెప్పాలనుకుంటున్నాను. మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి. జమ్మూ కశ్మీర్ ఉగ్రవాదం నుంచి విముక్తి పొందుతుంది. ఇది ప్రధాని మోదీ సంకల్పం' అని అమిత్ షా స్పష్టం చేశారు.

మణిపూర్‌లో మరో ఆరు నెలలు రాష్ట్రపతి పాలన
తీర్మానానికి లోక్‌సభ ఆమోదం

న్యూఢిల్లీ, జూలై 30: ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను ఆగస్టు 13 తర్వాతి నుంచి మరో ఆరు నెలలు పొడిగించడానికి సంబంధించిన తీర్మానానికి బుధవారం లోక్‌సభ ఆమోదం తెలిపింది. హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఈ తీర్మానాన్ని లోక్‌సభలో చర్చకు ప్రవేశపెట్టారు. మణిపూర్‌లో ఫిబ్రవరి 13న రాష్ట్రపతి పాలన ను విధించగా.. ఏప్రిల్ 2న పార్లమెంట్ ఆమోదం తెలిపిందని స్పీకర్ ఓం బిర్లా పేర్కొన్నారు. రాష్ట్రపతిపాలనకు పార్లమెంట్ తెలిపిన ఆమోదం ఆరు నెలల పాటు చెల్లుబాటు అవుతుంది. ఒకవేళ రాష్ట్రపతి పాలనను మరో ఆరు నెలల పాటు పొడిగించాలంటే చట్టబద్ధమైన తీర్మానాన్ని పార్లమెంట్‌లోని ఉభయ సభలు ఆమోదం తెలపాల్సి ఉంటుంది. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించిన తర్వాతి నుంచి ఒకే ఒక మరణం చోటు చేసుకుందని కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్ పేర్కొన్నారు. ఈ రాష్ట్రంలో శాంతి స్థాపనకు రాష్ట్రపతి పాలన ముఖ్యమన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు నియంత్రణలో ఉన్నాయని తెలిపారు.

లోకం తీరు



పహల్గాం ఉగ్రదాడిలో
టీఆర్ఎఫ్ పాత్ర

ఐరాస భద్రతా మండలి నివేదిక స్పష్టీకరణ

న్యూఢిల్లీ, జూలై 30: పహల్గాం దాడిలో అంతర్జాతీయంగా పాకిస్థాన్‌ను దోషిగా నిలబెట్టే విషయంలో భారత్ గొప్ప దౌత్య విజయం సాధించింది. ఈ దాడిలో ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్) పాత్ర ఉందని మొట్టమొదటిసారి ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (యూఎన్ఎస్‌సీ) నివేదిక స్పష్టం చేసింది. లష్కరే తాయిబా మద్దతు లేకుండా ఏప్రిల్ 22న జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రదాడి జరగదని, లష్కరే తాయిబాకు, టీఆర్ఎఫ్‌కు అవినాభావ సంబంధం ఉందని భద్రతా మండలికి చెందిన పర్యవేక్షక బృందం (ఎంటీ) నివేదిక వెల్లడించింది. భద్రతా మండలి 1267 ఆంక్షల కమిటీ నిర్ణయాలు, నివేదికలను ఏకాభిప్రాయంతో ఐరాస సభ్యులు ఆమోదించడంతో ఆ నివేదిక ప్రాధాన్యత సంతరించుకుందని ఐరాస వర్గాలు తెలిపాయి. పహల్గాం దాడిలో ఐదుగురు ఉగ్రవాదులు పాల్గొన్నారని, 26 మంది అమాయక పౌరులు చనిపోయారని నివేదిక తెలిపింది. ఆ దాడులు తామే చేశామని టీఆర్ఎఫ్ అదేరోజు ప్రకటించడాన్ని ప్రస్తావించింది. నాలుగు రోజుల తర్వాత టీఆర్ఎఫ్ మాటమార్చేసిందని వెల్లడించింది. అనంతరం మరే ఉగ్రవాద సంస్థ కూడా దాడులకు బాధ్యత తీసుకోలేదని తెలిపింది. ప్రాంతీయంగా నెలకొన్న ఉద్రిక్తతలను లష్కరే ఉపయోగించుకునే ప్రమాదం ఉందని హెచ్చరించింది. లష్కరే, జేఈఎం నుంచి దృష్టి మరల్చడానికి టీఆర్ఎఫ్, పీపుల్ ఎగైనెస్ట్ ఫాసిస్ట్ ఫ్రంట్ పేర్లతో జమ్మూ కశ్మీర్‌లో దాడులు చేయడానికి పాక్ చేసిన ప్రయత్నాలకు పెద్ద దెబ్బపడినట్లయింది. కాగా, లష్కరే, పాక్‌లోని ఉగ్రవాద గ్రూపుల పేర్లను నివేదికల్లో చేర్చడం 2019 తర్వాత తొలిసారి. ఎంటీ నివేదిక నుంచి టీఆర్ఎఫ్ పేరును తొలగించడానికి పాక్ చేసిన ప్రయత్నాలు కూడా ఫలించలేదు. తమకు సంబంధం లేదంటూ పాక్ చేసిన వాదన ఎంటీ నివేదికతో వీగిపోయింది.

భారత్‌పై 25% సుంకం

(మొదటి పేజీ తరువాయి)

మరొక ప్రకటన చేశారు. అప్పటిదాకా.. చైనా వంటి కొన్నిదేశాలు మినహా మెజారిటీ దేశాలపై 10 శాతం సుంకం వసూలు చేస్తానని చెప్పారు. భారతదేశం తమకు మిత్రదేశమే అయినప్పటికీ.. ఆ దేశంతో అమెరికా చాలా సంవత్సరాలుగా పెద్దగా వ్యాపారం చేయలేకపోయిందని ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమమైన 'ట్రూత్ సోషల్'లో పేర్కొన్నారు. "ఎందుకంటే భారత్ విధించే సుంకాలు చాలా ఎక్కువగా ఉంటాయి. ప్రపంచంలోనే అత్యధిక సుంకాలు విధిస్తున్న దేశాల్లో భారత్ ఒకటి. ఇతరదేశాలతో పోలిస్తే భారత్ అత్యంత కఠినమైన, గర్హనీయమైన ఆర్థికేతర పన్ను అడ్డంకులను విధించే దేశం" అని ఆయన ఆ పోస్టులో వివరించారు. "అంతేకాదు.. వారు (భారత్) ఎల్లప్పుడూ తమకు కావాల్సిన సైనిక పరికరాల్లో ఎక్కువ భాగం రష్యా నుంచే కొనుగోలు చేస్తారు. రష్యా నుంచి ఇంధనాన్ని కొనుగోలు చేసే అతిపెద్ద దేశాల్లో చైనాతో పాటు భారత్ కూడా ఉంది. ఇదంతా కూడా.. ఉక్రెయిన్‌లో రష్యా సాగిస్తున్న మారణకాండను నిలువరించాలని అందరూ అనుకుంటున్న వేళ జరుగుతోంది. ఇది మంచిది కాదు. అందువల్ల భారత్ ఉత్పత్తులపై 25% సుంకాలు, అదనంగా జరిమానా విధిస్తాం. ఇవి ఆగస్టు 1 నుంచి అమల్లోకి వస్తాయి." అని తేల్చిచెప్పారు. "ఆగస్టు ఒకటి అంటే.. ఆగస్టు ఒకటే. ఈసారి ఆ గడువును పొడిగించే ప్రసక్తే లేదు." అని హెచ్చరించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ట్రంప్.. వాణిజ్యంతోపాటు.. భారత్ 'బ్రిక్స్'లో భాగం కావడం కూడా 25% సుంకాల నిర్ణయానికి ఒక కారణమని తెలిపారు. బ్రిక్స్.. అమెరికా వ్యతిరేక కూటమి అని, అది డాలర్‌పై దాడి చేస్తోందని.. ఎవరైనా సరే, డాలర్‌పై దాడి చేయడాన్ని తాము అనుమతించబోమని ఆయన వ్యాఖ్యానించారు. "ప్రధాని మోదీ నా స్నేహితుడే. కానీ.. వాణిజ్యకోణంలో చూస్తే వారు (భారత్) మాతో పెద్ద ఎత్తున వ్యాపారం చేయట్లేదు. భారత్ మాకు అనేక ఉత్పత్తులను విక్రయిస్తోందిగానీ మేం వారి దగ్గర కొనదల్చుకోలేదు. ఎందుకంటే వారి సుంకాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రపంచంలోనే అత్యధిక సుంకాలు వారు వసూలు చేస్తున్నారు. ఇప్పుడు వారు ఆ సుంకాలను గణనీయంగా తగ్గించడానికి సిద్ధంగా ఉన్నారు. చర్చలు జరుగుతున్నాయి. ఏం జరుగుతుందో చూడాలి. ఈ వారాంతానికి ఏ విషయమూ తెలుతుంది" అని ట్రంప్ పేర్కొన్నారు. కాగా.. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటిదాకా ఇరు దేశాల మధ్య.. వాణిజ్య ఒప్పందంపై ఐదుసార్లు చర్చలు జరిగాయిగానీ అవి ఒక కొలిక్కి రాలేదు. ఆరో దశ చర్చలు ఆగస్టులో జరగాల్సి ఉంది. ఇందుకోసం అమెరికా నుంచి ఒక బృందం ఆగస్టు 25న భారత్‌కు రానున్నట్టు ప్రభుత్వ వర్గాలు ఇటీవలే వెల్లడించాయి. ఇంతలోనే.. ట్రంప్ ఈ ప్రకటన చేయడం గమనార్హం.



పరిశీలిస్తున్నాం..

ట్రంప్ టారిఫ్‌ల ప్రభావం ఎంతమేరకు ఉంటుందనే అంశాన్ని పరిశీలిస్తున్నామని కేంద్రప్రభుత్వం తెలిపింది. సముచితమైన, సంతులిత, పరస్పర ప్రయోజనకారిగా, ఇరు దేశాలకూ లాభదాయకంగా ఉండే వాణిజ్య ఒప్పందం కుదురుతుందన్న ఆశ తమకు ఉందని.. ఆ దిశగా ఇరు దేశాల మధ్య చర్చలు జరుగుతున్నాయని పేర్కొంది. మరోవైపు.. భారత ఉత్పత్తులపై 25% సుంకం, రష్యా చమురు కొన్నందుకు జరిమానా విధిస్తామంటూ ట్రంప్ చేసిన ప్రకటన నేపథ్యంలో విపక్షాలు కేంద్రంపై విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టాయి. ప్రధాని మోదీకి ట్రంప్‌తో ఉన్న స్నేహం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని దీంతో తేటతెల్లమైందని ఎద్దేవా చేశాయి. హౌడీ మోదీకి, ట్రంప్‌కు మధ్య ఉన్న 'తారిఫ్ (పరస్పర పొగడ్తలు)' పనికి రాలేదని.. ట్రంప్ మనపై టారిఫ్ (సుంకం), పెనాల్టీ (జరిమానా) వేశారని కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'టారిఫ్'.. 'తారిఫ్' అనే పదాలు ఉపయోగించి చురక వేశారు. ఇప్పటికైనా ప్రధాని మోదీ మాజీ ప్రధాని ఇందిరా గాంధీని ఆదర్శంగా తీసుకుని.. అమెరికా అధ్యక్షుడికి ఎదురుగా ధైర్యంగా నిలబడాల్సిన అవసరం ఉందన్నారు. ట్రంప్ చేసిన ఎన్నో అవమానాలను మౌనంగా భరిస్తే భారత్‌కు ప్రయోజనాలు ఉంటాయని ప్రధాని మోదీ భావించారని.. కానీ అలా జరగలేదని జైరామ్ రమేశ్ వ్యాఖ్యానించారు.

2024లో ఎగుమతులు ఇలా

ఉత్పత్తి	విలువ (రూ.కోట్లలో)
ఔషధాలు	67,635
టెలికం పరికరాలు	54,340
రత్నాలు	44,360
పెట్రో ఉత్పత్తులు	34,260
స్వర్ణాభరణాలు	26,720
ఆటో విడిభాగాలు	23,400
రెడీమేడ్ దుస్తులు	23,380
ఇనుము, ఉక్కు	22,545

ట్రంప్ అసహనం.. అందుకే..

భారత్‌పై 25% సుంకాలు విధిస్తామంటూ ట్రంప్ చేసిన ప్రకటన వెనుక కారణం ఏంటో వైట్‌హౌస్ ఆర్థిక సలహాదారు, అమెరికా నేషనల్ ఎకనమిక్ కౌన్సిల్ డైరెక్టర్ కెవిన్ హాసెట్ బయటపెట్టారు. ఏప్రిల్‌లో ట్రంప్ సుంకాల ప్రకటన చేసిన నాటి నుంచీ.. ఇండియా-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందానికి సంబంధించి జరుగుతున్న చర్చలు ఎటూ తెగట్లేదు. దీనిపై ట్రంప్ అసహనంతో ఉన్నారని.. 25% సుంకాల విధింపును ఆయన ఒక పరిష్కారంగా చూస్తున్నారని.. ఈ టారిఫ్ ద్వారా భారత్‌పై ఒత్తిడి పెంచి అమెరికా ప్రజలకు మేలు చేసేలా ఒప్పందం కుదుర్చుకోవచ్చని ఆయన భావిస్తున్నట్టు హాసెట్ వెల్లడించారు.

ఇరుదేశాలకూ నష్టమే!

న్యూఢిల్లీ, జూలై 30: భారత్‌పై ట్రంప్ సుంకాల బాదుడుతో.. ఇరు దేశాలకూ నష్టమేనని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారత్ నుంచి అమెరికా దిగుమతి చేసుకుంటున్న పలు ఉత్పత్తులపై ఇన్నాళ్లుగా అతి తక్కువ సుంకాలు ఉండేవి. దీంతో ఆయా ఉత్పత్తులు అమెరికన్లకు చాలా చౌకగా అందుబాటులో ఉండేవి. ముఖ్యంగా.. స్మార్ట్‌ఫోన్లు, రెడీమేడ్ దుస్తులు, ఆటోమొబైల్ విడిభాగాలు, ఆభరణాలు, కట్, పాలిష్డ్ వజ్రాలు, పలు కీలక ఔషధాల ధరలు ట్రంప్ నిర్ణయంతో భారీగా పెరగనున్నాయి. ప్రముఖ మార్కెట్ రిసెర్చ్ కంపెనీ.. 'కౌంటర్‌పాయింట్ రిసెర్చ్' నివేదిక ప్రకారం స్మార్ట్‌ఫోన్లకు భారత్ ఇటీవలికాలంలో గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా మారింది. ప్రపంచవ్యాప్తంగా అమ్ముడవుతున్న మధ్య శ్రేణి ఆండ్రాయిడ్ ఫోన్లతోపాటు.. యాపిల్ ఫోన్ల కాంపొనెంట్లు కూడా భారత్‌లోనే అసెంబుల్ అవుతున్నాయి. ఇటీవలికాలంలో ఐఫోన్లు భారత్‌లో పెద్ద ఎత్తున తయారై అమెరికాకు ఎగుమతి అవుతున్నాయి. వాటన్నింటిపైనా 25% సుంకం విధించడమంటే.. ఇప్పటికే ద్రవ్యోల్బణం దెబ్బకు విలవిలలాడుతున్న అమెరికన్ వినియోగదారులపై పెనుభారం మోపడమేనని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. 'యేల్స్ బడ్జెట్ లాబ్', 'అసోసియేటెడ్ ప్రెస్' అంచనాల ప్రకారం.. తాజా సుంకాల పెంపుతో అమెరికాలో దుస్తుల ధరలు 17% దాకా పెరుగుతాయి. అమెరికా ప్రజలు వినియోగించే జనరిక్ ఔషధాల్లో 40% ఇండియా నుంచే సరఫరా అవుతున్నాయి. భారత్ ఎగుమతి చేసే ఔషధాల్లో క్యాన్సర్, మధుమేహం, హృద్రోగాలు, సాంక్రమిక వ్యాధులకు సంబంధించిన కీలక ఔషధాలు చాలా ఉన్నాయి. ట్రంప్ నిర్ణయంతో వాటన్నింటి ధరలూ పెరుగుతాయి. 2023లో భారత్ నుంచి అమెరికాకు 2.2 బిలియన్ డాలర్ల విలువైన ఆటోమొబైల్ విడిభాగాలు ఎగుమతి అయ్యాయి. అమెరికన్ వాహన తయారీదారులు.. తమ ఉత్పత్తి ఖర్చులను తక్కువగా ఉంచుకోవడానికి భారత్ నుంచి దిగుమతి చేసుకునే విడిభాగాలపైనే ఆధారపడుతున్నారు. ఇకపై వాటి ధరలు కూడా పెరగనుండడంతో.. సగటు అమెరికన్ల కారు మరమ్మతుల ఖర్చులు పెరుగుతాయి.

మనమీదా..

ట్రంప్ సుంకాల ప్రభావం సగటు అమెరికన్లపైనే కాక.. భారత జీడీపీపైనా గణనీయంగా పడే ప్రమాదం ఉందని ఐఎంఎఫ్ ఏప్రిల్‌లోనే అంచనా వేసింది. అప్పట్లో ట్రంప్ ప్రకటించిన 26% టారిఫ్ ప్రభావం భారత జీడీపీపై 30 బిలియన్ డాలర్ల మేర (దాదాపు రూ.2.5 లక్షల కోట్లు) ఉంటుందని ఐఎంఎఫ్ పేర్కొంది. 2025 క్యాలెండర్ సంవత్సరంలో భారత జీడీపీ రూ.4.3 లక్షల కోట్ల డాలర్లలో ఇది దాదాపుగా 0.7 శాతానికి సమానం. ఇప్పుడు.. 25 శాతం సుంకం, దానికి తోడుగా జరిమానా కూడా విధిస్తే ఆ ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. అమెరికా గనక 20 శాతం అంతకంటే ఎక్కువ సుంకాన్ని గంపగుత్తగా విధిస్తే.. భారత జీడీపీపై 50 బేసిస్ పాయింట్ల మేర (0.5%) ప్రభావం పడుతుందని అంతర్జాతీయ బ్రోకింగ్ సంస్థ మాక్వరీ గతంలోనే హెచ్చరించింది.

ఆయుధాలు అప్పగించండి

- గాజాలో పాలన కూడా ముగించండి
- హమాస్‌కు తేల్చి చెప్పిన అరబ్ దేశాలు

న్యూయార్క్, జూలై 30: హమాస్ తమ వద్ద ఉన్న ఆయుధాలను పాలస్తీనా అథారిటీకి అప్పగించి గాజా పాలన నుంచి తప్పుకోవాలని అరబ్ దేశాలు తొలిసారిగా సూచించాయి. పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించేందుకు ఇదే సరైన మార్గమని తేల్చి చెప్పాయి. న్యూయార్క్‌లో ఐక్యరాజ్యసమితిలో జరిగిన సదస్సులో అరబ్ దేశాలు, ఈయూతో పాటు 17 దేశాలు పాల్గొని ఇజ్రాయెల్-పాలస్తీనాలను రెండు దేశాలుగా గుర్తించే సూత్రంపై చర్చించాయి. దీనిపై ఫ్రాన్స్, బ్రిటన్, కెనడాతో పాటు ఈయూ, అరబ్ లీగ్ దేశాలు సమావేశమై ఓ తీర్మానం ఆమోదించాయి. 2023 అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడిని కూడా తీర్మానంలో ఖండించారు. హమాస్ చర్యను అరబ్ దేశాలు ఖండించడం కూడా ఇదే తొలిసారి. నాటి హమాస్ దాడిలో 1200 మంది ఇజ్రాయెలీలు చనిపోయారు. ప్రతీకారంగా గాజాపై ఇజ్రాయెల్ దాడుల్లో 60 వేల మందికి పైగా మృతిచెందారు.



సమావేశానికి హాజరుకాని అమెరికా, ఇజ్రాయెల్

ఐక్యరాజ్యసమితిలో జరిగిన ఈ సమావేశానికి అమెరికా, ఇజ్రాయెల్ హాజరుకాలేదు. కాల్పుల విరమణకు అంగీకరించకుంటే పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తిస్తామని బ్రిటన్ ప్రధాని స్టార్మర్ హెచ్చరించడాన్ని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తప్పుబట్టారు. ఉగ్రవాదులపై మెతకవైఖరి తగదన్నారు. ఐక్యరాజ్యసమితిలో రెండు దేశాల సూత్రంపై సెప్టెంబరులో జరిగే చర్చలో పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తిస్తామని ఫ్రాన్స్ అధ్యక్షుడు మ్యాక్రాన్ ప్రకటించడాన్ని కూడా ఇజ్రాయెల్, అమెరికా ఇప్పటికే ఖండించాయి. రెండు దేశాల సూత్రంపై ఫ్రాన్స్, స్పెయిన్ సహా 15 పశ్చిమ దేశాలు ఇప్పటికే మద్దతు తెలిపాయి.



ఇక టికెట్ పొందినరోజే శ్రీవాణి దర్శనం

తిరుమలలో రేపటి నుంచే అమలు

తిరుమల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): శ్రీవాణి టికెట్ల కేటాయింపు, దర్శన వేళల్లో టీటీడీ మార్పులు చేసింది. ప్రస్తుతం ఉదయం పది గంటలకు వీఐపీ బ్రేక్ దర్శనం శ్రీవాణి దాతలకు లభిస్తోంది. ఈ సమయాన్ని సాయంత్రం 4.30 గంటలకు మార్చారు. ప్రస్తుతం ఉన్నట్టుగానే వీరికి లఘు దర్శనం ఉంటుంది. ఆగస్టు 1 నుంచే ఈ సమయం అమల్లోకి వస్తుంది. అయితే, ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్ ద్వారా అక్టోబరు 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో శ్రీవాణి టికెట్లు పొందిన భక్తులను మాత్రం పాత సమయంలోనే ఉదయం 10 గంటలకే దర్శనానికి అనుమతిస్తారు. తిరుమలలోని గోకులం సమావేశ మందిరంలో బుధవారం శ్రీవాణి దర్శనాలపై అధికారులతో సమీక్షించిన తర్వాత టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. ప్రస్తుతం తిరుమలలో శ్రీవాణి టికెట్లను ఉదయం 7 గంటలకు జారీ చేస్తున్నారు. భక్తులు ముందు రోజు రాత్రే తిరుమలకు చేరుకుని, తెల్లవారు జాము నుంచే క్యూలో ఉండాల్సివస్తోంది. పైగా వీరికి మరుసటి రోజు ఉదయం దర్శనం కేటాయిస్తున్నారు. ఇందువల్ల దాదాపుగా మూడు రోజుల పాటు తిరుమలలో శ్రీవాణి దాతలు ఉండాల్సి వస్తోంది. ఇలా కాకుండా ప్రతిరోజూ ఉదయం 10 గంటలకు శ్రీవాణి టికెట్లు కేటాయించి, అదేరోజు సాయంత్రం 4.30 గంటలకు దర్శనం కల్పిస్తే భక్తులకు సౌకర్యంగా ఉంటుందనే ఆలోచనతో టీటీడీ ఈ మార్పులు చేసింది. ఈ కొత్త విధానాన్ని ప్రయోగాత్మకంగా ఆగస్టు 15 దాకా అమలు చేసి పరిశీలిస్తారు. ప్రస్తుతం కేటాయిస్తున్నట్టే తిరుమలలో ఆఫ్‌లైన్ ద్వారా 800 టికెట్లు, ఎయిర్‌పోర్టులో ఉదయం 7 గంటలకు 200 టికెట్లు ఇస్తారు.

గదుల సమయంలోనూ....

శ్రీవాణి టికెట్లు పొందిన భక్తులు కోరుకుంటే కేవలం రెండు మూడు గంటల పాటు మాత్రమే గదులు కేటాయించే అంశాన్ని టీటీడీ పరిశీలిస్తున్నట్టు తెలిసింది. అలాగే శ్రీవాణి టికెట్ల జారీ కేంద్రానికి సమీపంలో చిన్నపాటి గదులతో వీఐపీ లాంజ్‌ల ఏర్పాటు అంశంపై అధ్యయనం చేయాలని అధికారులకు అదనపు ఈవో వెంకయ్య చౌదరి సూచన చేసినట్టు తెలిసింది.



పోలవరం పనుల పురోగతిని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

డిసెంబరుకు డయాఫ్రమ్ వాల్ పూర్తి

- మార్చికి ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ గ్యాప్-1
- పోలవరం పనులపై మంత్రి నిమ్మల సమీక్ష

అమరావతి, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది డిసెంబరు నాటికి పోలవరం ప్రాజెక్టు డయాఫ్రమ్ వాల్ పనులు పూర్తి చేస్తామని జల వనరుల శాఖ అధికారులు ఆ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు చెప్పారు. అలాగే వచ్చే ఏడాది మార్చికి ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ (ఈసీఆర్ఎఫ్) గ్యాప్-1ను పూర్తి చేస్తామని తెలిపారు. బుధవారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో పోలవరం ప్రాజెక్టుతో సహా ఎడమ ప్రధాన కాలువ పనుల పురోగతిపై మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జల వనరుల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్, సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ నరసింహమూర్తి తదితరులతో మాట్లాడారు. ఎడమ ప్రధాన కాలువ పనులు లక్ష్యాల మేరకు వేగంగా సాగుతున్నాయని అధికారులు వివరించారు. డయాఫ్రమ్ వాల్ 40 శాతం పురోగతి సాధించినట్టు తెలిపారు. డయాఫ్రమ్ వాల్ 373 ప్యానళ్లకుగాను ఇప్పటికే క్లిష్టంగా ఉన్న 130 ప్యానళ్లను పూర్తి చేశామని అధికారులు వివరించారు. వరదకాలంలో కూడా పనులు ఆగకుండా డీవాటరింగ్ చేసుకుంటూ డిసెంబరు నాటికి పూర్తి చేస్తామని వెల్లడించారు. ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ గ్యాప్-1 పనులు 2026 మార్చి నాటికి పూర్తి చేస్తామని అధికారులు ధీమా వ్యక్తం చేశారు. ఈసీఆర్ఎఫ్ గ్యాప్-2 డిజైన్లు కేంద్ర జలసంఘం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ ఆమోదం పొందిన వెంటనే నవంబరు నాటికి పనులు మొదలు పెడతామని వివరించారు. పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తి చేసి 2026 కల్లా ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు తీసుకువెళ్లేలా ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యాన్ని నెరవేర్చేలా చూడాలని అధికారులకు రామానాయుడు ఆదేశాలు జారీ చేశారు. ఈ కాలువ పురోగతికి సంబంధించి నేషనల్ హైవే క్రాసింగ్‌ల దగ్గర బ్రిడ్జిల పనులు ఆగస్టులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. గడిచిన ఐదేళ్లలో నాటి ముఖ్యమంత్రి జగన్ నిర్లక్ష్యం చేశారన్నారు. పోలవరం ఎడమ కాలువకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, తట్టి మట్టి కూడా తవ్వలేదని రామానాయుడు విమర్శించారు.



గంజాయి మత్తులో దాడిచేస్తున్న బాలురు

బాలురే...కానీ, గంజాయికి బానిసలై...

- మద్యం తాగేందుకు రాలేదని ఇద్దరు బాలురపై దాడి
- వీడియోలు చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్టు
- ముగ్గురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- శ్రీసత్యసాయి జిల్లాలో ఘటన

కదిరి అర్బన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): వారు మైనర్లు.... బాల్య వయస్సులోనే గంజాయికి బానిసలయ్యారు. అంతే కాదు, తోటి బాలురను మద్యం సేవించాలని ఒత్తిడి చేశారు. వారు వినలేదని గంజాయిమత్తులో క్రూరంగా దాడిచేశారు. దాడి దృశ్యాలను తమ సెల్‌ఫోన్‌లలో చిత్రీకరించి సోషల్ మీడియాలో ఉంచారు. ఇవి వైరల్ కావడంతో పోలీసులు రంగంలోకి దిగి, దాడికి పాల్పడిన ముగ్గురు మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలం కాళసముద్రం గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ముగ్గురు బాలురు ఇటీవల జరిగిన పీర్ల పండుగ సందర్భంగా అదే గ్రామానికి చెందిన ఇద్దరు బాలురను మద్యం తాగుదామని పిలిచారు. దానికి వారు నిరాకరించారు. దీంతో వారిపై ఆ ముగ్గురు కక్ష పెంచుకున్నారు. ఈ నేపథ్యంలో ఆ ముగ్గురు గ్రామ శివారులో ఆదివారం గంజాయి సేవించారు. మత్తులో ఉండగా.. మద్యం సేవించేందుకు నిరాకరించిన ఇద్దరు బాలురు అటువైపు వెళుతూ కనిపించారు. ఇదే అదనుగా ఆ ముగ్గురు దాడికి దిగారు. 'మద్యం తాగడానికి పిలిస్తే రారా..?' అని కేకలు వేస్తూ చెప్పులు, చింతబర్రలతో చితకబాదారు. వదిలిపెట్టండి అని వేడుకున్నా కనికరించలేదు. ఓ వైపు దాడి చేస్తూ, మరోవైపు వీడియో చిత్రీకరించారు. సోషల్ మీడియాలో వీడియోలు చూసిన పోలీసులు స్పందించి, బాధితుల నుంచి ఫిర్యాదు స్వీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ శివనారాయణ స్వామి తెలిపారు. కాగా, తమ కుమారుడు గంజాయి, మత్తుకు అలవాటుపడ్డాడని, పలుమార్లు మందలించినా దారికి రాలేదని దాడికి పాల్పడిన ఓ బాలుడి తండ్రి మీడియా ఎదుట వాపోయారు.

చూడలేని సీసీలు.. తూయలేని వే బ్రిడ్జ్‌లు

ఇసుక అక్రమాల్ని వైసీపీ అడ్డుకుంది ఇలా..

- దొంగల్ని పట్టలేదుగానీ కొత్త దోపిడీకి ద్వారాలు
- ఏపీఎండీసీ నిర్వాకంతో రూ.100 కోట్లు వృథా
- నాసిరకం కొని రూ.కోట్లు జేబులో వేసుకున్న వైనం
- పట్టించుకోకపోవడంతో పరికరాలకు తుప్పు
- కెమెరాలు, సోలార్ యూనిట్‌లు దొంగలపాలు

(తెనాలి - ఆంధ్రజ్యోతి)

ఇసుక అక్రమంగా బయటకు పోకుండా కాపాడతామంటూ గత వైసీపీ ప్రభుత్వ కాలంలో రాష్ట్ర ఖనిజాభివృద్ధి విభాగం (ఏపీఎండీసీ) బాగానే హడావుడి చేసింది. చూడలేని సీసీ కెమెరాలు... బరువు కాటా వెయ్యలేని వే బ్రిడ్జ్‌లతో అక్రమ రవాణాను అడ్డుకునేందుకు 'ప్రయాస' పడింది. అక్రమంగా ఇసుకతో వాహనాలు వెళుతున్నా ఆపలేని చెక్‌పోస్టులు... విద్యుత్తు సరఫరా చెయ్యలేని సోలార్ యూనిట్‌లు... వీటన్నిటికీ మించి నిఘా పర్యవేక్షణ కోసం రాష్ట్రం మొత్తం మీద ఐదు వేలకుపైగా తాత్కాలిక సిబ్బంది నియామకం... ఇలా చేసిన ఏర్పాట్లేవీ దొంగలను పట్టలేదుగానీ కొత్త దోపిడీ పద్ధతులకు మాత్రం తలుపులు తెరిచాయి. నాసిరకం పరికరాలు కొని రూ.కోట్లు ఆనాటి నేతలు, ఏపీఎండీసీ ఎండీ స్థాయి అధికారి జేబులో వేసుకున్నట్టు అప్పట్లోనే ఆరోపణలు వచ్చాయి. అప్పుడు ఏపీఎండీసీ చేసిన పాపాలకు సాక్ష్యంగా ఇప్పుడు ఇసుక రీచ్‌లలో ఉన్న పరికరాలు తుప్పు పడుతున్నాయి. కెమెరాలు, సోలార్ పరికరాలు దొంగలపాలయ్యాయి. దొంగలు దోచిందిపోగా, మిగిలిన పరికరాలనయినా తర్వాత సద్వినియోగం చేశారా! అంటే అదీలేదు. సిబ్బందికోసం ఏర్పాటు చేసిన కంటైనర్ క్యాబిన్‌లు పాడయిపోతున్నాయి.



మున్నంగి దగ్గర ఏర్పాటు చేసిన కంటైనర్ క్యాబిన్ తుప్పుపట్టి పనికిరాకుండా పోతున్న చిత్రం,



గుంటూరు జిల్లా మున్నంగి దగ్గర ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్, దాని పక్కనే సోలార్‌యూనిట్, సీసీ కెమెరాలు, సిబ్బందికోసం ఏర్పాటు చేసిన కంటైనర్‌లు

దోచేయ్.. దాచేయ్...

గత ప్రభుత్వంలో తొలి సంవత్సరంపాటు ఏపీఎండీసీ కిందే ఇసుక రీచ్‌ల నిర్వహణ కొనసాగింది. ఆ తర్వాత ప్రైవేటు కంపెనీలకు ఆ బాధ్యతను అప్పగించారు. తన పరిధిలో ఉన్నప్పుడు సైతం ఒక్క రోజు కూడా ఇసుక రీచ్‌లను ఏపీఎండీసీ పర్యవేక్షించింది లేదు. అసలు ఒక్క కెమెరా కూడా అప్పట్లో పనిచేయలేదు. ఏర్పాటు చేసిన మూడు నెలల్లోనే నదిలోని వాటిని దొంగలు ఎత్తుకుపోయారు. ప్రైవేటు సంస్థ ప్రవేశించాక సర్వ హక్కులు తమకే అన్నట్టు ఆ సంస్థ సిబ్బంది మిగిలినవాటినీ లేపేశారు. ఇక సోలార్ ప్యానెళ్ల పరిస్థితి సరేసరి. చాలా వరకు ఏపీఎండీసీ ఉద్యోగులే పంచుకున్నారనే విమర్శ అప్పుడే వచ్చింది. వీటికి విద్యుత్తు బ్యాకప్ కోసం ఉపయోగించే బ్యాటరీలు కూడా మాయం చేశారని కొందరు చెబుతుంటే, అసలు బ్యాటరీలే ఏర్పాటు చేయలేదని ఆ సంస్థలోని సిబ్బంది చెప్పడం అప్పట్లో దుమారం రేపింది. క్యాబిన్‌లు వందల సంఖ్యలో ఉండాల్సిఉండగా, కృష్ణా నది దిగువన కేవలం రెండు, మూడు చోట్ల మాత్రమే కనిపిస్తున్నాయి. మిగిలినవి ఏమయ్యాయో తెలియని పరిస్థితి. ఉన్నవి కూడా తుప్పు పట్టిపోతుంటే, వాటిని ఇతర అవసరాలకు వాడుకోవటం కానీ, అవసరం లేదనుకుంటే వేలం వేయటం వంటివికూడా ఏపీఎండీసీ చేయలేదు. చెక్‌పోస్టుల దగ్గర కెమేరాలు, ఇతర పరికరాలన్నీ మాయమైపోతే, కేవలం ఒక్క పైపు మాత్రం మిగిలింది. కొన్ని చోట్లయితే వాటి ఆనవాళ్లుకూడా లేకుండా ఎత్తుకుపోయారు. వే బ్రిడ్జ్‌లు కాటావేసి తూకం రసీదు ఇచ్చిన పాపానపోలేదు. కాటా వేసేందుకు అవసరమైన కంప్యూటర్, ప్రింటర్ వంటివి అమర్చకపోవడం దీనికి కారణం. ఈ వ్యవహారంపై అప్పట్లో టీడీపీ నాయకులు ఆందోళన చేశారు. ఇప్పుడు అవి కూడా నదిలో వరదలు, వర్షాలు వచ్చినప్పుడు తడిచి పాడయిపోతున్నాయి.



కొల్లిపర దగ్గర కృష్ణానదిలో ఐదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన వే బ్రిడ్జ్ పనికిరాకుండాపోయి ఇసుకలో కప్పబడిపోతున్న చిత్రం

సీనియర్ నేతలూ గీత దాటితే ఎలా?

- పులివెందుల టీడీపీ నేత పార్థసారథితో క్రమశిక్షణ కమిటీ

అమరావతి, జూలై 30(ఆంధ్రజ్యోతి): పులివెందుల టీడీపీ నేత, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథి రెడ్డి బుధవారం టీడీపీ క్రమశిక్షణ కమిటీ ముందు హాజరయ్యారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, జాతీయ కార్యదర్శి లోకేశ్‌పై పార్టీ నియమావళికి విరుద్ధంగా వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై ఆయనను టీడీపీ క్రమశిక్షణ సంఘం పిలిపించింది. టీడీపీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, క్రమశిక్షణ కమిటీ సభ్యులు వర్ల రామయ్య, ఎంఏ షరీఫ్, కొనకళ్ల నారాయణ ఎదుట హాజరైన పార్థసారథి రెడ్డి వివరణ ఇస్తూ... 'నేను ఉద్దేశపూర్వకంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. తొలి నుంచీ టీడీపీలోనే ఉన్నా. సస్పెండ్ చేసినా పార్టీనే నమ్ముకుని ఉంటా' అని తెలిపారు. సీనియర్ నాయకులు ఆచితూచి మాట్లాడాలని, పార్టీ గీత దాటొద్దని, మరోసారి ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని పల్లా శ్రీనివాస్ ఆయనకు స్పష్టం చేశారు.

అంబుడ్స్‌మెన్ ఎంపిక కమిటీ చైర్మన్‌గా రావత్

అమరావతి, జూలై 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధి అంబుడ్స్‌పర్సన్స్ నియామకానికి ఎంపిక కమిటీ చైర్మన్‌గా జీఏడీ సర్వీసెస్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్‌ను నియమించారు. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రంలోని 19 జిల్లాల్లో అంబుడ్స్‌పర్సన్స్ పదవీకాలం ముగిసింది. ఈ ఖాళీలను భర్తీ చేసేందుకు ఇప్పటికే పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ నోటిఫికేషన్ జారీచేసింది. దరఖాస్తుల ప్రక్రియ కూడా ముగిసింది. వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేసేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ చైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన అదనపు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ నుంచి ప్రతినిధి, కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సూచించిన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సభ్యులుగాను, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి మెంబర్ కన్వీనర్‌గాను ఉంటారు. ప్రభుత్వం ఎస్ఎస్ రావత్‌ను ఈ కమిటీకి చైర్మన్‌గా నియమించింది.



అనంతపురం నగరంలో నిర్వహించిన 'సారథ్యం' ర్యాలీలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు

రాయలసీమ అభివృద్ధికి తొలి ప్రాధాన్యం

- యువత ఉద్యోగ, ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి
- అమరావతి ఎక్స్‌ప్రెస్ వే బెంగళూరు వరకూ విస్తరణ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 30(ఆంధ్రజ్యోతి): 'రాయలసీమలో ప్రాజెక్టులు పూర్తి చేస్తాం. నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తాం. సీమ అభివృద్ధికి తొలి ప్రాధాన్యం ఇస్తాం' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం 'సారథ్యం' పేరుతో ఆయన రాయలసీమలో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం అనంతపురానికి వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. 'సాగునీటి, వ్యవసాయ ప్రాజెక్టులు చేపట్టి రాయలసీమ రూపురేఖలను మార్చేస్తాం. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కియ వంటి మరిన్ని పరిశ్రమలను తీసుకువచ్చేందుకు బీజేపీ కృషి చేస్తుంది. యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. ఉమ్మడి, విభజిత రాష్ట్రానికి ముఖ్యమంత్రులను అందించిన ఘనత రాయలసీమదే. చారిత్రాత్మక కట్టడాలు, నిర్మాణాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రసాదం, స్వదేశీ దర్శిని పథకాల ద్వారా అభివృద్ధి చేస్తాం. అమరావతి ఎక్స్‌ప్రెస్ వేను బెంగళూరు వరకు విస్తరిస్తాం. దీంతో కోస్తాంధ్రకు, బెంగళూరుకు రవాణా సదుపాయం మరింత మెరుగవుతుంది. అనంతలో భారీ స్టేడియం నిర్మించి, క్రీడారంగాన్ని ప్రోత్సాహిస్తాం. కేంద్ర ప్రభుత్వానికి రాయలసీమ పట్ల ప్రత్యేక మక్కువ ఉంది. అభివృద్ధి చేసి ఆచరణలో పెడతాం. అనంతలో రైతులు అధికంగా పండించే పంటలకు అనువుగా ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తాం. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 168 పథకాలను ప్రజలకు చేరువ చేసి, అభివృద్ధి, సంక్షేమంలో భాగస్వాములను చేస్తాం. కూటమి ప్రభుత్వంలో అక్కడక్కడ చిన్నచిన్న అభిప్రాయ భేదాలున్నా అన్నింటినీ సరిచేసుకుంటూ ముందుకు సాగుతాం' అని మాధవ్ పేర్కొన్నారు.

7 పట్టణాల్లో స్మార్ట్ వీధులు

- స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్ల ఏర్పాటుకు అనుమతి
- మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు

అమరావతి, జూలై 30(ఆంధ్రజ్యోతి): మెప్మా ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 7 పట్టణాల్లో స్మార్ట్ వీధుల ఏర్పాటుకు మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ అనుమతించింది. ఇప్పటికే నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో పైలట్ ప్రాజెక్టుగా 200 షాపులతో స్మార్ట్ వీధిని ఏర్పాటు చేశారు. తాజాగా అనంతపురం, కర్నూలు, తాడేపల్లి-మంగళగిరి, ఒంగోలు, శ్రీకాకుళం, విజయవాడ, కడప మున్సిపల్ కార్పొరేషన్లలో 'స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్'ల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. ఒక్కో కార్పొరేషన్‌లో 40 నుంచి 200 వరకు షాపులతో స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్‌ను ఏర్పాటు చేస్తారు. జాతీయ పట్టణ జీవనోపాధి మిషన్ మార్గదర్శకాల ప్రకారం వీటిని నిర్వహిస్తారు. 18 ఏళ్లు నిండిన వీధి వ్యాపారులకు ఈ షాపుల ఏర్పాటులో ప్రాధాన్యమిస్తారు. స్ట్రీట్ వెండర్ కార్డులున్న వారికి అవకాశమిస్తారు. కంటైనర్ మోడల్‌లో ఈ షాపులను నిర్మిస్తారు. వారికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందిస్తారు. బ్యాంకులు, పీఎం స్వానిధి ద్వారా రుణాలు అందిస్తారు. డిజిటల్ లావాదేవీలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఒక్కో కార్పొరేషన్‌లో ఈ ప్రాజెక్టుకు రూ.1.80 కోట్ల నుంచి రూ.9 కోట్ల వరకు ఖర్చు చేయనున్నారు. అనంతపురం, కర్నూలు, ఒంగోలు, శ్రీకాకుళం, కడపల్లో 100 చొప్పున, తాడేపల్లి, విజయవాడల్లో 40 చొప్పున మొత్తం 580 షాపులు నిర్మిస్తారు. ఇందుకోసం మొత్తం రూ.26.10 కోట్లు ఖర్చు చేయనుండగా అందులో పట్టణ స్థానికసంస్థలు రూ.16.82 కోట్లు, స్వయం సహాయ రుణాలు రూ.8.70 కోట్లు, మెప్మా ద్వారా రూ.58 లక్షలు ఖర్చు చేస్తారు.

రుతుపవన విరామం?

- దక్షిణాదిలో కొనసాగనున్న వర్షాభావం
- ఖరీఫ్ పంటలపై తీవ్ర ప్రభావం
- పెరగనున్న ఎండ తీవ్రత: స్కైమెట్

విశాఖపట్నం, జూలై 30(ఆంధ్రజ్యోతి): దేశంలో రుతుపవనాల విరామం (బ్రేక్ మాన్‌సూన్) వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. రుతుపవన ద్రోణి తూర్పుభాగం ఉత్తరాది వైపునకు మళ్లనుంది. దీంతో బిహార్, పశ్చిమబెంగాల్, అసోం, ఈశాన్య రాష్ట్రాల్లో వర్షాలు పెరగనున్నాయి. ఇంకా తమిళనాడు, కోస్తాంధ్రలో కొన్ని ప్రాంతాలు తప్ప దక్షిణాదిలో వర్షాభావం కొనసాగనుంది. ఎండ తీవ్రత పెరిగి పొడి వాతావరణం నెలకొంటుందని, ప్రధానంగా పశ్చిమ తీరంలో పూర్తిగా వర్షాలు తగ్గుముఖం పడతాయని ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ పేర్కొంది. మధ్యప్రదేశ్, రాజస్థాన్ పరిసరాల్లో అల్పపీడనం బలహీనపడింది. రానున్న రెండు రోజుల్లో రుతుపవనద్రోణి తూర్పుభాగం ఉత్తరాది వైపునకు వెళ్లనుందని స్కైమెట్ తెలిపింది. చైనా, వియత్నాం, ఇతర తూర్పు ఆసియా దేశాలను అతలాకుతలం చేసిన వైపా తుఫాన్ అవశేషం గత వారం బంగాళాఖాతంలో ప్రవేశించి అల్పపీడనంగా మారి బలపడి వాయుగుండమై తూర్పుభారతం మీదుగా మధ్య భారతం చివరి వరకు పయనించింది. దీనివల్ల దక్షిణాదిలో వర్షాలు తగ్గి, వేసవి తరహా ఎండలు కొనసాగుతున్నాయి. ఈ ఏడాది రుతుపవనాలు దేశంలో అన్ని ప్రాంతాలకు విస్తరించిన తర్వాత ఏర్పడిన రుతుపవనద్రోణి చాలా రోజులు మధ్యభారతం, ఇంకా పైభాగంలోనే కొనసాగింది. బంగాళాఖాతంలో అల్పపీడనాలు వచ్చినప్పుడు మాత్రం వాయవ్య బంగాళాఖాతం మీదుగా పయనించి మళ్లీ ఉత్తరాది వైపే కొనసాగింది. రుతుపవనద్రోణి తూర్పుభాగం దక్షిణం వైపు పయనిస్తేనే ఏపీ, తెలంగాణ, దక్షిణ ఒడిశా, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లలో విస్తారంగా వర్షాలు కురుస్తాయి. ఈ పరిస్థితి ఈ నైరుతి సీజన్‌లో లేకపోవడంతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాభావం కొనసాగుతుంది.

వచ్చే 5 రోజులు చెదురుమదురు వర్షాలు..

ఈ ఏడాది రుతుపవనాలు విస్తరించే సమయం, తర్వాత ఈ నెల మూడో వారంలో కొద్దిరోజులు తప్ప మిగిలిన రోజుల్లో వర్షాలు లేవు. ఎక్కువ రోజులు ఎండలు కాయడంతో పంటలపై తీవ్ర ప్రభావం పడింది. రుతుపవనద్రోణి తూర్పుభాగం దక్షిణాది వైపు వచ్చిన తర్వాతే మళ్లీ వర్షాలు పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు. అయితే, రుతుపవన విరామం సమయంలో దక్షిణాదిలో ఎండ ప్రభావంతో వాతావరణ అనిశ్చితి నెలకొని అక్కడక్కడ వర్షాలు కురుస్తాయన్నారు. వచ్చే నాలుగైదు రోజుల్లో కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ బుధవారం తెలిపింది.

జగన్‌తో శాంతిభద్రతలకు విఘాతం

- వైసీపీ హయాంలో హిందూ సంస్కృతి నాశనం: మంత్రి ఆనం



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, బీసీ జనార్దన్ రెడ్డి

బనగానపల్లె, జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రశాంతంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంలో మాజీ సీఎం వైఎస్ జగన్ వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశాలున్నాయని దేవదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం నంద్యాల జిల్లా బనగానపల్లెలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డితో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. 'వైసీపీ ప్రభుత్వ హయాంలో ఖనిజ సంపదను దోచుకున్న వ్యక్తులు, రౌడీలు, గూండాలు, దొంగల పరామర్శ పేరుతో జగన్ రాష్ట్రంలో అశాంతిని సృష్టించేందుకు వస్తున్నారు. నెల్లూరు జిల్లాలో ఖనిజ సంపదను దోచుకున్న దొంగలు జైల్లో ఉంటే వారిని పరామర్శించేందుకు రావడం సిగ్గుచేటు. కూటమి ప్రభుత్వం ప్రజల ఆశీస్సులతో సుపరిపాలన అందిస్తోంది. వైసీపీ హయాంలో రామతీర్థంలో రాముని తల పగులగొట్టడం, అంతర్వేది రథం తగలబెట్టడం, దుర్గమ్మ వెండి సింహాల చోరీ, వెంకటేశ్వర స్వామి రథం తగలబెట్టిన ఘటనలపై తిరిగి విచారణ చేస్తున్నాం' అని మంత్రి ఆనం తెలిపారు.

ఇక బెజవాడ నుంచే నేరుగా హజ్‌యాత్ర

- సీఎంకు వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజీజ్ ధన్యవాదాలు

విజయవాడ సిటీ, జూలై 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ముస్లింలు సులువుగా, సునాయాసంగా పవిత్ర స్థలం మక్కాకు చేరుకునే అవకాశం ఏర్పడింది. నేరుగా మక్కాకు చేరుకునేందుకు వీలుగా దేశవ్యాప్తంగా ఎంబార్కేషన్ పాయింట్లు కలిగిన 17 అంతర్జాతీయ విమానాశ్రయాల జాబితాలో గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం చోటు దక్కించుకుంది. ఇప్పుడు రాష్ట్రంలోనే ఎంబార్కేషన్ పాయింట్ ఏర్పాటుతో హజ్‌యాత్ర చేసే ముస్లింలకు వేలాది రూపాయల డబ్బు, సమయం ఆదా కానున్నాయి. ఎంబార్కేషన్ పాయింట్ ఏర్పాటు పట్ల సీఎం చంద్రబాబుకు, మంత్రి ఫరూక్‌కు రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, హజ్ కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

రేపు జమ్మలమడుగుకు సీఎం

- పింఛన్ల పంపిణీ అనంతరం గండికోట ప్రాజెక్టుకు శంకుస్థాపన

అమరావతి, నిడదవోలు, జూలై 30(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు కడప జిల్లాలో జరిగే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్నారు. శుక్రవారం కడపకు చేరుకుని జమ్మలమడుగు మండలం గూడెంచెరువులో పింఛన్ల పంపిణీలో పాల్గొంటారు. గ్రామస్థులతో నిర్వహించే ప్రజావేదిక కార్యక్రమానికి హాజరవుతారు. అక్కడి నుంచి గండికోటకు చేరుకుంటారు. కేంద్రప్రభుత్వ సహకారంతో సాస్కీ పథకం కింద రూ.78 కోట్లతో చేపట్టనున్న ప్రతిష్ఠాత్మక గండికోట పర్యాటక ప్రాజెక్టుకు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేస్తారని మంత్రి కందుల దుర్గేశ్ నిడదవోలులో తెలిపారు.

2న ఐదు కోట్ల మొక్కలకు అంకురార్పణ

- పర్యావరణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు అంకారావు



పిడుగురాళ్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఐదు కోట్ల మొక్కలు పెంచేందుకు ఆగస్టు 2వ తేదీన శ్రీకారం చుడుతున్నామని ప్రభుత్వ పర్యావరణ సలహాదారు కొమెర అంకారావు తెలిపారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం జానపాడు జడ్పీ పాఠశాలలో బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ....'ఆగస్టు 2న నల్లమల ఫారెస్టులో 15 కిలోమీటర్లు వాక్ రన్ చేయనున్నాం. కారంపూడి మండలం సింగరుట్ల నల్లమల ఫారెస్టు నుంచి గుత్తికొండ బిళం వరకు నడక కొనసాగిస్తూ...అడవిలో ప్లాస్టిక్ బాటిళ్లు, వ్యర్థపదార్థాలు తొలగింపుతో పాటు అటవీ ప్రాంతంలో మొక్కలు పెంచేందుకు విత్తన బాల్స్‌ను చల్లనున్నాం. జిల్లాలోని పర్యావరణ ప్రేమికులు, పాఠశాల విద్యార్థులు 15 కిలోమీటర్ల వాక్ రన్‌లో పాల్గొనవచ్చు. ప్రతి వారం ఓ మండలంలోని జడ్పీ పాఠశాలను సందర్శించి పర్యావరణ పెంపుపై అవగాహన కల్పించడంతో పాటు మనకు అందుబాటులో ఉన్న మొక్కల విశిష్టత, వివరాలను విద్యార్థులకు తెలియజేసేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నాం.' అని వివరించారు. మనచుట్టూ ఆరోగ్యానికి మేలు చేసే మొక్కలు ఎన్నో ఉన్నాయని, అవి ఏమిటో, ఎందుకు ఉపయోగిస్తారు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించే ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్టు అంకారావు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సమాధానాలులేని ప్రశ్నలు

పహల్గాం దాడి, ఆపరేషన్ సిందూర్‌లపై లోక్‌సభలో 19గంటలకుపైగా జరిగిన ప్రత్యేక చర్చకు సమాధానంగా మంగళవారం సాయంత్రం ప్రధానమంత్రి నరేంద్రమోదీ 102 నిముషాలు మాట్లాడారు. ఆయన వాగ్ధాటి మనకు కొత్తేమీ కాదు కానీ, టెలివిజన్‌చానెళ్లలో ప్రత్యక్షంగా చూసినవారు మారోమారు పరవశులైపోయి ఉంటారు. విపక్షాలు లేవనెత్తిన ఏ ప్రశ్నకూ నేరుగా సమాధానం చెప్పక పోయినా అభిమానులూ, పార్టీ ప్రేమికులను ఆయన ప్రసంగం కచ్చితంగా కుదిపేసేవుంటుంది. గంటన్నరకుపైగా మాట్లాడి కూడా ఉగ్రదాడి, ప్రతీకార దాడులమీద దేశప్రజల్లో రేగిన అనుమానాలను నివృత్తి చేయకపోగా, విపక్షాలపై విరుచుకుపడటంలోనూ, ప్రధానంగా కాంగ్రెస్‌ను పాక్‌ప్రేమిగా, చైనా దూతగా ముద్రవేయడంలో ఆయనదే పైచేయి. యుద్ధంమీద చర్చతో ప్రజలకు సంబంధం లేదని, వారికి చెప్పాల్సింది ఏమీ లేదనీ, ఇది ప్రజాక్షేత్రంలోనూ, ప్రచారసభల్లోనూ కాంగ్రెస్–బీజేపీ రాజకీయ పోరాటమేనని దేశప్రధాని సైతం భావించినట్టుంది. చర్చ తొలిరోజున, సభలో కూర్చొని విపక్షాల వాదన వినడం కంటే, ఎన్నికల క్షేత్రం తమిళనాడుకు పోయి, బృహదీశ్వరాలయంలో ప్రార్థనలు చేయడం బహుశా ప్రయోజనకరంగా ఉంటుందని ఆయన అనుకొని ఉంటారు.

అత్యంత ప్రమాదకరమైన, ఉగ్రదాడులకు నిలయమైన పహల్గాంలో పదివేలమంది పర్యాటకులు చేరినప్పుడు, ఒక్క పోలీసు కూడా ఎందుకు లేదు, నిఘావ్యవస్థ ఏం చేస్తోంది, సహాయం ఎందుకు ఆలస్యమైందన్న ప్రశ్నలకు అధికారపక్షంనుంచి బాధ్యతాయుతమైన సమాధానాలు వచ్చివుంటే బాగుండేది. ప్రత్యేక ప్రతిపత్తిని కోసేసిన కశ్మీర్‌లో ఉగ్రవాదం దుంపనాశనమైపోయిందన్న పాలకుల ప్రచారాన్ని నమ్మి, ఛప్పన్నారు ఇంచీల ఛాతీ గల చౌకీదార్ మనలను భద్రంగా కాపాడతాడని విశ్వసించి, నిర్భయంగా వినోదానికి వెళ్ళిన అమాయక ప్రజలను ఓ ఉగ్రమూక అంత సునాయాసంగా ఎలా ఊచకోతకోయగలిగిందో చెప్పివుంటే బాగుండేది.

దాడిజరిగిన వందరోజుల తరువాత, అదీ ప్రధానమంత్రి సమాధానానికి కాస్తముందు ఉగ్రవాదులను మట్టుబెట్టడమేమిటని విపక్షాలు ఆశ్చర్యపోవడం కూడా మహాపాపమైపోయింది. ఇలా ముహూర్తం చూసుకొనే ఆ పనిచేసినట్టుగా దేశప్రజలకూ అనిపించింది కనుకనే, ఆ రాక్షసులను ఎప్పుడు పట్టుకున్నారు, ఇపుడు ఎందుకు కాల్చారన్న సందేహం కలిగింది. నేరుగా సమాధానాలు చెప్పడం ఇబ్బంది కాబట్టే, ఎప్పటిలాగానే చరిత్ర తవ్విపోతలు, నెహ్రూ తప్పిదాల ఎత్తిపోతలు, కాంగ్రెస్‌మీద నేరాభియోగాలు ఈ మారూ మనం వినకతప్పలేదు. ఇది ఆపరేషన్ సిందూర్ మీద చర్చ కాక, నెహ్రూ విదేశాంగ విధానంమీద చర్చలాగా విశ్లేషకులకు అనిపించింది. చైనాకు కాంగ్రెస్ భారీగా భూమిని ధారాదత్తం చేసిందని విమర్శిస్తున్న మోదీ, మొన్నటి యుద్ధంలో పాకిస్తాన్‌కు ఆయుధసాయం చేసినందుకు కూడా చైనాను గట్టిగా అనలేకపోతున్నారు.

వాణిజ్యాయుధాన్ని ప్రయోగించి నేనే యుద్ధం ఆపానని ట్రంప్ ముప్పైసార్లు చెప్పుకున్నారు. చివరకు నిండుసభలో మోదీ ప్రసంగం ముగిసిన మరుక్షణంలోనే మళ్ళీ ట్రంప్ పాతపాటే పాడటం చూస్తే, వీళ్ళిద్దరి మధ్యా బాగా చెడిందేమోనన్న అనుమానం కూడా కలుగుతోంది. ఏ దేశాధినేతా తనను యుద్ధం ఆపమనలేదని, అమెరికా ఉపాధ్యక్షుడు ఫోన్‌చేసినా తాను తగ్గలేదని మోదీ చెప్పుకున్నారు. ట్రంప్ పచ్చి అబద్ధాలు ఆడుతున్నారని నిండుసభలో ప్రకటించడానికి మోదీకి ఇబ్బందులు ఉండవచ్చు. మరి, ఏ కారణంగా, ఎవరి నిర్ణయం మేరకు, ఏ ప్రకటిత లక్ష్యాల సాధనతో ఈ యుద్ధం ఆగిందో ఆయనే ఓ సావకాశంగా వివరంగా చెప్పివుంటే ఎంతో బాగుండేది. యుద్ధం కొనసాగనందుకు సంతోషించాల్సిందే. కానీ, బహుత్ మారా, బస్ కరో అని పాకిస్తాన్ డీజీఎంవో ప్రాధేయపడటంతోనే మనం యుద్ధాన్ని ఆపేశామన్న అభిప్రాయం మాత్రం మోదీ సమాధానం తరువాత కలుగుతోంది. మన దాడికి తట్టుకోలేక విలవిలలాడిన పాకిస్తాన్‌నుంచి ఇందుకు ప్రతిగా దక్కిన హామీలు ఏమిటో తెలియదు. ఉగ్రవాదాన్ని సమూలంగా పెకిలించివేయాలన్న లక్ష్యం కోసం పొరుగుదేశంలోకి చొచ్చుకుపోవాలని తహతహలాడిన మనం కేవలం శత్రువు ఏడ్పునందుకే ఇలా విరమించుకున్నప్పటి క్రమంలో ప్రయోజనం ఏమిటన్నది ప్రశ్న. అటు, బీజేపీ వీరాభిమానులు ఆశించిన పీఓకే స్వాధీనం, బెలూచిస్తాన్ విముక్తి ఇత్యాది లక్ష్యాలు ఆకాంక్షలను నెరవేరకుండా, ఇటు పాక్ భూభాగంనుంచి భారతదేశంలోకి భవిష్యత్తులో ఏ ఉగ్రదాడి జరగదన్న కనీస హామీ కూడా దక్కకుండా పాలకులు వెనకడుగువేయడం ఆశ్చర్యం. యుద్ధదేశం కాదు, బుద్ధదేశం అన్న మోదీ వ్యాఖ్య పాకిస్తాన్‌కు ఇప్పుడు కొత్తగా ఇచ్చే సందేశం ఏమిటో చూడాలి.


కట్టని కాళేశ్వరమే బనకచర్ల!

జీవధార జగడాలు జటిలమైనవి. నీటి పంపకాలలో పక్షపాతాలు ఆంధ్రప్రదేశ్‌ను రెండు రాష్ట్రాలుగా విభజించాయి. వేరుపడిన దశాబ్దం అనంతరం ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదించిన గోదావరి–బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు (లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్) ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య నదీజలాల ఘర్షణలు పునఃప్రారంభమయ్యే పరిస్థితిని కల్పించింది. రైతులు సమృద్ధ సాగునీటి వసతిని కోరుతున్నారు. వారి ఆరాటం రాజకీయవేత్తలకు మరొక మెగా ప్రాజెక్ట్ నిర్మాణాన్ని ఆరంభించేందుకు ఆలంబన అయింది.

బనకచర్ల ప్రాజెక్టు ఏమిటి? అది ఆంధ్రప్రదేశ్ కాళేశ్వరం! తెలంగాణలో కట్టిన కాళేశ్వరం, ఆంధ్రలో ప్రతిపాదిత బనకచర్ల మధ్య పోలికలు కొట్టొచ్చినట్టు కనిపిస్తాయి. తొమ్మిది దశలవారీగా నీటి పంపింగ్, ఇంచుమించు 400 కిలోమీటర్ల దూరానికి బదలాయింపు, కాలువలు, సొరంగాలు, 150 టీఎంసీలకు పైగా నీటి నిల్వ చేసే భారీ జలాశయాలు. రెండిటి నిర్మాణ వ్యయ అంచనా కూడా సమస్థాయిలో ఉన్నది. కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చే ప్రాజెక్టులివి. భారీ ప్రాజెక్టులు, వాటిని మించిన మహా భారీ ప్రాజెక్టులు నిర్మించడమనే ప్రక్రియ అప్రతిహతంగా సాగిపోతోంది. నిర్మాణ వ్యయాలు పోటా పోటీగా పెరిగిపోతున్నాయి. ఈ పోటీ సుడిలో బనకచర్ల లాంటి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు చిక్కుకున్నాయి. వ్యవస్థాపిత ప్రమాణాలు, ఆర్థిక తర్కాన్ని ఈ ప్రాజెక్టులు పరిగణనలోకి తీసుకోవు. పర్యావరణ వ్యవస్థల పరిరక్షణను పట్టించుకోవు. పుట్టని తరాల వారిపై పడుతున్న భారం గురించి కించిత్ ఆలోచన కూడా ఉండదు. ఈ పరిణామాలు మినహాయింపుగా కాకుండా ఒక సాధారణ ప్రమాణంగా వాటిల్లుతున్నాయి. ప్రాజెక్టు పరిమాణం ఎంత భారీగా ఉంటే అంత మంచిది, నిర్మాణ వ్యయం ఎంత అధికంగా ఉంటే అంత ప్రయోజనకరం. కాళేశ్వరం, బనకచర్ల కథ ఒకటే. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో అమెరికాలో సైనిక–పారిశ్రామిక వర్గాల కుమ్మక్కుతో ఆయుధోత్పత్తి పరిశ్రమలు విస్తరిల్లినట్టుగా ఇప్పుడు మన దేశంలో రాజకీయ వర్గాలు– బిల్డర్లు, ఇంజనీరింగ్ సంస్థల కుమ్మక్కుతో మెగా ఇంజనీరింగ్ ప్రాజెక్టుల నిర్మాణం పెచ్చరిల్లిపోతోంది.

సమస్త వ్యవస్థాపిత ప్రమాణాలు, నియమ నిబంధనలు, నదీ జల పంపకాల ఒప్పందాలు, వ్యయ ప్రయోజన తర్కాన్ని భూస్థాపితం చేసేందుకు ఆంధ్ర, తెలంగాణ, గోదావరి ఎగువ రాష్ట్రాలు, భారత ప్రభుత్వం, కేంద్ర జల సంఘం ఏకీభవిస్తేనే బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం సుసాధ్యమవుతుంది. ఈ ప్రాజెక్టు ఎప్పటికైనా ఒక రూపు తీసుకుంటే, అంతర్ రాష్ట్ర ఒప్పందాలను లక్ష్య పెట్టకుండా తమకు తోచిన రీతిలో ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని చేపట్టేందుకు అన్ని రాష్ట్రాలనూ పురిగొల్పుతుంది.

రాయలసీమ రైతుల ఆదాయాన్ని పెంపొందించేందుకు బనకచర్ల నిర్మించాల్సిన అవసరం లేదు. ఈ ప్రాజెక్టు పూర్తయ్యి, నీటి సరఫరా మొదలైనా నిర్వహణ వ్యయం పంట దిగుబడుల విలువ కంటే అధికంగా ఉంటుందని చెప్పేందుకు పెద్ద తెలివితేటలు అవసరం లేదు. నీటి సరఫరా వ్యయం ఎకరానికి రూ.50వేలకు మించి ఉంటుందని ఇప్పటికే కొంతమంది లెక్క కట్టారు. బనకచర్ల నిర్మాణ వ్యయాన్ని పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే భరించినా అది ఆంధ్రా ప్రజలకు పెద్ద భారమవుతుంది.


akbar

బనకచర్ల ప్రాజెక్టుకు అవసరమైన 200 టీఎంసీల నీరు అందుబాటులో లేదు; సముద్రానికి తరలిపోయే నీరు ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రాతిపదిక కాదు; సీడబ్ల్యూసీ ఈ ప్రాజెక్టుకు అనుమతి నివ్వదు. వరద జలాల భావన అనేదే లేదని, ఏ ప్రాజెక్టుకూ వరద జలాల కేటాయింపు లేదని సీడబ్ల్యూసీ స్పష్టం చేసింది.

ఈ ప్రాజెక్టుకు అవసరమైన 200 టీఎంసీల నీరు అందుబాటులో లేదు; సముద్రానికి తరలిపోయే నీరు ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రాతిపదిక కాదు; సీడబ్ల్యూసీ ఈ ప్రాజెక్టుకు ఎట్టి పరిస్థితులలోను అనుమతినివ్వబోదు; సీడబ్ల్యూసీ అనుమతి లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టలేదు; అనుమతి లేకుండానే నిర్మాణాన్ని ఆరంభించిన పక్షంలో ఎగువ రాష్ట్రాల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతుంది. సముద్రం లోకి వృథాగా పోతున్నాయని చెబుతున్న 3000 టీఎంసీల నీటిలో ఎగువ రాష్ట్రాలు వివిధ కారణాల వల్ల ఉపయోగించుకోని జలాలు కూడా ఉన్నాయనేది విస్మరించకూడదు. వరద జలాలు అన్న భావనే లేదు. నదుల్లో ప్రవహించే నీటిని అడ్డుకోవడం, ఉపయోగించుకోవడం కుదరదు. ఈ కారణంగానే సీడబ్ల్యూసీ ఆయా నదుల్లో లభ్యమయ్యే నీటికి సంబంధించి అంచనాలు వేసి, పరీవాహక ప్రాంత రాష్ట్రాలకు కేటాయింపులు జరుపుతోంది. బనకచర్ల ప్రస్తుత అంచనా వ్యయం రూ.80,000 కోట్లు. అంతిమంగా ఇది రూ.1,50,000 కోట్లకు పెరగవచ్చు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆ మొత్తాన్ని మరింత అర్థవంతంగా, మరింత ప్రయోజనకరమైన ప్రాజెక్టులకు వినియోగించాలి.

తెలంగాణ రాష్ట్రం తప్పకుండా బనకచర్లను వ్యతిరేకిస్తుంది. అయితే అది తమ న్యాయబద్ధమైన వ్యతిరేకతలను సీడబ్ల్యూసీ అధికార పరిధిలో వ్యక్తం చేయాలి. ప్రజల వద్దకు ఈ సమస్యను తీసుకుపోయి భావావేశాలను రెచ్చగొట్టడం మంచిది కాదు. బనకచర్లపై వ్యతిరేకత వ్యక్తం చేసేందుకు వ్యవస్థాపిత ప్రమాణాలు, వేదికలు ఉన్నాయి. ఈ సమస్య తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల మధ్య కాదు. తెలంగాణ రాష్ట్రం గోదావరి నదీ జలాల ట్రిబ్యునల్ తమకు కేటాయించిన నీటిలో సగభాగాన్ని కూడా ఉపయోగించుకోవడం లేదు. ఆంధ్రప్రదేశ్ తన వాటాను ఇప్పటికే పూర్తిగా వినియోగించుకుంటోంది. బనకచర్లపై ముందస్తు సాధ్యాసాధ్యాల నివేదికకు సంబంధించి సీడబ్ల్యూసీ తెలంగాణ ప్రభుత్వానికి రాసిన లేఖలో సూచించిన విధంగా ఆంధ్రకు అదనపు జలాలు సమకూరుస్తామని తెలంగాణ ప్రభుత్వం లిఖిత పూర్వకంగా హామీ ఇవ్వడమనేది జరగని విషయం. తనకు కేటాయించిన నీటి వాటా, భావి ప్రాజెక్టులపై తన హక్కును వదులుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం అంగీకరిస్తే తప్ప, దాని నుంచి ఆంధ్రప్రదేశ్ 200 టీఎంసీల నీటిని వాడుకునేందుకు తమకు అభ్యంతరం లేదనే లిఖితపూర్వక హామీ పొందడమనేది జరగదు.

సీడబ్ల్యూసీ బాధ్యతలు, అధికారాలు రాజ్యాంగ నిర్దేశితమైనవి. తమకు కేటాయించిన నదీజలాల ఆధారంగా కాకుండా ఇతరత్రా నిర్మించేందుకు తలపెట్టిన కొత్త ప్రాజెక్టులకు అనుమతిని నిర్ద్వంద్వంగా నిరాకరించేందుకు సీడబ్ల్యూసీకి అధికారమున్నది. నీటి కేటాయింపులు పొంది, ప్రస్తుతం ఆ జలాలను ఉపయోగించుకోలేకపోతున్న రాష్ట్రాల భావి ప్రయోజనాలను పరిరక్షించే బాధ్యత కూడా సీడబ్ల్యూసీపై ఉన్నది. ఎగువ రాష్ట్రాలు ఏవైనా తమ వాటా నీటిని ఉపయోగించుకోలేకపోతే దిగువ రాష్ట్రాలు వాటిని ఉపయోగించుకునేందుకు వీలులేదు. ఉమ్మడి పరీవాహక ప్రాంతంలోని ఇతర రాష్ట్రాల అవసరాలు, ఆకాంక్షలను తప్పక గుర్తించి, గౌరవించాలి. ఈ దృష్ట్యా వరద జలాలు, సముద్రానికి వృథాగా వెళుతున్న నీరు అనే భావనలు బనకచర్ల తరహా అదనపు ప్రాజెక్టుల నిర్మాణానికి ఆలంబన కాబోవు. సముద్రంలోకి ప్రవహిస్తున్న నీరు వృథా అయిపోతుందనేది పూర్తిగా కాలం చెల్లిన భావన. నదీ ప్రవాహాలను అడ్డుకుంటే పర్యావరణ విపత్తులు సంభవిస్తాయి. నదులు స్వేచ్ఛగా సముద్రానికి ప్రవహించాలి.. ఇది పర్యావరణ అవసరం. కోస్తా ప్రాంతాలు ఈ నీటిపైనే ఆధారపడి ఉన్నాయి. ఈ కారణంగానే వరద జలాల భావన అనేదే లేదని సీడబ్ల్యూసీ స్పష్టం చేసింది. ఏ ప్రాజెక్టుకూ వరద జలాల కేటాయింపు లేదని ఖండితంగా పేర్కొంది. బనకచర్ల ముందస్తు సాధ్యాసాధ్యాల నివేదికపై సీడబ్ల్యూసీ తీసుకున్న విధానపరమైన వైఖరి అది. గోదావరీ తీరస్థ రాష్ట్రాలకు 18 ఫిబ్రవరి 2022న రాసిన లేఖలో ఇచ్చంపల్లి వద్ద 75 శాతం మిగులు జలాల లభ్యత (ఏదైనా ప్రాజెక్టు తలపెట్టినప్పుడు ఆ ప్రాజెక్టు కింద ఏర్పాటయ్యే ఆయకట్టుకు నాలుగేళ్లలో కనీసం మూడేళ్లపాటైనా నిర్దేశిత సాగునీరు అందుబాటులో ఉండే విధానాన్ని 75 శాతం లభ్యత అంటారు) లేదని కేంద్ర జలసంఘం స్పష్టం చేసింది. గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు ముందస్తు సాధ్యాసాధ్యాల నివేదికపై పోలవరం వద్ద 200 టీఎంసీల నీటి లభ్యతపై కూడా స్పష్టమైన వ్యాఖ్యలు చేసింది. గోదావరి ఎగువ రాష్ట్రాలలో పూర్తయిన, నిర్మాణమవుతున్న, ప్రతిపాదిత ప్రాజెక్టులు అన్నిటినీ పరిగణనలోకి తీసుకుని ఆ వ్యాఖ్యలు చేయడం జరిగింది.

బనకచర్ల ప్రాజెక్టు ముందస్తు సాధ్యాసాధ్యాల నివేదికపై ఎగువ రాష్ట్రాలయిన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిషాలు కూడా తమ అభిప్రాయాలు చెప్పవలసిన అవసరం ఉంది. ఈ రాష్ట్రాలు తమ వాటా జలాల నుంచి కొత్త ప్రాజెక్టుకు అవసరమైన నీటిని ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వవలసి ఉన్నది. ఇది జరగడం అసంభవం. గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు వంటివి ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజల మధ్య గందరగోళాన్ని, విభేదాలను సృష్టిస్తాయి. అటువంటి నిష్ఫల ప్రాజెక్టులను ప్రశ్నించిన వారిపై అభివృద్ధి నిరోధకులు లేదా ఫలానా రాష్ట్ర వ్యతిరేకి అని ముద్ర వేయడమూ జరుగుతుంది. బనకచర్ల ప్రాజెక్టును ప్రశ్నిస్తున్నవారు ప్రత్యామ్నాయాలను సూచించవలసిన అవసరమున్నది. అన్ని ప్రత్యామ్నాయాలను అన్వేషించాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు ఉన్నది.

ఆంధ్రప్రదేశ్ పాలకులు మూడు విషయాలపై ఆలోచించవలసిన అవసరం ఉంది. బనకచర్ల ఆచరణ సాధ్యమైన ప్రాజెక్టు కాదు. ఆంధ్ర, తెలంగాణ ప్రజల మధ్య సమస్యలు తలెత్తేందుకు ఆస్కారమున్నది; ఆంధ్రప్రదేశ్‌పై ఈ ప్రాజెక్టు పెద్ద ఎత్తున ఆర్థిక భారాన్ని మోపవచ్చు; ప్రస్తుత ప్రతిపాదనల ప్రకారం బనకచర్లకు సీడబ్ల్యూసీ, పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ, అపెక్స్ కౌన్సిల్ మొదలైనవి అనుమతులు ఇవ్వబోవు; రాయలసీమ రైతులను ఆదుకునేందుకు అనేక మార్గాలు ఉన్నాయి; మరీ ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టుకు మద్దతు నివ్వలేదు. రాజకీయ కారణాలతో కేంద్ర ప్రభుత్వ తోడ్పాటు లభించినా దేశవ్యాప్తంగా నదీ జలాల కేటాయింపులకు ప్రస్తుతం అనుసరిస్తున్న మార్గదర్శక సూత్రాలు, నియమ నిబంధనలు, వ్యవస్థాపిత ప్రమాణాలు సమస్తమూ సమసిపోతాయి. ఇదే సంభవిస్తే సీడబ్ల్యూసీ విశ్వసనీయత, అధికారమూ హరించిపోతాయి. దేశ జలవనరుల నిర్వహణలో కీలక పాత్ర వహిస్తున్న ఆ జాతీయ సంస్థ నిష్పాక్షికతపై ప్రజలు నమ్మకం కోల్పోతారు.


■ డాక్టర్ బిక్షం గుజ్జా
■ డాక్టర్ కె.శివకుమార్
(వ్యాసకర్తలు జలవనరుల, పర్యావరణ వ్యవహారాల నిపుణులు)

ఇంటర్నెట్‌ను కమ్మేసిన అశ్లీలం

భారత ప్రభుత్వం 25 అశ్లీల యాప్‌లు, వెబ్‌సైట్లపై నిషేధం విధిస్తూ ఇటీవల నిర్ణయం తీసుకొంది. 2018లో కూడా భారత టెలీ కమ్యూనికేషన్ విభాగం 827 పోర్న్ వెబ్‌సైట్లు బ్లాక్ చేయాలని ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లకు ఆదేశాలు ఇచ్చింది. అంతకుముందు 2015లో సైతం సుప్రీం కోర్టు ఆదేశాలను అనుసరించి 850 పోర్న్ వెబ్‌సైట్లను బ్లాక్ చేసింది. ఈ లెక్కలు ఎలా ఉన్నా మనుషుల ఆలోచనాధోరణుల్లో మార్పులు రానంత వరకూ అశ్లీలతకు ఎవరూ అడ్డుకట్ట వేయలేని పరిస్థితులు ఉన్నాయి.

నీలి చిత్రాలను పంపిణీ చేసే పోర్న్ హబ్ అనే సంస్థ సర్వే ప్రకారం– అశ్లీల చిత్రాలు చూసేవారిలో అమెరికా, బ్రిటన్ తరువాత స్థానంలో భారతీయులు ఉన్నారు. వివిధ ఇంటర్నెట్ సర్వేలు కూడా మన దేశంలో అశ్లీల చిత్రాలు చూసే వారి సంఖ్య పెరుగుతోందని చెబుతున్నాయి. పట్టణ ప్రాంతాల్లో 63శాతం మంది చూస్తున్నారు, ఇందులో 75 శాతం మొబైల్స్‌లో చూస్తున్నారు.

ఈ మార్కెట్‌ను ఆధారం చేసుకొనే దేశంలో అశ్లీల చిత్రాలు రూపొందించే వారు, నటించేవారు పెరిగిపోయారు. వాటిని యాప్‌లు, వెబ్‌సైట్ల రూపంలో మన ఫోన్లలోకి డంప్ చేస్తున్నారు. శుక్రవారం నిషేధానికి గురైన ఉల్లు యాప్ యజమాని ఆస్తి రూ.100కోట్లు అని అంచనా. ఈ యాప్‌లో బోల్డ్ కంటెంట్ పేరుతో అశ్లీలాన్ని గుమ్మరిస్తున్నారు. ఉల్లు యాప్ వాళ్ళు హద్దులు మీరడంతో ఈ యేడాది మే నెలలో జాతీయ మహిళా కమిషన్ సమన్లు ఇచ్చింది. నిషేధానికి గురైన మరో యాప్ ఏఎల్‌టీటీ బాలాజీ. ఈ యాప్ యజమాని ఏక్తా కపూర్. పలు టీవీ సీరియళ్ళు, సినిమాలు తీసిన ఏక్తా కపూర్‌కి 2020లో పద్మశ్రీ పురస్కారం కూడా దక్కింది. ఏఎల్‌టీటీ యాప్‌లో బోల్డ్ కంటెంట్ పేరుతో అశ్లీలాన్ని గుప్పిస్తున్నారు. నిషేధం వార్త వచ్చాక ఆ కంపెనీతో తనకు సంబంధం లేదని, 2021లో బయటకు వచ్చానని ఏక్తాకపూర్ వివరణ ఇచ్చారు. అయితే సదరు యాప్ బాలాజీ టెలీ ఫిల్మ్స్ నుంచే పుట్టిందని ఆరోపణ. గతంలో నటి శిల్పాశెట్టి భర్త రాజ్ కుంద్రా కూడా ఈ అశ్లీల చిత్రాలు నిర్మించి అరెస్టయ్యారు. వెబ్‌సైట్లు, యాప్స్ నిషేధానికి గురవుతుండటంతో వీటిలో నటించే వారు, నిర్మాతలు కొత్త మార్గాలు వెతుకుతున్నారు. ఎక్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్ లాంటి సోషల్ మీడియా వేదికల ద్వారా ఖాతాలు తెరిచి అశ్లీల చిత్రాలు గుమ్మరిస్తున్నారు. అంతే కాదు అందులో నటించేవారు– వీడియో కాల్స్ వ్యాపారాలకు తెర తీశారు. నిర్దేశిత రుసుములతో సెమీ న్యూడ్, న్యూడ్ లైవ్ షోల ద్వారా వ్యాపారం చేస్తున్నారు.



యాప్స్, వెబ్‌సైట్లతోపాటు ప్రభుత్వం సోషల్ మీడియా ప్లాట్‌ఫార్మ్స్‌లో ఉన్న నీలి కంటెంట్‌ను అదుపు చేయాలి. ఇంతకంటే ముందు అసలు ఇలాంటి కంటెంట్‌ను నిర్మించేవారిని, నటించేవారిని, సాంకేతిక నిపుణులను... వీరికి పెట్టుబడులు సమకూర్చి, ఇలాంటి వీడియోల ఆధారంగా వ్యాపారం చేసేవారిని ముందుగానే గుర్తించి అదుపు చేయాలి. నీలి చిత్రాల నటులు, సాంకేతిక నిపుణులకు ప్రచారం కల్పించే వెబ్ ఆధారిత చానెళ్లు, ఖాతాలను కూడా కట్టడి చేయాలి.

కొంతలో కొంత మెరుగు ఏమిటంటే– తెలుగులో ఈ తరహా కంటెంట్‌కు తగిన ఆదరణ దక్కలేదు. కరోనా సమయంలో ఇక్కడ కూడా రొమాంటిక్ పేరుతో ఈ తరహా చిత్రాలు, బూతు కథలు చెప్పే వీడియోలు మొదలైనప్పటికీ, తగిన ఆదరణ రాకపోవడంతో కొద్ది కాలమే నడిచింది ఈ దందా. ఇందులో కొందరు పెయిడ్ వీడియోలు మొదలుపెట్టారు. అలాగే హాస్యం పేరుతో బూతులతో వీడియోలు చేస్తున్నారు. రీల్స్ ద్వారా ప్రవహిస్తున్న అశ్లీలత మరో ఎత్తు. ఏఐ టెక్నాలజీ వాడి స్టాండప్ కామెడీ వీడియోల తరహాలో యువతులను సృష్టించి వారితో పచ్చి బూతులు మాట్లాడిస్తున్నారు.

పోర్నోగ్రఫీకి సంబంధించిన కేసులు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టాల ప్రకారం నమోదు చేస్తున్నారు. 2015లో వచ్చిన తీర్పు మేరకు ఇంట్లో నాలుగు గోడల మధ్య పోర్న్ చూడటం నేరం కాదు. అయితే ఆ తరహా వీడియోలు తీయడం, ప్రచారం, పంపిణీ మాత్రం నేరం. సెక్షన్ 292 అశ్లీలం అంటే ఏంటో వివరిస్తుంది. ఈ సెక్షన్ ప్రకారం వీటిని రూపొందించడం, డిస్ట్రిబ్యూషన్ చేయడం నేరంగా పరిగణిస్తూ తొలిసారి అయితే మూడేళ్ల జైలు శిక్ష, రెండోసారి అయితే ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తారు. సెక్షన్ 67ఏ ప్రకారం అశ్లీల కంటెంట్‌ను ఎలక్ట్రానిక్ రూపంలో పబ్లిష్ చేయడం, షేర్ చేయడం నేరం. ఈ సెక్షన్ కింద గరిష్ఠంగా ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10 లక్షల వరకు జరిమానా విధిస్తారు. రెండోసారి నేరం చేస్తే ఏడేళ్ల వరకూ జైలు శిక్ష విధించవచ్చు.

యాప్స్, వెబ్‌సైట్లతోపాటు ప్రభుత్వం సోషల్ మీడియా ప్లాట్‌ఫార్మ్స్‌లో ఉన్న నీలి కంటెంట్‌ను అదుపు చేయాలి. ఇంతకంటే ముందు అసలు ఇలాంటి కంటెంట్‌ను నిర్మించేవారిని, నటించేవారిని, సాంకేతిక నిపుణులను... వీరికి పెట్టుబడులు సమకూర్చి, ఇలాంటి వీడియోల ఆధారంగా వ్యాపారం చేసేవారిని ముందుగానే గుర్తించి అదుపు చేయాలి. నీలిచిత్రాల నటులు, సాంకేతిక నిపుణులకు ప్రచారం కల్పించే వెబ్ ఆధారిత చానెళ్లు, ఖాతాలను కూడా కట్టడి చేయాలి.

ఇన్ని చేసినా అశ్లీలతను కట్టడి చేయగలమా అంటే జవాబు చిక్కని ప్రశ్నే! పాఠశాల స్థాయి నుంచే పిల్లలకు ఏది మంచి ఏది చెడు అని చెప్పాలి. నైతిక విలువల బోధన పాఠ్యాంశాల్లో చేర్చాలి. భారతీయ జీవన విధానం, కుటుంబ బంధాల విలువను తెలియచెప్పాలి. ఇది విద్యాలయాల స్థాయిలో చేయాలి. అదే సమయంలో గృహ వాతావరణంలోను మార్పు రావాలి. పట్టణ, నగర వాతావరణంలో భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగస్తులుగానో, వ్యాపార వ్యవహారాల్లోనో తలమునకలవుతున్నారు. తమ బిడ్డలకు కావల్సిన సౌకర్యాలు సమకూరుస్తున్నారు. ఇందులో భాగంగా వారికి ఇచ్చే మొబైల్స్, లాప్‌టాప్స్ మీద ఓ కన్ను వేసి ఉంచాల్సిందే. వారికి తగినంత సమయం కేటాయించి మంచి చెడు చెప్పడం అవసరం. లేదంటే రేపటి తరం మెదళ్లు చెదలు పట్టే ప్రమాదం ఉంది.

○ వట్టికూటి చక్రవర్తి

ఆలయం కోసం యుద్ధంలో సందేశం ఏమిటి?

ఒక ప్రాచీన శివాలయం కోసం కాంబోడియా–థాయ్‌లాండ్ మధ్య ఘర్షణలు రేగడం వెనుక పనిచేసినదేమిటి? కొంత భూభాగంపై ఆధిపత్యం కంటే, తమ పూర్వీకుల మూలాలూ, ఆనవాళ్లకు సంబంధించిన ఉద్వేగపూరితమైన అంశం ఇది. ఈ వైరం భూమి కోసం కాదు, సాంస్కృతిక వారసత్వం కోసం. మరి, దీని నుంచి మనం నేర్చుకోవాల్సినదీ, స్ఫూర్తి పొందాల్సినదీ ఏమీ లేదా?

జైనం, బౌద్ధం, వీరశైవం భారతీయ సమాజాన్ని ప్రభావితం చేసి సర్వమానవ సమానత్వానికి బాటలేశాయి. మానవ సమాజపు ఉన్నతి ఎట్లా ఉండాలో బసవేశ్వరుడు వందలయేండ్ల కిందనే ఆచరించి చూపించారు. తన ప్రజామండపంలో మహిళలకూ సమాన అవకాశాలిచ్చారు. అట్టడుగు సామాజిక వర్గాలకు ప్రాధాన్యం ఇచ్చారు. జైనం ఉనికిలో ఉన్నప్పుడు అల్ప, స్వల్ప ప్రాణులకూ కష్టం, నష్టం కలిగించరాదనే భావనను నూరి పోసింది. బౌద్ధం మానవాళి జీవన గమనాన్నే మార్చి వేసి, ఆనాటి సామాజిక, రాజకీయ పరిస్థితులకు సరికొత్త భాష్యాన్ని చెప్పింది. బసవేశ్వరుడు, ఆ తర్వాత చాలా మంది మార్గదర్శులు సమాజపు ఆలోచనా ధోరణిని మార్చి, సరికొత్త దారులు చూపించారు. అక్కమహాదేవి, అల్లమమహాప్రభు, హరళయ్య, కక్కయ, వేమన, ఆదున్న ఇద్దాసు... ఇట్లా చాలామంది శివతాత్విక పునాది ఆధారంగా అందర్నీ ఏకం చేసేందుకు యత్నించారు, సఫలమయ్యారు. నాటి సామాజిక పరిస్థితుల కోణంలో చూసినప్పుడు వీరిది అతి పెద్ద సాహసం. వీరి బోధలు ఆ తర్వాత ఉత్పత్తి కులాల ప్రజల పనిపాటల్లో ప్రధాన భాగం అయ్యాయి. ఆలోచనలను, ఉత్పత్తిశక్తిని పెంచాయి. సరికొత్త సంస్కృతికి, ఉన్నతికి దారి చూపించాయి.

పాల్కురికి, ధూర్జటి, శ్రీనాథుని రచనలన్నీ నాటి వీరశైవ ప్రభావంతోనే వచ్చాయి, నాటి సమాజాన్ని ప్రభావితం చేశాయి. కర్ణాటక, రాయలసీమ, తెలంగాణ ప్రాంతాల్లో శివాలయాలు లెక్కకు మిక్కిలిగా ఉన్నాయి. ఈ ప్రజల జీవితాల్లో శివుడు ప్రధానం. కాలక్రమంలో వీరశైవ ప్రభావం ఎందుకు తగ్గిపోయిందో చారిత్రక, సాంస్కృతిక కోణాల్లో పరిశోధించాలి. కాయకమే కైలాసం అని చెప్పిన బసవేశ్వరుల జీవితసారం గురించి మనం ఎందుకు మర్చిపోయామో ఆలోచించాలి. "రాజుల్ మత్తుల్ వారి సేవ నరక ప్రాయంబు" అని ప్రభువులనే సవాల్ చేసిన ధూర్జటి ఇచ్చిన చైతన్యం గురించీ తెలుసుకోవాలి. జన జీవితంలో పరుల కోసం జీవించాలనే తలంపును బలీయంగా తీసుకొచ్చింది వీరశైవమే. అంటే శివుని మార్గం. మరి, మనదైన ఉన్నతి సంస్కృతిని, సదాచారాన్ని సమాజం ఎందుకు మర్చిపోయింది? భక్తి భావన అంటే అందరూ బాగుండాలని, పరులకు మేలు చేయకపోయినా, కీడు తలంచొద్దనే. తత్వాల రూపంలో, గేయాల రూపంలో, పద్యాల రూపంలో, నాటకాల రూపంలో పూర్వీకులు బోధించిన ఇలాంటి పాఠాలను జీవితంలో ఆచరిస్తున్నామా? రెండు దేశాల మధ్య ఒక శివాలయం కోసం జరిగిన యుద్ధాన్ని మనం చూడాల్సింది వార్తగా కాదు. వీరశైవం బోధించిన సర్వమానవ సమానత్వాన్నీ, ప్రజాస్వామ్యాన్నీ మనం అవలోకనం చేసుకోవాలి, ఆచరించాలి.

– గోర్ల బుచ్చన్న (జర్నలిస్టు)

రైతుకు తోడై నిలిచిన పరిశోధన

ఋతుపవనాల ఎగుళ్ళు దిగుళ్ళు, ఉష్ణ మండల ప్రాంతపు సముద్ర తలాల ఉష్ణోగ్రతలూ, తత్కారణంగా జరిగే ఉష్ణ సంవహన ప్రక్రియలకు సంబంధించి నాలుగున్నర దశాబ్దాల క్రితం తన పరిశోధనతో భారతదేశపు వ్యవసాయాన్ని, పంటలనూ, దేశ ఆర్థిక ప్రణాళికలను ప్రభావితం చేసిన ప్రొ. సులోచనా గాడ్గిల్ 81 సంవత్సరాల వయసులో ఈ జూలై 24న బెంగళూరులో కన్నుమూశారు. ఆమె పరిశోధనల్లో స్థూలంగా గణిత, భౌతిక శాస్త్రాలు; వాతావరణ, సముద్ర శాస్త్రాలు; వ్యవసాయం, ఆర్థిక శాస్త్రం మొదలైన విభాగాలు కలగలిశాయి. భారత ఋతుపవనాల గురించి అమోఘంగా కృషి చేసి, మూడు వందల ఏళ్ళుగా మనకు ఉన్న అవగాహనను విస్తృతం చేసిన ప్రపంచ స్థాయి శాస్త్రవేత్త డా. సులోచనా గాడ్గిల్.

భారత స్వాతంత్ర్యోద్యమంలోనే కాదు, మహిళా విమోచనా కార్యక్రమాలలో కూడా ఒకటిన్నర శతాబ్దం చరిత్ర ఉన్న పూణె నగరంలో సులోచన 1944 జూన్ 7న వేశ్వంత్ పాఠక్, ఇందుమతి దంపతులకు జన్మించారు. వీరికి కలిగిన నలుగురు ఆడపిల్లల్లో ఈమె మూడవ సంతానం. ఈమె తాత వైద్యుడిగా సేవలందిస్తూ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న వ్యక్తి. కనుక వాళ్ళింటికి ఎప్పుడూ ఆయన మిత్రులైన పోరాట యోధులు వస్తూ వెడుతూ ఉండేవారు. తండ్రి అల్లోపతిలో ఎం.డి. పట్టాతో పాటు ఆయుర్వేద, యోగ విధానాలలో పూర్తిగా అవగాహన ఉన్న వైద్యులు. తల్లి మరాఠీ సాహిత్యరంగంలో ప్రముఖులు. పూణెలో ప్రాథమిక విద్య తర్వాత ఆమె హైస్కూల్ విద్య కోసం ఏపీ లోని మదనపల్లి దగ్గర ఉన్న ఋషి వ్యాలీలో చేరారు. మార్కులు, ర్యాంకులతో సంబంధం లేకుండా ఇష్టమైన అంశాన్ని, ఇష్టమైన రీతిలో చదివే అవకాశం తనకు అక్కడ లభించిందని; అదే దృష్టి తన చదువును, జీవితాన్ని తీర్చిదిద్దిందని ఆమె చెప్పేవారు. పూణెలోని ఫెర్గ్యూసన్ కాలేజీలో కెమిస్ట్రీ, ఫిజిక్స్, మ్యాథమెటిక్స్‌తో బీఎస్సీ చేసిన తర్వాత; పూణె విశ్వవిద్యాలయం నుంచి అప్లైడ్ మ్యాథమెటిక్స్‌లో ఎంఎస్సీ 1965 లో పూర్తి చేశారు. ఒకసారి బోర్ కొట్టి క్లాసు ఎగ్గొట్టడానికి కిటికీలోంచి దూకుతున్న సులోచన రెండేళ్ల సీనియరైన మాధవ్ గాడ్గిల్ దృష్టిని ఆకర్షించారు. సులోచన ఎమ్మెస్సీ చదివే సమయంలో మాధవ్ గాడ్గిల్‌తో ఆమె పెళ్ళి జరిగింది. ఆ తర్వాత ఇద్దరూ ఫెలోషిప్ మీద హార్వర్డు యూనివర్సిటీలో చేరారు.

పక్షులు, సీతాకోకచిలుకలు, ఏనుగులు, మేఘాలు, నక్షత్రాలు, తోకచుక్కలు పరిశీలించడం తన హాబీ అని చెప్పుకునే సులోచనా గాడ్గిల్ ప్రకృతి ప్రపంచం మీద ఆసక్తి కలిగి హార్వర్డ్ యూనివర్సిటీలో 'ఫిజికల్ ఓషనోగ్రఫీ' అంశాన్ని ఎంచుకున్నారు. తనకు ఫిజిక్స్, మ్యాథమెటిక్స్ లలోతైన అవగాహన ఉందనీ; అదే సమయంలో తన భర్త మాధవ్‌కు మ్యాథమెటికల్ ఎకాలజీ, ఎవల్యూషనరీ బయాలజీ ఆసక్తికరమైన విషయాలు కావడం వల్ల తన అధ్యయనం హాయిగా సాగిందనీ ఆమె చెప్పేవారు. ప్రొఫెసర్ ఎ.ఆర్. రాబిన్‌సన్ వద్ద ఫిజికల్ ఓషనోగ్రఫీ పూర్తి చేసిన తర్వాత; అక్కడే ప్రఖ్యాత శాస్త్రవేత్త ప్రొ. జూల్స్ చర్నీ వద్ద 'ప్లానిటరీ ఫ్లూయిడ్ డైనమిక్స్'లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. తర్వాత ఋతుపవనాల మీద ఆసక్తి కలిగి చర్నీ వద్దనే ఎమ్ఐటీలో పోస్ట్‌డాక్టోరల్ రీసెర్చ్ ముగించారు. అమెరికాలో ఆరేళ్ల పాటు మూడు విలక్షణమైన విభాగాలను శోధించి భర్తతో కలిసి 1971లో భారతదేశం తిరిగి వచ్చారు. అప్పటికి ఆమె ఋతుపవనాల తీరుతెన్నుల గురించి పట్టు సాధించడంతో వాతావరణంలో మార్పులను విశ్లేషించే రీతిలో పరిశోధన చేపట్టడానికి సాహసం చేశారు. ఈ పరిశోధన కొనసాగింపుగా పంటలకొచ్చే తెగుళ్లు, రోగాలు, కరువు పరిస్థితులు వంటివి ముందుగా వివరించే రీతిలో దేశానికి దోహదపడ్డారు.




ఉష్ణమండల సముద్రాల పైన ఉండే మేఘమాలికల వర్షస్వభావం అనేది ఆయా సముద్రతలాల ఉష్ణోగ్రతల మీద ఆధారపడి ఉంటుంది. ఈ ఉష్ణోగ్రత 28డిగ్రీల సెల్సియస్ ఉన్నప్పుడు అత్యధిక వర్షపాతం పడే అవకాశం ఉందని సులోచనా గాడ్గిల్ బృందం చేసిన పరిశోధనలతో తేలింది. నేరుగా జన సామాన్యంతో, దేశ ఆర్థిక భద్రతతో ముడిపడిన పరిశోధనాంశం కనుక ఆమె సదా రైతులతో ముచ్చటిస్తూ క్షేత్రస్థాయి నివేదికలను అధ్యయనం చేసేవారు.

1971లో భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత సులోచనా గాడ్గిల్ సీఎస్ఐఆర్ పూల్ ఆఫీసర్‌గా పూణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రోపికల్ మెటీరాలజీలో ఓ రెండేళ్ల పాటు పనిచేయడంతో వాతావరణానికి సంబంధించి నిష్ణాతులైన ఆర్. అనంతకృష్ణన్, డి.ఆర్. శిక్కాలతో పరిశోధన చేసే అవకాశం కలిగింది. 1973లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ డైరెక్టర్‌గా ప్రముఖ అంతరిక్ష విజ్ఞానవేత్త సతీష్ ధావన్ ఫ్లూయెడ్ డైనమిక్స్‌లో ఋతుపవనాల గురించి పరిశోధన చేయాలని సెంటర్ ఫర్ థియరిటికల్ స్టడీస్ విభాగాన్ని ప్రారంభించి, సులోచనా గాడ్గిల్‌ను ఆహ్వానించి, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా తీసుకున్నారు. అదే సమయంలో అదే విభాగంలో మ్యాథమెటికల్ ఎకాలజీకి సంబంధించి మాధవ్ గాడ్గిల్ కూడా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా అవకాశం పొందారు. క్రమంగా ఈ విభాగమే 'సెంటర్ ఫర్ అట్మాస్ఫియరిక్ అండ్ ఓషనిక్ సైన్సెస్'గా మారి ఇక్కడ విశేషమైన పరిశోధనలు జరిగాయి.

ఉష్ణమండల సముద్రాల పైన ఉండే మేఘమాలికల వర్షస్వభావం అనేది ఆయా సముద్రతలాల ఉష్ణోగ్రతల మీద ఆధారపడి ఉంటుంది. ఈ ఉష్ణోగ్రత 28డిగ్రీల సెల్సియస్ ఉన్నప్పుడు అత్యధిక వర్షపాతం పడే అవకాశం ఉందని సులోచనా గాడ్గిల్ బృందం చేసిన పరిశోధనలలో తేలింది. నేరుగా జన సామాన్యంతో, దేశ ఆర్థిక భద్రతతో ముడిపడిన పరిశోధనాంశం కనుక ఆమె సదా రైతులతో ముచ్చటిస్తూ క్షేత్రస్థాయి నివేదికలను అధ్యయనం చేసేవారు. ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో కర్ణాటక రాష్ట్రం లోని పావగడ ప్రాంతపు రైతుల నుంచి తెగుళ్లు, చీడపీడల గురించి సమాచారం అందుకొని పరిశోధన కొనసాగించడం విశేషం. 2016లో భూ విజ్ఞాన శాస్త్రాల మంత్రిత్వ శాఖ జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేస్తూ 'ఏ ఆర్థిక శాస్త్రవేత్తా సాధించని రీతిలో సులోచనా గాడ్గిల్ విజయం సాధించారని పేర్కొన్నది. గత ఐదు దశాబ్దాలలో మనదేశపు జీడీపీలో వ్యవసాయం పాత్ర తగ్గినా; కరువు ప్రభావం మాత్రం అలాగే రెండు నుంచి ఐదు శాతంగా దాదాపు స్థిరంగా ఉందని ఈమె పరిశోధన తేల్చింది.

సులోచన భర్త మాధవ్ గాడ్గిల్ జీవావరణ శాస్త్రవేత్త మాత్రమే కాకుండా రచయితగా, కాలమిస్ట్‌గా కూడా ప్రఖ్యాతులు. పశ్చిమ కనుమల జీవావరణాన్ని అధ్యయనం చేయడానికి 2010లో ఏర్పరిచిన గాడ్గిల్ కమిషన్‌తో సుప్రసిద్ధులు. సులోచనా గాడ్గిల్ కూతురు జర్నలిస్టుగా ఉంటూ స్పానిష్ భాషను బోధిస్తుంటారు. కుమారుడు సిద్ధార్థ గాడ్గిల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్‌లో గణిత శాస్త్రవేత్తగా పరిశోధనలు చేస్తున్నారు. విద్యా సంస్కార సంపద పుష్కలంగా ఉన్న నేపథ్యం నుంచి వచ్చిన సులోచనా గాడ్గిల్ ఋతుపవనాల గురించి విశేషమైన పరిశోధన చేసిన ప్రపంచ స్థాయి శాస్త్రవేత్తగా కలకాలం గుర్తుండిపోతారు.

• డా. నాగసూరి వేణుగోపాల్



పులిచింతల నుంచి భారీగా నీటి విడుదల

బిరబిరా.. కృష్ణమ్మ


బిరబిరా పరుగులతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. ఎగువ రాష్ట్రాల్లో వర్షాలతో.. శ్రీశైలం నుంచి భారీగా వరద పోటెత్తుతుండటంతో నాగార్జున సాగర్, పులిచింతల జలాశయాలతో పాటు ప్రకాశం బ్యారేజీ నిండుకుండల్లా మారాయి. సాగర్‌కు భారీగా వరదతో 26 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. లక్షల క్యూసెక్కులు సముద్రం దిశగా పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. దీంతో ప్రకాశం బ్యారేజీకి ఎగువున కృష్ణమ్మ సోయగాలతో కనువిందు చేస్తుండగా దిగువున వరద భయంతో ప్రజలను వణికి స్తోంది. నదీ తీరం వెంట గంటగంటకు వరద ఉధృతి పెరుగుతోంది. దీంతో మత్స్యకారులు తమ పడవలను ఒడ్డుకు చేర్చుకున్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా జూలై నెలలో కృష్ణానది లో నీటి ప్రవాహం ఉంది. పైగా నాగార్జున సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు జలాశయాలు నిండుకుండల్లా మారడం.. భారీగా వరద నీటి విడుదలతో పలు ప్రాంతాల్లో రైతులు ముమ్మరంగా సాగు పనులు చేపట్టారు. అయితే డెల్టా పరిధిలోని లంక గ్రామాల్లోని సాగుదారులు ఆందోళన చెందుతున్నారు.

- జలాశయాల గేట్ల నుంచి జాలువారుతూ..
- ఒకవైపు కనువిందు.. మరోవైపు వరద భయం
- సాగర్‌కు కొనసాగుతున్న వరద.. 26 గేట్లు ఎత్తి విడుదల
- ఇన్‌ఫ్లో 3,01,350 క్యూసెక్కులు.. ఔట్‌ఫ్లో 2,54,668 క్యూసెక్కులు
- వరద హెచ్చరికతో భయాందోళనల్లో లంక గ్రామాల రైతులు

నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి 2,82,364 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. దీంతో బుధవారం అధికారులు 26 క్రస్ట్ గేట్లను తెరిచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. 16 క్రస్ట్‌గేట్లను 5 అడుగులు, 10 క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 2,65,816 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జల విద్యుత్ కేంద్రం ద్వారా 28,826, కుడి కాల్వ ద్వారా 8144, ఎడమ కాల్వ ద్వారా 7272, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, మొత్తం ఔట్‌ఫ్లో 3,12,158 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 586.20 అడుగులు ఉంది. శ్రీశైలం నుంచి సాగర్‌కు ఇన్‌ఫ్లో 2,82,364 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

బ్యారేజీకి పెరిగిన ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లోలు

ప్రకాశం బ్యారేజ్ వద్ద గంట గంటకు ఇన్‌ఫ్లో, అ వుట్‌ఫ్లోలు పెరుగుతున్నా యి. బుధవారం రాత్రి 9.30 గం టలకు 1,21,679 క్యూసెక్కుల వరద నీరు బ్యారేజ్ వద్దకు చేరుతున్నట్లు ఇరిగేషన్‌వర్గాలు గుర్తించాయి. బ్యారేజ్‌లో నీటిమట్టం 12 అడుగుల వద్ద కొనసాగుతున్నది. 60 గేట్లను రెండు అడుగులు, 10 గేట్లను మూడు అడుగులు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కేఈ మెయిన్ కెనాల్‌కు 10,207, కేడబ్ల్యూ మెయిన్ కెనాల్‌కు 6,522, గుంటూరు ఛానల్‌కు 200, సముద్రంలోకి 1,04,750,750 క్యూసెక్కుల వరదనీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లోలు గురువారం ఉదయానికి మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు చెప్పారు.



ప్రకాశం బ్యారెజి వద్ద వరద ప్రవాహం

అప్రమత్తం.. హెచ్చరికలు

ఎగువ నుంచి పెద్దఎత్తున నీటి ప్రవాహంతో నదీ పరివాహక ప్రాంతంలో ప్రజలను అప్రమత్తం చేశారు. రెవెన్యూ, పోలీసు శాఖలు ముందస్తు చర్యలు చేపట్టాయి. గజఈత గాళ్లను సిద్ధం చేశారు. పశువులను నదిలోకి దింప వద్దని రెవెన్యూ శాఖ హెచ్చరించింది. పడవలను కూడా నిషేధించారు. అవసరమైన ప్రాంతాల్లో నది వెంట పోలీసు పహరా ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు వరద ప్రవాహంపై తీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.



దాచేపల్లి : రామాపురంలో కృష్ణా నది ఒడ్డున నివాసం ఉంటున్న పల్లె కార్లను అప్రమత్తం చేస్తున్న అధికారులు

కొల్లూరు, తాడేపల్లి, నరసరావుపేట, గుంటూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కృష్ణమ్మ ఉరుకులు పరుగులతో సాగరం దిశగా ప్రవహిస్తోంది. నిండుకున్న జలాశయాల నుంచి నీటి విడుదలతో ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేస్తూ పరవళ్లు తొక్కుతోంది. నాగార్జున సాగర్, టెయిల్‌పాండ్, పులిచింతల, ప్రకాశం బ్యారేజిల నుంచి భారీగా వరద ప్రవహిస్తోంది. ఎక్కడికక్కడ అధికారులు ఇన్‌ఫ్లోను అంచనా వేసి నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ జలాశయానికి భారీగా వరద పోటెత్తుతుండటంతో మంగళవారం సాయంత్రం నుంచే అన్ని గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదలు చేస్తున్నారు. దీంతో భారీగా వస్తోన్న వరదను టెయిల్‌పాండ్, పులిచింతల, ప్రకాశం బ్యారేజీల వద్ద కూడా అన్ని గేట్లు ఎత్తి దిగువకు పంపుతున్నారు. దీంతో గతంలో ఎన్నడూ లేనట్లుగా కృష్ణమ్మ ప్రవాహం ముందుకు సాగుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. సాగర్‌లో 586.20 అడుగుల మేర నీటి మట్టం ఉండగా ఇది 301.36 టీఎంసీలకు సమానం.

బుగ్గవాగు నుంచి నీటి విడుదల

జవహర్ కుడికాల్వ జలకళ సంతరించుకుంది. బుగ్గవాగు నుంచి కుడికాల్వకు 7,500 కూసెక్కుల నీటిని బుధవారం విడుదల చేసినట్లు జలవనరుల శాఖ ఎస్‌ఈ కృష్ణ మోహన్ తెలిపారు. బుగ్గవాగు పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 3.46 టీఎంసీలు కాగా 2.33 టీఎంసీలకు నీటి నిల్వ చేరింది. కుడి కాల్వ నుంచి గుంటూరు, అద్దంకి, బెల్లంకొండ, జూలకల్లు బ్రాంచ్ కాలువలకు నీటిని విడుదల చేశారు.

నిండు కుండలా పులిచింతల

వరద పోటేత్తుతుండటంతో పులిచింతల జలాశయం జలకళ సంతరించుకుంది. బుధవారం సాయంత్రానికి ప్రాజెక్టు నిండు కుండలా మారింది. డ్యాం సామర్థ్యం 45.77 టీఎంసీలకుగాను నీటి నిల్వ 41.34 టీఎంసీలకు చేరింది. పూర్తి స్థాయి నీటి మట్టం 175 అడుగులు కాగా 172.08 అడుగులకు చేరింది. గరిష్టస్థాయికి నీటి మట్టం చేరడంతో డ్యాంలోకి వచ్చిన నీటిని వచ్చినట్టుగా విడుదల చేసేందుకు (మిగతా 6వ పేజీలో)



భట్టిప్రోలు : పెదలంక అరటి తోట



చింతల్లంక వద్ద కళకళలాడుతున్న కంద పైరు



పోతార్లంక వద్ద పసుపు పైరు

తప్పుడు రిజిస్ట్రేషన్.. ఇద్దరు అరెస్టు

కోట్ల ఖరీదైన ల్యాండ్ మాఫియాపై చీటింగ్ కేసు

గుంటూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కోట్ల ఖరీదైన స్థలాలకు తప్పుడు డాక్యుమెంట్ సృష్టించి రిజిస్ట్రేషన్ చేస్తున్న ల్యాండ్ మాఫియా పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితులైన హైదరాబాద్‌కు చెందిన ఎల్లాప్రగడ చంద్రమౌళి, మంగళగిరికి చెందిన తెలగతోటి వందనం అలియాస్ వంశీలను బుధవారం అరండల్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. విద్యానగర్ శివార్లలోని సీతయ్యడొంకలో వట్టికూటి పద్మశ్రీకి 868 చదరపు గజాల స్థలం, కాట్రగడ్డ మంజులతకు 1059 చదరపు గజాల స్థలం ఉంది. తెలగతోటి వందనంతోపాటు నగరానికి చెందిన కలపాల రామ కోటేశ్వరరావు, మాదల శ్రీవల్లి, గింజుపల్లి వీరయ్యచౌదరి, వెంకట్‌రెడ్డి, విజయవాడకు చెందిన పర్వీద్ మహమ్మద్ ముఠాగా ఏర్పడి ఎల్లాపురం చంద్రమౌళి పేరుతో నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి తప్పుడు రిజిస్ట్రేషన్లతో మోసాలకు పాల్పడుతున్నారు. పద్మశ్రీ, మంజుల స్థలాలికి తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి, పశ్చిమ తహసీల్దారు సంతకాన్ని ఫోర్జరీ చేసిన పై ముఠా కొరిటెపాడు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఈ ఏడాది జనవరిలో రిజిస్ట్రేషన్ చేయించింది. విషయం తెలుసుకున్న కొరిటెపాడు సబ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో బుధవారం చంద్రమౌళి, వందనం వంశీలను అరెస్టు చేశారు. మిగిలిన నిందితుల కోసం గాలిస్తునట్లు పోలీసులు తెలిపారు. వెస్ట్ తహసీల్దారు సంతకాన్ని ఫోర్జరీ చేసి తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించిన వ్యవహారంపై నల్లపాడు పోలీస్ స్టేషన్లో గతంలోనే ఫిర్యాదు చేయగా పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. ఈ ల్యాండ్ మాఫియాపై మంగళగిరి పోలీస్‌స్టేషన్లో ఇప్పటికే రెండు చీటింగ్ కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.

రేపటి నుంచి ఆస్తులకు ఆటో మ్యుటేషన్

- ఇక పేరు మార్పు ప్రక్రియకు తిప్పలు తప్పినట్లే..

గుంటూరు కార్పొరేషన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం నుంచి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆస్తులకు ఆటోమ్యుటేషన్ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్తులకు ఆటో మ్యూటేషన్ విధానాన్ని ఇప్పటికే విజయవాడలో అమలు చేయగా అక్కడ సత్ఫలితాలు రావడంతో రాష్ట్రంలోని 17 కార్పొరేషన్లలో అమలుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఆస్తులకు ఆటోమ్యుటేషన్ విధానంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగంగా పూర్తి కావడంతో పాటుగా సమయం కూడా ఆదా అవుతుందన్నారు. ఇప్పటి వరకు ఆస్తుల మ్యుటేషన్(ఆస్తుల బదలాయింపు) కోసం, ఆస్తుల రిజిస్ట్రేషన్ అనంతరం ఇంటి పన్ను, కుళాయి పన్ను, పేరు మార్పు కోసం మ్యుటేషన్ ఫీజుగా చలానా చెల్లించాల్సి వచ్చేదన్నారు. పైగా ఈ ప్రక్రియ పూర్తి కావడానికి చాలా సమయం పట్టేదన్నారు. ఈ క్రమంలో తాజాగా అమల్లోకి రానున్న ఆటో మ్యుటేషన్ విధానంతో కార్పొరేషన్ ఆఫీసు చుట్టూ తిరగాల్సిన పని ఉండదని, ఆస్తుల కొనుగోలు తర్వాత రిజిస్ట్రేషన్ సమయంలోనే రిజిస్ట్రార్ ఆఫీసులోనే మ్యుటేషన్ ప్రక్రియ పూర్తి అవుతుందన్నారు. దీనివల్ల సమయం ఆదాతో పాటుగా కార్పొరేషన్ ఆఫీసు చుట్టూ తిరగాల్సిన పని ఉండదని తెలిపారు.

పొన్నూరు జనసేనలో కిలారి చిచ్చు



- సమన్వయకర్తకి వ్యతిరేకంగా కార్యకలాపాలపై వడ్రాణం ఫిర్యాదు
- ఎమ్మెల్సీ హరిప్రసాద్ నేతృత్వంలో రోశయ్య వ్యవహారంపై విచారణ

గుంటూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు నియోజకవర్గంలో జనసేన పార్టీలో మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య చిచ్చు రగిల్చే ప్రయత్నం చేస్తున్నారు. గత ఎన్నికల్లో వైసీపీ తరపున గుంటూరు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి ఘోర పరాజయం పాలైన రోశయ్య కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జనసేనలోకి జంపయ్యారు. జనసేన కండువా కప్పుకున్న ఆయన తాను జగన్ హయాంలో పాల్పడిన నేరాల నుంచి బయటపడే ప్రయత్నం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పొన్నూరు వైసీపీ ఎమ్మెల్యేగా కొనసాగిన రోశయ్య ఆ ఐదేళ్లలో చేయని అరాచకం లేదు. ఒక దశలో ఆయన కోర్కెలు తీర్చలేక అక్కడ పనిచేయాలంటే అధికారులు వణికిపోయారు. అలా ఆయన మాట వినని ఎంతో మంది అధికారులు అక్కడ నుంచి వేరే ప్రాంతానికి బదిలీ చేయించుకున్నారు. మరికొందరు అధికారులను కక్షతో సస్పెండ్ చేయించిన సందర్భాలున్నాయి. ఇలాంటి వ్యక్తిని టీడీపీ ప్రధాన భాగస్వామ్యంగా ఉన్న కూటమి పార్టీలోకి చేర్చు కోవడాన్ని అప్పట్లోనే ఎంతో మంది వ్యతిరేకించారు. నియోజకవర్గంలో టీడీపీ, జనసేన కేడర్‌కు ఇబ్బందికర పరిస్థితులు వస్తాయని ఆనాడే ఊహించి జనసేనలో ఆయన చేరికను అడ్డుకునే ప్రయత్నం కొందరు టీడీపీ, జనసేన నేతలు చేసినా వీలు కాలేదు. తాజా పరిస్థితులను గమనిస్తే పొన్నూరు నియోజకవర్గం సమన్వయకర్త వడ్రాణం మార్కం డేయులు జనసేన పార్టీకి తొలి నుంచి అండగా ఉంటూ వచ్చారు. పొత్తు తర్వాత టీడీపీ కేడర్‌తో కలిసి మెలిసి వ్యవహరిస్తున్నారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌తో కూడా సన్నిహితంగా మెలుగుతున్నారు. అయితే రోశయ్య రాకతో అక్కడ జనసేన పార్టీ రెండు ముక్కలు అయ్యే పరిస్థితి ఏర్పడింది. వచ్చే ఎన్నికల్లో జనసేన తరపున తాను ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం వస్తుందని ముభ్యపెట్టి పార్టీలోని ఒక వర్గాన్ని దగ్గరకు తీసుకుని మార్కండేయులుకు వ్యతిరేకంగా పనిచేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇటీవల కొందరు నేతల చేత కిలారి పరోక్షంగా మార్కండేయులుపై విమర్శలు కూడా చేయించారు.

వైసీపీ అనుయాయులతో సంబంధాలు

జనసేనలో చేరిన ఇంకా వైసీపీలోనే కొనసాగుతున్న తన అనుయాయులతో ఉన్న సంబంధాలను వదులుకోకుండా వారికి కూడా ప్రభుత్వంలో పనుల య్యేలా చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గంలో జనసేన ముసుగులో రోశయ్య వ్యవహరిస్తున్న తీరును జనసేన రాష్ట్ర కార్యాలయం దృష్టికి సమన్వయకర్త మార్కండేయులు తీసుకెళ్లారు. దీంతో పొన్నూరు వ్యవహారంపై విచారణ నిర్వహించి నివేదిక ఇవ్వాల్సిందిగా పార్టీ సుప్రీం పవన్‌కల్యాణ్ ఆ పార్టీ వ్యవహారాల ముఖ్య నేత, ఎమ్మెల్సీ హరిప్రసాద్‌ను ఆదేశించినట్లు తెలిసింది.

ప్రతి గ్రామం పరిశుభ్రంగా..



కొలకలూరులో సీసీ రోడ్డు పక్కన సైడ్ కాలువల పనులను పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

- క్లీన్ విలేజ్.. క్లీన్ కొలకలూరుకు మంత్రి మనోహర్ శ్రీకారం
- వినూత్న రీతిలో రోజంతా ఒక గ్రామంలోనే
- అప్పటికప్పుడు పరిష్కారం దిశగా తొలి అడుగు

6



ఈకేవైసీ త్వరగా పూర్తి చేయాలి

- అన్నదాత సుఖీభవ పెండింగ్‌లో 4300 మంది
- చిలువూరు రైతుసేవా కేంద్రం తనిఖీలో కలెక్టర్ నాగలక్ష్మి

దుగ్గిరాల, జూలై 30 (ఆంధ్రప్రదేశ్): అన్నదాత సుఖీభవకు అర్హత కలిగి పెండింగ్‌లో ఉన్న రైతుల బయోమెట్రిక్, ఈకేవైసీ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని వ్యవసాయ, రెవెన్యూ అధికారులను కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. మండలంలోని చిలువూరులో రైతుసేవా కేంద్రాన్ని కలెక్టర్ బుధవారం సందర్శించారు. ఆర్ఎస్‌కేలో ప్రచురించిన అన్నదాత సుఖీభవ అర్హుల జాబితాను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 4300 రైతుల ఈకేవైసీ



చిలువూరులో రైతుసేవాకేంద్రంలో అన్నదాత సుఖీభవ అర్హుల జాబితాను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

పెండింగ్ ఉందన్నారు. రైతుసేవా కేంద్రాల్లో ప్రదర్శించిన జాబితాలో పేర్లు లేవని అర్జీలు అందించిన రైతుల సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈకేవైసీ గడువు గురువారంతో ముగుస్తుండగా, పెండింగ్ ఉన్న రైతులకు ఈకేవైసీ పూర్తి చేసుకునేలా చూడాలన్నారు. ఈ నెల 31లోగా మిర్చి రైతులు, ఆగస్టు 15 లోగా వరి రైతులు పంట బీమా చేయించుకోవాలన్నారు.

బంగారు కుటుంబంతో కలెక్టర్

పీ-4 అమలు తీరును క్షేత్రస్థాయిలో కలెక్టర్ నాగలక్ష్మి బుధవారం పరిశీలించారు. కంఠంరాజుకొండూరుకి చెందిన బంగారు కుటుంబం గుమ్మడి ఝాన్సీని కలెక్టర్ స్వయంగా కలిశారు. ఆమె ఇంటి వద్దకు వెళ్లి ఆర్థిక స్థితిగతులు దృష్ట్యా మధ్యలోనే చదువు నిలిపేసిన ఆమె కుమార్తెకు అవసరమైన సాయం చేయాలని అధికారులకు సూచించారు. బంగారు కుటుంబాల వివరాలను యాప్‌లో సక్రమంగా నమోదు చేసి వారికి అండగా నిలవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, సీపీవో శేషశ్రీ, జిల్లా గృహ నిర్మాణ శాఖాధికారి కెవీ.ప్రసాద్, ఎంపీడీఓ ఏ.శ్రీనివాసరావు, ఎంపీపీ షేక్ జబీన్, సర్పంచ్ చిలువూరు మాణిక్యం, ఎంపీటీసీ చిలువూరు రోజమరియమ్మ, శేషగిరి, ఏపీఓ మధుబాల, సలాలుద్దీన్, ఏసుపాదం కార్యదర్శి ఎం. శరత్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు చెల్లింపులపై రైతుల ఆగ్రహం

- మ్యుటేషన్ వంకతో చెల్లింపుల నిలుపుదల
- తాజా జాబితాలో మృతుల పేర్లు ప్రత్యక్షం
- ఇంకా 6,114 మందికి 60 కోట్లు బకాయి
- గ్రీవెన్స్ దినోత్సవం రోజు ఆందోళనకు సిద్ధం

8 లో..

మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం అందరి బాధ్యత

- బస్టాండ్‌లలో అదనపు సౌకర్యాలు కల్పించాలి
- సమీక్షలో ఆర్టీసీ ఎండీ తిరుమలరావు, చైర్మన్ కొనకళ్ల

8

ఉపాధిలో..అవినీతికి చెక్

- నిబంధనలు కఠినతరం
- శ్రామికుల యాప్‌లో అప్‌లోడ్
- ఆదేశాలు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం

ఆదాయపన్ను చట్టాలపై అవగాహన ఉండాలి

- ఆదాయపు పన్ను అధికారి ప్రసాద్‌బాబు

కాకాని శివాలయం హుండీ ఆదాయం రూ.64,92,250


పెదకాకాని శివాలయంలో హుండీ లెక్కిస్తున్న భక్తులు, సిబ్బంది

పెదకాకాని, జూలై 30(ఆంధ్రజ్యోతి): పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానము ఆలయ ప్రాంగణములో ఉన్న కానుకల హుండీలను తెరచి కల్యాణ మండపము నందు బుధవారం లెక్కించినట్లు ఆలయ ఉపకమిషనరు లీలాకుమార్ తెలిపారు. హుండీల లెక్కింపునకు దేవాదాయశాఖ పర్యవేక్షణాధికారిగా సహాయ కమిషనర్, జ్యువెలరీ వెరిఫికేషన్ అధికారి సైదమ్మబాయి పర్యవేక్షణలో లెక్కింపు జరిగింది. దేవస్థానమునకు గడిచిన 120 రోజుల కానుకల హుండీల ద్వారా రూ.64,92,250, అన్న ప్రసాదం హుండీ ఆదాయం రూ.3,13,782, బంగారం 63.5గ్రాములు, వెండి 795గ్రాములు, విదేశీ కరెన్సీ 623 అమెరికన్ డాలర్ల ఆదాయము వచ్చిందని గోగినేని లీలాకుమార్ తెలిపారు. హుండీ లెక్కింపు నందు కార్యాలయ సిబ్బంది, కెనరా బ్యాంకు సిబ్బంది,సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

ప్రగతి పోర్టల్‌పై అవగాహన ఉండాలి

● జడ్పీ సీఈఓ వీర్ల జ్యోతి బసు


ప్రసంగిస్తున్న సీఈఓ వీర్ల జ్యోతి బసు

గుంటూరు సిటీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందితో పాటు, గ్రామ సచివాలయం లో పనిచేస్తున్న వారు కూడా ప్రగతి పోర్టల్ నిర్వహణపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా పరిషత్ సీఈఓ వీర్ల జ్యోతి బసు అన్నారు. బుధవారం గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రగతి పోర్టల్ నిర్వహణపై ఉమ్మడి జిల్లాలోని డిప్యూటీ ఎంపీడీఓలు, ఐదుగురు పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఈఓ జ్యోతి బసు మాట్లాడుతూ గ్రామ, మండలస్థాయిలో జరిగిన ప్రతి పనిని నివేదిక రూపంలో పంపించే ఉద్యోగులు సరిగ్గా పనిచేసేటట్లు అవుతుందని అన్నారు. జిల్లాలో పర్యటించనున్న స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ సిబ్బందికి సిటిజన్ ఫీడ్ బ్యాక్ తీసుకునే విషయంలో పంచాయతీ కార్యదర్శులు సహకరించాలని సూచించారు. శిక్షణ తరగతులకు వచ్చిన ప్రతి ఒక్కరికీ డీ రవీంద్ర బాబు, డీపీఎం నాగేశ్వరరావు పూర్తిస్థాయిలో శిక్షణను ఇచ్చి, సాంకేతిక పరంగా కార్యదర్శులకు వచ్చిన పలు సందేహాలు నివృత్తి చేయడమైనది. ఈ కార్యక్రమంలో డీఎల్ పీ ఓ కే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

11 సీట్లొచ్చినా వైసీపీ బుద్ధి మారలేదు

ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



రెంటచింతల,జూలై 30 (ఆంధ్రజ్యోతి) : వైసీపీకి 11 సీట్లిచ్చి ప్రతిపక్ష హోదా లేకుండా ప్రజలు తీర్పిచ్చినా వారి బుద్ధి మారలేదని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. బుధవారం రెంటచింతలలో టీడీపీ సీనియర్ నేత మూలిరామిరెడ్డి ఇంట జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యరపతినేని మాట్లాడుతూ అధికారంలో ఉన్నంత కాలం అక్రమంగా కేసులు పెట్టి టీడీపీ వాళ్లను వేధించడం, పదం, మద్యం ముసుగులో దంగనీళ్లు పోసి పేదల ప్రాణాలను హరించారని ఆరోపించారు. లిక్కర్ కేసు దోమలంతా జైళ్లకు వెళ్తున్నారు. అప్పుడే ఏమైంది.. సినిమాలో సెకండ్ ఆఫ్ చూడబోతున్నారంటూ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పొలిటికల్ కామెంట్స్ చేశారు. గత పాలకుల హయాంలో ఐఏఎస్, ఐపీఎస్‌లు జైళ్లపాలయ్యారని అందుకు ఐపీఎస్ సీతారామాంజనేయులు ఓ ఉదాహరణగా పేర్కొన్నారు. చంద్రబాబును సందర్భాల్లో అక్రమంగా అరెస్ట్ చేసిన తరువాత ఐపీఎస్ సీతారామాంజనేయులు అభ్యంతరకర భాషను ఉపయోగించారని ఈరోజున ఏమైందని ప్రశ్నించారు. మాచర్ల, గురజాల నియోజకవర్గంలో గతంలో దారుణమైన పరిస్థితులుండేవని ఇప్పుడు ప్రశాంతంగా ఉంటున్నారు. ఈ సమావేశంలో యువనేత జూలకంటి గౌతమ్‌రెడ్డి, గొంటు ఆదిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి,సుమంతిరెడ్డి,ముక్తి శివారెడ్డి,రాజారెడ్డి,రామకృష్ణ, శౌరెడ్డి,ఎనుముల కేశవరెడ్డి,చెన్నారెడ్డి కోటిరెడ్డి, డీసీ మాజీ చైర్మన్ నరసింహారావు,తుమ్మా జోజిరెడ్డి,కాపూరి నాగయ్య, లింగాపున్నారావు,ఖల్లం బ్రహ్మారెడ్డి,శీలంనేని సోదరులు,ఖల్లం బ్రహ్మారెడ్డి,సామ్యేల్ పాల్గొన్నారు.

12 ఇసుక డంప్‌లు సీజ్

అచ్చంపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేట మండలంలో అక్రమంగా ఇసుకను డంప్ చేసిన 12 కుప్పలను గుర్తించి సీజ్ చేసినట్లు అచ్చంపేట తహసీల్దార్ కే శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం తహసీల్దార్‌తో పాటు మైనింగ్ ఫీల్డ్ అధికారి కల్యాణి, ఇతర అధికారులతో కలసి కృష్ణా నది పరివాహ ప్రాంతాల గ్రామాలైన చామర్రు, అంబడిపూడి గ్రామాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక కుప్పలను గుర్తించి సీజ్ చేశారు. మండలంలో అన్ని శాఖల అధికారులతో కలసి కమిటీని ఏర్పాటు చేశారు. తహసీల్దార్, ఎంపీడీవో, రెవెన్యూ, మైనింగ్, పంచాయతీ రాజ్, పోలీసు శాఖ, ఇరిగేషన్ శాఖ అధికారులతో కలసి కమిటీని ఏర్పాటు చేయగా బుధవారం అనుమతులు లేకుండా ఉన్న కుప్పలను సీజ్ చేసి వీటిని స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. కోనూరులో మూడు స్టాక్ పాయింట్లు, అంబడిపూడి గ్రామంలో నాలుగు స్టాక్ పాయింట్లు అధికారికంగా ఏర్పాటు చేశామని, అనుమతులు తీసుకొని ఇసుకను తీసుకు వెళ్ళవచ్చని తహసీల్దార్ తెలిపారు. సీజ్ చేసిన వారిలో తహసీల్దార్‌తో పాటు మైనింగ్ ఫీల్డ్ అధికారి కల్యాణి, ఏవో వెంకటేశ్వరరావు, ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఆర్ఐ, సర్వేయర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.


చామర్రు వద్ద పొలాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక కుప్పలను స్వాధీనం చేసుకున్న తహసీల్దార్ కే శ్రీనివాసరావు, మైనింగ్ అధికారులు

ప్రతి రైతు 'ఫసల్ బీమా యోజన'లో చేరాలి

ఆర్థిక సలహాదారు వైభవ్ శర్మ

పొన్నూరుటౌన్, జూలై30 (ఆంధ్రజ్యోతి): పంటలు సాగు చేసే ప్రతి రైతు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో చేరాలని ఫసల్ బీమా యోజన ఆర్థిక సలహాదారు వైభవ్ శర్మ కోరారు. మండల పరిధిలోని వల్లభరావుపాలెం, నండూరు గ్రామాల్లో బుధవారం వ్యవసాయ శాఖ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఢిల్లీ నుంచి వైభవ్ శర్మ విచ్చేసి రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ అభిప్రాయాలను తెలియజేస్తూ పంటల బీమా పథకంలో గ్రామం యూనిట్‌గా కాకుండా రైతుకు వ్యక్తిగతంగా లబ్ధి చేకూరే విధంగా చేయాలని కోరారు. పంట కోత అనంతరం 15 రోజుల వరకు పోస్ట్ హార్వెస్ట్ నష్టానికి కూడా బీమాలో వర్తింపచేయాలని విజ్ఞప్తి చేశారు. రైతులు కూడా పంట రుణాలు పొందితే పంటల బీమా వర్తింప చేయాలన్నారు. రైతులు తెలియచెప్పిన అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా గ్రామంలో పంట పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ సీహెచ్ తిరుమల దేవి, ఏడీఏ వీ రామ కోటేశ్వరి, ఏవో ఆర్ వెంకటేశ్వరరావు, విస్తరణ అధికారి ఐ శ్రీకాంత్, డీ యామిని తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వైభవ్ శర్మ

శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చర్యలు

● సత్తెనపల్లి డీఎస్పీ ఎం హనుమంతరావు ● కుంకలగుంటను జల్లెడ పట్టిన పోలీసులు

నకరికల్లు, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్టు సత్తెనపల్లి డీఎస్పీ ఎం హనుమంతరావు తెలిపారు. బుధవారం తెల్లవారు జామున నకరికల్లు మండలం కుంకలగుంట గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. కుంకలగుంటను పోలీసులు జల్లెడ పట్టారు. సరైన పత్రాలు లేని 36 బైక్‌లను, గొడ్డళ్ళను, కత్తులను పోలీసులు సీజ్ చేశారు. కుంకలగుంటలో గత ఏడాది వినాయక చవితి ఉత్సవాల సమయంలో శాంతి భద్రతల సమస్య తలెత్తిందని, అలాంటి సమస్య తిరిగి తలెత్తకుండా ఉండేందుకు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు కుంకలగుంటలో కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్టు డీఎస్పీ తెలిపారు. కుంకలగుంటలో కులాల పరంగా విడిపోయి ఉన్నట్టు చెప్పారు. త్వరలోనే రాజకీయ నేతలతో సమావేశం నిర్వహిస్తామన్నారు. రానున్న వినాయక చవితి సమయంలో శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు డీఎస్పీ ఎం హనుమంతరావు తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలో వందలాది మంది పోలీసులతో ఈ కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐలు పీ కిరణ్, పీ సురేష్, నకరికల్లు ఎస్ఐ సీహెచ్ సురేష్‌తో పాటు పలువురు సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


కార్డెన్ సెర్చ్‌లో స్వాధీనం చేసుకున్న బైక్‌లు, మారణాయుధాలతో సత్తెనపల్లి డీఎస్పీ ఎం హనుమంతరావు

బిరబిరా.. కృష్ణమ్మ

(5వ పేజీ తరువాయి)

జలవనరుల శాఖ చర్యలు చేపట్టింది. గంట గంటకు సాగర్ నుంచి ప్రవాహం పెరుగుతుందని పులిచింతల ప్రాజెక్టు డీఈ వెంకట్ తెలిపారు. తాడువాయి వద్ద మత్స్యకారుల పడవలు ఒడ్డుకు చేరాయి. నదీ తీరాల గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసినట్లు తహసీల్దారు శ్రీనివాసరావు తెలిపారు.

లంకలకు పొంచి ఉన్న ముప్పు..

కృష్ణానదికి వరద నీరు పోటెత్తుతుండటంతో లంక గ్రామాలకు ముప్పు పొంచి ఉంది. గత ఏడాది భారీ వరదల నుంచి తేరుకున్న రైతులను ఈ ఏడాది కూడా వరద భయం వెంటాడుతోంది. కొల్లిపర, కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలోని నదీ పరివాహక ప్రాంతంలో సుమారు 35 గ్రామాల్లో 20 వేల ఎకరాల్లో వాణిజ్య పంటలు సాగు చేస్తున్న రైతులు వరద నుంచి రక్షించాలని కృష్ణమ్మను వేడుకుంటున్నారు. బుధవారం రాత్రి 3 లక్షల పైచిలుకు క్యూసెక్కులు విడుదల చేస్తారని అధికారులు ప్రకటించడంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

బాపట్ల కలెక్టర్ సమీక్ష

కృష్ణానది వరద నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయడంతో పాటు అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. బుధవారం కొల్లూరులోని ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది 11.43 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా ప్రాణనష్టం జరగకుండా పని చేసినట్లు ఇప్పుడు కూడా యంత్రాంగం పని చేయాలన్నారు. కరకట్ట బలహీనంగా ఉన్న చోట్ల ఇసుక బస్తాలతో పటిష్టపరచాలన్నారు. బియ్యం, నిత్యావసరాలు, పడవలు, ట్రాక్టర్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పునరావాస కేంద్రాల్లో అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల్లోని కొన్ని ప్రాంతాలు వరద ప్రభావితం అవుతాయన్నారు. గతం కంటే మెరుగుగా అధికారులు పని చేసి ప్రాణనష్టం జరగకుండా చూడాలన్నారు.

- సత్రశాలలోని టెయిల్‌పాండ్‌లో 14 గేట్ల ద్వారా 2,94,109 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎగువన సాగర్ నుంచి 2 లక్షల 91 వేల క్యూసెక్కుల నీరు వస్తుండగా రిజర్వాయర్‌లో 6.337 టీఎంసీల నీరుంది. 74.39 మీటర్లు అంటే 247.70 అడుగులకు ఇది సమానం.
- బుధవారం సాయంత్రం పులిచింతల ప్రాజెక్టులో 41.58 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఎగువ నుంచి 3,01,167 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది. వీటిలో విద్యుత్ ఉత్పత్తి ద్వారా 13,600 క్యూసెక్కులు, 12 గేట్ల ద్వారా 2,84,561 క్యూసెక్కులు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులను విడుదల అవుతుంది.

7న గోవాలో ఓబీసీ జాతీయ మహాసభలు

● సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

మంగళగిరి సిటీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ మహాసభలు ఆగస్టు 7వ తేదీన గోవాలో జరుగుతాయని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తెలిపారు. మంగళగిరిలోని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో బుధవారం మహాసభల తాలూకా గోడప్రతుల ను ఆయన ఆవిష్కరించారు. శంకరరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, డిమాండ్ల సాధన కోసం భవిష్యత్ కార్యాచరణను రూపొందించడానికి గోవాలోని డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఇండోర్ స్టేడియంలో జాతీయ మహాసభలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ మహా సభలకు దేశ ప్రధాని నరేంద్ర మోదీతోపాటు పలువురు కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, అఖిలపక్ష పార్టీల అధ్యక్షులు హాజరవుతారని తెలిపారు. ఓబీసీ సమాజ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై జయ ప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్, నేతలు కొల్లూరి హనుమంతరావు, వాకా వెంకటేశ్వరరావు, వుడతా శ్రీనివాసరావు, విజయలక్ష్మి, కిరణ్, ధనుంజయరావు, పవన్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.


జాతీయ మహాసభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కేసన శంకరరావు, నేతలు

ఏపీ మాజీ ప్రిన్సిపల్ సెక్రెటరి గిరిజాశంకర్‌కు పీహెచ్‌డీ



పెదకాకాని, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రూరల్ డెవలప్మెంట్‌లో విశ్రాంత ఐఏఎస్ అధికారి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రిన్సిపల్ సెక్రెటరి ఎం గిరిజాశంకర్‌కు పీహెచ్‌డీ డిగ్రీని ప్రదానం చేసింది. ఏఎన్‌యూ రూరల్ డెవలప్మెంట్ విభాగం ఆచార్యులు వి.దివ్యతేజోమూర్తి పర్యవేక్షణలో గిరిజాశంకర్ "రోల్ ఆఫ్ నాచురల్ రిసోర్సెస్ మేనేజ్మెంట్ ఆన్ రూరల్ లైవ్లీహుడ్(ఏ స్టడీ ఆఫ్ వైఎస్సార్ కడప డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం)"అనే అంశంపై పరిశోధనలు పూర్తి చేశారని పరిశోధనా విభాగం సమన్వయకర్త డాక్టర్ పీ సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల గిరిజాశంకర్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ప్రిన్సిపల్ సెక్రటరి హోదాలో ఉద్యోగ విరమణ చేశారు.

జోన్ 3 పరిధిలో మరో 18 మందికి

ఇన్‌చార్జి ఎంఈఓలుగా బాధ్యతలు

గుంటూరు (విద్య), జూలై 30 (ఆంధ్రజ్యోతి): (ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు) జిల్లాల పరిధిలోని మండలాల్లో ఖాళీగా ఉన్న ఎంఈఓ పోస్టులను ఇన్‌చార్జిలతో (ఎఫ్ఏసీ) భర్తీ చేస్తూ ఆర్జేడీ లింగేశ్వర రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో తుళ్లూరు ఎంఈఓగా ఎన్ అజయ్ కుమార్, పొన్నూరుకు డీ రాజు, మంగళగిరికి ఉషాకుమారి, అమరావతికి కేఎస్ ఎన్ ప్రసాద్, కారంపూడికి జే అనిల్‌కుమార్, క్రోసూరుకు జీ కృష్ణ, ముప్పాళ్లకు పీ సుధారాణి, నూజెండ్లకు కే సత్యనారాయణ, చుండూరుకు జే సురేష్‌బాబులను నియమించారు. ప్రకాశం జిల్లాకు సంబంధించి బెస్తవారిపేట ఎం ఈఓగా మధుసూదన్ రెడ్డి, గిద్దలూరుకు ఎంవీ భాస్కర్‌లను నియమించారు. నెల్లూరు జిల్లాకు సంబంధించి కందుకూరు ఎంఈఓగా ఎంఎంకే శర్మ, ఒలేటివా రిపాలెంకు పీ మాల్యాద్రి రెడ్డి, గుడ్లూరుకు బీ హరేరామ్, దుత్తలూరుకు ఎన్ పద్మనాభరావు, ఉదయగిరికి టీ వెంకటేశ్వర్లు, చీరాలకు కే కొండయ్య, సైదాపురానికి బాలసుబ్రమణ్యంను ఇన్చార్జి ఎంఈఓలుగా నియమించారు.

తండ్రిని చంపిన తనయుడుకి జీవిత ఖైదు

నరసరావుపేట లీగల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ఆస్తి ఇవ్వలేదని అక్కసుతో తండ్రిని దారుణంగా హతమార్చినట్లు నేరం రుజువు కావడంతో నిందితుడు నాదెండ్ల మండలం బుక్కాపురం గ్రామానికి చెందిన గొట్టిపాటి కాంతారావుకు జీవిత ఖైదు రూ. 10,000 జరిమానా విధిస్తూ స్థానిక 13వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయాధికారి నేతి సత్యశ్రీ బుధవారం తీర్పు వెలువరించారు. మృతుడు రోశయ్యకు రెండు పెళ్లిళ్లు అయ్యాయి. రోశయ్యకు మూడు ఎకరాల పొలం ఉంది. మొదటి భార్య కుమారునికి ఒక ఎకరం, రెండో భార్య కుమారుడైన నిందితుడు కాంతారావుకు ఒక ఎకరం పొలం పంచి ఇచ్చాడు. మిగిలిన ఎకరం పొలం తన కోసం ఉంచుకున్నాడు. దుర్వ్యసనాలకు లోనైన నిందితుడు కాంతారావు ఆ ఎకరం కూడా తన పేరున రాయమని మృతుడు రోశయ్యను వేధిస్తుండేవాడు. ఈ నేపథ్యంలో తండ్రి రోశయ్యను 2019 మే 26న బంధువుల శుభకార్యానికని మోటార్ సైకిల్‌పై ఎక్కించుకొని వెళ్లి నాదెండ్ల ఎండుగుమ్ పాలెం మధ్యగల నక్కవాగు వద్ద గొంతు కోసి దారుణంగా హతమార్చాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన చిలకలూరిపేట రూరల్ పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో పై విధంగా కోర్టు తీర్పు వెలువడించింది.

వైసీపీ నుంచి క్రైస్తవులను కాపాడాలి

● ప్రొఫెసర్ జోసఫ్ మోసిగంటి

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), జూలై 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుల నుంచి రాష్ట్రంలో క్రైస్తవులను కాపాడాలని జీసస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ జోసఫ్ మోసిగంటి బుధవారం కోరారు. వైసీపీ ప్రభుత్వంలో క్రైస్తవ సమాజానికి ఏమి చేయకపోవడం వలన క్రైస్తవ సమాజం చంద్రబాబు వైపు మొగ్గు చూపిందన్నారు. 25 శాతం ఉన్న క్రైస్తవ సమాజాన్ని తమ వైపు నిలబెట్టుకోవడానికి వైసీపీ నాయకులు కుయుక్తులు పన్నుతున్నారని ఆరోపించారు. క్రైస్తవేతరుల చేత చర్చిల మీద కంప్లైంట్లు ఇప్పించి చర్చికి పర్మిషన్ లేదని.. మైకులు పెడుతున్నారనే కారణాలు చూపించి కొన్ని చోట్ల చర్చిలను మూసి వేయిస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో చర్చిల మీద దాడులు పెరిగిపోతున్నాయి అన్నట్లుగా ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

ఉపాధ్యాయులకు త్వరలో మూల్యాంకన నిధులు

ఇప్పటికే రూ.65 లక్షలు సీఎఫ్ఎంఎస్ ఖాతాలకు: డీఈఓ సీవీ రేణుక

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంటూరు (విద్య) జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల మూల్యాంకన నిధులు త్వరలో సీఎఫ్ఎంఎస్ ద్వారా చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఈఓ సీవీ రేణుక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రజ్యోతిలో బుధ వారం ప్రచురితమైన "మూల్యాంకన వేతనం మరిచారు" శీర్షికన ప్రచురితమైన కథనంపై ఆమె స్పందిస్తూ ఇప్పటికే రూ. 65 లక్షల నిధులు మంజూరు అ య్యాయని వీటిని సీఎఫ్ఎంఎస్‌కు పంపించినట్లు వివరించారు. విడతలవారీగా ఉపాధ్యాయుల ఖాతాలకు ఆ నిధులు జమ చేస్తామని తెలిపారు. మూల్యాం కనానికి సంబంధించి అన్ని బకాయిల చెల్లింపులు త్వరలో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

జంట హత్య కేసులో నిందితుల అరెస్టు

నరసరావుపేట లీగల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఈ నెల 23న బెంగళూరుకు చెందిన తండ్రీకుమారులైన రియల్టర్లు వీరస్వామిరెడ్డి, ప్రశాంత్‌ల హత్య కేసులో నిందితులను నరసరావుపేట మొదటి పట్టణ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆర్థిక వివాదాల నేపథ్యంలో తండ్రీకుమారులను కిడ్నాప్ చేసి సంతమాగులూరు సమీపంలో సంతమాగులూరు గ్రామానికి చెందిన బాదం మాధవరెడ్డి, గడ్డం రఘురాం రెడ్డి, గడ్డం నాగిరెడ్డి, గడ్డం గోపిరెడ్డి, గడ్డం ఇంద్రసేనారెడ్డిల హతమార్చినట్లు కేసు నమోదైన విషయం తెలిసిందే. సీఐలు ఎంవీ చరణ్, హైమారావు, బి.సుబ్బానాయుడు, పి.రామకృష్ణల నేతృత్వంలో ఎస్ఐలు హరిబాబు, వంశీకృష్ణ ప్రత్యేక బృందాలుగా ముంబయి వెళ్లి నిందితులను అరెస్టు చేశారు. వీరిని బుధవారం నరసరావుపేటలోని మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయ అధికారి ఆవుల సలోమి ఎదుట హాజరు పరుచగా రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసులో పోలీసులు ఇప్పటివరకు మొత్తం 13 మందిని నిందితులుగా పేర్కొన్నారు. గతంలోనే అనిల్ రెడ్డిని అరెస్టు చేశారు. ప్రస్తుతం ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. మొత్తం ఆరుగురు నిందితులను మూడు రోజుల వ్యవధిలోనే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	116, 124, 135
చికెన్ విత్ స్కిన్(కిలో)	220.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	230.00

40,869 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 42,379 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 40,869 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 9,818 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9600	11000
334	9500	13200	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	13300	334	9500	12600
273	----	----	నెంబరు. 5	10000	13400
341	10000	13500	273	----	----
4884	----	----	341	10000	13600
సూపర్ 10	----	----	4884	10000	12700
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14000	తేజ	10000	13800
షార్క్-1	----	----	బ్యాడిగి	10000	12300
బ్యాడిగి	10000	12600	దేవనూరు డీలక్స్	10000	12700
దేవనూరు డీలక్స్	10000	12500	తాలుకాయలు	4500	7000

గుంటూరు సిటీ వార్తలు
◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ


సుపరిపాలనలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్, దేగల ప్రభాకర్

మైనార్టీల అభ్యున్నతికి కృషి చేస్తాం
● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ చెప్పారు. అసెంబ్లీ మైనారిటీ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా బుధవారం స్థానిక అంజుమన్ షాదీఖానాలో గోల్డ్ వర్కర్స్ అసోసియేషన్, మాయాబజార్ వర్కర్స్ అసోసియేషన్ మైనారిటీ కమ్యూనిటీ నాయకులు, టీడీపీ బీసీ విభాగం నాయకులు ఆయనను సన్మానించా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీ మైనారిటీ కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే నసీర్ నియమితులవడం గర్వకారణమని చెప్పారు.

నిత్యం ప్రజలతోనే ఉంటా..

నిత్యం తాను ప్రజలతోనే ఉంటానని ఎమ్మెల్యే నసీర్ చెప్పారు. సుపరిపాలనలో తొలిఅడుగు అంటూ బుధవారం ఆయన, ఏపీఐడీసీ చైర్మన్ దేగల ప్రభాకర్‌తో కలిసి గుంటూరులోని ఏడో డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది నుంచి ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటున్నామని, దీంతో తూర్పు నియోజకవర్గంలో కాలనీల రూపురేఖలు మారుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో దాసరి రాజా మాస్టర్, మద్దిరాల మ్యాని, చిట్టాబత్తిన చిట్టిబాబు, డిప్యూటీ మేయర్ సజీలా, క్లస్టర్ ఇన్‌చార్జ్ కొనకళ్ళ సత్యనారాయణ, మాజీ డిప్యూటీ మేయర్ గౌస్, ఉమామహేశ్వరి, అబ్దుల్ కుదూస్, పెండ్యాల విజయ్ కుమార్, శ్రీనివాస్, ఫారుక్, షౌకత్, అజీస్, పద్మావతి, జమీర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సంగీత నృత్యోత్సవాలు ప్రారంభం

గుంటూరు(తూర్పు), జూలై 30(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో అన్నమయ్య కళావేదికపై టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్ట్, గుంటూరు ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్ న్యూఢిల్లీ (తిరుపతి రీజియన్), ద్వారం లక్ష్మి అకాడమీ ఫర్ మ్యూజికల్ సర్వీసెస్, తిరుపతి వారి సంయుక్త నిర్వహణలో బుధవారం నుంచి ఆగస్టు 3 వరకు జరిగే సంగీత నృత్యోత్సవాలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తిరుపతి జాతీయ సాంస్కృతిక విశ్వవిద్యాలయం వీసీజీఎస్ఆర్ కృష్ణమూర్తి, అన్నమాచార్య ప్రాజెక్ట్‌ల ప్రత్యేక అధికారులు ఆనంద తీర్థాచార్యులు మేడసాని మోహన్, ఆలయ పాలకమండలి అధ్యక్షుడు చిట్టిపోతు మస్తానయ్య పాల్గొని ఉత్సవాలను ప్రారంభించారు. సభానంతరం ద్వారం లక్ష్మీ అకాడమీ ఫర్ మ్యూజికల్ సర్వీసెస్ వారి ఆధ్వర్యంలో ప్రముఖ మృదంగ విద్వాంసులు పద్మశ్రీ దండమూడి సుమతి రామ్మోహనరావుకు మృదంగ నందిని బిరుదు, కొమ్మ జ్యోస్యుల సద్గురు చరణ్‌కు తాళావధాన పంచావన బిరుదును ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. అనంతరం భరత కళాక్షేత్ర, తిరుపతి వారి నాట్యప్రదర్శన అభిమానులను అలరించింది.


సద్గురుచరణ్‌కు తాళావధాన పంచావన బిరుదును ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

పాత పాలకవర్గంపై చర్యలు తీసుకోవాలి
● విశ్వబ్రాహ్మణ సమాజం అధ్యక్షుడు రాధాకృష్ణమూర్తి

గుంటూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): గుత్తాధిపత్యంగా వ్యవహరిస్తున్న ఆంధ్రరాష్ట్ర దేశీయ విశ్వబ్రాహ్మణ సమాజం పాత పాలకవర్గంపై అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ప్రస్తుత అధ్యక్షుడు జం పని రాధాకృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు కొలగాని నందవీరప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు. 13 ఏళ్లుగా విశ్వబ్రాహ్మణ సమాజం పాలకవర్గంగా కందుకూరి లక్ష్మీనారాయణ, మేడూరి శివరామకృష్ణలతో కూడిన కార్య వర్గం బైలాకు వ్యతిరేకంగా, చట్టవిరుద్ధంగా, అక్రమ లావాదేవీలతో వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఈ క్రమంలో ఈనెల 20న మహాజన సభ ద్వారా కొత్తగా కార్యవర్గంగా తాము ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలి పారు. అయితే కొత్తపాలకవర్గానికి పరిపాలనా బాధ్యతలు బదిలీ చేయకుండా పాత వారే నిరంకుశ ధోరణితో కొనసాగుతూ తమపై అక్రమ కేసులు పెడుతూ బెదిరింపు ధోరణితో వ్యవహరిస్తున్నారన్నారు.

పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ పదవికి
రాయపాటి శైలజ రాజీనామా ఆమోదం

అమరావతి, జూలై 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ... రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ పదవికి చేసిన రాజీనామాను ప్రభుత్వం ఆమోదించింది. రాష్ట్ర ప్రభుత్వం ఆమెను గత ఏడాది సెప్టెంబరులో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టరుగా నియమించింది. ఆ తర్వాత ఆమెను రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నియమించింది. దీంతో ఆమె సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టరు పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామాను ఆమోదించాలని కోరుతూ ఈ ఏడాది మే 13న సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఎండీకి లేఖ రాశారు. ఆమె రాజీనామాను ఆమోదిస్తూ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఎండీ, పౌరసరఫరాల శాఖ కమిషనర్, ప్రభుత్వ ఎక్స్ అఫిషియో సెక్రటరీ సౌరభ్ గౌర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

బండి సాహితీరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సేవలు స్ఫూర్తిదాయకం
● ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి

గుంటూరు(తూర్పు), జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు ఆర్థిక తోడ్పాటు అందించడంతో పాటు అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న బండి సాహితీరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సేవలు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి అన్నారు. స్థానిక నగ రంపాలెంలో బుధవారం ఉడుముల నర్సిరెడ్డి బాలుర వసతి గృహంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపకారవేతనాల పంపిణీ, కొండవీడు మ్యూజియం అభివృద్ధికి రూ.5 లక్షల విరాళం అందజేసే కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ వేలాది మంది విద్యార్థులకు ఆర్థిక సాయం అందించి వారి అభ్యున్నతికి సహకరించిన ట్రస్ట్ సేవలు అభినందనీయమన్నారు. అనంతరం కొండవీడు మ్యూజియం అధికారులకు విరాళం, విద్యార్థులకు ఉపకారవేతనాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ఆంధ్ర లయోలా కాలేజీ విశ్రాంత ప్రిన్సిపాల్ గుమ్మా సాంబశివరావు అధ్యక్షత వహించగా, వసతి గృహ అధ్యక్ష, కార్యదర్శులు చల్లా అంజిరెడ్డి, కంది సంజీవ రెడ్డి, విశ్రాంత ఆర్జేడీ ఐకేవీ ప్రసాదు, ఏపీటీపీఐఈఏ అధ్యక్షుడు బ్రహ్మ నందరెడ్డి, ఏరువా సాయిరామ్, ట్రస్ట్ చైర్మన్లు బండి అశోక్‌రెడ్డి, సుధావాణి పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్ల విధానాన్ని ఉపసంహరించుకోవాలి
● సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల

గుంటూరు(తూర్పు), జూలై 30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లుకు వ్యతిరేకంగా వామపక్ష, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పాతగుంటూరు అంకమ్మ గుడిసెంటర్లో ప్రజా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం మెప్పు కోసమే రాష్ట్ర ప్రజలపై స్మార్ట్ మీటర్ల భారాన్ని మోపుతున్నారని ఆరోపించారు. సీఐటీయూ నగర కార్యదర్శి ముత్యాలరావు మాట్లాడుతూ ప్రజల అనుమతి లేకుండా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయొద్దని విద్యుత్‌శాఖ మంత్రి ప్రకటన హాస్యాస్పదమని అన్నారు. కార్యక్రమంలో అకిటి అరుణ్‌కుమార్, మేడా హనుమంతరావు, కోట మాల్యాద్రి, అంజిబాబు, జంగాల చైతన్య పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నేరం
● డీఆర్‌వో ఖాజావలి


మానవ అక్రమ రవాణ వ్యతిరేక దినోత్సవం పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న డీఆర్వో ఖాజావలి

గుంటూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణకు పాల్పడటం నేరమని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ఎస్‌కే ఖాజావలి అన్నారు. బుధవారం కలెక్టరేట్, గుంటూరు రైల్వే స్టేషన్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా వివిధ కార్యక్రమాలు జరిగాయి. గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సంవత్సరం నినాదం మానవ అక్రమ రవాణ వ్యవస్థీకృత నేరం - దోపిడీని అంతం చేయడం, నివారణ ప్రయత్నాలను బలోపేతం చేయడం, బాధితులకు మద్దతు ఇవ్వడమని డీఆర్‌వో అన్నారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి, సాధికారత అధికారి ప్రసూన, జిల్లా మిషన్ కోఆర్డినే టర్ శ్రీవాణి, మహిళ కళాశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి, డాక్టర్ అనురాధాదేవి, రత్నకుమారి, బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది, ఎన్‌జీవో బాలల హక్కు అడ్వొకేసి ఫౌండేషన్, మిషన్ వాత్సల్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీఆర్ స్టేడియం పాలకవర్గ ఎన్నికలు ప్రారంభం
● ఈసీ మెంబర్ పదవికి గోనుగుంట్ల నామినేషన్

గుంటూరు కార్పొరేషన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): గుంటూరు ఎన్టీఆర్ స్టేడియం పాలక వర్గం ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ మంగళవారం నుంచి అధికారికంగా ప్రారంభమైంది. ఆగస్టు 1వ తేదీ వరకు స్టేడియం ప్రాంగణంలో నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం కొనసాగనుంది. ఈ సందర్భంగా పలువురు అభ్యర్థులు ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నారు. అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు అభ్యర్థులు రంగంలోకి దిగుతున్నారు. సీనియర్ పాత్రికేయుడు గోనుగుంట్ల హనుమంతరావు ఈసీ మెంబర్ (ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు) పదవికి బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. హనుమంతరావు నామినేషన్ కార్యక్రమానికి ఆయన మద్దతుదారులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. స్టేడియం పాలకవర్గ ఎన్నికలు ఈసారి అత్యంత ఆసక్తికరంగా మారాయి. అభ్యర్థుల పనితనం, ప్రజాదరణతో పాటు క్రీడాభివృద్ధిపై వారికున్న విజన్ ఈ ఎన్నికల్లో కీలకంగా మారనుంది. ప్రముఖులు పోటీకి రంగంలోకి దిగుతుండటం, అభ్యర్థులకు మద్దతు ఇచ్చేందుకు సభ్యులు ఉత్సాహం చూపిస్తుండటం చూస్తే ఎన్నికల వేడి మొదలైందని స్పష్టమవుతోంది.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

గుంటూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): డిపో పరిధిలోని సమస్యల పరిష్కారంలో భాగంగా గురువారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గుంటూరు-1 డిపో మేనేజర్ రామకృష్ణ ఒక ప్రకటన లో తెలిపారు. డిపో పరిధిలోని అమరావతి, క్రోసూరు, తుళ్ళూరు, 75 తాళ్ళూరు, పర్చూరు రూట్లలో ప్రయాణించే వారు 9959225420కు ఫోన్ చేసి సమస్యలు, సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు.

వైద్యశిబిరం నిర్వహించటం అభినందనీయం
● నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యం కాపాడే ప్రజారోగ్య కార్మి కులకు ఐటీసీ ఎంఎస్కే, ఫినిష్ సొసైటీ వైద్యశిబిరం నిర్వహించడం అభినందనీయమని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక రెవెన్యూ కల్యాణ మండ పంలో ఐటీసీ ఎంఎస్కే, ఫినిష్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రజారోగ్య కార్మికులకు ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంప్‌కు కమిషనర్ ఆదేశాల మేరకు జీఎంసీ తరపున హాజరైన డిప్యూటీ కమిషనర్, ఇన్‌చార్జి సీఎంవోహెచ్ టి.వెంకటకృష్ణయ్య మాట్లాడుతూ నిత్యం వ్యర్థాలు తొలగింపు వంటి విధుల్లో ఉండే కార్మికులకు ఆరోగ్య సమ స్యలు కూడా అధికంగానే వస్తుంటాయని అన్నారు. కార్మికులు క్యాంపుల్లో తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకొని, వైద్యులు సూచించిన విధంగా మందులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐటీసీ ఎంఎస్కే, ఫినిష్ సొసైటీ మేనేజర్ కే నారాయణ, డాక్టర్ షేక్ అమిదా, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్తు అంధకారమే
● నవజీవన్ బాలభవన్ కో ఆర్డినేటర్ గొల్లమూడి

గుంటూరు (విద్య), జూలై 30(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని వీటికి బానిసలైతే భవిష్యత్తు అంధకారమేనని నవజీవన్ బాలభవన్ కోఆర్డి నేటర్ గొల్లమూడి శేఖర్‌బాబు తెలిపారు. బుధవారం పాత గుంటూరు సమీపంలోని నగరపాలక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడా రు. మత్తు పదార్థాలు తీసుకోవడం కేవలం మీ భవిష్యత్తుకు మాత్రమే కాదు, మన దేశ భవిష్యత్తుకు కూడా ప్రమాదం ఏర్పడుతుందని అన్నారు. మత్తుపదార్థాల వినియోగం వల్ల శారీరక, మానసిక రుగ్మతలు వస్తాయని శేఖర్‌బాబు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కే శ్రీనివాసులు రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ కే శామ్యూల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మిక శాఖలో బదిలీలు

గుంటూరు(తూర్పు), జూలై 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో కార్మిక శాఖలో పలు అధికారులను బదిలీ చేస్తున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం మంగళగిరిలో అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న కట్టా శ్రీనివాసరావు గుంటూరుకు బదిలీ అవ్వగా, నెల్లూరులో ఏసీఎల్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ మహబూబ్ సుభాని నరసరావుపేటకు బదిలీ అయ్యారు.


రిసాసిడేషన్ స్ట్రక్చర్ల వద్ద రమణ యశస్వి, రాధికరాణి

క్యాజువాల్టీలో ఎమర్జెన్సీ పేషెంట్ ట్రాలీలు

గుంటూరు మెడికల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సమగ్రాస్పత్రి నిత్యం వందల మంది రోగులతో రద్దీగా ఉండే అత్యవసర వైద్య విభాగంలో (క్యాజువాల్టీ) బుధవారం కొత్తగా ఆరు రిసాసిడేషన్ స్ట్రక్చర్లు (పడకలు), మ్యాట్రెస్లు అందుబాట్లోకి తెచ్చారు. వీటిని సూపరిం టెండెంట్ డాక్టర్ రమణ యశస్వి ప్రారంభించారు. అత్యవసర రోగుల ను ఇంటిబేషన్, కార్డియాక్ మసాజ్, సీపీఆర్ వంటి అత్యవసర వైద్య చికిత్సలను రోగులను ఇతర ప్రాంతాలకు షిఫ్ట్ చేయకుండానే వీటిపైనే చేయవచ్చు. సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కానింగ్ వంటి పరీక్షలకు సైతం రోగులను ఇదే స్ట్రక్చర్లపై తరలించవచ్చు. వీటి పక్కనే వెంటిలేటర్లు, ఆక్సిజన్ సిలెండర్లు, ఇతర అత్యవసర వైద్య పరికాలను అమరుస్తున్నట్లు డాక్టర్ రమణ తెలిపారు. క్యాజువాల్టీలో రోగుల చికిత్సల్లో ఇవి ఎంతగానో ప్రయోజనకరంగా ఉంటాయని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ చంద్ర రాధికారాణి, సివిల్ సర్జన్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ బీవీరావు తదితరులు పాల్గొన్నారు.


గ్రీన్ డే కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

సీతారామయ్య హైస్కూల్లో గ్రీన్ డే వేడుకలు

గుంటూరు కార్పొరేషన్, జూలై 30(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురంలోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలలో ఈ రోజు గ్రీన్ డే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రీ ప్రైమరీ చిన్నారులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా గ్రీన్ కలర్ వస్త్రధారణతో పాల్గొన్నారు. చిన్నారులు పర్యావరణం ప్రాముఖ్యాన్ని తెలి యజేసే విధంగా చెట్లు నాటడం వల్ల కలిగే ప్రయోజనాలు, చెట్లు కొట్టివేయడం వల్ల కలిగే నష్టాల గురించి స్కిట్ రూపంలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల కమిటీ వైస్ ప్రెసిడెంట్ సూర్యదేవర హనుమంతరావు, పాఠశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువ ర్ధన్ మాట్లాడుతూ పర్యావరణం పచ్చదనం అనేది మానవుని మనుగడతో ముడిపడి ఉందని కావున పచ్చదనాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ళ కృష్ణవేణి, ప్రిన్సిపాల్ దోసకాయల దుర్గాశ్యామ్, ప్రైమరీ కోఆర్డినేటర్ దిల్ జహాన్, ప్రీ ప్రైమరీ కోఆర్డినేటర్ టి.శ్రీదేవి, ఇన్‌చార్జి కె.హరి ప్రియ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

3న బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపికలు

గుంటూరు(తూర్పు), జూలై 30(ఆంధ్రజ్యోతి): బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 3వ తేదీన గుంటూరు ఎన్జీవో క్లబ్‌లో జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ మహిళలు, పురుషుల విభాగాల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపికలు జరుగుతాయని అసోసియేషన్ కార్యదర్శి వై.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జట్లు ప్రకాశం జిల్లాలోని చేవూరు, అనంతపురంలలో అదే నెలలో జరిగే అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. పోటీలకు హాజరయ్యే వారు ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం తీసుకుని అదే రోజున ఉదయం 8 గంటలకు మైదానంలో రిపోర్టు చేయాలని కోరారు. వివరాలకు 93477 85888లో సంప్రదించాలని సూచించారు.

అప్పుల బాధతో వ్యక్తి అదృశ్యం

గుంటూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతో ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని బారాఇమామ్‌పంజా సెంటర్‌కు చెందిన షేక్ అస్లాం(48) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుంటాడు. తన కుటుంబ అవసరాల నిమిత్తం కొంత డబ్బులు అప్పు చేశాడు. అప్పులు తీర్చేమార్గం లేక మంగళవారం రాత్రి ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయాడు. ఆయన కుమారుడు షేక్ అనాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు లాలాపేట పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అస్లాం ఆచూకీ తెలిసిన వారు లాలాపేట పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని పోలీసులు కోరారు.

భర్త, అత్తమామల నుంచి రక్షణ కల్పించండి
● ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన బాధితురాలు

గుంటూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : భర్త, అత్త మామల నుంచి తనకు రక్షణ కల్పించాలని పొన్నూరు మండలం ఆలూరుకు చెందిన పేర్ల వెంకటేశ్వరమ్మ బుధవారం ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తనకు 2017 మార్చి 23న పొన్నూరుకు చెందిన పేర్ల పౌల్ రాజుతో వివాహం జరిగిందన్నారు. తన భర్త ఓ ప్రజాప్రతినిధి వద్ద పని చేస్తాడన్నారు. తనను అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధిస్తూ నా తల్లిని, తనకు సహకరించిన వారిని చంపుతానని బెదిరించడమేకాక నా కూతురిని వారి వద్ద ఉంచుకొని బెదిరిస్తున్న భర్త పేర్ల పౌల్‌రాజు, మామ శామ్యూల్‌పై తగు చర్యలు తీసుకొని, తమకు రక్షణ కల్పించి, పాపను తనకు ఇప్పించాలని ఆమె ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది.

ఆకతాయిలకు పోలీసుల కౌన్సెలింగ్

స్థానిక కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల వద్ద కొంతకాలంగా ఆకతాయిల ఆగడాల నేపథ్యంలో పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సీఐ వీరయ్య చౌదరి ఆదేశాల మేరకు ఎస్ఐలు, సిబ్బంది బుధవారం సాయంత్రం మహిళా కళాశాల వద్ద తనిఖీలు చేపట్టారు. పట్టుబడిన ఆయా యువకులకు కౌన్సెలింగ్ ఇవ్వడమే కాకుండా భారీ మొత్తంలో జరిమానాలు విధించారు. త్రిబుల్ రైడింగ్ చేస్తూ మహిళా కాలేజ్ వద్ద విన్యాసాలు చేస్తున్న ఆయా యువకులను పోలీసులు తమదైన శైలిలో హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో లెక్చరర్‌కు గాయాలు

స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని నల్లపాడు పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఈనెల 28న జరిగిన రోడ్డు ప్రమాదంలో లెక్చరర్ వడ్డే హరికృష్ణకు గాయాలయ్యాయి. కృష్ణనగర్‌కు చెందిన వడ్డే హరికృష్ణ నల్లపాడు పాలిటెక్నిక్ కళాశాల వద్ద రోడ్డు పక్కన బస్సు కోసం ఎదురు చూస్తుండగా ద్విచక్ర వాహనంపై వేగంగా వచ్చిన వ్యక్తి ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. ఆయన ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


పాఠశాల, కళాశాలల యాజమాన్యంతో సమావేశమైన ఎమ్మెల్యే గళ్లామాధవి

సమాజ సేవకు పునరంకితం కావాలి
● పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి
● ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యంతో పీ-4పై సమావేశం

గుంటూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): సమాజంలో వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్న వ్యక్తులు సమాజసేవకు పునరంకితం కావాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పిలుపునిచ్చారు. నగరంలోని పలు ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలతో బుధవారం ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో పీ-4 కార్యక్రమంపై సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఎంతో మంది పాలకులు మారినా కూడా పేదరికాన్ని నిర్మూలించలేకపోయారని, పేదరికం లేని సమాజం వల్ల అసమానతలు తగ్గుతాయని సీఎం చంద్రబాబు భావించి పీ-4 అనే కార్యక్రమానికి నాంది పలికారని మాధవి తెలిపారు. సమాజంలో మార్పు తీసుకొచ్చే శక్తి ఉపాధ్యాయులకే ఉంటుందని, అటువంటి వ్యక్తులు ముందుకు వస్తే మార్పు ఖాయమన్నారు. ఇప్పటికే అనేక రంగాల్లో ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తులతో సమావేశాలు ఏర్పాటు చేసి పీ-4 లక్ష్యాలను వివరించామని, చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయాన్ని ప్రతిఒక్కరూ స్వాగతిస్తున్నారని, ఉపాధ్యాయులుగా మీరు బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని, మీ పాఠశాలలు, కళాశాలకు వచ్చే బంగారు కుటుంబాల విద్యార్థులకు ఆర్థికంగా సాయం, విద్యాపరంగా సాయం అందించాలని ఎమ్మెల్యే కోరారు. ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు మాట్లాడుతూ... ఎమ్మెల్యే మాధవి చేసిన, విజ్ఞప్తికి తాము వివిధ రూపాల్లో బంగారు కుటుంబాలకు సహాయం అందించటానికి సిద్ధంగా ఉన్నామని, పేద విద్యార్థులకు పుస్తకాలు, ఇతర సహాయ సహకారాలు అందిస్తామని, కుటుంబాలను దత్తత తీసుకుంటూ, మార్గదర్శులుగా తమ పేర్లను పీ-4 వెబ్‌సైట్ లో నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఓబులేసు, యాగంటి దుర్గారావు, అంజయ్య, పాఠశాలల, కళాశాలల యాజమాన్యం పాల్గొన్నారు.

విలేకరులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి
● కార్డియాలజిస్ట్ డాక్టర్ రాఘవశర్మ సూచన
● వర్కింగ్ జర్నలిస్టులకు హెల్త్ కార్డులు అందజేత

గుంటూరు మెడికల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నిత్యం ఒత్తిళ్ల మధ్య వార్తాసేకరణ జరిపే జర్నలిస్టులు తమ ఆరోగ్య సంరక్షణపై తగిన శ్రద్ధ వహించాలని ప్రముఖ కార్డి యాలజిస్ట్, లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ పీవీ రాఘవశర్మ సూచించారు. కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీ యూడబ్ల్యూజే) నగర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన హెల్త్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జర్నలిస్టుల ఆరోగ్య సంరక్షణకు లలితా ఆసుపత్రి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏపీ యూడబ్ల్యూజే నగర కమిటీ అధ్యక్షుడు వీ కిరణ్, కార్యదర్శి ఫణికుమార్ తదితరులు డాక్టర్ రాఘవశర్మను శాలువాతో సన్మానించారు. అనంతరం వర్కింగ్ జర్నలిస్టులకు డాక్టర్ రాఘవ శర్మ హెల్త్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఎస్ఎన్ మీరా, జిల్లా కార్యదర్శి కే రాంబాబు, ఐజేయూ సభ్యుడు గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, చైర్మన్ కొనకళ్ల నారాయణ తదితరులు

మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం
అందరి బాధ్యత

- తొలినాళ్లలో జాతరను తలపించే అవకాశం
- బస్టాండ్‌లలో అదనపు సౌకర్యాలు కల్పించాలి
- బస్సులను కండీషన్‌లో ఉంచే బాధ్యత అధికారులదే
- సమీక్షలో ఆర్టీసీ ఎండీ తిరుమలరావు, చైర్మన్ కొనకళ్ల

గుంటూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి తలపెట్టిన మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణ పథకం అమలు బాధ్యత గ్యారేజ్ సిబ్బంది స్థాయి నుంచి అధికారుల వరకు అందరిపై ఉందని ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరులమరావు, చైర్మన్ కొనకళ్ల నారాయణ సూచించారు. జోన్-3 పరిధిలోని నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని డిపో మేనేజర్లతో గుంటూరులోని ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో బుధవారం వారు సమీక్ష నిర్వహించారు. పథకం అమలు చేయనున్న తొలినాళ్లలో మహిళలతో పెద్ద ఎత్తున జాతర తలపించే పరిస్థితులున్నాయని, అందుకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. ప్రస్తుతమున్న బస్సుల కండీషన్‌ను మరింత తీర్చిదిద్దాలని ఆదేశించారు. బస్సుల ఫుట్ బోర్డులు కానీ, లోపల సీట్లు వంటివి నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. అలానే బస్టాండ్‌లలో మహిళల కోసం కుర్చీలు, టాయిలెట్లు, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. మహిళ రద్దీకి అనుగుణంగా సర్వీసులను అందుబాటులో ఉంచాలన్నారు. ముఖ్యంగా గ్యారేజ్‌లోని మెకానిక్‌లు, డ్రైవర్‌లు, కండక్టర్‌లు పూర్తిస్థాయిలో కృషిచేస్తే పథకం అమలు సాధ్యమవుతుందన్నారు. త్వరలో 1050 కొత్త ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి రానున్నాయన్నారు. అలానే ప్రతి ఏటా డీజిల్ బస్సుల స్థానంలో 1500 నుంచి 2వేల వరకు ఎలక్ట్రిక్ బస్సులు వస్తాయని ఇప్పటికే సీఎం చంద్రబాబు చెప్పారన్నారు. ప్రస్తుతం ఉన్న బస్సులతోనే పథకాన్ని అమలు చేయాలని సూచించారు. సమీక్షలో ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సురేష్‌రెడ్డి, జోన్ ఈడీ నాగేంద్రప్రసాద్, డీపీటీవో సామ్రాజ్యం, జోన్ డిప్యూటీ సీటీఎం రవికాంత్, పలువురు డిపో మేనేజర్‌లు ఉన్నారు.

ఏఐని విస్తృతంగా వినియోగించాలి

- డీఆర్ఎం సుధేష్ణ సేన్

గుంటూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేథ(ఏఐ)ని రైల్వేలోని వివిధ విభాగాల్లో వినియోగించడంపై ప్రతీ ఒక్క అధికారి దృష్టి పెట్టాలని గుంటూరు రైల్వే డీఆర్ఎం సుధేష్ణ సేన్ ఆదేశించారు. బుధవారం పట్టాభిపురంలోని రైల్ వికాస్ భవన్‌లో రోజువారి పనుల్లో ఏఐ వినియోగంపై అధికారులకు శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ పనిలో వేగం పెరగడానికి, సులభతరం చేయడానికి ఏఐ పరికరాల వినియోగించాలని సూచించారు. భవిష్యత్తులో ఏఐ ఎన్నో పనులను చేయబోతున్నదని, అందుకు తగినట్లుగా అందరూ సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం ఎం రమేష్‌కుమార్, సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్, డీసీఎం కమలాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ 2003 టీచర్స్‌కు పాత పెన్షన్ అమలుచేయాలి

- సీఎస్ విజయానంద్‌కు సంఘం నాయకుల వినతి

గుంటూరు (విద్య), జూలై 30(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని కోరుతూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు డీఎస్సీ 2003 టీచర్స్ ఫోరమ్ నాయ కులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వాల జాప్యం వల్ల డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆందోళన వ్య క్తం చేశారు. ఇతర శాఖల ఉద్యోగులకు వెంటనే పాత పెన్షన్ పథకాన్ని చేయాలని కోరారు. తమ సమస్యలు ఎన్నిసార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎస్ విజయానంద్‌కు వినతి పత్రం ఇచ్చిన వారిలో మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, టీచర్స్ ఫోరమ్ ఏపీ నాయకులు మోపిదేవి శివశంకరరావు తదితరులు ఉన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంస్థ
బలోపేతానికి కృషి



ద్రవ జీవామృతంను పరిశీలిస్తున్న డాక్టర్ షేక్ ఎన్ మీరా, ఎం యుగంధర్, పాల్గొన్న రైతులు

గుంటూరు(తూర్పు), జూలై 30(ఆంధ్రజ్యోతి): రైతు ఉత్పత్తిదారుల సంస్థల (ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్) బలోపేతానికి కృషి చేస్తున్నట్టు ఐకార్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ మీరా అన్నారు. కృషి విజ్ఞాన కేంద్ర దత్తత గ్రామమైన రూరల్ మండలం జొన్నలగడ్డ గ్రామంలో క్షేత్ర పరిశీలనలో భాగంగా వరి పొలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సేంద్రియ వ్యవసాయంలో భాగంగా ద్రవజీవామృతంను ప రిశీలించారు. ఆయన మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతులను ఒకే గొడుగు కిందకు తీసుకురావడమే ఈ సంస్థ లక్ష్యమని అన్నారు. ఈ సంస్థలో చేరేవారి పంటలకు మార్కెటింగ్, సాంకేతిక సదుపాయాలను కల్పిస్తున్నట్టు చెప్పారు. ఆర్థిక బలంతో పాటు మార్కెటు అనుసంధానం పెంపొందించుకునేందుకు ఈ సంస్థ దోహదపడుతుందన్నారు. అనంతరం మినుములో నూతన వంగడాలను 375 మంది రైతులకు అందించి విత్తన ఉత్పత్తిదారులుగా తయారవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేవీకే హెడ్ ఎం యుగంధర్, సీనియర్ శాస్త్రవేత్త ఎం గంగాదేవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

లాభాల బాటలో డ్రాగన్ ఫ్రూట్స్

- తక్కువ పెట్టుబడితో అధికలాభం
- డ్రాగన్ ఫ్రూట్స్ పంటకు మొగ్గు చూపుతున్నరైతులు



డ్రాగన్ ఫ్రూట్స్ పంట



రైతు మట్టయ్య



గురజాలటౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): డ్రాగన్ ఫ్రూట్స్ పంట తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తున్నాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎక్కడా మండలంలో డ్రాగన్ ఫ్రూట్ పంటలు లేవు. లాభాలు ఎక్కువగా రావడంతో డ్రాగన్ ఫ్రూట్ పంటకు రైతులు మొగ్గు చూపుతున్నారు. మండలంలోని పులిపాడులో కొమ్మినేని మట్టయ్య అనే రైతు నాలుగు ఎకరాల్లో గత నాలుగేళ్లగా డ్రాగన్ ఫ్రూట్ పంట సాగు చేస్తున్నారు. డ్రాగన్ ఫ్రూట్ పంట వలన వచ్చే లాభాలు, నష్టాలపై మట్టయ్య మాట్లాడుతూ డ్రాగన్ ఫ్రూట్ మొక్క ఎండ 45 డిగ్రీలలో కూడా బతుకుతుందన్నారు. వర్షం ఎక్కువైనా తక్కువైనా మొక్క బతుకుతుందన్నారు. అలాగే డ్రాగన్ ఫ్రూట్ మొక్క నాటినప్పటి నుంచి వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకొని పంటను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఎకరాకు సుమారు రూ.10 లక్షల దాకా ఖర్చు అవుతుందని, మొక్కలు నాటిన తరువాత రెండేళ్లకు కాయ వస్తుందన్నారు. ఎకరాకు సుమారు 15 టన్నుల నుంచి 20 టన్నుల వరకు దిగుబడి వస్తుందన్నారు. 20 యేళ్ల పాటు పంట చేతికి వస్తుందన్నారు. రెండేళ్లలో పెట్టుబడి మొత్తం పోయి లాభాలు తెస్తుందన్నారు. దీంతో మండలంలో పలువురు రైతులు డ్రాగన్‌ఫ్రూట్స్ పంటలు వేసేందుకు మొగ్గు చూపుతున్నారు.

పల్లెలు పచ్చగా ఉంటేనే కాదు... పల్లెలు ఎంత పరిశుభ్రంగా ఉంటే, ప్రజలు అంత ఆరోగ్యంగా ఉంటారంటూ క్లీన్ విలేజ్ కార్యక్రమానికి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వినూత్న రీతిలో శ్రీకారం చుట్టారు. రోజంతా ఒకే గ్రామంలో ఉండి, ప్రతి వీధిలో పర్యటించి, ఎక్కడా పారిశుధ్య సమస్యలు లేకుండా చూడాలనే కొత్త ఆలోచనతో ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీనితోపాటే గ్రామంలోని ప్రజలకున్న సమస్యలను తెలుసుకుంటూ, వాటికీ పరిష్కారం చూపారు. మెగా శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా బుధవారం గుంటూరు జిల్లా తెనాలి మండల పరిధిలోని కొలకలూరు మేజర్ పంచాయతీలో క్లీన్ కొలకలూరు కార్యక్రమాన్ని చేపట్టారు.

ప్రతి గ్రామం పరిశుభ్రంగా..

- క్లీన్ విలేజ్.. క్లీన్ కొలకలూరుకు మంత్రి మనోహర్ శ్రీకారం
- వినూత్న రీతిలో రోజంతా ఒక గ్రామంలోనే
- అప్పటికప్పుడు పరిష్కారం దిశగా తొలి అడుగు



సీసీ రోడ్డుకు కాలువ లేకపోవడంతో ఎక్స్‌కవేటర్ సాయంతో మురుగు తీయిస్తున్న మంత్రిమనోహర్

తెనాలిరూరల్, జూలై30(ఆంధ్రజ్యోతి): మురుగు కూపంగా ఉన్న కొలకలూరు గ్రామాన్ని పచ్చదనం పరిశుభ్రతలకు నిలయంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. బుధవారం మండలంలోని కొలకలూరులో మెగా శానిటేషన్ డ్రైవ్‌ను చేపట్టారు. తెనాలి మునిసిపాలిటీ, మండలంలోని పలు పంచాయతీల పారిశుధ్య సిబ్బందితో గ్రామంలోని వీధుల్లో కాలువలు పూడికతీత, బ్లీచింగ్ చిమ్మించడం వంటివి జరిపారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం సాయంత్రం 5 గంటలవరకూ సాగింది. మంత్రి మనోహర్ జరుగుతున్న పారిశుధ్య పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రధానంగా గ్రామంలో బీసీ కాలనీ శానిటేషన్‌లోపంతో కునారిల్లుతుండటాన్ని మంత్రిమనోహర్ గుర్తించారు. అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో శానిటేషన్ అధ్వానంగా ఉంటే మీరేం చేస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేశారు. మండలంలోనే అత్యధికంగా 16వేల మంది జనబా ఉన్న గ్రామంమే ఇంత అధ్వానంగా ఉండటం ఏంటని మండిపడ్డారు. వర్షాలు కురుస్తున్నాయి కాలువల్లో పారుదల కావాల్సిన నీరు రోడ్లపైకి చేరుతున్నాయి. చిన్నారులు, పెద్దలు ఈ నీటిలో నడిచి వెళ్లితే అనారోగ్యసమస్యలు రావా అంటూ అధికారులను నిలదీశారు. తాను వచ్చి చూస్తేనే ఇంత దారుణంగా ఉంటే రోజు ఇక్కడే ఉండే స్థానికుల పరిస్థితి ఏంత బాధాకరంగా ఉంటుందో ఊహించగలనన్నారు. ఇకనైనా నిర్లక్ష్యాన్ని విడనాడాలని సూచించారు. రోడ్డు పొడవునా స్థానికులతో మాట్లాడి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. తమ కాలనీలో దాదాపుగా ఆరేళ్లుగా పారిశుధ్యం అధ్వానంగా తయారై దుర్భరమైన జీవితం గడుపుతన్నామని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. గ్రామానికి విచ్చేసిన మంత్రి మనోహర్‌కు ఆ గ్రామ కూటమి నాయకులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. పూలమాలలు వేసి దుశాలవాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందించారు. సబ్‌కలెక్టర్ సంజనసింహ, డీపీవో నాగసాయిపవన్‌కుమార్, సర్పంచ్ డాక్టర్ చొప్పర ప్రీతి, ఎంపీడీవో అత్తోట దీప్తి, తహసీల్దార్ గోపాలకృష్ణ, డ్వామా, ఇరిగేషన్, ఎలక్ట్రిసిటీ, ఆర్‌డబ్ల్యుఎస్ పలు శాఖల అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పని చేస్తున్న ఉపాధి కూలీలు

ఉపాధిలో.. అవినీతికి చెక్

- నిబంధనలు కఠినతరం
- పని ప్రదేశంలో రెండు విడతలుగా హాజరు నమోదు
- శ్రామికుల యాప్‌లో అప్‌లోడ్
- ఆదేశాలు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం

సత్తెనపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉపాధి హామీ పథకం అమల్లోని అవినీతికి అడ్డుకట్ట వేసే దిశగా అడుగులు పడుతున్నాయి. దీని కోసం కేంద్ర ప్రభుత్వం నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ యాప్ తీసుకు వచ్చింది. ఈ విధానం ద్వారా ఉపాధి కూలీలు ఉదయం, సాయంత్రం పని ప్రదేశంలో ముఖ హాజరు వేసేలా తప్పనిసరి చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. దొంగ మస్టర్ల కట్టడికి కేంద్రం మరికొన్ని చర్యలు చేపట్టింది. ఇప్పటి వరకు ఉన్న నిబంధనలను మరింత కఠినతరం చేయటంతో పాటు సంబందిత అధికారుల పర్యవేక్షణ బాధ్యతలను పెంచింది. ఉపాధి పథకంలో ఇప్పటి వరకు పనులు చేస్తున్న కూలీలు ఒక్క పూట మాత్రమే పని చేసేవారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు వారిని ఫోటోలు తీసి నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా రెండు పూటలా పని చేసినట్లు హాజరు వేసి ఆ ఫోటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేవారు. అలా పని చేసిన కూలీలకు ఒక పూట మస్టర్ల ఆధారంగానే వేతనాలు చెల్లించే వారు. ఈ క్రమంలో కొందరు ఫీల్డ్ అసిస్టెంట్‌లు అవినీతికి పాల్పడే అవకాశాలు ఎక్కువగా ఉండేవి. సామాజిక తనిఖీలు, ఆడిట్‌లు జరుగుతున్నప్పుడు అవినీతి జరిగినట్టు రుజువైతే సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్‌లకు జరిమానాలు విధించే వారు. దీనిని అరికట్టేందుకు ఉదయం పనికి రాగానే ఒక సారి, సాయంత్రం 4 గంటల తరువాత మరో సారి ఫోటోలు తీసి వాటిని నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. శ్రామికుల వేతనాలు చెల్లించేందుకు ఈ ఫోటోలు తప్పనిసరి. లేదంటే ఆ రోజు వేతనం రానట్టే.

అమలు తీరు ఇలా...

గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్‌లు తీసే ఫోటోలను పంచాయతీ కార్యదర్శులకు అప్‌లోడ్ చేయాలి. వాటిని నిరంతరం కార్యదర్శులు పర్యవేక్షిస్తూ నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్‌లో ఏపీవోలకు నివేదిక అందజేయాల్సి ఉంది. ఫోటోలు సక్రమంగా తీశారనేది మండల స్థాయి అధికారులు పరిశీలించాలి. మండల పరిధిలో వచ్చిన అన్ని ఫోటోలకు సంబందించి 20 శాతం వివరాలను జిల్లా అధికారులకు అందజేయాలి. క్షేత్ర స్థాయిలో రెండో సారి ఫోటోలు తీయని ఫీల్డ్ అసిస్టెంట్, సీనియర్ మేట్ల పై క్రమశిక్షణా చర్యలు తీసుకోనున్నారు. నూతన మస్టర్ల విధానం అమలుతో కూలీలు తప్పనిసరిగా పని ప్రదేశంలో ఉండాల్సి వస్తుంది.

కౌలు చెల్లింపులపై రైతుల ఆగ్రహం

- మ్యుటేషన్ వంకతో చెల్లింపుల నిలుపుదల
- తాజా జాబితాలో మృతుల పేర్లు ప్రత్యక్షం
- ఇంకా 6,114 మందికి 60 కోట్లు బకాయి
- గ్రీవెన్స్ దినోత్సవం రోజు ఆందోళనకు సిద్ధం

గుంటూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాజధాని రైతుల కౌలు చెల్లింపుల తీరుపై రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. 6 వేలమందికి పైగా కౌలు చెల్లించకుండా ఆపడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. పైపెచ్చు తాజాగా రూపొందించిన జాబితాలో మృతుల పేర్లు కూడా కనిపించడంతో రైతులు అవాక్కవుతున్నారు. జాబితా రూపకల్పనలో సీఆర్డీఏ అధికారుల తీరుపై మండిపడుతున్నారు. రాజధాని కోసం భూసమీకరణ చేపట్టిన సమయంలో రైతులకు పదేళ్లపాటు కౌలు చెల్లించేందుకు గత టీడీపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. అయితే వైసీపీ ప్రభుత్వం మూడేళ్లపాటు కౌలు చెల్లించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక బకాయిలు చెల్లించింది. తాజాగా మరో ఐదేళ్లపాటు కౌలు చెల్లింపును కూటమి ప్రభుత్వం పొడిగించింది. అయితే కౌలు చెల్లింపు ఇప్పటికే రెండు నెలలు ఆలస్యం అయింది. ఎట్టకేలకు జూలైలో కౌలు వేసినప్పటికీ అందులో 6,114 మందికి రూ.60 కోట్ల మేర చెల్లింపులు ఆపేశారు. రిటర్నబుల్ ప్లాట్లలో ఎంతోకొంత అమ్ముకున్నా, బిడ్డల పేర రాసుకున్నా మ్యుటేషన్ పేరుతో వాటిని అధికారులు పరిశీలనలో పెట్టారు. పదేళ్లగా కౌలు ఇస్తున్న జాబితాలో పేర్లను పరిశీలన పేరుతో ఆపామని సీఆర్డీఏ అధికారులు చెబుతున్నారని రైతులు అంటున్నారు. గతంలో లేని విధంగా ఇప్పుడెలా ఆపుతారంటూ రైతులు నిలదీస్తున్నారు.

● జాబితాలో మృతుల పేర్లు..

తాజాగా పెండింగులో పెట్టిన జాబితాను పరిశీలించే క్రమంలో మృతుల పేర్లు వెలుగు చూశాయని రైతులు చెబుతున్నారు. రైతుల సమక్షంలోనే జరిగిన పరిశీలనలో మృతుల పేర్లు రావడంతో అక్కడే వారు అధికారులను నిలేసినట్లు సమాచారం. కాగా రాజధాని రైతుల్లో చాలామంది ప్లాట్లను వారసుల పేర రాసుకున్నారు. ఇలా మ్యుటేషన్ చేయించుకున్న రైతులకు సంబంధించి వారి పిల్లలకే ప్రభుత్వం కౌలు చెల్లిస్తోంది. అయితే తాజా జాబితాలో పిల్లల పేర రాసుకున్నవారి పేర్లు వచ్చాయి. వారిలో చాలామంది చనిపోయి ఉన్నారు. ఇలా చనిపోయిన వారి పేర్లు జాబితాలో తిరిగి ప్రత్యక్షమవడానికి సీఆర్డీఏ అధికారులే కారణమంటూ రైతులు మండిపడుతున్నారు.

● ఆందోళనకు సిద్ధమవుతున్న బాధితులు

శుక్రవారం జరిగే గ్రీవెన్స్ రోజున కౌలు విషయమై ప్రశ్నించేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ప్రతి శుక్రవారం రాజధానిలో జరిగే గ్రీవెన్స్ స్థానిక అధికారులతో సీఆర్డీఏ తూతూమంత్రంగా మార్చేసిందని, గ్రీవెన్స్ కార్యక్రమానికి సీఆర్డీఏ అదనపు కమిషనర్ హాజరు కావాలని, అప్పుడే తమ గోడు ప్రభుత్వానికి అర్థమవుతుందని రైతులు అంటున్నారు.

విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు రిజర్వేషన్ కోటా సవరణ

గుంటూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నంబరు 17015 భువనేశ్వర్ - సికింద్రాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు రిజర్వేషన్ కోటాని రైల్వే బోర్డు సవరించింది. సెప్టెంబరు 25వ తేదీ నుంచి ఈ సవరణ అమలులోకి రానుంది. ఆ తేదీ నుంచి స్లీపర్‌క్లాస్ బెర్తులు జనరల్ కోటాలో 130, రిమోట్ లొకేషన్ విశాఖపట్టణంలో 70, ఆర్‌ఎల్ రాజమండ్రిలో 15, తత్కాల్ 72, ప్రీమియం తత్కాల్ 72 బెర్తులకు పెరుగుతాయి. ఏసీ టూ టైర్, ఏసీ త్రీటైర్ ఎకానమిలో మాత్రం బెర్తుల సంఖ్యని కోత పెట్టింది.

ఆదాయపన్ను చట్టాలపై అవగాహన ఉండాలి

- ఆదాయపు పన్ను అధికారి ప్రసాద్‌బాబు

గుంటూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఆదాయపు పన్ను చెల్లింపుదారులు నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని ఆదాయపు పన్ను అధికారి బిప ప్రసాద్ బాబు తెలిపారు. నగరంపాలెంలోనున్న ఆదాయపు పన్నుశాఖ కార్యాలయంలో బుధవారం బులియన్, గోల్డ్, డైమండ్ వ్యాపారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాన్ కార్డు ధృవీకరణతో పాటు ఫామ్ 60న దాఖలు చేయటంపై అవగాహన కల్పించారు. అలానే ఫామ్ 61/61 ఏ దాఖలు చేయటంపై కూడా తెలియజేస్తూ ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్స్ రిజిష్టర్ చేయటంపై కూడా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఐటీ చట్టాల ప్రకారం వ్యాపారులు అడిగిన సందేహాలను ఆయన నివృత్తి చేశారు. ఇన్ కంటాక్స్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ నాయకులు రాజేంద్రకుమార్‌జైన్, నరసింహరావు, జగన్నాధరావు తదితరులున్నారు.

మహిళలకు అంతర్గత ఫిర్యాదు కమిటీ ఏర్పాటుచేయాలి

- జిల్లా లీగల్‌సెల్ అధికారి విజయలక్ష్మి

గుంటూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా పదిమందికి పైగా పనిచేస్తారో అక్కడ మహిళలకు అంతర్గత ఫిర్యాదు కమిటీని ఆయా సంస్థలు ఏర్పాటు చేయాలని మహిళా శిశు సంక్షేమశాఖ జిల్లా లీగల్‌సెల్ అధికారి ఎ విజయలక్ష్మీ తెలిపారు. జిన్నాటవర్ సెంటర్‌లోని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో జరిగిన సమావే శంలో ఆమె మాట్లాడారు. ఈ కమిటీ వారు ఆ పని ప్రదేశంలో కనుక మహిళలు ఎవరైనా లైంగిక వేధింపులకు గురైతే తప్పనిసరిగా రాతపూర్వకంగా ఫిర్యాదు స్వీకరించి విచారించి తప్పు చేసిన వారికి చట్టప్రకారం శిక్ష విధించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కమిటీ రిపోర్టును జిల్లా కలెక్టర్‌కు సమర్పించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఈ చట్టం ప్రకారం అంతర్గత కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. కమిటీలను ఏర్పాటు చేయకపోతే చట్ట ప్రకారం రూ. 50వేల జరిమానా విధించేలా చట్టంలో ఉందని తెలిపారు. వ్యాపార సంస్థలు తప్పనిసరిగా అంతర్గత కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా చాంబర్ గౌరవ అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు మాట్లాడుతూ దుకాణాల యజమానులు చట్టప్రకారం వ్యవహరించి అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో చాంబర్ అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు, కార్యదర్శులు షరాబు కృష్ణమూర్తి, గొల్లపూడి కాశీ వెంకటరాంబాబు తదితరులున్నారు.

లారీ కిందపడి విద్యార్థి దుర్మరణం

- పొన్నూరు రోడ్డులో హృదయ విదారక ఘటన
- పెన్ కొనుక్కునేందుకు రోడ్డుపైకి రాగా ప్రమాదం



షాహిద్ అహ్మద్ (ఫైల్)

గుంటూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మరికొద్ది నిమిషాల్లో తమ్ముడితో కలసి స్కూలుకు బయలుదేరి వెళ్లాల్సిన విద్యార్థి లారీ కిందపడి దుర్మరణం చెందడం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. బుధవారం ఉదయం పొన్నూరు రోడ్డులో జరిగిన ఈ దుర్ఘటనలో ఆనందపేట 9వ లైన్‌కి చెందిన షాహిద్ అహ్మద్ (13) మృతి చెందాడు. ఈస్ట్ ట్రాఫిక్ సిఐ అశోక్ కుమార్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పొన్నూరు రోడ్డులోని ఆనందపేటకి చెందిన షేక్ షబ్బార్ ఆటోనగర్లో కారు మెకానిక్‌గా పనిచేస్తుంటాడు. ఆయనకు భార్య, ఇరువురు కుమారులు ఉన్నారు. ఇరువురు కొత్తపేటలోని భాష్యం స్కూల్లో చదువుతున్నారు. బుధవారం ఉదయం సుమారు 6 గంటల 45 నిమిషాల సమయంలో వారు స్కూలుకు వెళ్లేందుకు రెడీ అయ్యారు. 9వ తరగతి చదివే పెద్ద కుమారుడు షేక్ షాహిద్ అహ్మద్ పెన్ లేకపోవడంతో కొనుక్కునేందుకు ఇంట్లో ఉన్న స్కూటీతో బయటికి వెళ్లాడు. పొన్నూరు రోడ్డు మీదుగా షాపునకు వెళ్తుండగా ఎస్ఆర్ ఫుడ్ కోర్టు ఎదురుగా వచ్చేసరికి వెనుక నుంచి రేషన్ బియ్యం పంపిణీ చేసే లారీ వెళ్తోంది. అదే సమయంలో రోడ్డుపై ఎడమ పక్కన మున్సిపల్ చెత్త బండి నిలబెట్టారు. ఎదురుగా రాంగ్ రూట్లో ఆటో ఎదురొచ్చింది. ఆటో ఎదురుగా రావడంతో ద్విచక్ర వాహనం ఆటోను ఢీకొంటుందనే కంగారులో షాహిద్ అహ్మద్ తన స్కూటీ వెనుక బ్రేకుతోపాటు ముందు బ్రేకు కూడా నొక్కాడు. ఆటో సమీపానికి వెళ్లి ఒక్కసారిగా స్కూటీ ముందు చక్రం అదుపుతప్పి కుడివైపు పడింది. అదే సమయంలో వెనుక నుంచి రేషన్ బియ్యం లోడుతో వెళ్తున్న కంటైనర్ లారీ వెనుక టైర్ కింద షాహిద్ పడిపోయాడు. టైరు షాహిద్ పైకి ఎక్కడంతో అక్కడికక్కడే కన్నుమూశాడు. మరి కొద్ది నిమిషాల్లో అన్నదమ్ములు ఇరువురు స్కూలుకు వెళ్తారనుకున్న తరుణంలో కుమారుడు షాహిద్‌ను మృత్యువు కబళించిందనే వార్త తెలిసిన వెంటనే తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కుప్పకూలిపోయారు. షాహిద్ మరణ వార్త స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ ఘటనపై ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఘోర రోడ్డు ప్రమాదం

- ఇద్దరు మృతి
- నరసరావుపేట మండలం ములకలూరు వద్ద ఘటన

నరసరావుపేట రూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ములకలూరు గ్రామం వద్ద బుధవారం రాత్రి రెండు మోటార్ సైకిల్స్ ఢీకొన్నాయి. సత్తెనపల్లి నరసరావుపేట ప్రధాన రహదారిపై నరసరావుపేట మండలం ములకలూరు వద్ద రెండు మోటార్ సైకిల్ ఎదురెదురుగా ఢీకొనగా మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు రోడ్డుపై పడ్డారు. వెనుక నుండి వస్తున్న గుర్తు తెలియని వాహనం వారిపై నుండి వెళ్లడంతో మృతి చెందారు. సత్తెనపల్లి గ్రామానికి చెందిన నాటకం రాకేష్ (34), షేక్ బాజీ (35) అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న నరసరావుపేట రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై కిషోర్ తెలిపారు.

అంగన్‌వాడీల జీతాలు పెంచాలి

గుంటూరు(తూర్పు), జూలై 30(ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా అంగన్‌వాడీలకు జీతాలు పెంచాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయు) గుంటూరు జిల్లా గౌరవ అధ్యక్షురాలు రమణ డిమాండ్ చేశారు. బుధవారం గుంటూరు పశ్చిమ అంగన్వాడీల సమావేశంలో ఆమె ప్రసంగించారు. గత ప్రభుత్వంలో జరిగిన సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను నేటివరకు నెరవేర్చలేదని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు 90శాతం పైగా పనిచేయడం లేదని దీనికి నిరసనగా ఆగస్టు 4న జిల్లాలో ఉన్న అంగన్‌వాడీలందరూ తమ ఫోన్లను సిడిపివోలకు ఇవ్వాలని పిలుపునిచ్చారు. అంగన్వాడీలకు గ్రాట్యుటీ అమలుచేస్తూ జీవో ఇస్తున్నామని ముఖ్యమంత్రి ఆర్భాటంగా ప్రకటించారని, ఆ జీవో ఇంతవరకు అమలుచేయలేదని అన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా జరిగే రాష్ట్రవ్యాప్త ఉద్యమంలో అంగన్వాడీలు, ఇతర చిరుద్యోగులు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమణ, పాల్గొన్న అంగన్‌వాడీలు

కౌన్సెలింగ్

ఈ సమస్యతో గర్భం దాల్చేదెలా?

నాకు పి.సి.ఓ.డి (పాలీసిస్టిక్ ఒవేరియన్ సిండ్రోమ్) సమస్య ఉంది. గర్భం దాల్చడానికి చేస్తున్న ప్రయత్నాలేవీ ఫలించడం లేదు. నా సమస్య తీరేదెలా?

- ఓ సోదరి, విశాఖపట్నం

పి.సి.ఓ.డి మహిళలను శారీరకంగా, మానసికంగా కుంగదీసే సమస్య! ఈ సమస్యతో వచ్చే ఇన్‌ఫర్టిలిటీని సమర్థంగా అధిగమించాలంటే అందుకు అన్ని విధాలుగా సంసిద్ధులు కావాలి. శరీరంలో అవకతవకలకు గురయ్యే హార్మోన్ల ప్రభావం మూలంగా నెలసరి క్రమం తప్పి గర్భధారణకు తగిన సమయాన్ని కనిపెట్టే వీలివ్వని పరిస్థితి తలెత్తుతుంది. ఇలాంటప్పుడు ధైర్యం కోల్పోకుండా వైద్యులను కలవడంతోపాటు కొన్ని జాగ్రత్తలు పాటించాలి. అవేంటంటే....



- శరీర బరువును తగ్గించుకోవాలి
- ఆరోగ్యకరమైన ఆహార, జీవనశైలులను అనుసరించాలి
- ఒత్తిడిని తగ్గించుకోవాలి
- వైద్యులు సూచించే ఇతరత్రా పరీక్షలను తప్పనిసరిగా చేయించుకోవాలి
- ఈస్ట్రోజెన్ మెటాబాలిజంను పెంచే ఆహారం తీసుకోవాలి.
- సమర్థమైన మందులతో హార్మోన్లు సక్రమంగా, సమంగా స్రవించేలా, క్రమం తప్పక అండం విడుదలయ్యేలా చూసుకోవాలి

డాక్టర్ షర్మిలా మజుందార్
సెక్సాలజిస్ట్ అండ్ సైకో అనలిస్ట్
హైదరాబాద్.

స్ఫూర్తి

చాలామంది పిల్లలు చేతిలో ఫోన్ ఉంటే చాలు సామాజిక మాధ్యమాలు చూస్తూ సమయం వృథా చేస్తారు. కానీ చండీగఢ్‌కు చెందిన జాన్వీ జిందాల్ అలా కాదు. యూట్యూబ్ వీడియోలు చూసి ఫ్రీస్టైల్ స్కేటింగ్‌లో మెలకువలు నేర్చుకుని 17 ఏళ్లకే అయిదు గిన్నిస్ రికార్డులు సొంతం చేసుకుంది. అతిచిన్న వయసులోనే ఈ ఘనత సాధించిన జాన్వీ జర్నీ ఇది!

గిన్నిస్ రికార్డుల జాన్వీ!



జాన్వీకి బాల్యం నుంచి చదువుతో పాటే క్రీడలంటే ఇష్టం. దాంతో తరచూ సాహస క్రీడల్లో పాల్గొనేది. అలా చిన్నప్పటి నుంచే స్కేటింగ్ మీద మక్కువ పెంచుకుంది. తల్లిదండ్రుల ప్రోత్సాహం కూడా తోడవడంతో ఎనిమిదేళ్ల వయసులోనే రోలర్ స్కేట్స్‌తో సాధన ప్రారంభించింది. 'రోలర్ స్కేట్స్ కొనివ్వమని నాన్నను అడిగాను. ఆయన వెంటనే కొనిచ్చారు. తరువాత యూట్యూబ్ వీడియోల ద్వారా సొంతంగా మెలకువలు నేర్చుకోవడం ప్రారంభించా. అది చూసి నాన్నే నాకు కోచ్‌గా మారారు' అని చెబుతోంది జాన్వీ.

ఆమె తండ్రి మునీష్ జిందాల్ పగలంతా ఉద్యోగం చేసి రాత్రి యూట్యూబ్ వీడియోలు చూసి జాన్వీకి మెలకువలు నేర్పేవారు. అలా తండ్రి సాయంతో ఫ్రీస్టైల్ స్కేటింగ్‌లో పట్టు సాధించారు ఆమె. 2019లో తొలిసారి జాతీయస్థాయి స్కేటింగ్ పోటీల్లో పాల్గొన్నారు జాన్వీ జిందాల్. 2019లో 57వ జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో తొలిపతకం గెలుచుకున్నారు. ఆ తరువాత పలు జాతీయస్థాయి పోటీల్లో స్వర్ణ, కాంస్య పతకాలు తన ఖాతాలో వేసుకున్నారు. స్కేటింగ్ చేస్తూ 'భాంగ్రా' నృత్యం చేసిన మొదటి వ్యక్తిగాను జాన్వీ ఘనత సాధించారు. ఈ విన్యాసానికి గాను ఆమెకు 2021 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్'లో స్థానం దక్కింది. గతేడాది స్కేటింగ్‌లో ఐదు గిన్నిస్ రికార్డులను తన పేరిట లిఖించుకున్నారు. 'పతకాలు గెలిచే కొద్దీ నాలో ఆత్మవిశ్వాసం పెరుగుతూ వచ్చింది. దాంతో సరికొత్త విన్యాసాలు సాధన చేయడం మొదలుపెట్టా. అయితే ఈ విన్యాసాలు అంత సులభం కాదు. బ్యాలెన్సింగ్ కోసం శారీరక దృఢత్వం ఎంతో అవసరం. కాబట్టి వ్యాయామాలు చేస్తాను' అంటున్నారామె. ప్రస్తుతం జాన్వీ ఇంటర్ రెండో ఏడాది చదువుతున్నారు.

నా లక్ష్యం అదే

"స్కేటింగ్‌లో ఇప్పటికే ఎన్నో జాతీయస్థాయి పతకాలు సాధించా. ఐదు గిన్నిస్ రికార్డులు కూడా సొంతం చేసుకున్నా. ఈ రికార్డులను నా తల్లిదండ్రులకు అంకితమిస్తున్నా. ఆసియా క్రీడల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించి స్వర్ణ పతకం సాధించాలన్నది నా లక్ష్యం. అయితే అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనాలంటే చాలా ఖర్చవుతుంది. అంత డబ్బు సమకూర్చుకోవడం కూడా పెద్ద సవాలే. ఎన్ని ఇబ్బందులు, సవాళుల ఎదురైనా నా లక్ష్యం సాధించే వరకు విశ్రమించను."



కష్టపడితే ఏదైనా సాధ్యమే...

ఇష్టంగా కష్టపడితే ఏదైనా సాధించవచ్చని అంటున్నారు జాన్వీ జిందాల్. తాను ఫుట్‌పాత్ మీద ప్రాక్టీస్ చేసేదాన్నని గుర్తు చేసుకున్నారామె. మొదట్లో ప్రాక్టీస్ చేసేటప్పుడు రోజుకు 40-50 సార్లు కిందపడేదాన్నని, అయినా సరే లేచి సాధన కొనసాగించానని జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఇష్టం, కష్టం.. ఇవి రెండు మనల్ని ఎంతటి ఎత్తులకైనా చేర్చుతాయని చెబుతున్నారామె.

విజేత



నాన్న భవన నిర్మాణ కూలీ. అమ్మ.. ముగ్గురు సంతానం.. అందరూ ఆ సంపాదనతోనే బతకాలి. కష్టాలు... సమస్యలు... సవాళ్లు... ఒకవైపు బతుకు పోరాటం. మరోవైపు... ఏదిఏమైనా సాధించి తీరాలన్న మహోన్నత ఆశయం. అదే ఆమెను విజేతగా నిలిపింది. 'ఆసియా యూత్ అండ్ జూనియర్ చాంపియన్‌షిప్స్' వెయిట్ లిఫ్టింగ్‌లో మూడు స్వర్ణ పతకాలు నెగ్గి... కామన్వెల్త్ గేమ్స్‌కు అర్హత సాధించింది. రెడ్డి భవానీ... మారుమూల పల్లె నుంచి ట్రిపుల్ గోల్డ్ వరకు సాగిన ఆమె జైత్రయాత్ర 'నవ్య'కు ప్రత్యేకం.

భవానీ... బంగారం

వదిలేద్దామని అనుకున్నా...

మా ఇల్లు అమ్మినప్పుడు వెయిట్‌లిఫ్టింగ్ వదిలేద్దామని అనుకున్నా. ఏదైనా పని చేసి నాన్నకు కాస్తయినా భారం తగ్గిద్దామనే ఆలోచన. కానీ కోచ్ ప్రోత్సాహంతో ఆ ఆలోచన విరమించుకున్నా. మా కుటుంబ పరిస్థితి తెలుసుకున్న విజయనగరం కలెక్టర్ అంబేడ్కర్... మానవతా హృదయంతో స్పందించారు. మాకు ఓ ఇంటిని మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పరంగా నాకు అవసరమైన సాయం అందిస్తానని హామీ ఇచ్చారు.

"రోజంతా కష్టపడితే నాన్నకు వచ్చేది ఐదారు వందల రూపాయలు. అదికూడా పని ఉన్నప్పుడే. దాంట్లోనే మా కుటుంబం నడవాలి. అంతులేని కష్టాలు... వచ్చేది సరిపోక పస్తులు... ఇవేవీ మాకు కొత్త కాదు. అయినా క్రీడల పట్ల నాకున్న ఆసక్తిని గమనించి, ప్రోత్సహించింది అమ్మ మాధవి. మా నాన్న ఆదినారాయణ కూడా అందుకు అడ్డు చెప్పలేదు. తిన్నా తినకపోయినా... ఇంట్లో ఎన్ని ఇబ్బందులు పడినా... ఏ రోజూ నన్ను నిరుత్సాహపరచలేదు. విజయనగరం జిల్లా కొండకరకం గ్రామంలో ఓ పేద కుటుంబం మాది. నాన్న భవన నిర్మాణ కూలీ. అక్క, చెల్లి, నేను... మేం ముగ్గురు సంతానం.

అమ్మతో స్టేడియానికి...

మా ప్రాంతంలో కె.వెంకటలక్ష్మి, మొయిదా రామకృష్ణ తదితరులు వెయిట్‌లిఫ్టింగ్‌లో రాణించారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. ఆ స్ఫూర్తితో అమ్మ నన్ను కూడా వెయిట్‌లిఫ్టర్‌ను చేయాలని కలలు కన్నది. వాళ్లకు శిక్షణ ఇచ్చిన కోచ్ చల్లా రాము వద్ద నన్ను చేర్పించింది. అప్పుడు నాకు పదేళ్లు. అమ్మ రోజూ నన్ను వెంటబెట్టుకొని స్టేడియానికి తీసుకువెళ్లేది. శిక్షణ అయ్యేవరకూ వేచి ఉండేది. ఒక పక్క ఇంటి పనంతా చేసుకొంటూ... మరోవైపు నా కోసం గంటలకు గంటలు సమయం కేటాయించేది. అలా నాలుగేళ్లు అక్కడే శిక్షణ తీసుకున్నా.

ఇల్లు అమ్మి...

2021 నా కెరీర్‌లో మరపురాని సంవత్సరం. ఆ ఏడాది భువనేశ్వర్‌లో జరిగిన జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్నాను. కాంస్య పతకం సాధించాను. అది నాలో ఎనలేని ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. మరుసటి ఏడాది ఏలూరులోని 'స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్'కు ఎంపిక అవ్వడానికి దోహదపడింది. అదేసమయంలో మా అక్క పెళ్లి కుదిరింది. నా కోచింగ్, పెళ్లి ఖర్చులు... నాన్నకు తలకు మించిన భారమైంది. దిక్కుతోచని స్థితి. చివరకు నాన్న ఇల్లు అమ్మేశారు. అయినా ఆర్థిక ఇబ్బందులు తీరలేదు. దీంతో వెయిట్‌లిఫ్టింగ్ ఆపేద్దామని అనుకున్నా. కానీ నా పరిస్థితిని గమనించిన కోచ్ గడిపల్లి ఆనంద్ నాకు అండగా నిలిచారు.



సాధన ఒక్కటే సరిపోదు...

ఏ క్రీడాకారుడైనా సరే... అంతర్జాతీయ స్థాయిలో రాణించాలంటే సాధన ఒక్కటే సరిపోదు. సరైన పౌష్టికాహారం కూడా ఎంతో ముఖ్యం. దానికి నెలకు కనీసం రూ.30 వేలు ఖర్చవుతుంది. మా నాన్న ఎన్నో అవస్థలు పడి ఐదు వేల వరకు సమకూరుస్తున్నారు. అంతకు మించి భరించలేని నిస్సహాయత. ఆ సమయంలోనే కోచ్ ఆనంద్ నా ప్రతిభను గుర్తించి, అండగా నిలిచారు. నా శిక్షణ కోసం తన డబ్బు ఖర్చు చేశారు. మరోవైపు తరచూ పోటీలు, శిక్షణవల్ల నా చదువు సరిగ్గా సాగలేదు. ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాశాను.

మరో మెట్టు పైకి...

నా కోసం అమ్మానాన్నలు ఎన్నో త్యాగాలు చేశారు. అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తే చూడాలని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వారి నమ్మకాన్ని నిలబెట్టేందుకు అహర్నిశలూ శ్రమించాను. ఒక్కో అడుగు ముందుకు వేశాను. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచాను. దాంతో ఔరంగాబాద్ 'స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా' (సాయ్) ఆధ్వర్యంలోని 'నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'కు ఎంపికయ్యాను. 2022, 2024లో మెక్సికోలో జరిగిన అంతర్జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్నాను. కానీ పతకం సాధించలేకపోయాను. మరింత కసితో సాధన చేశాను. గత ఏడాది జాతీయ పాఠశాల క్రీడా పోటీల్లో రజతం గెలవడంతో నాలో ఉత్సాహం నింపింది.

ఆసియా యూత్ చాంపియన్‌షిప్...

నా కెరీర్‌లో అతిపెద్ద విజయం... ఈ ఏడాది జూలై 4న కజకిస్తాన్‌లో జరిగిన 'ఆసియా యూత్ అండ్ జూనియర్ చాంపియన్‌షిప్' వెయిట్‌లిఫ్టింగ్‌లో మూడు స్వర్ణ పతకాలు సాధించడం. దీనికి ముందు మెరుగైన శిక్షణ కోసం మెక్సికోలో ఐడబ్ల్యూఎఫ్ ట్రైనింగ్ క్యాంప్‌కు వెళ్లాల్సి వచ్చింది. దాంతో చదువు దెబ్బతింది. కానీ ఆసియా చాంపియన్‌షిప్‌లో భారత్ తరుపున ట్రిపుల్ గోల్డ్ మెడల్స్ సాధించడం నాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. అంతేకాదు... ఈ విజయం స్కాట్‌లాండ్‌లోని గ్లాస్గోలో జరిగే 2026 కామన్వెల్త్ గేమ్స్‌కు అర్హత సాధించిపెట్టింది. ఇప్పుడు పాటియాలాలోని 'నేతాజీ సుభాష్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్'లో గేమ్స్ కోసం సన్నద్ధమవుతున్నాను. భారత్‌కు పతకం తేవాలన్న ఏకైక లక్ష్యంతో సాధన చేస్తున్నాను."

• **బి. శ్రీనివాసరావు,** విజయనగరం

సబ్జా గింజలతో అందం... ఆరోగ్యం!



సబ్జా గింజలు శరీరంలో వేడిని తగ్గిస్తాయని తెలిసిందే. అయితే వాటి వలన మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని, అందానికి వన్నెలద్దడంతోనూ అవి ఉపయోగపడతాయని నిపుణులు చెబుతున్నారు. ఆ వివరాలు తెలుసుకుందాం...

- సబ్జా గింజలోని యాంటీ ఫంగల్, యాంటీ బయోటిక్, యాంటీ మైక్రోబియల్ లక్షణాలు చర్మ ఇన్ఫెక్షన్లను దరి చేరనీయవు.
- డీటాక్స్ గుణాలు చర్మంలోని టాక్సిన్లకు బయటకు పంపుతాయి. దాంతో చర్మం మెరుస్తుంది.
- ఈ గింజల్లో విటమిన్ ఎ, సి పుష్కలంగా ఉంటాయి. చర్మాన్ని కాంతివంతంగా మార్చుతాయి.
- సబ్జా గింజల్లోని ప్రోటీన్లు, బీటా కెరోటిన్, విటమిన్ కె- కురులకు పోషణ అందించి దృఢంగా మార్చుతాయి.

ఆరోగ్యం కూడా

- సబ్జా గింజల్లోని అధిక పీచు జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఆకలిని నియంత్రించి బరువు తగ్గడంలో సహాయపడుతుంది.
- సబ్జా గింజలు ఎడిడిటిని దరిచేరనీయవు. శరీరంలోని వేడిని తగ్గిస్తాయి.
- రక్తంలో చక్కెర స్థాయులను నియంత్రిస్తాయి.
- ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి.



బతుకు చిత్రాన్ని మార్చుకుంది



ఆమె నేపథ్యం... పేదరికం. భారం దించుకొందామని తల్లిదండ్రులు చిన్న వయసులోనే పెళ్లికి బలవంతం పెట్టినా... తలొగ్గలేదు. సామాజిక కట్టుబాట్లను కాదని... మధ్యలో ఆగిన చదువును కొనసాగించి... నేడు తన కాళ్లపై తాను నిలబడింది. రచన కుమారి... 23 ఏళ్ల ఈ యువతి చిత్రకళలో వినూత్న పంథాను చొప్పించి... విజయవంతమైన వ్యాపారవేత్తగా ఎదిగి... మరికొందరికి ఉపాధి మార్గమైంది.

"ఊహ తెలిసినప్పటి నుంచీ ఒకటే కల... బాగా చదువుకోవాలి. నేను, నా కుటుంబం ఉన్నతంగా బతకాలి. కానీ పేదరికం ప్రతి అడుగులోనూ అవరోధంగా మారింది. దానికి సామాజిక కట్టుబాట్లు తోడై... చదువుకోవాలన్న నా ఆకాంక్షను మధ్యలోనే తుంచేశాయి. ఉత్తరప్రదేశ్ బహ్రైజ్ జిల్లా చితాన్‌పూర్వ గ్రామం మాది. అమ్మానాన్న చిన్న చిన్న పనులు చేసేవారు. కానీ వారి సంపాదన ఏమాత్రం సరిపోయేది కాదు. తినడానికి తిండి లేక పస్తులున్న సందర్భాలు ఎన్నో. అవాంతరాలు ఎన్ని ఎదురైనా ఏ రోజూ నేను బడి మానేయలేదు. పదో తరగతిలోకి వచ్చేసరికి... ఉన్నట్టుండి ఇంట్లోవాళ్లు బడి మాన్పించేశారు. కారణం... స్కూలు కోసం వేరే ఊరు వెళ్లాలి. పెరుగుతున్న అమ్మాయిని అంత దూరం పంపించడానికి మా కమ్యూనిటీ అభ్యంతరం చెప్పింది. నేను ఎంత మొర పెట్టుకున్నా మా పెద్దలు కూడా ఒప్పుకోలేదు. అలాగని ఊళ్లో ఉన్న ప్రైవేటు పాఠశాలలో చదివించే స్తోమత మాకు లేదు. చేసేది లేక ఇంటికే పరిమితమయ్యాను.



పెళ్లి తప్పించుకొని...

పదిహేడేళ్ల వయసులో అమ్మానాన్న నాకు పెళ్లి చేద్దామని నిర్ణయించుకున్నారు. నేను ససేమిరా అన్నాను. ఇప్పుడే పెళ్లి వద్దని, ఒకరిపై ఆధారపడకుండా జీవించే స్థాయికి ఎదగాలని కోరుకొంటున్నానని చెప్పాను. అవేవీ వాళ్లు వినలేదు. పెళ్లి చేసుకోవాల్సిందేనని బలవంతం పెట్టారు. ఎన్నో ఘర్షణల తరువాత... నా దారిన నన్ను వదిలేశారు. అదే సమయంలో 'అగాఖాన్ ఫౌండేషన్' (ఏకేఎఫ్) వారు మా ఊళ్లో పలు వృత్తివిద్యా కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారని తెలిసింది. వారిని సంప్రతించాను. గోధుమ గడ్డితో రూపొందించే కళాకృతులు నన్ను బాగా ఆకర్షించాయి. అందులో శిక్షణ తీసుకున్నా.

రెండు వందలకు పైనే...

గత ఏడాది షాపు ప్రారంభించాను. ఇప్పటివరకు నేను తయారు చేసిన రెండు వందలకు పైగా చిత్రాలు అమ్ముడయ్యాయి. ఒక్కొక్కటీ వెయ్యి నుంచి మూడు వేల రూపాయల వరకు ధర పలికింది. ఒక చిత్రం రూపొందించడానికి పది గంటలకు పైనే సమయం పడుతుంది. గోధుమ గడ్డిని సన్నని తీగల్లా చేసి, దాన్ని వస్త్రంపై చిత్రంలా తీర్చిదిద్దాలి. ఎంతో శ్రమతో కూడుకున్న పని ఇది. నా ప్రతిభను, విజయాలను గుర్తించిన అగాఖాన్ ఫౌండేషన్ వారు నన్ను తమ సంస్థలో శిక్షకురాలిగా నియమించారు. ఈ జీతం, నా షాపుపై వచ్చే ఆదాయంతో మా కుటుంబం ఇప్పుడు ఎంతో సంతోషంగా జీవిస్తోంది.

కళాకృతులు చేసి...

శిక్షణ పూర్తయ్యాక మా ఊళ్లోని మార్కెట్ ప్రాంతంలో ఒక చిన్న షాపు అద్దెకు తీసుకున్నా. అందులో గోధుమ గడ్డితో తయారైన కళాకృతుల విక్రయం ప్రారంభించాను. చూడగానే విభిన్నంగా ఉండటంతో మార్కెట్‌కు వచ్చిపోయే వారందరినీ నా చిత్రాలు విశేషంగా ఆకర్షించాయి. దాంతో కొద్ది కాలంలోనే చుట్టుపక్కల ప్రాంతాలకు కూడా దీని గురించి తెలిసింది. ఊహించిన దానికంటే తక్కువ సమయంలోనే మంచి డిమాండ్ ఏర్పడింది. ఖర్చులు పోనూ కొంత మిగులు కనిపించింది. ఇది నాలో ఎనలేని ఉత్సాహాన్ని ఇచ్చింది.

నాలాంటివారి కోసం...

చిత్రాల ద్వారా ఆదాయం పెరగడంతో కొత్త ఆలోచన వచ్చింది. నాలానే పేదరికంలో మగ్గుతూ, ఏ ఆధారం లేక ఇబ్బందులు పడుతున్న ఔత్సాహిక బాలికలకు ఈ కళలో శిక్షణ ఇవ్వాలని అనుకున్నా. అదే సమయంలో చదువు కొనసాగించాలని నిర్ణయించుకున్నా. బీఏలో చేరా. ప్రస్తుతం మూడో సంవత్సరం. చదువుకొంటూనే షాపు చూసుకొంటున్నా. ఆసక్తి గల అమ్మాయిలకు చిత్రకళ నేర్పిస్తున్నా. వారి నుంచి నామమాత్రపు ఫీజు తీసుకొంటున్నా. వారానికి ఆరు రోజులు శిక్షణ ఇస్తున్నా. పన్నెండు నుంచి పదిహేడేళ్ల మధ్య వయసుగల ఇరవైమంది బాలికలు ఇప్పుడు నా దగ్గర నేర్చుకొంటున్నారు. నెల రోజుల ఈ శిక్షణ పూర్తిచేసుకున్న కొందరు తమ చిత్రాల ద్వారా ఆదాయం కూడా పొందుతున్నారు. ఇలాంటి మార్పే నేను కోరుకున్నది. ఆడపిల్ల ఒకరిపై ఆధారపడకుండా స్వశక్తితో ఎదగాలి. కట్టుబాట్ల పేరుతో తల్లిదండ్రులు వారి ఆశయాలు, ఆలోచనలను మొగ్గలోనే చిదిమేయకుండా... ప్రోత్సహిస్తే అసాధ్యమనేది ఏదీ ఉండదని అర్థం చేసుకోవాలి."

అభిరుచులకూ ఇవ్వాలి సమయం...

మనందరికీ పుస్తక పఠనం, సంగీతం, రచనా వ్యాసాంగం, ఆటలు... ఇలా ఏదో ఒక అభిరుచి ఉండే ఉంటుంది. కానీ సమయాభావం అంటూ వాటిని పక్కన పెట్టేస్తూ ఉంటాం. అలాకాకుండా రోజూ కొన్ని చిట్కాలు పాటించి కొంత సమయాన్ని అభిరుచుల కోసం కేటాయించుకోవచ్చు.

- ముందుగా అవసరం లేని పనులు చేయకూడదు. ఉదాహరణకు ఫోన్‌లో ఎక్కువ సేపు మాట్లాడడం, తరచూ షాంపింగ్ కోసమని వెళ్లడం, ఎక్కువగా టీవీ చూడడం లాంటివి. దీనివల్ల రోజూ కొంత సమయం మిగులుతుంది.
- బొమ్మలు గీయడం, నృత్యం చేయడం, సంగీత పరికరాలు వాయించడం ఇలా ఆసక్తి ఉన్న అంశం మీద రోజూ అరగంట సాధన చేయాలి. అవసరమైతే శిక్షణ కూడా తీసుకోవచ్చు. ఇలా చేస్తూ ఉంటే క్రమంగా ఒకప్పుడు అనుకున్న లక్ష్యం సాధించవచ్చు.
- రోజూ చేయాల్సిన పనులను పక్కన పెట్టడం, వాయిదా వేయడం లాంటివి చేయకూడదు. దీనివల్ల వాటికి సంబంధించిన ఆలోచనలతో ఏకాగ్రత కుదరదు. సమయానుసారం పనులు పూర్తిచేసిన తరవాత మాత్రమే మీకిష్టమైన అంశాలమీద దృష్టి నిలపాలి.
- ఒకేసారి గంటల సమయం కాకుండా పావుగంటతో మొదలుపెట్టి క్రమంగా సమయాన్ని పెంచుకోవాలి. వారాంతాల్లో కనీసం రెండు గంటలు అభిరుచులకోసం కేటాయించుకోవాలి.
- అన్ని పనులనూ ఒక్కరమే చేయాలన్న భావనతో ఉండకుండా కుటుంబసభ్యుల సహాయం తీసుకుంటూ ఉండాలి. అప్పుడే రోజూ కొంత సమయం దొరుకుతుంది.
- ఏ పనికి ఎంత సమయం పెట్టాలో ముందుగానే నిర్ణయించుకోవాలి. అత్యవసరమైనవాటిని త్వరగా పూర్తిచేయాలి. సమయం వృథాకాకుండా చూసుకోవాలి. అప్పుడే అభిరుచులకూ సమయం దొరుకుతుంది.



సమం చేస్తారా?

జోష్‌లో యువ భారత్



● సూపర్ ఫామ్‌లో గిల్, జడేజా, రాహుల్
● బుమ్రాపై కొనసాగుతున్న సస్పెన్స్
● స్టోక్స్ దూరం ● డీలాపడిన ఇంగ్లండ్

ఆఖరి టెస్ట్ నేటి నుంచే
మ. 3.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..

లండన్: మాంచెస్టర్ టెస్ట్‌లో అద్భుత పోరాటాన్ని ప్రదర్శించిన భారత జట్టు.. ఇంగ్లండ్ పర్యటనను విజయంతో ముగించాలనుకొంటోంది. ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో 1-2తో వెనుకంజలో ఉన్న శుభ్‌మన్ గిల్ సేన.. గురువారం నుంచి ఓవల్‌లో జరిగే ఐదో, ఆఖరి మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను సమం చేయాలనే పట్టుదలతో ఉంది. లార్డ్స్‌లో క్రాలేతో గిల్ వాగ్వాదం.. ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో స్టోక్స్ డ్రా ప్రతిపాదనకు జడేజా నో చెప్పడం.. తాజాగా క్యూరేటర్ లీ ఫోర్టిస్‌పై గంభీర్ ఆగ్రహం లాంటి ఘటనలతో సిరీస్ హాట్‌హాట్‌గా మారింది. రోహిత్, కోహ్లీ, అశ్విన్ లాంటి స్టార్లు లేకుండా.. యువ ఆటగాడు గిల్ సారథ్యంలో ఇంగ్లండ్ వెళ్లిన భారత్ కొన్నిసార్లు తడబడినా.. ఓవరాల్‌గా ఢీ అంటే ఢీ అన్నట్టుగానే ఎదురు నిలిచింది. పైగా, స్టోక్స్ గైర్హాజరీలో డీలాపడ్డ ఇంగ్లండ్‌కు నాకౌట్ పంచ్ ఇచ్చేందుకు గిల్ సేనకు ఇదో సువర్ణావకాశం.


ఇంగ్లండ్ సారథి పోప్

బ్యాటర్లు అదరహో..

నాలుగో టెస్ట్‌లో చాలా భాగం ఆతిథ్య జట్టుదే ఆధిపత్యమే అయినా.. రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటర్ల అసాధారణ పోరాటంతో భారత్ డ్రాతో గట్టెక్కింది. ముఖ్యంగా కీలక బ్యాటర్లు సూపర్ ఫామ్‌లో ఉండడం టీమిండియా ఆత్మవిశ్వాసాన్ని పెంచుతోంది. ఓపెనర్ రాహుల్ నిలకడగా రాణిస్తుండగా.. గిల్ మళ్లీ టచ్‌లోకి రావడం శుభపరిణామం. అయితే, మరో ఓపెనర్ జైస్వాల్ వరుస వైఫల్యాలు జట్టును దెబ్బ తీస్తున్నాయి. సాయి సుదర్శన్ క్రీజులో నిలిచేందుకు ప్రయత్నించాలి. గత మ్యాచ్‌లో చిరస్మరణీయ శతకాలు సాధించిన జడేజా, సుందర్ నుంచి జట్టు అదే తరహా ప్రదర్శనను కోరుకొంటోంది. గాయంతో రిషభ్ పంత్ చివరి మ్యాచ్‌కు దూరమవడంతో.. ధ్రువ్ జురెల్ కీపర్‌గా తుది జట్టులోకి రానున్నాడు. పంత్ లేకపోవడంతో బ్యాటింగ్ డెప్త్ కోసం శార్దూల్ ఠాకూర్‌ను కొనసాగించడానికే మేనేజ్‌మెంట్ మొగ్గుచూపుతున్నట్టు సమాచారం. అంటే, స్పిన్నర్ కుల్దీప్‌కు మరోసారి నిరాశే. పేస్ గన్ బుమ్రా విషయంలో ఇంకా సస్పెన్స్ వీడలేదు. మ్యాచ్ ఆరంభానికి ముందు పిచ్‌ను బట్టి నిర్ణయం తీసుకొంటామని గిల్ చెప్పాడు. సిరాజ్, ఆకాశ్‌దీప్ ప్రధాన బౌలర్లు కాగా.. బుమ్రా దూరమైతే అర్ష్‌దీప్‌కు చాన్స్ దక్కొచ్చు.

గిల్ మరో 52 పరుగులు సాధిస్తే.. ఓ సిరీస్‌లో అత్యధిక పరుగులు స్కోరు చేసిన భారత ఆటగాడిగా సునీల్ గవాస్కర్‌ను అధిగమిస్తాడు. ఈ సిరీస్‌లో గిల్ ఇప్పటి వరకు 722 రన్స్ చేశాడు.

మరోసారి బాజ్‌బాల్?

మరోవైపు కెప్టెన్ స్టోక్స్ దూరం కావడంతో పాటు పేసర్ జోఫ్రా ఆర్చర్, కార్స్‌కు విశ్రాంతి నివ్వడంతో ఇంగ్లండ్ కొంత బలహీనంగా కనిపిస్తోంది. బెన్ గైర్హాజరీలో ఓలీ పోప్ జట్టును నడిపించనున్నాడు. ఇంగ్లండ్ మొత్తంగా నాలుగు మార్పులతో బరిలోకి దిగుతోంది. బాజ్‌బాల్ ఆడాలనే వ్యూహంతోనే స్పిన్నర్ డాసన్‌ను తప్పించి హిట్టర్ జాకబ్ బెథల్‌ను జట్టులోకి తీసుకొన్నట్టుగా కనిపిస్తోంది. గస్ అట్కిన్సన్, ఓవర్టన్, జోష్ టంగ్ జట్టులోకి వచ్చారు. స్టోక్స్ దూరం కావడంతో జట్టు భారం మొత్తం బ్యాటర్లే మోయాల్సిన పరిస్థితి.

జట్లు

భారత్ (అంచనా): జైస్వాల్, రాహుల్, సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), సుందర్, జడేజా, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), శార్దూల్, అర్ష్‌దీప్/ప్రసిద్ధ్ కృష్ణ, సిరాజ్, ఆకాశ్‌దీప్.

ఇంగ్లండ్: జాక్ క్రాలే, బెన్ డకెట్, ఓలీ పోప్ (కెప్టెన్), రూట్, హ్యారీ బ్రూక్, జాకబ్ బెథల్, జేమీ స్మిత్ (వికెట్ కీపర్), క్రిస్ వోక్స్, అట్కిన్సన్, ఓవర్టన్, జోష్ టంగ్.

పిచ్/వాతావరణం: వికెట్‌పై పచ్చిక కనిపిస్తుండడంతో పేసర్లకు సహకరిస్తుందని భావిస్తున్నారు. టాస్ గెలిచిన టీమ్ బౌలింగ్ ఎంచుకొనే అవకాశం ఉంది. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలం. ఇటీవలే ఇక్కడ జరిగిన కౌంటీ మ్యాచ్‌లో సర్రే 820/9 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. మూడు వారాల క్రితం వాతావరణం వేడిగా ఉన్నా.. ప్రస్తుతం చల్లగా మారింది. తొలి రోజు మధ్యాహ్నం మళ్లీ చివరి రెండు రోజులు ఓ మోస్తరు వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ చెబుతోంది.

స్టోక్స్‌కు గాయం..



ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ భుజం గాయంతో చివరి టెస్ట్‌కు దూరమయ్యాడు. మాంచెస్టర్ టెస్ట్‌లో తొలి ఇన్నింగ్స్‌లో ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన స్టోక్స్.. రెండో ఇన్నింగ్స్‌లో భుజం నొప్పితో బాధపడుతూనే బౌలింగ్ చేశాడు. కండర గాయం కావడంతో కోలుకోవడానికి సుమారు ఆరు వారాల సమయం పట్టే అవకాశం ఉంది.

ఇంకా సందిగ్ధమే..



కీలక మ్యాచ్‌కు పేస్ గన్ బుమ్రా అందుబాటులో ఉంటాడా? లేదా? అనే దానిపై సందిగ్ధం కొనసాగుతోంది. పని భారం నేపథ్యంలో బుమ్రాకు విశ్రాంతి నివ్వాలని నిర్ణయించినట్టు ఊహాగానాలు బలంగా వినిపించాయి. వెన్నునొప్పితో ఇబ్బందిపడుతున్న బుమ్రా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని అతడిని దూరంగా ఉంచాలని మెడికల్ టీమ్ సూచించినట్టు సమాచారం. కానీ, మ్యాచ్ రోజు ఉదయం పిచ్‌ను పరిశీలించిన తర్వాత బుమ్రాపై తుది నిర్ణయం తీసుకొంటామని గిల్ తెలిపాడు.

గంభీర్‌కు ఆ హక్కుంది: గిల్

ఓవల్ చీఫ్ క్యూరేటర్ ఫోర్టిస్‌తో ఘర్షణ విషయంలో కోచ్ గంభీర్‌కు గిల్ మద్దతుగా నిలిచాడు. పిచ్‌ను పరిశీలించడానికి భారత కోచ్‌కు హక్కుందన్నాడు. ఇదో అనవసర వివాదమని అభిప్రాయపడ్డాడు. భారత సహాయ సిబ్బంది వికెట్‌ను పరిశీలించడానికి వెళ్లినప్పుడు.. దూరం నుంచే చూడాలని ఫోర్టిస్ చెప్పడంతో అతడిపై గౌతీ ఫైర్ అయ్యాడు. 'ఇలా దూరం నుంచే చూడాలని చెప్పడం ఇంతకుముందు ఎన్నడూ జరగలేదు. వికెట్‌ను పరిశీలించడం కెప్టెన్, కోచ్ బాధ్యత' అని గిల్ చెప్పాడు. ఇతర వేదికలపై ఎటువంటి ఆంక్షలు విధించలేదని తెలిపాడు. కాగా, ఇంగ్లండ్ తాత్కాలిక కెప్టెన్ ఓలీ పోప్, రూట్ బుధవారం పిచ్‌పై నిలుచొని షాడో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయడం కనిపించింది. దీంతో టీమిండియా పట్ల వివక్ష ప్రదర్శిస్తున్నారని ఫ్యాన్స్ విమర్శిస్తున్నారు. మాజీ ఆటగాళ్లు పార్థివ్ పటేల్, ఇర్ఫాన్ పఠాన్ కూడా గంభీర్‌ను సమర్థించారు.

పాకిస్థాన్‌తో సెమీస్ ఆడం

● టోర్నీ నుంచి వైదొలగిన భారత్
● ఆడకుండానే ఫైనల్‌కు పాక్
● లెజెండ్స్ వరల్డ్ చాంపియన్‌షిప్



బర్మింగ్‌హామ్: పాకిస్థాన్‌తో గురువారం జరగాల్సిన టీ20 లెజెండ్స్ వరల్డ్ చాంపియన్‌షిప్ సెమీఫైనల్ మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నట్టు భారత జట్టు ప్రకటించింది. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం ఆపరేషన్ సిందూర్ చేపట్టిన భారత్.. పాకిస్థాన్‌తో ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడకూడదన్న నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు పాక్‌తో మ్యాచ్ నుంచి వైదొలగుతున్నట్టు భారత లెజెండ్స్ తెలిపారు. ఈ టోర్నీ లీగ్ దశలో పాకిస్థాన్‌తో మ్యాచ్‌నూ భారత్ బహిష్కరించింది. శిఖర్ ధవన్, యువరాజ్ సింగ్ (కెప్టెన్), ఇర్ఫాన్ పఠాన్, హర్భజన్ సింగ్, సురేష్ రైనా వంటి మాజీ స్టార్లు భారత జట్టులో ఉన్నారు. భారత జట్టు వైదొలగాలన్న నిర్ణయంతో పాక్ ఆడకుండానే టోర్నీ ఫైనల్‌కు చేరుకుంది. ఇక ఆస్ట్రేలియా-దక్షిణాఫ్రికా జట్ల మధ్య గురువారం జరిగే సెమీఫైనల్ విజేతతో పాక్ ఫైనల్లో తలపడుతుంది. భారత్ సహా మొత్తం ఆరు జట్లు ఈ టోర్నీలో పాల్గొంటున్నాయి.

మర్చండ్ ప్రపంచ రికార్డు

స్విమ్మింగ్ వరల్డ్ చాంపియన్‌షిప్



సింగపూర్: ఒలింపిక్ చాంపియన్, ఫ్రెంచ్ స్విమ్మర్ లియోన్ మర్చండ్ ప్రపంచ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లోనూ తనకు తిరుగులేదని చాటాడు. 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లే ఈవెంట్‌లో మర్చండ్ ఒక నిమిషం 52.61 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకొని సరికొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. ఈ క్రమంలో 2011లో అమెరికా స్విమ్మర్ ర్యాన్ లోచెట్ నమోదుచేసిన ఒక నిమిషం 54 సెకన్ల ప్రపంచ రికార్డును మర్చండ్ బద్దలుకొట్టాడు. గతేడాది పారిస్ ఒలింపిక్స్‌లో నాలుగు స్వర్ణ పతకాలు కొల్లగొట్టిన 23 ఏళ్ల మర్చండ్.. ఇంకా 400 మీటర్ల వ్యక్తిగత మెడ్లేతో పాటు రిలే ఈవెంట్‌లో పోటీపడాల్సి ఉంది.

టీ20 నెం.1 బ్యాటర్.. అభిషేక్



దుబాయ్: ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్‌లో అదరగొడుతున్న ఆల్‌రౌండర్ జడేజా తన నెం.1 ర్యాంక్‌ను మరింత పదిలం చేసుకోగా.. టీ20 ఫార్మాట్‌లో అభిషేక్ శర్మ తొలిసారి అగ్రస్థానాన్ని కైవసం చేసుకొన్నాడు. బుధవారం విడుదల చేసిన ఐసీసీ ర్యాంకింగ్స్ టీ20 బ్యాటర్ల విభాగంలో టాప్‌లో ఉన్న హెడ్‌ను అభిషేక్ వెనక్కినెట్టాడు. వెస్టిండీస్‌తో టీ20 సిరీస్‌కు దూరం కావడంతో హెడ్ రెండో స్థానానికి పడిపోయాడు. ఆల్‌రౌండర్ల విభాగంలో జడ్డూ టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. మాంచెస్టర్ టెస్ట్‌లో సెంచరీ బాదిన సుందర్ ఎనిమిది స్థానాలు మెరుగుపర్చుకొని 65వ ర్యాంక్‌లో నిలిచాడు. మెహిదీ హసన్, స్టోక్స్ రెండు, మూడు ర్యాంకుల్లో ఉన్నారు.

తరుణ్, లక్ష్య ముందంజ

మకావు ఓపెన్‌లో ప్రణయ్‌కు షాక్

మకావు: తెలుగు యువ షట్లర్ తరుణ్ మన్నెపల్లి మకావు ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో శుభారంభం చేశాడు. తరుణ్‌తో పాటు స్టార్ ఆటగాడు లక్ష్యసేన్, ఆయుష్ శెట్టి కూడా ముందంజ వేశారు. సింగిల్స్ ఆరంభ రౌండ్లో తరుణ్ 21-19, 21-13తో సహచరుడు మన్‌రాజ్ సింగ్‌పై, లక్ష్య 21-8, 21-14తో జియోన్ హ్యాక్ జిన్ (కొరియా)పై, ఆయుష్ 21-10, 21-11తో హువాంగ్ యు కాయి (తైపీ)పై గెలిచారు. ప్రణయ్ 21-18, 15-21, 15-21తో యోహానెస్ (ఇండోనేసియా) చేతిలో కంగుతిన్నాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల/తనీషా క్రాస్టో 21-10, 21-15తో థాయ్ జంట రచాపోల్/నటామోన్‌ను ఓడించగా, మహిళల సింగిల్స్‌లో ఉన్నతి హుడా తొలిరౌండ్లోనే వెనుదిరిగింది.



ఇటీవల ఇండోనేసియాలో జరిగిన ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం గెలిచిన హైదరాబాద్ క్రీడాకారిణి వెన్నెల కలగొట్లకు లక్ష రూపాయల ప్రోత్సాహకాన్ని అందిస్తున్న హైదరాబాద్ బ్యాడ్మింటన్ సంఘం చీఫ్ చాముండేశ్వర్‌నాథ్

'హండ్రెడ్స్'లో నాలుగు ఐపీఎల్ ఫ్రాంచైజీలు

లండన్: నాలుగు ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఫ్రాంచైజీలు ఇంగ్లండ్, వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) నిర్వహించే 'హండ్రెడ్స్' లీగ్‌లోనూ అడుగుపెట్టాయి. ముంబై ఇండియన్స్, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్యాలు హండ్రెడ్స్ టోర్నీ జట్లతో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. మాంచెస్టర్ ఒరిజినల్స్ జట్టులో లఖ్‌నవూ, నార్తర్న్ సూపర్ చార్జర్స్‌లో సన్‌రైజర్స్, సదరన్ బ్రేవ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్, ఓవల్ ఇన్విజిబుల్స్‌లో ముంబై ఇండియన్స్ వాటాలు కొనుగోలు చేశాయి.

బిజినెస్



రొయ్యల ఎగుమతీ సమస్యే

హైదరాబాద్/భీమవరం (ఆంధ్రజ్యోతి): ట్రంప్ సుంకాల ప్రభావం ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడుల్లోని రొయ్యల ఎగుమతులపైనా పడనుంది. మన దేశం నుంచి ఏటా 11 లక్షల టన్నుల రొయ్యలు ఎగుమతి అవుతుంటే అందులో ఎనిమిది లక్షల టన్నులు ఆంధ్రప్రదేశ్ నుంచే ఎగుమతి అవుతున్నాయి. రాష్ట్రం నుంచి ఎగుమతయ్యే రొయ్యల్లో 70 శాతం అమెరికాకే వెళ్తాయి. ట్రంప్ తాజా సుంకాలతో రైతులతో పాటు, ఇటు ఎగుమతిదారులూ తీవ్రంగా నష్టపోతారని జగదీష్ మెరైన్ ప్రొడక్ట్స్ అధినేత జగదీశ్ చెప్పారు. అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) కుదిరే వరకు ఈ తిప్పలు తప్పవన్నారు.

సగం వాటా రొయ్యలదే: మన దేశం నుంచి ఏటా 480 కోట్ల డాలర్ల విలువైన మత్స్య ఎగుమతులు జరుగుతుంటే అందులో సగానికిపైగా వాటా రొయ్యలదే. ఇపుడు ట్రంప్ సర్కార్ మన దేశానికి చెందిన మత్స్య ఎగుమతుల పైనా 25 శాతం దిగుమతి సుంకం విధించింది. దీనికి తోడు రష్యా నుంచి చమురు, ఆయుధాలు దిగుమతి చేసుకుంటే జరిమానాలూ తప్పవని ట్రంప్ ప్రకటించారు. ఇదే సమయంలో అమెరికాకు అతి సమీపంలో ఉన్న ఈక్వెడార్ నుంచి అతి తక్కువ సుంకాలతో రొయ్యలతో సహా అనేక మత్స్య దిగుమతులను అనుమతించనుంది. దీంతో భారత రొయ్యలకు అతి పెద్ద మార్కెట్ అయిన అమెరికా మార్కెట్ దాదాపు మూసుకు పోయినట్టేనని భావిస్తున్నారు. ఈ ప్రభావం వ్యాపారులు రొయ్యల రైతులకు చెల్లించే ధరల పైనా పడుతుందని మార్కెట్ వర్గాల అంచనా.

మార్కెట్ పైనా ట్రంప్ పిడుగు



నష్టాల్లో భారత కంపెనీల ఏడీఆర్‌లు
మూడేళ్ల కనిష్ఠానికి రూపాయి

'బేర్'మన్న గిఫ్ట్ నిఫ్టీ

అమెరికా తాజా సుంకాలు, పెనాల్టీలతో గురువారం దేశీయ స్టాక్ మార్కెట్ లాభాలకు బ్రేక్ పడే సూచనలు కనిపిస్తున్నాయి. భారత్ నుంచి వచ్చే దిగుమతులపై ఆగస్టు 1 నుంచి 25 శాతం సుంకాలు, పెనాల్టీలు విధించబోతున్నట్టు అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. దీంతో గురువారం నిఫ్టీ 24,700 పాయింట్ల దిగువకు పడిపోయే అవకాశం ఉందని టెక్నికల్ విశ్లేషకుల అంచనా. ముఖ్యంగా ఆటోమొబైల్ విడిభాగాలు, టెక్స్‌టైల్స్, ఫార్మా, జువెలరీ, రొయ్యల ఎగుమతి కంపెనీల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తే అవకాశం ఉందని భావిస్తున్నారు. గురువారం నాటి నిఫ్టీ ఓపెనింగ్‌కు సూచికగా భావించే గిఫ్ట్ నిఫ్టీ, ట్రంప్ ప్రకటన వెలువడిన కొద్ది సేపటికే 24,700 పాయింట్ల దిగువకు పడిపోయింది. దీనికి తోడు గురువారం నాటి ఎఫ్ అండ్ ఓ సెటిల్‌మెంట్ భయాలూ మార్కెట్‌ను వెంటాడుతున్నాయి.

నష్టాల్లో ఏడీఆర్‌లు: ట్రంప్ సుంకాల ప్రకటనతో అమెరికా స్టాక్ మార్కెట్‌లో భారత కంపెనీలు జారీ చేసిన ఏడీఆర్‌లూ నష్టాల్లోకి జారుకున్నాయి. ఐసీఐసీఐ బ్యాంక్ (1.2%), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (1.06%), విప్రో (1.7%), ఇన్ఫోసిస్ (0.78%), డాక్టర్ రెడ్డీ ల్యాబ్స్ (3.83%) ఏడీఆర్‌లు భారీగా నష్టపోయాయి.

రూపాయి ధమాల్: డాలర్ మారకంలో రూపాయి విలువ మూడేళ్ల కనిష్ఠ స్థాయికి దిగజారింది. బుధవారం ఉదయం 19 పైసల నష్టంతో రూ.87.10 వద్ద ప్రారంభమైన రూపాయి చివరికి 89 పైసల నష్టంతో రూ.87.80 వద్ద ముగిసింది. ట్రంప్ ప్రకటనతో గురువారం రూపాయి మారకం రేటు మరింత పతనమయ్యే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. 'అమెరికా-భారత వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితి ఇంకా కొనసాగుతోంది. చమురు ధర కూడా పెరుగుతోంది. వీటికి తోడు ఎఫ్‌పీఐల అమ్మకాలు కొనసాగుతున్నాయి. దీంతో డాలర్‌తో రూపాయి మారకం రేటు మరింత పతనమవుతుందని మా అంచనా' అని మిరాసె అసెట్ షేర్‌ఖాన్ సంస్థ రీసెర్చి అనలిస్టు అనూజ్ చౌదరి చెప్పారు. వచ్చే కొద్ది రోజుల్లో డాలర్‌తో రూపాయి 87 - 87.90 మధ్య ట్రేడయ్యే అవకాశం ఉందన్నారు. నెలాఖరులో దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ పెరగడం సైతం ఫారెక్స్ మార్కెట్‌లో రూపాయి మారకం రేటును కుంగదీస్తోంది.

రెండో రోజూ లాభాల్లో సెన్సెక్స్

ట్రంప్ సుంకాల భయం వెంటాడడంతో బుధవారం దేశీయ స్టాక్ మార్కెట్ పెద్దగా లాభాలు నమోదు చేయలేదు. సెన్సెక్స్ 143.91 పాయింట్ల లాభంతో 81,481.86 వద్ద, నిఫ్టీ 50 ఇండెక్స్ 33.95 పాయింట్ల లాభంతో 24,855.05 వద్ద ముగిశాయి. అమెరికా సుంకాల భయం, ఎఫ్‌పీఐల కొనుగోళ్ల జోరు తగ్గడం బుధవారం సూచీల జోరుకు పగ్గాలు వేశాయి. అయితే ఎల్ అండ్ టీ షేర్లలో భారీ కొనుగోళ్లు సూచీలను లాభాలవైపు నడిపించాయి. సన్ ఫార్మా, ఎన్‌టీపీసీ, మారుతీ, ఎయిర్‌టెల్, ట్రెంట్, యాక్సిస్ బ్యాంకు షేర్ల కొనుగోళ్లూ ఇందుకు దోహదం చేశాయి.

టాటా మోటార్స్ చేతికి ఇటలీ కంపెనీ ఇవెకో!

డీల్ విలువ రూ.38,240 కోట్లు

న్యూఢిల్లీ: టాటా గ్రూప్ మరో భారీ టేకోవర్ చేసింది. ఇటలీ కేంద్రంగా పనిచేసే ట్రక్కుల తయారీ కంపెనీ ఇవెకో ఎన్‌వీ కంపెనీని 450 కోట్ల డాలర్లకు (సుమారు రూ.38,240 కోట్లకు కొనుగోలు చేసింది. టాటా గ్రూప్ చరిత్రలోనే ఇది అతి పెద్ద కొనుగోలు. ఇందుకోసం గత నెలన్నర రోజులుగా జరుగుతున్న చర్చలు కొలిక్కి వచ్చి నట్టు టాటా మోటార్స్ బోర్డు బుధవారం ప్రకటించింది. ఈ డీల్‌లో భాగంగా ఇవెకో ఈక్విటీలో నూరు శాతం వాటాను పూర్తి నగదు చెల్లింపు పద్ధతిలో టాటా గ్రూప్ కొనుగోలు చేస్తోంది. అయితే ఆ గ్రూప్‌లోని రక్షణ పరి కరాల విభాగం మాత్రం ఈ టేకోవర్ పరిధిలోకి రాదు. యూరప్, అమెరికా మార్కెట్లలో ఇవెకో గ్రూప్ ట్రక్కుల కు మంచి డిమాండ్ ఉంది. ఇది వ్యూహాత్మక కొనుగోలు అని, దీని ద్వారా జాతీయ-అంతర్జాతీయ మార్కెట్లలోనూ పోటీపడగలుగుతాం అని టాటా మోటార్స్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ అన్నారు

మహీంద్రా లాభం రూ.4,083 కోట్లు

దేశీయ వాహన దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా వర్తమాన ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 24% వృద్ధితో రూ.4,083 కన్సాలిడేటెడ్ నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన లాభం రూ.3,283 కోట్లు. మొత్తం ఆదాయం రూ.37,218 కోట్ల నుంచి రూ.45,529 కోట్లకు పెరిగింది. ఆటో, వ్యవసాయ ఉపకరణాల విభాగం ఎప్పటివలెనే మంది వృద్ధిని నమోదు చేసిందని, ఈ విభాగంలో లాభాల మార్జిన్ 20% పెరిగిందని కంపెనీ తెలిపింది. ఆర్థిక సర్వీసుల విభాగం నిర్వహణలోని ఆస్తుల విలువ 15% వృద్ధిని నమోదు చేసింది. ఐటీ సర్వీసుల విభాగం టెక్ మహీంద్రా డీల్స్ సంఖ్య గణనీయంగా పెరిగిందని గ్రూప్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ అనిష్ షా తెలిపారు.

ఫార్చ్యూన్ గ్లోబల్ 500లో రిలయన్స్@88

న్యూఢిల్లీ: ఈ ఏడాదికిగాను ప్రపంచంలోని 500 అతిపెద్ద కంపెనీల జాబితాను ప్రముఖ అమెరికన్ మ్యాగజైన్ ఫార్చ్యూన్ బుధవారం విడుదల చేసింది. రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు ఈ లిస్ట్‌లో 88వ స్థానం దక్కింది. గత ఏడాది 86వ స్థానంలో ఉండగా.. ఈసారి ర్యాంకింగ్ రెండు స్థానాలు జారుకుంది. 2021లో 155వ స్థానంలో నిలిచిన ఆర్ఐఎల్.. గడిచిన నాలుగేళ్లలో 67 స్థానాలు ఎగబాకింది. ఈ లిస్ట్‌లో రిలయన్స్‌కు చోటు దక్కడం వరుసగా ఇది 22వ సంవత్సరం. కాగా, '2025 ఫార్చ్యూన్ గ్లోబల్ 500' జాబితాలో భారత్ నుంచి 9 కంపెనీలకు స్థానం దక్కింది. వాటిలో 5 ప్రభుత్వ రంగానివి కాగా.. మిగతా నాలుగు ప్రైవేట్ కంపెనీలు. ఈ మార్చి 31 నాటికి కంపెనీల వార్షికాదాయం ఆధారంగా ఫార్చ్యూన్ ఈ జాబితాను రూపొందించింది. అమెరికన్ రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్ మరోసారి ప్రపంచ నం.1గా కొనసాగగా.. అంతర్జాతీయ ఈ-కామర్స్ కంపెనీ అమెజాన్ రెండో స్థానంలో ఉంది. టాప్-10లో 3 చైనా కంపెనీలకు చోటు దక్కింది. సౌదీ అరేబియాకు చెందిన చమురు ఉత్పత్తి దిగ్గజం సౌదీ అరామ్కో నాలుగో స్థానంలో నిలిచింది. ఐఫోన్ల తయారీ సంస్థ యాపిల్‌కు 8వ స్థానం లభించింది.

జియో రూ.52,000 కోట్ల ఐపీఓ!?



వచ్చే ఏడాదిలో ఇష్యూకు..

న్యూఢిల్లీ: ముకేశ్ అంబానీకి చెందిన టెలికాం సంస్థ రిలయన్స్ జియో సహా అన్ని డిజిటల్ సేవల విభాగమైన జియో ఇన్ఫోకామ్.. దలాల్ స్ట్రీట్ చరిత్రలో అతిపెద్ద పబ్లిక్ ఆఫరింగ్‌కు సిద్ధమవుతోంది. 5 శాతం వాటా విక్రయం ద్వారా 600 కోట్ల డాలర్ల (సుమారు రూ.52,200 కోట్లు) వరకు సమీకరించాలని జియో ఇన్ఫోకామ్ భావిస్తున్నట్లు బ్లూంబర్గ్ కథనం వెల్లడించింది. ప్రస్తుతం మార్కెట్ చరిత్రలో అతిపెద్దదైన రూ.28,000 కోట్ల హ్యుండయ్ ఐపీఓతో పోలిస్తే జియో దాదాపు రెండింతల అధిక నిధులు సమీకరించనుందన్నమాట. ఐపీఓకు అనుమతి కోసం సెబీతో రిలయన్స్ ఇప్పటికే అనధికారిక చర్చలు కూడా ప్రారంభించినట్లు ఆ నివేదికలో తెలిపారు. సంస్థ వచ్చే ఏడాదిలో పబ్లిక్ ఇష్యూకు రావచ్చని సమాచారం. ఈ ఆగస్టులో ఆర్ఐఎల్ నిర్వహించబోయే వాటాదారుల వార్షిక సమావేశంలో జియోతోపాటు రిలయన్స్ రిటైల్ ఐపీఓలపై స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. జియో ఇన్ఫోకామ్‌లో 2020లో పెట్టుబడులు పెట్టిన మెటా ప్లాట్‌ఫామ్స్, గూగుల్ వంటి అమెరికన్ టెక్ దిగ్గజాలు, ప్రైవేట్ ఈక్విటీ ఇన్వెస్టర్లు ప్రతిపాదిత ఐపీఓ ద్వారా తమ వాటాలను కొంత మేర ఉపసంహరించుకునే అవకాశాలున్నాయి. మెటా, గూగుల్ పెట్టుబడులు పెట్టిన సమయంలో జియో మార్కెట్ విలువను 5,800 కోట్ల డాలర్ల స్థాయిలో లెక్కగట్టగా.. ప్రస్తుతం 10,000 కోట్ల డాలర్లు (రూ.8.7 లక్షల కోట్లు) దాటింది.

జియో ఫైనాన్షియల్‌కు రూ.15,825 కోట్లు : రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి వేరు చేసి ప్రత్యేక సంస్థగా ఏర్పాటు చేసిన జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్‌ను ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు ముకేశ్ అంబానీ, ఆయన కుటుంబం, ప్రమోటర్ గ్రూప్ సంస్థలు కలిసి రూ.15,825 కోట్ల మూలధన నిధులు సమకూర్చాలని బుధవారం జరిగిన కంపెనీ బోర్డు సమావేశంలో నిర్ణయించారు. ప్రస్తుతం జేఎఫ్ఎస్ఎల్‌లో వీరందరికీ కలిపి 47.12 శాతం వాటా ఉండగా.. నిధులు సమకూర్చిన అనంతరం వాటా 54.19 శాతానికి పెరగనుంది.

ఇండిగో లాభంలో 20% క్షీణత

న్యూఢిల్లీ: ప్రైవేట్ విమానయాన దిగ్గజం ఇండిగో లాభాలకు గగనతల ఆంక్షలు గండి కొట్టాయి. వర్తమాన ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికంలో ఇండిగో మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ లాభం 20% క్షీణించి రూ.2176.3 కోట్లకు పరిమితమయింది. అయితే వివిధ గమ్యాలకు చేర్చిన ప్రయాణికుల సంఖ్య మాత్రం 12% పెరిగి 3.1 కోట్లుగా నమోదయింది. గత ఏడాది ఇదే కాలంలో ఇండిగో లాభం రూ.2,728.8 కోట్లుంది. మొత్తం ఆదాయం 6.4% వృద్ధితో రూ.20,248.9 కోట్ల నుంచి రూ.21,542.6 కోట్లకు పెరిగింది. జూన్ నెలలో ఇండిగో 64.5% మార్కెట్ వాటా సాధించింది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్




హైదరాబాద్	110	విజయవాడ	109
వరంగల్	110	గుంటూరు	114
కరీంనగర్	110	ఒంగోలు	117
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	102
కర్నూలు	110	నెల్లూరు	107
విశాఖపట్నం	97	అనంతపురం	107
గోదావరి	109		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



31వ తేదీ			
హైదరాబాద్	410	విజయవాడ	475
వరంగల్	412	గోదావరి	455
చిత్తూరు	483	విశాఖపట్నం	455
		డజను గుడ్లు రూ. 72	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,00,480 ▲	92,100 ▲	1,27,000 ▲
విజయవాడ	1,02,300 ▲	96,500 ▲	1,17,600 ▲
విశాఖపట్నం	1,02,300 ▲	92,100 ▲	1,27,000 ▲
రాజమండ్రి	1,00,470 ▲	92,100 ▲	1,17,300 ▲
ప్రొద్దుటూరు	99,650 ▲	91,680 ▲	1,16,800 ▲
ముంబై	99,020 ▲	90,700 ▲	1,13,400 ▲



మెగా మాస్

చిరంజీవి కథానాయకుడిగా వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'విశ్వంభర'. ఇటీవలే చివరి షెడ్యూల్ చిత్రీకరణ పూర్తి చేశారు. ఈ షెడ్యూల్‌లోనే ఓ ప్రత్యేక గీతాన్ని తెరకెక్కించారు. భీమ్స్ సిసిరోలియో స్వరపరిచిన మాస్ బీట్‌కు చిరుతో బాలీవుడ్ భామ మౌనీరాయ్ స్టెప్పులేశారు. ఈ గీతానికి గణేశ్ ఆచార్య నృత్యరీతులు సమకూర్చారు. ఈ సందర్భంగా సెట్స్‌లో చిరంజీవితో దిగిన ఫొటోలను మౌనీరాయ్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. చిరంజీవి సర్‌తో కలసి డాన్స్ చేయడం గొప్ప అనుభూతిని ఇచ్చిందని ఆమె తెలిపారు. త్రిష కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మిస్తున్నారు. త్వరలో విడుదల తేదీని ప్రకటించనున్నారు.

పరాటా చేయడం నేర్చుకున్నా

విజయ్ సేతుపతి



విజయ్ సేతుపతి, నిత్యా మీనన్ జంటగా పాండిరాజ్ తెరకెక్కించిన చిత్రం 'సార్ మేడమ్'. సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మించారు. ఇటీవలె తమిళ్‌లో విడుదలైందీ చిత్రం. ఈ శుక్రవారం తెలుగులో విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రీ రిలీజ్ వేడుకలో విజయ్ సేతుపతి మాట్లాడుతూ "ఈ సినిమాకు తమిళ్‌లో మంచి విజయం దక్కింది. తెలుగులోనూ పెద్ద విజయం సాధిస్తుందని నమ్మకముంది. ఈ సినిమా కోసం పరాటా చేయడం నేర్చుకున్నాను. కథను నమ్మి చేసిన చిత్రమిది" అని అన్నారు. "ఇది యూనివర్సల్ సబ్జెక్ట్. అందరూ రిలేట్ చేసుకుంటారు" అని నిర్మాత త్యాగరాజన్ చెప్పారు. "ఇది ప్రేక్షకులకు మంచి హోమ్ ఫుడ్ లాంటి సినిమా" అని దర్శకురాలు నందినీ రెడ్డి తెలిపారు. "భార్యాభర్తల మధ్య జరిగే అందమైన ప్రేమకథ ఈ చిత్రం" అని పాండిరాజ్ అన్నారు.



బుకింగ్స్‌కు అద్భుత స్పందన

విజయ్ దేవరకొండ

'థియేటర్‌కు వచ్చిన ప్రతి ప్రేక్షకుడికీ 'కింగ్‌డమ్' చిత్రం మంచి అనుభూతిని ఇస్తుంది. కుటుంబ భావోద్వేగాల నేపథ్యంలో కథ సాగుతుంది. సినిమా మొదలైన రెండు నిమిషాలకే ప్రేక్షకులు కింగ్‌డమ్ ప్రపంచంలోకి వెళ్తారు. 'జెర్సీ' లాంటి గుర్తుండిపోయే చిత్రాన్ని అందించిన గౌతమ్ తిన్ననూరి తనదైన శైలిలో తెరకెక్కించారు. సినిమా అవుట్‌పుట్ పట్ల మేం పెట్టుకున్న నమ్మకం నిజమైంది. బుకింగ్స్‌కు వస్తున్న అద్భుత స్పందన వస్తోంది' అని విజయ్ దేవరకొండ అన్నారు. ఆయన కథానాయకుడిగా సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించిన 'కింగ్‌డమ్' చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ మాట్లాడుతూ 'రొమాంచిత పోరాట ఘట్టాలతో భారీ హంగులతో సినిమాను రూపొందించాం. మనసుకు హత్తుకునే భావోద్వేగాలున్న కథ ఇది' అన్నారు. సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ 'ఈ మధ్యకాలంలో సినిమాలకు భారీ ఓపెనింగ్స్ రావడం కష్టమైంది. 'కింగ్‌డమ్' చిత్రం ఆ పరిస్థితిని అధిగమించింది. మంచి వసూళ్లతో సినిమా ఘన విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు.

పవన్‌కల్యాణ్ అభినందనలు...

అన్నపూర్ణ స్టూడియోలోనే పవన్‌కల్యాణ్ నటిస్తున్న 'ఉస్తాద్ భగత్‌సింగ్' పాట చిత్రీకరణ జరుగుతుండడంతో 'కింగ్‌డమ్' యూనిట్ సభ్యులు ఆయన్ని కలిశారు. సినిమా విజయం సాధించాలని టీమ్‌ను అభినందించారు పవన్‌కల్యాణ్.

వినోదాత్మక చిత్రం



లావణ్య త్రిపాఠి లీడ్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం 'సతీ లీలావతి'. తాతినేని సత్య దర్శకత్వంలో నాగ మోహన్ నిర్మిస్తున్నారు. సినిమా త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ చిత్ర టీజర్‌ని రిలీజ్ చేశారు. భార్యాభర్తల కథతో తీసిన వినోదాత్మక చిత్రంగా టీజర్‌ని చూస్తే అర్థమవుతోంది. భార్యగా లావణ్య, భర్తగా దేవ్ మోహన్ నటించారు. పెళ్లి చేసుకొన్న కొన్నాళ్లకే ఇక మనం కలిసుండలేం అని భర్త అంటే... అతన్ని ఇంట్లోనే తాళ్లతో కట్టిపడేస్తుంది భార్య. ఆ తరవాత ఏం జరిగిందనేది ఆసక్తికరం. టీజర్‌లో లావణ్య, దేవ్‌మోహన్‌తో పాటు వీటీవీ గణేశ్, సప్తగిరి తదితరులు కనిపించారు. కాగా, ఈ సినిమాకు మిక్కీ జే మేయర్ సంగీతం అందిస్తున్నారు.

అలరించే ప్రేమకథా చిత్రం

హెబ్బా పటేల్, ధనుష్ రఘుముద్రి జంటగా నటించిన చిత్రం 'థాంక్యూ డియర్'. తోట శ్రీకాంత్ కుమార్ దర్శకత్వంలో పప్పు బాలాజీ రెడ్డి నిర్మించారు. ఈ చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం బుధవారం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. శ్రీకాంత్ కుమార్ మాట్లాడుతూ 'ప్రతి ఒక్కరి హృదయాన్ని కదిలించే సున్నితమైన ప్రేమకథా చిత్రం ఇది. తెరపై అందమైన ప్రణయ భావనల్ని ఆవిష్కరి



స్తుంది. సమకాలీన సమాజంలో చర్చనీయాంశంగా మారిన ఓ ముఖ్యమైన పాయింట్‌ను తీసుకొని ఈ సినిమా తెరకెక్కించాం' అన్నారు. బాలాజీ మాట్లాడుతూ 'మానవ సంబంధాలను చర్చిస్తూ సందేశాత్మకంగా సాగే చిత్రమిది. ప్రేక్షకులు ఆశించే అంశాలతో అలరిస్తుంది' అని తెలపారు. ఈ చిత్రంలోని ఎమోషన్స్ చాలా కాలం పాటు ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోతాయి అని కథానాయిక రేఖా నిరోషా చెప్పారు.

నటి పాయల్ రాజ్‌పుత్ ఇంట విషాదం



నటి పాయల్ రాజ్‌పుత్ ఇంట విషాదం నెలకొంది. ఆమె తండ్రి విమల్ కుమార్ (67) కన్నుమూశారు. కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన సోమవారం తుదిశ్వాస విడిచినట్లు పాయల్ రాజ్‌పుత్ తెలిపారు. ఈ మేరకు సోషల్‌మీడియాలో పోస్ట్ పెట్టారు. 'ప్రతీక్షణం నిన్ను మిస్ అవుతూనే ఉంటా నాన్నా. మీరు క్యాన్సర్‌ను జయిస్తారని అనుకున్నాను. మీకు మనోధైర్యం ఇవ్వడానికి నేను చేయాల్సిందల్లా చేశాను. మిమ్మల్ని కాపాడుకోలేకపోయాను, క్షమించండి" అని పేర్కొన్నారు.

ఎంఈవో పోస్టుల్లో ఖాళీలకు ఇన్‌చార్జ్‌లు

- ప్రభుత్వ మేనేజ్‌మెంట్ టీచర్లకు అవకాశం
- వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు

అమరావతి, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఖాళీగా ఉన్న మండల విద్యాశాఖ అధికారి పోస్టులకు ఇన్‌చార్జ్‌లను నియమిస్తూ బుధవారం జోన్ 3, 4 ఆర్జేడీలు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లనే చాలావరకు ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. దీనిపై ఉపాధ్యాయ సంఘాల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అన్ని మేనేజ్‌మెంట్ల టీచర్లకు ఉమ్మడి సీనియారిటీ తీసుకుని భర్తీ చేయాల్సిన పోస్టులకు కేవలం ప్రభుత్వ మేనేజ్‌మెంట్ టీచర్లనే నియమించడాన్ని సంఘాలు తప్పుబట్టాయి. ఎంఈవో-1 పోస్టులను ఉమ్మడి సీనియారిటీ ద్వారా మాత్రమే భర్తీ చేయాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) డిమాండ్ చేసింది. జోన్-2 పరిధిలో ప్రభుత్వ మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లను మాత్రమే ఎంఈవో-1లుగా భర్తీ చేసేందుకు సమాచారం సేకరించడాన్ని తప్పుబట్టింది. ఉమ్మడి సర్వీసు రూల్స్ జీవోలు 72, 73, 74 అమలు చేయాల్సిన అధికారులే సమన్యాయం పాటించకుండా పక్షపాత వైఖరితో వ్యవహరిస్తున్నారని ఫ్యాప్టో చైర్మన్ ఎల్.సాయి శ్రీనివాస్, ఎస్.చిరంజీవి ఓ ప్రకటనలో ఆరోపించారు. ఎంఈవోలకు బదిలీలు నిర్వహించి ఖాళీలను పదోన్నతుల ద్వారానే భర్తీ చేయాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఎంఈవో ఖాళీలను ప్రభుత్వ యాజమాన్య టీచర్లతోనే కాకుండా ఉమ్మడి సీనియారిటీతో భర్తీ చేయాలని పీఆర్‌టీయూ అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఎంఈవో పోస్టులకు ఇన్‌చార్జ్ ఏర్పాట్లలో జడ్పీ హెచ్‌ఎంలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఏపీటీఎఫ్-అమరావతి అధ్యక్షుడు సీవీ ప్రసాద్ కోరారు.

డీఎస్సీ-2003 టీచర్లకు ఓపీఎస్ అమలు చేయాలి

అమరావతి, జూలై 30(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2003 నోటిఫికేషన్ టీచర్లకు పాత పెన్షన్ విధానం అమలుచేయాలని డీఎస్సీ-2003 టీచర్ల ఫోరం ప్రభుత్వాన్ని కోరింది. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఫోరం నేతలు బుధవారం సచివాలయంలో సీఎస్ కె.విజయానంద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. సీపీఎస్ అమలు తేదీ కంటే ముందే డీఎస్సీ-2003 నోటిఫికేషన్ విడుదలైందని, కానీ ప్రభుత్వాల జాప్యం వల్ల ఉద్యోగాల్లో చేరడం ఆలస్యమైందని, అందువల్ల తమకు ఓపీఎస్ అమలుచేయాలని కోరారు.

రెండో విడత భూసమీకరణపై చర్చావేదిక

- ఏకాభిప్రాయ సాధనకు ఇదోమార్గం: నిమ్మగడ్డ రమేశ్

అమరావతి, జూలై 30(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతికి రెండో విడత భూసమీకరణపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్న నేపథ్యంలో త్వరలో ఒక చర్చా వేదికను ఏర్పాటు చేయనున్నట్లు సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ కార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల కమిషన్ మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 'జూలై 27న సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఆధ్వర్యంలో విజయవాడలో ఒక సదస్సు జరిగింది. దానిలో సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు, మాజీ అడ్వొకేట్ జనరల్ డీవీ సీతారామ్మూర్తి... రెండో విడత భూసమీకరణపై ప్రజల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయని పేర్కొన్నారు. అంత పెద్దఎత్తున రెండో విడత భూసేకరణ, సమీకరణ అవసరమా? అనే అంశంపై స్పష్టత లేదు. గతంలో సేకరించిన భూమిని అభివృద్ధి చేసి, ఆ ఫలితాలను లబ్ధిదారులకు అందజేసిన తర్వాతనే రెండో విడత భూసేకరణ చేయవచ్చునన్న భావనలు ఒక వైపున వ్యక్తమవుతుండగా, అమరావతిలోనే ఇంత పెద్దఎత్తున భూసేకరణ చేయడం ప్రాంతీయ అభివృద్ధికి, సమతౌల్యానికి వ్యతిరేకమనే వాదనలు కూడా మరో వైపున వినిపిస్తున్నాయి.

పారిశ్రామికవేత్తల కోసం చాట్‌బాట్: కొండపల్లి

అమరావతి, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సులువుగా సమాచారాన్ని అందించేందుకు ఏఐ ఆధారిత చాట్‌బాట్‌ను రూపొందించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ప్రాథమిక సమాచారం కోసం ఎంట్రప్రెన్యూర్లు వేచి చూడాల్సిన పరిస్థితులు ఉండకూడదన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఆయా రంగాల వారీగా ఉపాధి నైపుణ్యాలు అందించాలని సూచించారు.

అంతా మా ఇష్టం..!

ఆరోగ్యశాఖ టెండర్లలో అధికారుల ఇష్టారాజ్యం

- ప్రసన్నం చేసుకున్న కంపెనీలకే అర్హత
- అన్ని అర్హతలున్న కంపెనీలు డిస్‌క్వాలిఫై
- గతంలో సజ్జల ఆప్తుడికి సెక్యూరిటీ టెండర్లు
- ఇప్పుడు శానిటేషన్ టెండర్లు కట్టబెట్టేలా స్కెచ్
- రఘురామ ఫిర్యాదు చేసిన కంపెనీకి ఓకే
- జగన్ కోటరీకే టెండర్లు కట్టబెడుతున్న వైనం

అమరావతి, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రుల్లో శానిటేషన్ పనులు నిర్వహించేందుకు పిలిచిన టెండర్ల వ్యవహారంలో అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అన్ని అర్హతలున్న కంపెనీలను ఉద్దేశ పూర్వకంగా డిస్‌క్వాలిఫై చేసి, అర్హత లేని కంపెనీలనే క్వాలిఫై చేయడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. శానిటేషన్ పనుల కోసం ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు మే నెలలో ఆరు జోన్లకు టెండర్లు ఆహ్వానించారు. ఈ టెండర్ ప్రక్రియలో మొత్తంగా 13 కంపెనీలు బిడ్లు దాఖలు చేశాయి. చివరికి వారం క్రితం.. అంటే టెండర్లు పిలిచిన రెండు నెలల తర్వాత టెక్నికల్ బిడ్లు తెరిచారు. టెక్నికల్ బిడ్‌లలో ఏడు కంపెనీలకు అర్హత కల్పించి, ఆరు కంపెనీలను డిస్‌క్వాలిఫై చేశారు. ముడుపులు మొత్తం అందిన తర్వాత టెక్నికల్ బిడ్లు తెరిచారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు ఇదే ఆరోగ్య శాఖలో పెద్ద చర్చనీయాంశంగా మారింది.

ఆ అధికారిని ఎందుకు తప్పించారో?

మొదటి నుంచి టెండర్ల ప్రక్రియను పర్యవేక్షిస్తున్న కీలక అధికారిని అకస్మాత్తుగా ఆ పని నుంచి తొలగించారు. ఉద్దేశ పూర్వకంగా కొన్ని కంపెనీలకు టెండర్లు కట్టబెట్టేందుకే ఇలా ఇష్టారాజ్యంగా మార్పులు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జాతీయ స్థాయిలో గుర్తింపు ఉండి, ప్రస్తుతం అనేక రాష్ట్రాల్లో శానిటేషన్ పనులు చేస్తున్న కంపెనీలను అధికారులు డిస్‌క్వాలిఫై చేశారు. అధికారులు క్వాలిఫై చేసిన కంపెనీల్లో నాలుగింటిపై తీవ్ర ఆరోపణలున్నాయి. ఇందులో ఒక కంపెనీ సజ్జలకు అత్యంత ఆప్తుడైన వ్యక్తిది కావడం గమనార్హం. అలానే వైసీపీ ప్రభుత్వంలో ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును ఇబ్బంది పెట్టిన జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్‌కు సంబంధించిన కంపెనీకి టెక్నికల్ బిడ్‌లో అర్హత కల్పించడం చర్చనీయాంశమైంది. సదరు కంపెనీపై విచారణ చేయాలని డీఎంఈకి ఆర్ఆర్ఆర్ ప్రత్యేకంగా ఫిర్యాదు చేశారు. సాధారణంగా టెండర్లలో పాల్గొనే కంపెనీపై ఫిర్యాదులు వచ్చినా, అనుమానాలున్నా వెంటనే సదరు కంపెనీల నుంచి సమాధానం కోరాలి. ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు అలాంటి నిబంధనలు ఏమీ పాటించ లేదు. ఫైనాన్షియల్ బిడ్ తెరవడానికి ఒక్కరోజు ముందు.. అభ్యంతరాలపై కేవలం వివరణ ఇచ్చి వెళ్లిపోండి అంటూ బుధవారం కంపెనీలకు లేఖలు పంపించారు. ఏపీఎంఎస్ఐడీసీ అడ్డగోలు నిర్ణయంపై కంపెనీలు కోర్టులను ఆశ్రయించేందుకు సిద్ధం అవుతున్నాయి.

> నీకు అన్ని అర్హతలు ఉన్నాయా.. నువ్వు పనికిరావు. నీకు అనుభవం ఉందా.. నీకు చాన్సేలేదు. నువ్వు జగన్ మనిషివా.. అయితే ఓకే. నిబంధనలు మాకు పట్టవు. మా టెండర్లు, మా ఇష్టం. టెండర్లలో పాల్గొంటేనే సరిపోదు. మమ్మల్ని ప్రసన్నం చేసుకోవడానికి ముడుపులతో మెప్పించాలి. అప్పుడే అర్హత కల్పిస్తాం. ఇదీ ఆరోగ్యశాఖ టెండర్ల వ్యవహారంలో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న తీరు.

జగన్ కోటరీదే హవా..

ప్రభుత్వం మారినా మాజీ సీఎం జగన్ కోటరీ కంపెనీల హవా మాత్రం తగ్గడం లేదు. ఆరోగ్యశాఖలో ఏ టెండర్ అయినా ఆ కంపెనీలకే దక్కుతున్నాయి. ఇప్పటికే విజయవాడలోని సిటీ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో టెండర్ లేకుండానే సీటీ స్కాన్ సేవలను జగన్ ఆప్తుడి కంపెనీకి అప్పగించేశారు. సెక్యూరిటీ టెండర్లు అలాగే కట్టబెట్టారు. ఇప్పుడు శానిటేషన్ టెండర్లు ఆ కోటరీ కంపెనీలకే కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం సెక్యూరిటీ టెండర్లలో అర్హత లేకపోయినా సజ్జల రామకృష్ణారెడ్డికి అనుంగుడైన వ్యక్తికి జోన్-1 టెండర్ కట్టబెట్టారు. ఇప్పుడు శానిటేషన్ టెండర్లలో కూడా ఏదొక జోన్ ఇవ్వాలనే ప్లాన్‌లో భాగంగా ఓ కంపెనీకి అర్హత కల్పించారు. కానీ సదరు కంపెనీ చాలా డాక్యుమెంట్లు టెండర్ బిడ్‌లో దాఖలు చేయకపోయినా అధికారులు కళ్లు మూసుకుని ఆ కంపెనీకి అర్హత కల్పించారు. దీనిపై వచ్చిన ఫిర్యాదులను బుట్టదాఖలు చేశారు.

పదో తరగతి ప్రశ్నపత్రాల్లో మార్పులు

- పరఖ్ సూచనలకు అనుగుణంగా సవరణ
- సృజనాత్మక ప్రశ్నలకు ప్రాధాన్యం

అమరావతి, జూలై 30(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ప్రశ్నాపత్రాల్లో పాఠశాల విద్యాశాఖ స్వల్ప మార్పులు చేసింది. పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షన్ సర్వేకు అనుగుణంగా సవరించిన ప్రశ్న పత్రాల బ్లూ ప్రింట్లను విడుదల చేసినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం తెలిపింది. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అనుగుణంగా, పనితీరు ఆధారిత అవగాహనను పెంపొందించేలా ఈ మార్పులు చేసినట్లు తెలిపింది. అయితే ప్రశ్నలు, మార్కుల విషయంలో ఎలాంటి మార్పులు చేయలేదు. సృజనాత్మక ప్రశ్నలకు ప్రాధాన్యం ఇచ్చింది. కొత్త బ్లూప్రింట్ ప్రకారం గణితం ప్రశ్నాపత్రంలో నాలెడ్జ్‌కు 20%, అవగాహనకు 25%, అప్లికేషన్‌కు 20%, అనాలసిస్‌కు 15%, ఎవాల్యుయేషన్‌కు 10%, సృజనాత్మకతకు 10% వెయిటేజీ ఇచ్చారు. ఎనిమిది మార్కుల ప్రశ్నలు 5, నాలుగు మార్కుల ప్రశ్నలు 8, రెండు మార్కుల ప్రశ్నలు 8, ఒక మార్కు ప్రశ్నలు 12 ఉంటాయి. అర్థమెటిక్ ప్రశ్నల్లో ఛాయిస్ తొలగించారు. క్లిష్టమైన ప్రశ్నలు 20%, సాధారణ స్థాయి ప్రశ్నలు 40%, సులభమైన ప్రశ్నలు 40% ఉండేలా మార్పులు చేశారు. సోషల్ స్టడీస్‌లో భూగోళం, చరిత్ర, పౌరశాస్త్రం, అర్థశాస్త్రంనకు 25 మార్కుల చొప్పున వెయిటేజీ ఇచ్చారు. తెలుగు సబ్జెక్టులో అవగాహన- ప్రతిస్పందనకు 24%, వ్యక్తీకరణ - సృజనాత్మకతకు 44%, భాషాంశాలకు 32% వెయిటేజీ ఇచ్చారు. ఎనిమిది మార్కుల ప్రశ్నలు 7, లఘు ప్రశ్నలు 3, అతి లఘు ప్రశ్నలు 9, లక్ష్యాత్మక ప్రశ్నలు 14 ఇచ్చారు. కొత్త బ్లూ ప్రింట్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలని పాఠశాలలకు సూచించిన పరీక్షల విభాగం అస్పష్టంగా ప్రకటన విడుదల చేసింది. ఎలాంటి మార్పులు చేశారనేది వివరించకుండా సవరణలు చేసినట్లు తెలపడంతో ఉపాధ్యాయులు కూడా అయోమయానికి గురయ్యారు. చేసిన మార్పులను చెపితే... లక్షలాదిమంది విద్యార్థులకు ఉపయోగపడే సమాచారానికి విస్తృత ప్రచారం కల్పిస్తామంటూ మీడియా ప్రతినిధులు పలుదఫాలు అడిగినా ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కనీసం స్పందించక పోవడం శోచనీయం. కాగా ఇప్పటికే ఈ ఏడాది టెన్త్ పరీక్షల మూల్యాంకనాన్ని పరీక్షల విభాగం అస్తవ్యస్తం చేసి ప్రభుత్వాన్ని విమర్శలపాలు చేసింది.

ఉచిత ప్రయాణానికి గుర్తింపు తప్పనిసరి

- రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా వెళ్లవచ్చు
- ఏపీ మహిళలకు మాత్రమే వర్తింపు: ఆర్టీసీ ఎండీ

గుంటూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఆగస్టు 15 నుంచి ప్రభుత్వం తలపెట్టిన ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ పథకం రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నట్లు ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. మహిళలకు ఉచిత ప్రయాణంపై జోన్ 3 పరిధిలోని గుంటూరు, ప్రకాశం, బాపట్ల, పల్నాడు, నెల్లూరు జిల్లాల పరిధిలోని అధికారులతో గుంటూరులో బుధవారం ఎండీ తిరుమలరావు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, జోనల్ చైర్మన్ సురేశ్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. 'రాష్ట్రంలో మహిళలు ఎక్కడ నుంచి ఎక్కడికైనా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. అయితే ఏపీకి చెందిన వారేనని ఆధార్ వంటి ఏదో ఒక గుర్తింపు కార్డు తప్పనిసరిగా బస్సులో చూపాల్సి ఉంటుంది. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పిస్తున్నాం. త్వరలో 1,050 కొత్త బస్సులు రానున్నాయి. ప్రతి ఏటా డీజిల్ బస్సుల స్థానంలో కొత్త ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి వస్తాయి. అలానే గురువారం విజయవాడలో తరువాత వైజాగ్‌లో కూడా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తాం' అని ఎండీ తెలిపారు. ఆర్టీసీ చైర్మన్ నారాయణ మాట్లాడుతూ... 'కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేసేందుకు సిద్ధమైంది. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా మహిళలు ప్రయాణించే అంశంపై త్వరలోనే మార్గదర్శకాలు రానున్నాయి. ఉచిత బస్సుతో మహిళల జీవితంలో పెనుమార్పులు రానున్నాయి. ప్రస్తుతం ఉన్న బస్సులు, సిబ్బందితోనే ఉచిత బస్సు పథకం అమలు చేస్తాం. రాష్ట్ర మహిళలకు మాత్రమే ఉచిత బస్సు సౌకర్యం ఉంటుంది' అని తెలిపారు.

మానవ అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు: డీజీపీ



విజయవాడ సిటీ, జూలై 30(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా వ్యక్తుల స్వేచ్ఛ, హక్కులు, మానవతా విలువలను హరించే ఘోరమైన నేరమని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా అన్నారు. ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై ఏపీ పోలీస్‌శాఖ అత్యంత కఠినంగా వ్యవహరిస్తుందని ఆయన స్పష్టం చేశారు. మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని 'మానవ అక్రమ రవాణా ఓ వ్యవస్థీకృత నేరం-దోపిడీ' అనే పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. డీజీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీపీ ఎన్.మధుసూదనరెడ్డి, ఉమెన్, చైల్డ్ సేఫ్టీ వింగ్ ఏపీఎస్పీ బి.రాజకుమారి, ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఎస్పీ ఎన్.దేవీరావు పాల్గొన్నారు. మానవహక్కుల పరిరక్షణ కోసం ఉమెన్, చైల్డ్ సేఫ్టీ వింగ్‌ను ఏర్పాటు చేసినట్లు ఈ సందర్భంగా డీజీపీ చెప్పారు. మానవ అక్రమ రవాణా నియంత్రణ కోసం 112 టోల్ ఫ్రీ నంబర్, శక్తి యాప్‌లను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు.

రూ. 378 కోట్ల సైబర్ దోపిడీ!



(మొదటి పేజీ తరువాయి)

క్రిప్టో కరెన్సీ ఎక్స్ఛేంజ్ సంస్థ నెబ్లియో టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సర్వర్‌ను హ్యాక్ చేసి.. ఏకంగా రూ.378 కోట్లను వేరే ఖాతాల్లోకి బదిలీ చేసుకున్నారు. నెబ్లియో టెక్నాలజీస్.. దేశంలోనే అతిపెద్ద క్రిప్టో కరెన్సీ ఎక్స్ఛేంజ్ సంస్థ. ఈ సంస్థ పటిష్ఠమైన అంతర్గత భద్రతా చర్యలను పాటిస్తోంది. అయినప్పటికీ.. సైబర్ నేరగాళ్లు ఈ సంస్థ సర్వర్‌లోకి ప్రవేశించి.. భారీ మోసానికి పాల్పడ్డారు. దీనికిగాను సంస్థ పార్ట్‌టైమ్ ఉద్యోగి ల్యాప్‌టాప్‌ను వినియోగించుకున్నట్టు గుర్తించారు. దేశంలోనే అతిపెద్ద సైబర్ మోసంగా దీనిని పేర్కొన్నారు. కాగా, నేరగాళ్లు బదిలీ చేసిన సొమ్ము సంస్థ, భాగస్వాములదేనని, వినియోగదారులకు నష్టం జరగలేదని నెబ్లియో టెక్నాలజీస్ సంస్థ వైస్‌ప్రెసిడెంట్ హర్‌దీప్‌సింగ్ తెలిపారు. దీనిని అసాధారణ మోసంగా పేర్కొన్నారు.

ఏం జరిగింది?

క్రిప్టో సహా బిట్ కాయిన్ ఎక్స్ఛేంజ్ సంస్థ నెబ్లియో టెక్నాలజీస్‌కు దేశంలోనే మంచి పేరుంది. దీనినే 'కాయిన్ డీసీఎక్స్'గా కూడా పిలుస్తారు. ఈ సంస్థ వినియోగించే ప్రత్యేక సాఫ్ట్‌వేర్ సహా రెండంచల భద్రతా వ్యవస్థలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఈ నెల 19న తెల్లవారుజామున 2.37 గంటలకు కంపెనీ వాలెట్ నుంచి ఒక యూనైటెడ్ స్టేట్స్ డాలర్ టెదర్(యూఎస్‌డీటీ) గుర్తు తెలియని వ్యాలెట్‌కు బదిలీ అయింది. ఆ తర్వాత ఉదయం 9.40 గంటలకు సైబర్ నేరగాళ్లు సర్వర్‌లోకి ప్రవేశించి, ఏకంగా 44 మిలియన్ యూఎస్‌డీటీ(రూ.378 కోట్లు) బదిలీ చేశారు. ఈ బదిలీ జరిగిన తర్వాత.. వెబ్-3 ట్రేడింగ్ ఆగిపోయింది. దీంతో ఉలిక్కిపడిన సంస్థ అధికారులు.. అసలేం జరిగిందన్న విషయంపై దృష్టిపెట్టారు. ఈ సంస్థలో పార్ట్‌టైమర్‌గా పని చేస్తున్న ఉద్యోగి రాహుల్ అగర్వాల్ ల్యాప్‌టాప్ నుంచి సైబర్ నేరగాళ్లు కంపెనీ సర్వర్‌ను హ్యాక్ చేశారని గుర్తించారు. అనంతరం.. సంస్థ వైస్‌ప్రెసిడెంట్ హర్‌దీప్‌సింగ్ 22న వైట్‌ఫీల్డ్ సీఈఎన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాను ల్యాప్‌టాప్‌ను మరోచోట వినియోగించానని, దీనికిగాను అక్కడ రూ.15 లక్షలు పొందినట్లు విచారణలో రాహుల్ తెలిపారు. దీంతో అతన్ని అరెస్టు చేశారు. ఈ సొమ్మును ఏయే ఖాతాలకు బదిలీ చేసిందీ తెలుసుకుంటున్నామని బెంగళూరు అదనపు పోలీసు కమిషనర్ రమేశ్ తెలిపారు. నెబ్లియో సంస్థ ఏర్పాటు చేసిన ఫైర్ వాల్స్.. ప్రధాన యాప్ సేవలకు, డేటాబేస్ భద్రతకు మాత్రమే పరిమితం అవుతున్నాయి. దీంతో లిక్విడిటీ బ్రిడ్జ్ లేదా ఏపీఐకి అనుసంధించిన ఆపరేషనల్ వ్యాలెట్‌కు ఫైర్ వాల్స్ భద్రత కల్పించవు.

ఈడీ ముందుకు ప్రకాశ్‌రాజ్

బెట్టింగ్ యాప్స్ కేసులో 5 గంటలు విచారణ

హైదరాబాద్, జూలై 30(ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కేసుకు సంబంధించి సినీ నటుడు ప్రకాశ్‌రాజ్ ఈడీ ముందు తన న్యాయవాదితో కలిసి బుధవారం విచారణకు హాజరయ్యారు. ఆయన్ను అధికారులు దాదాపు 5గంటలు విచారించి వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు. 2016లో ప్రకాశ్‌రాజ్ జంగిల్ రమ్మీ అనే యాప్‌కు ప్రమోషన్ చేసిన నేపథ్యంలో.. అందుకు ఎంత పారితోషికం తీసుకున్నారు? నగదు రూపంలోనా.. ఆన్‌లైన్‌లోనా? అని అధికారులు ప్రశ్నించినట్లు తెలుస్తోంది. విచారణ అనంతరం ప్రకాశ్‌రాజ్ మీడియాతో మాట్లాడుతూ.. జంగిల్ రమ్మీ యాప్ ప్రమోషన్ చేసినందుకు తనకు ఒక్క రూపాయి కూడా రాలేదన్నారు. వారు డబ్బు ఇస్తానని చెప్పినా తాను తీసుకోలేదని పేర్కొన్నారు. జంగిల్ రమ్మీ యాప్ యాజమాన్యానికి తనకు మధ్య ఎలాంటి ఆర్థిక లావాదేవీలు జరగలేదని తెలిపారు. డబ్బు తీసుకోకుండా ప్రమోషన్ ఎందుకు చేశారన్న ప్రశ్నకు సమాధానం దాటవేశారు.

నింగిలోకి నిసార్



(మొదటి పేజీ తరువాయి)

నిలిచింది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం-షార్ నుంచి బుధవారం సాయంత్రం 5:40 గంటలకు నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి దూసుకెళ్లిన జీఎస్ఎల్వీ-ఎఫ్16 రాకెట్.. 18.59 నిమిషాల్లోనే ఉపగ్రహాన్ని నిర్దేశిత సూర్య సమకాలిక కక్ష్యలోకి చేర్చింది. మంగళవారం మధ్యాహ్నం 2:10 గంటలకు ప్రారంభమైన 27:30 గంటల కౌంట్‌డౌన్ పూర్తవగానే రివ్వున ఎగిరిన రాకెట్.. తొలి మూడు దశలనూ సునాయాసంగా పూర్తిచేసుకుంది. ఈ క్రమంలో 747 కిలోమీటర్లు ప్రయాణించిన తర్వాత 2,392 కిలోల బరువున్న ఉపగ్రహాన్ని కక్ష్యలో విడిచిపెట్టింది. ఈ వెంటనే మిషన్ కంట్రోల్ సెంటర్‌లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. అక్కడి నుంచే రాకెట్ గమనాన్ని పర్యవేక్షిస్తున్న ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ జీఎస్ఎల్వీ-ఎఫ్16 ప్రయోగం విజయవంతమైందని ప్రకటించారు. సహచర శాస్త్రవేత్తలను ఆలింగనం చేసుకొని ఆనందం పంచుకున్నారు. ఈ ఏడాది మేలో పీఎస్ఎల్వీ-సీ61 రాకెట్ ప్రయోగం విఫలమైన నేపథ్యంలో.. ఈ విజయం ఇస్రోకు భారీ ఉత్సాహాన్నిచ్చింది. ఇస్రో-నాసా సంయుక్త మిషన్ కావడంతో ఇస్రోతో పాటు అమెరికా నుంచి నాసా శాస్త్రవేత్తలు కూడా షార్‌కు చేరుకుని ప్రయోగాన్ని పరిశీలించారు.

తొలి సిగ్నల్స్ అందాయ్...

విజయవంతంగా కక్ష్యలోకి చేరిన నిసార్ ఉపగ్రహం అక్కడ స్థిరంగా ఉన్నట్లు బెంగళూరులోని హసన్ మాస్టర్ కంట్రోల్ సెంటర్ గ్రౌండ్ స్టేషన్‌కు సిగ్నల్స్ అందాయి. ఇస్రో చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నారాయణన్‌కు ఇది మూడో ప్రయోగం. తొలి రెండు ప్రయోగాలూ విఫలం కావడంతో దీని విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. కాగా, నాసా-ఇస్రో సంయుక్తంగా అభివృద్ధి చేయడంతో దీనికి 'నిసార్' (నాసా-ఇస్రో సింథటిక్ అపార్చర్ రాడార్) అని పేరు పెట్టారు. దీని కోసం రూ.13వేల కోట్లకుపైగా వెచ్చించినట్టు అంచనా.

పల్లీలు తింటూ.. ప్రయోగాన్ని వీక్షిస్తూ..

నిసార్ ప్రయోగ సమయంలో శ్రీహరికోటలోని మిషన్ కంట్రోల్ సెంటర్‌లో నాసా శాస్త్రవేత్తలు పల్లీలు తింటూ కనిపించారు. ప్రయోగాన్ని పరిశీలిస్తున్న సమయంలో వారి చేతుల్లో చిన్న డబ్బాలు కనిపించాయి. రాకెట్ గమనాన్ని వీక్షిస్తున్నంతసేపూ వాళ్లు అందులోని పల్లీలు పంచుకుని తింటూ ఉన్నారు. దీనిపై ఇస్రో పూర్వ ఉద్యోగిని ప్రశ్నించగా.. 'ప్రతి ప్రయోగ సమయంలోనూ వాళ్లు ఇలాగే తింటారు.. ఇది వాళ్ల సెంటిమెంట్' అని చెప్పారు.



మిషన్ కంట్రోల్ సెంటర్‌లో వేరుశనగ పప్పుల డబ్బాతో నాసా శాస్త్రవేత్త

బలపడిన ఇస్రో-నాసా బంధం

'భూపరిశీలన ఉపగ్రహం కోసం ఇస్రో-నాసా మధ్య 2014లో ఒప్పందం కుదిరింది. అప్పట్నుంచి రెండు బృందాలు నిసార్ ఉపగ్రహాన్ని అభివృద్ధి చేశారు. ఇద్దరూ కలిసి చేపడుతున్న తొలి ప్రయోగమే అయినా.. మా మధ్య బంధం మరింత బలపడింది. రాబోయే కాలంలో ఇద్దరం కలిసి మరో మూడు ప్రయోగాలు చేపట్టేందుకు ఒప్పందం చేసుకున్నాం' అని ఇస్రో చైర్మన్ నారాయణన్ అన్నారు. జీఎస్ఎల్వీ-ఎఫ్16 ప్రయోగం విజయానంతరం ఆయన మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి మాట్లాడారు. శాస్త్రవేత్తల సమష్టి కృషితోనే నిసార్ విజయవంతమైందన్నారు. రాబోయే రోజుల్లో చంద్రయాన్-4 ప్రయోగ పనులకు శ్రీకారం చుడుతున్నామన్నారు. ఈ ఏడాది చివరికి గగన్‌యాన్-1 పేరుతో రోబో వ్యోమమిత్రను అంతరిక్షంలోకి పంపే ప్రయోగానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పీఎస్ఎల్వీ సిరీస్‌లో కూడా మరో నాలుగు ప్రయోగాలు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. కాగా, ఇస్రో తమకు చక్కని సహకారం అందించినట్లు నాసా శాస్త్రవేత్తలు తెలిపారు.


ఇస్రోకు సీఎం చంద్రబాబు అభినందనలు

అమరావతి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఇస్రో-నాసా నిసార్ ఉపగ్రహ ప్రయోగం విజయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తంచేశారు. ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. ఈ ప్రయోగం విజయవంతం కావడం తెలుగువారందరికీ గర్వకారణమని అన్నారు. నిసార్ ప్రయోగం విజయంతో అంతరిక్ష రంగంలో భారత్ మరో ముందడుగు వేసినట్లయిందని మంత్రి సత్యకుమార్ తెలిపారు.

నిసార్ విశేషాలు

- ఉమ్మడిగా భూపరిశీలన ఉపగ్రహ మిషన్‌ను ప్రారంభించేందుకు నాసా, ఇస్రో 2014 సెప్టెంబరులో ఒప్పందం చేసుకున్నాయి. నాసా-ఇస్రో మధ్య కుదిరిన తొలి భారీ ఒప్పందమిది.
- భూమిపై పొరల్లో ఒక్క సెంటీమీటరు మార్పులు సంభవించినా గుర్తించేందుకు వీలుగా దీనిలో డబుల్ ఎల్, ఎస్-బ్యాండ్ రాడార్ ఫ్రీక్వెన్సీలను ఉపయోగించారు. ఈ రాడార్లు పగలు, రాత్రి మేఘాలు, పొగ, వర్షం, పొగమంచులోనూ స్పష్టంగా ఫొటోలు తీసి పంపగలవు.
- సైన్స్ డేటా కోసం ఎల్-బ్యాండ్ సింథటిక్ అపార్చర్ రాడార్, జీపీఎస్ రిసీవర్లను నాసా అందించగా.. ఉపగ్రహం, ఎస్-బ్యాండ్ రాడార్, ప్రయోగానికి అవసరమైన జీఎస్ఎల్వీ-ఎఫ్16 రాకెట్‌ను ఇస్రో సమకూర్చింది.
- భూకంపాలు, అగ్నిపర్వతాల పేలుళ్లు, కొండచరియలు, పర్వత ప్రాంతాల్లో మంచు చరియలు విరిగిపడే పరిస్థితులను ముందే గుర్తిస్తుంది.
- నిసార్ భూమిపై, సముద్రాల్లో మంచు పరిస్థితి ఎలా ఉంది.. ఎంత మందంలో ఉంది? ఆ మంచు కరిగి నీరుగా మారే అవకాశాలను కచ్చితత్వంతో గుర్తిస్తుంది. భూమిని, మంచును 3డీలో చూపిస్తుంది. ఇది 12 రోజుల వ్యవధిలో భూమి మొత్తాన్నీ స్కాన్ చేస్తుంది.
- అడవులు, పంటల విస్తీర్ణం, పచ్చదనంలో తేడాలు, నేల తేమ, నీటి వనరులు, తేడాలను గుర్తిస్తుంది.
- నిసార్ డేటాతో ప్రభుత్వాలు ప్రకృతి విపత్తులు, ప్రమాదాలను అంచనావేసి తగుజాగ్రత్తలు తీసుకోవచ్చు.
- జీఎస్ఎల్వీ-ఎఫ్16 ద్వారా ఇస్రో సూర్య సమకాలిక కక్ష్యలోకి ఒక ఉపగ్రహాన్ని ప్రయోగించడం ఇదే తొలిసారి. శ్రీహరికోట నుంచి ఇస్రోకు ఇది 102వ ప్రయోగం.

రష్యాలో 8.8 తీవ్రతతో భారీ భూకంపం



- ఊగిపోయిన కమ్చాట్కా ద్వీపకల్పం..
- పసిఫిక్ తీర దేశాలకు సునామీ అలర్ట్
- ముందు జాగ్రత్తతో తప్పిన ప్రాణనష్టం



'క్ల్యుచెవ్‌స్కోయ్' అగ్నిపర్వతం

టోక్యో, జూలై 30: రష్యా తూర్పు కొసన ఉన్న కమ్చాట్కా ద్వీపకల్పం సమీపంలో సముద్రంలో భారీ భూకంపం వచ్చింది. స్థానిక కాలమానం ప్రకారం బుధవారం ఉదయం 7 గంటల సమయంలో ఏకంగా 8.8 మ్యాగ్నిట్యూడ్‌తో భూకంపం వచ్చింది. దీనితో కమ్చాట్కా ద్వీపకల్పం ఊగిపోయింది. చుట్టూ వందల కిలోమీటర్ల దూరంలోని ప్రాంతాలకూ ఈ ప్రకంపనలు విస్తరించాయి. దీనికితోడు 6, 7 తీవ్రతతో వచ్చిన మరికొన్ని ప్రకంపనలు.. పసిఫిక్ తీర ప్రాంత దేశాల్లో సునామీ భయాన్ని రేకెత్తించాయి. 20 ఏళ్ల కింద హిందూ మహా సముద్రంలో, 14 ఏళ్ల కింద జపాన్ సమీపంలో భూకంపాలతో వచ్చిన భారీ సునామీల వంటివి రావొచ్చనే కలకలం చెలరేగింది. దీనితో భూకంప ప్రాంతానికి సమీపంలోని దేశాలు.. ప్రజలను తీర ప్రాంతాల నుంచి దూరంగా తరలించాయి. కానీ రష్యా తూర్పు తీరంలో నాలుగు మీటర్ల ఎత్తున, జపాన్, అమెరికాలోని హవాయ్, అలాస్కా, పశ్చిమ తీర ప్రాంతాల్లో, ఫిలిప్పీన్స్‌లలో మీటరు ఎత్తున చిన్నపాటి సునామీ అలలు మాత్రమే వచ్చాయి. సముద్ర తీరంలోని నిర్మాణాలు స్వల్పంగా దెబ్బతినడం, బోట్లు కొట్టుకుపోవడం వంటి నష్టం జరిగింది. దీనితో సునామీ హెచ్చరికలను వెనక్కి తీసుకున్నారు. తీర ప్రాంతాల్లో ముందస్తుగా హెచ్చరికలు జారీ చేయడంతో ఎక్కడా ప్రాణనష్టం జరగలేదు. రష్యా, జపాన్ మాత్రం పదుల సంఖ్యలో జనం గాయపడినట్టు ప్రకటించాయి. అయితే మళ్లీ భూకంపం వచ్చే అవకాశం ఉందన్న నిపుణుల హెచ్చరికల నేపథ్యంలో.. పసిఫిక్ తీర ప్రాంత దేశాలు అప్రమత్తంగా ఉండాలన్న సూచనలు వెలువడ్డాయి. మరోవైపు రష్యాలో ప్రస్తుత భూకంప ప్రాంతానికి సుమారు 400 కిలోమీటర్ల దూరంలో ఉన్న 'క్ల్యుచెవ్‌స్కోయ్' అగ్నిపర్వతం బుధవారం సాయంత్రం బద్దలైంది. ఈ అగ్నిపర్వతం భారీ పేలుళ్లతో లావాను వెదజల్లుతోందని రష్యా భూతత్వ పరిశోధన సంస్థ ప్రకటించింది. ఇక రష్యాలో భారీ భూకంపం వచ్చిన కొన్ని గంటల్లోనే టిబెట్‌లో హిమాలయ పర్వతాలకు సమీపంలో 4.3 తీవ్రతతో భూకంపం వచ్చింది.

అంత భారీ భూకంపం అయినా..

2011 మార్చిలో జపాన్‌ను వణికించిన, ఫుకుషిమా అణు విద్యుత్ ప్లాంట్ ప్రమాదానికి గురైన భూకంపం (9.1 తీవ్రత) తర్వాత.. ప్రస్తుతం కమ్చాట్కా ద్వీపకల్పంలో వచ్చిన భూకంపమే అతి పెద్దది కావడం గమనార్హం. అంతకు ముందు 1960లో చిలీలోని బయోబియెలోట 9.5 తీవ్రతతో, 1964లో అమెరికాలోని అలాస్కాలో 9.2 తీవ్రతతో భూకంపాలు వచ్చాయి. 2004లో ఇండోనేషియా సమీపంలో హిందూ మహా సముద్రంలో 9.1 తీవ్రతతో వచ్చిన భూకంపం.. అతి భారీ సునామీకి కారణమై, భారత్ సహా దక్షిణ, ఆగ్నేయాసియా దేశాల్లో రెండున్నర లక్షల మంది మృతికి కారణమైంది. కాగా తాజాగా రష్యాలో వచ్చిన భూకంపం జపాన్ మంగా ఆర్టిస్ట్ రియో టట్సుకి కాలజ్ఞానాన్ని మళ్లీ తెరపైకి తెచ్చింది. జూలై 5న జపాన్‌లో భారీ భూకంపం వస్తుందని రియో టట్సుకి గతంలో పేర్కొన్న నేపథ్యంలో తీవ్రకలకలం చెలరేగింది. ఆమె చెప్పిన భూకంపం ఇదేననే వాదనలు వినిపిస్తున్నాయి.



టెమాసెక్ హోల్డింగ్స్ ప్రతినిధి దినేశ్ ఖన్నాతో భేటీ అయిన ముఖ్యమంత్రి చంద్రబాబు



క్యాపిటాల్యాండ్ ఇన్వెస్ట్‌మెంట్ (ఇండియా) ప్రతినిధి సంజీవ్ దాస్ గుప్తాతో సమావేశమైన సీఎం చంద్రబాబు


ఎస్ఎంబీసీ మేనేజింగ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాజీవ్ కన్నన్‌తో సమావేశమైన చంద్రబాబు, మంత్రులు నారాయణ, టీజీ భరత్

అపార వనరులున్నాయ్.. పెట్టుబడులతో

ఏపీకి రండి

(మొదటి పేజీ తరువాయి)

వర్తక, వాణిజ్య, పరిశ్రమల ఏర్పాటు అవకాశాలు, అందుబాటులో ఉన్న వనరుల గురించి వివరించారు. ప్రాంతాల వారీగా పారిశ్రామిక, వాణిజ్య ప్రణాళికలను సిద్ధం చేశామన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్రంలో అభివృద్ధికి అనువైన వనరుల గురించి వివరించారు. కీలక కంపెనీలైన క్యాపిటాల్యాండ్ ఇన్వెస్ట్‌మెంట్ (ఇండియా), మండాయ్ వైల్డ్ లైఫ్ గ్రూప్, సుమితోమో మిత్సుయ్ బ్యాంకింగ్ కార్పొరేషన్, టెమసెక్ హోల్డింగ్స్ వంటి సంస్థల ప్రతినిధులతో సీఎం వేర్వేరుగా ముఖాముఖి చర్చలు జరిపారు. రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు, ఇండస్ట్రియల్ పార్కులు , డేటా సెంటర్లు, గ్రీన్ బిల్డింగ్స్, డిజిటల్ టౌన్‌షిప్స్ వంటి అంశాలపై క్యాపిటాల్యాండ్ ప్రతినిధులు సంజీవ్ దాస్‌గుప్తా, గౌరీశంకర్ నాగభూషణంతో చర్చించారు. అమరావతి, విశాఖ, తిరుపతి వంటి నగరాల్లో ఐటీ పార్కులు, ప్లగ్ అండ్ ప్లే సదుపాయాలతో కూడిన వర్క్ స్టేషన్ల ఏర్పాటుకు అవకాశం ఉందని వారికి సీఎం తెలిపారు. పోర్టులు, ఎయిర్‌పోర్టుల ద్వారా అభివృద్ధికి రూపొందించుకున్న ప్రణాళికలనూ వారితో పంచుకున్నారు. హైదరాబాద్-బెంగళూరు-అమరావతి-చెన్నై మధ్య ఎయిర్‌పోర్టు ఎకనామిక్ కారిడార్ గురించి కూడా చర్చించారు. హైదరాబాద్ నగరంలో ఉన్న మొత్తం ఐటీ పార్కుల్లో తాము 30-35 శాతం పెట్టుబడులు పెట్టామని క్యాపిటాల్యాండ్ ప్రతినిధులు చంద్రబాబుకు తెలిపారు. రియల్ ఎస్టేట్,పారిశ్రామిక రంగాల్లో పెట్టుబడులకు ఆసక్తి కనబరిచారు.

ఎంఎస్ఎంఈలు.. ఏపీఐఐసీ జాయింట్ వెంచర్లు

పెట్టుబడుల రంగంలో దిగ్గజ కంపెనీగా ఉన్న టెమాసెక్ హోల్డింగ్స్‌కు చెందిన పోర్ట్‌ఫోలియో డెవలప్‌మెంట్, కార్పొరేట్ స్ట్రాటజీ విభాగం జాయింట్ హెడ్ దినేశ్ ఖన్నాతో చంద్రబాబు కీలక చర్చలు జరిపారు. ఎంఎస్ఎంఈల అభివృద్ధికి ఆ సంస్థ సహకారాన్ని కోరారు. ఈ రంగంలో భాగస్వామ్యానికి, ఏపీఐఐసీతో జాయింట్ వెంచర్లకు టెమాసెక్ ఆసక్తి చూపింది. సమావేశంలో మంత్రులు నారాయణ, టీజీ భరత్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మండాయ్ సీఈవోతో సీఎం చర్చలు

మండాయ్ వైల్డ్ లైఫ్ గ్రూప్ సంస్థ సీఈవో మైక్ బార్క్‌లేతో జరిగిన సమావేశంలో వైల్డ్ లైఫ్ పార్కులు, ఎకో టూరిజం, బయోడైవర్సిటీ కాంప్లెక్సులు, వైల్డ్ లైఫ్ ఎక్స్‌పీరియన్స్ జోన్ల ఏర్పాటు వంటి అంశాలపై చంద్రబాబు చర్చించారు. విశాఖ, తిరుపతి వంటి ప్రాంతాల్లో ఎకో టూరిజం రంగాల్లో భాగస్వామ్యంతో వెళ్తే చక్కటి అవకాశాలు ఉంటాయని సీఎం తెలిపారు. సింగపూర్ గార్డెన్ సిటీ , జూపార్కు మోడళ్లను ఏపీలోనూ స్థాపించే అవకాశాలపై చర్చించారు. విశాఖలో డాల్ఫిన్ సిటీ, అమరావతిలో బొటానికల్ గార్డెన్ ఏర్పాటు చేయాలని సీఎం కోరగా.. ఆ సంస్థ సుముఖత వ్యక్తం చేసింది.

డ్రోన్, డిఫెన్స్ పరిశ్రమలకు చేయూత

మౌలిక వసతులు, గ్రీన్ ఎనర్జీ, నగరాభివృద్ధి రంగాల్లో పెట్టుబడులపై జపాన్‌కు చెందిన సుమితోమో మిత్సుయ్ బ్యాంకింగ్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాజీవ్ కన్నన్‌తో సీఎం సమావేశమయ్యారు. లేపాక్షి, ఒర్వకల్లు ప్రాంతాల్లో ఏర్పాటు చేయబోతున్న డ్రోన్ సిటీ, రక్షణ, సివిల్ ఏరోస్పేస్ కారిడార్ ప్రాజెక్టులకు అవసరమైన ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఇన్‌ఫ్రా, క్లీన్ ఎనర్జీ రంగాల్లో పెట్టుబడుల అవకాశాలు పరిశీలిస్తామని కన్నన్ చెప్పారు.

సీఎంకు ఘనంగా వీడ్కోలు

సింగపూర్ పర్యటన ముగించుకుని చంద్రబాబు బుధవారం రాష్ట్రానికి తిరుగుప్రయాణమయ్యారు. ఆయనకు సింగపూర్‌లోని తెలుగువారు ఘనంగా వీడ్కోలు పలికారు. 'జై సీబీఎన్' అని నినాదాలు చేశారు. ఇక్కడి ప్రజల ఆదారాభిమానాలు మరువలేనివని సీఎం అన్నారు.


మైక్రోసాఫ్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను సందర్శించిన మంత్రి లోకేశ్

ఏపీలో 'ఎక్స్‌పీరియన్స్ జోన్'

స్థాపించండి

క్వాంటం వ్యాలీలో హ్యాకథాన్ నిర్వహించండి

- మైక్రోసాఫ్ట్ ప్రతినిధులకు మంత్రి లోకేశ్ ఆహ్వానం
- సింగపూర్‌లోని ఆ సంస్థ కార్యాలయం సందర్శన

అమరావతి, జూలై 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మైక్రోసాఫ్ట్ ఎక్స్‌పీరియన్స్ జోన్‌ను ఏర్పాటు చేయాలని ఆ సంస్థ ప్రతినిధులను మంత్రి లోకేశ్ ఆహ్వానించారు. సింగపూర్ పర్యటనలో భాగంగా మైక్రోసాఫ్ట్ కార్యాలయాన్ని లోకేశ్ బృందం బుధవారం సందర్శించింది. అక్కడ ఏఐ ఆధారిత గోస్టోర్‌లో ఆరోగ్య సంరక్షణ, ఆర్థిక సేవలు, తయారీ, వినియోగదారుల పరిశ్రమల వంటి రంగాల్లో ఏఐ వాడకాన్ని పరిశీలించింది. ఈ సందర్భంగా మైక్రోసాఫ్ట్ ఎక్స్‌పీరియన్స్ ప్రత్యేకతలను సంస్థ ప్రతినిధులు వివరించారు. రిటైల్, విద్య తదితర రంగాల్లో వ్యాపారులు, వినియోగదారులు, పరిశీలకులకు మద్దతును అందించేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏఐ ఆధారిత సేవల ద్వారా వినియోగదారులకు సేవలు అందిస్తున్నామన్నారు. కృత్రిమ మేధతో కూడిన వ్యాపార లావాదేవీలకు సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం మైక్రోసాఫ్ట్ గవర్నమెంట్ అఫైర్స్ హెడ్ మార్కస్ లోహ్, సెలా హెడ్ జాస్మిన్ బేగం, సీఈవో మార్క్ సౌజాలతో లోకేశ్ సమావేశమయ్యారు. జనరేటివ్ ఏఐ ఆధారిత పరిష్కారాలు కనుగొని సమన్వయం చేయడానికి రాష్ట్రంలో మైక్రోసాఫ్ట్ ఎక్స్‌పీరియన్స్ జోన్/ టెక్నాలజీ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని వారిని మంత్రి ఆహ్వానించారు. భారతదేశంలో అతిపెద్ద నైపుణ్యం కలిగిన ఐటీ నిపుణుల సమూహాల్లో ఏపీ ఒకటని తెలిపారు. క్వాంటం వ్యాలీ టెక్ పార్క్‌లో అజూర్ ఓపెన్ ఏఐ సేవలు, మైక్రోసాఫ్ట్ కోపైలట్‌ను ఉపయోగించి హ్యాకథాన్ నిర్వహించాలని కోరారు. ఇన్ఫినియన్ సెమీ కండక్టర్ల తయారీ యూనిట్‌ను మంత్రి లోకేశ్ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా సంస్థ ఎండీ సీఎస్ దువాతో మంత్రి చర్చలు జరిపారు. ఏపీలో ఈఎంసీలు, పారిశ్రామిక పార్కుల్లో సెమీ కండక్టర్ల తయారీకి అనుబంధంగా ప్యాకేజింగ్, టెస్టింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

ఐవీపీ సెమీ ఫౌండర్ రాజా మాణిక్కంతో భేటీ

ఐవీపీ సెమీ ఫౌండర్ రాజా మాణిక్కంతో లోకేశ్ బృందం భేటీ అయింది. రాష్ట్రంలో సెమీ కండక్టర్ల తయారీ యూనిట్ లేదా చిప్ డిజైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, ప్రోత్సాహకాలను అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కాగా, డీటీడీఎస్ నైపుణ్యాన్ని ఉపయోగించి పరికరాల త యారీకి ఎంఎస్ఎంఈలకు సహకరించాలని ఆసంస్థ సీఈ వో చక్రవర్తిని లోకేశ్ కోరారు. క్యాపిల్యాండ్ ఇన్వెస్ట్‌మెంట్ సీఈవో సంజీవ్‌దాస్ గుప్తతోనూ లోకేశ్ భేటీ అయ్యారు. విశాఖలో డేటా సెంటర్ల ఏర్పాటుకు సహకారించాలన్నారు. రాష్ట్రంలో గ్లోబల్ కేపబులిటీ సెంటర్‌ని ఏర్పాటు చేయాలని ఏబీమ్ కన్సల్టింగ్ సంస్థ ఎండీ యూనో టోమోకాజును కోరారు.

రెవెన్యూ అధికారులపై

సర్కారు కొరడా

- పల్నాడులో 20 మందిపై తీవ్ర అభియోగాలు
- నగరి, కలసపాడు మండల అధికారులపై విచారణ
- భూకబ్జా, వెబ్‌ల్యాండ్ తప్పులపై తీవ్ర ఆగ్రహం

అమరావతి, జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు కబ్జాకు గురైనా కన్నెత్తిచూడని, కీలకమైన 'వెబ్‌ల్యాండ్'లో తప్పుడు ఎంట్రీలకు పాల్పడిన అధికారులపై ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. ముఖ్యంగా పల్నాడుజిల్లా మాచర్ల, వెల్దుర్తి మండలాల్లో పనిచేస్తున్న రెవెన్యూ అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. అదేవిధంగా నగరి తహసీల్దార్లపైనా చర్యలకు ఆదేశించింది. ఈ మేరకు రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. జయలక్ష్మి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా నగరి మండలంలో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములను ఓ వ్యక్తి కబ్జా చేసినా తహసీల్దార్లు చర్యలు తీసుకోలేదు. వీరితోపాటు ఇతర అధికారులపైనా విచారణ చేపట్టాలని జయలక్ష్మి ఆదేశించారు. నగరి ఆర్డీవోను విచారణాధికారిగా నియమించారు. నగరిలో గతంలో తహసీల్దార్లుగా పనిచేసిన కె. వెంకటరమణ, కె. బాబు, గ్రామ రెవెన్యూ అధికారులు సదాశివ పిళ్లై, దేవదాసు తదితరులపై శాఖాపరమైన విచారణ చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటికే వారిపై అభియోగాలు నమోదు అయ్యాయని.. వాటికి అనుగుణంగా విచారణ చేపట్టాలని జయలక్ష్మి పేర్కొన్నారు.

- నగరి మండలంలోని ఎస్.ఆర్. కుప్పం గ్రామంలో విలువైన ప్రభుత్వ భూమిని ఓ వ్యక్తి ఆక్రమించుకున్నారు. ఈ విషయంలో లోకాయుక్తకు ఫిర్యాదు చేరింది. అయితే, లోకాయుక్తను తప్పుదోవ పట్టించేలా రెవెన్యూ అధికారులు తప్పుడు నివేదికలు ఇచ్చారు. దీంతో సదరు అధికారులపై అభియోగాలు నమోదయ్యాయి.
- కడప జిల్లా కలసపాడు మండలంలో గతంలో తహసీల్దార్‌గా పనిచేసిన ఎం. మోహన్‌రావుతో పాటు మరికొందరు అధికారులపై కూడా శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో అడ్డగోలు ఎంట్రీలు చేశారన్న అభియోగాలపై విచారణ చేపట్టాలని బద్వేలు ఆర్డీఓను జయలక్ష్మి ఆదేశించారు.
- పల్నాడు జిల్లా మాచర్ల, వెల్దుర్తి తదితర మండలాల రెవెన్యూ అధికారులపై మూకుమ్మడిగా శాఖాపరమైన చర్యలకు ఆదేశించారు. గతంలో ఈ మండల కార్యాలయాల పరిధిలో అవినీతి నిరోధక శాఖ ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. ఆ సమయంలో అధికారుల వద్ద లెక్క చూపని డబ్బు దొరికింది. నిబంధనల ప్రకారం నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించాల్సిన 'మీ సేవ' దరఖాస్తులను గడువు దాటిన తర్వాత కూడా పెండింగ్‌లో ఉంచారు. ఇలా ఎందుకు పెండింగ్‌లో ఉంచారన్న దానికి రెవెన్యూ అధికారులు ఏసీబీకి అర్థంలేని కారణాలు చెప్పారు.
- ఈ నేపథ్యంలో ఒకేసారి మాచర్ల, వెల్దుర్తి మండలాలకు సంబంధించి ఒకేసారి 20 మంది అధికారులపై అభియోగాలు నమోదు చేశారు. వీరిపై చర్యలు తీసుకోనున్నారు.

మహిళా నేతలకు ప్రజాజీవితం శిక్ష కాకూడదు

- వారి ఆత్మగౌరవాన్ని రక్షించేందుకు చట్టం తేవాలి: శబరి
- లోక్‌సభ దృష్టికి వైసీపీ నేతల అభ్యంతరకర వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రజాజీవితంలో ఉండే మహిళల పట్ల అసభ్య వ్యాఖ్యలను అరికట్టేందుకు, వారి ఆత్మగౌరవాన్ని రక్షించేందుకు ఒక చట్టాన్ని తీసుకురావాలని టీడీపీ ఎంపీ బైరెడ్డి శబరి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళా నేతల పట్ల అసభ్య వ్యాఖ్యలను ఇకపై సహించబోమని, మహిళలకు న్యాయం త్వరగా అందించేందుకు పార్లమెంటులో ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టి చట్టాన్ని తీసుకురావాలని కోరారు. లోక్‌సభలో బుధవారం ఆమె మాట్లాడుతూ ఏపీలో టీడీపీ మహిళా నేతల గౌరవానికి భంగం కలిగించేలా వైసీపీ నేతలు అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. ప్రజాజీవితం మహిళలకు ఎప్పుడూ శిక్ష కాకూడదన్నారు. అసభ్య పదజాలంతో మహిళలను కించపరచడం లైంగిక దాడితో సమానమన్నారు.మరోవైపు తన నంద్యాల నియోజకవర్గంలో రైల్వే సమస్యలను పరిష్కరించాలని రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్‌కు శబరి విజ్ఞప్తి చేశారు.

ఐటీ సెజ్‌లలో ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు

- కేంద్రానికి కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ)ని అభివృద్ధి చేసే లక్ష్యంతో దేశవ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక ఆర్థిక మండళ్ల(సెజ్)లో ఐటీ ఉద్యోగులకు ప్రత్యేకంగా నివాస గృహాల కోసం స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ కేంద్రప్రభుత్వాన్ని కోరారు. బుధవారం లోక్ సభలో ఆయన ఈ అంశాన్ని లేవనెత్తారు. ఐటీ క్లస్టర్లలో పనిచేసే లక్షలాది మందికి నివాస సమస్య ఎదురవుతోందని తెలిపారు. ఐటీ, ఐటీఈఎస్ సెజ్‌లలో సమీపంలో నివాస గృహాల నిర్మాణానికి స్పష్టమైన జాతీయ మార్గదర్శకాలు జారీ చేయాలని కోరారు.

దుర్మార్గులకు పరామర్శా..?: సోమిరెడ్డి

నెల్లూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): దుర్మార్గులను పరామర్శించడానికి జగన్ నెల్లూరుకు వస్తుండడం ఆయన నైజానికి నిదర్శనమని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం నెల్లూరులోని తన కార్యాలయంలో సోమిరెడ్డి మాట్లాడారు. అరాచకాలు చేసిన కాకాణి గోవర్ధన్‌రెడ్డిని, ఓ మహిళా ఎమ్మెల్యే గురించి నీచంగా మాట్లాడిన నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వంటి వైసీపీ నేతల్ని పరామర్శించడానికి జగన్ నెల్లూరు రావడాన్ని ఆయన తప్పు పట్టారు. 'నేతల అరాచకాలు, దుర్మార్గాలను భరించలేక నెల్లూరు జిల్లాలో పదికి పది స్థానాల్లో వైసీపీని ప్రజలు మట్టికరిపించాక జగన్‌రెడ్డి ఏ ముఖం పెట్టుకొని ఇక్కడకు వస్తున్నారు? లిక్కర్ స్కామ్‌లో ఇప్పటి వరకూ 12 మంది అరెస్టు అయ్యారు. జగన్ ధనదాహానికి వీరంతా జైలుకు వెళ్లారు. ఆ కుటుంబ సభ్యులకు సమాధానం చెప్పలేకనే జగన్ లిక్కర్‌స్కామ్ నిందితులను పరామర్శించేందుకు వెళ్లడం లేదు. చంద్రబాబుతో పాటు నా తల్లిదండ్రుల గురించి కూడా కాకాణి నీచంగా మాట్లాడారు. వైసీపీ హయాంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిపై అక్రమ మైనింగ్ కేసు పెట్టారు. అందుకు కాకాణి ధనదాహమే కారణం. నాడు ఇన్ని పాపాలు చేసి.. నేడు పరామర్శల పేరుతో రాజకీయాలు చేయాలని చూడడం సిగ్గుచేటు' అని సోమిరెడ్డి విమర్శించారు.

లిక్కర్ స్కాంలో ఎంత పెద్దవారున్నా చర్యలు తప్పవు

- సిట్ విచారణ నిష్పక్షపాతంగా జరుగుతోంది: మంత్రి కొలుసు

కళ్యాణదుర్గం, జూలై 30(ఆంధ్రజ్యోతి): 'లిక్కర్ స్కాంలో చట్టం తన పని తాను చేసుకుని వెళుతుంది. ఇందులో ఎంత పెద్దవారున్నా చర్యలు తప్పవు' అని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలోని చాపిరి గ్రామంలో బుధవారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు'లో ఆయన పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుతో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. అనంతరం రచ్చబండ వద్ద ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. 'కూటమి ప్రభుత్వంలో ఎవరిపైనా కక్ష సాధింపు చర్యలు ఉండవు. రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజలకు నష్టం కలిగించిన ఎవరైనా జైలుకు వెళ్లక తప్పదు. లిక్కర్ కేసులో ఎంతపెద్ద నాయకులున్నా, చర్యలు ఉంటాయి. సిట్ విచారణ నిష్పక్షపాతంగా జరుగుతోంది. సీఎం చంద్రబాబు నిరంతరం రాష్ట్ర అభివృద్ధికి పాటు పడుతున్నారు.' అని మంత్రి కొలుసు అన్నారు.

రహదారుల అభివృద్ధి


పనులను చేపట్టండి

- కేంద్ర మంత్రి గడ్కరీకి మంత్రి సత్యకుమార్, ఎంపీ కేశినేని వినతి
- 2న రాష్ట్రానికి రానున్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ, జూలై 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ జిల్లాల్లోని రహదారుల అభివృద్ధి పనులు చేపట్టాలని కేంద్ర రోడ్డు, రవాణా మంత్రి నితిన్ గడ్కరీకి విజ్ఞప్తి చేశారు. బుధవారం పార్లమెంటులో కేంద్ర మంత్రి కార్యాలయంలో ఆయనతో మంత్రి సత్యకుమార్, ఎంపీ కేశినేని చిన్ని భేటీ అయ్యారు. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన వివిధ రహదారుల విస్తరణ, కొత్త రహదారుల నిర్మాణాన్ని చేపట్టాలని కోరుతూ వారు వినతిపత్రాలు అందించారు. కాగా, ఏపీలో రూ.9,500 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన, ప్రారంభోత్సవాల కోసం ఆగస్టు 2న కేంద్ర మంత్రి గడ్కరీ రాష్ట్రానికి వస్తున్నారని మంత్రి సత్యకుమార్ తెలిపారు.

గడ్కరీని కలిసిన టీడీపీ ఎంపీలు

ఏపీలో ప్రాంతీయ అనుసంధానాన్ని పెంచడానికి ముఖ్య జాతీయ రహదారి, పట్టణ రవాణా ప్రాజెక్టులకు కేంద్రం సహకారం అందించాలని మంత్రి నితిన్ గడ్కరీకి టీడీపీ ఎంపీలు విన్నవించారు. బుధవారం పార్లమెంటులో కేంద్రమంత్రితో ఆయన కార్యాలయంలో టీడీపీ ఎంపీలు భేటీ అయ్యారు. ఎన్‌హెచ్-65 (కానూరు-మచిలీపట్నం వరకు) విస్తరణ పనులు చేపట్టాలని, ఎన్‌హెచ్-65లో హైదరాబాద్ నుంచి అమరావతికి నిరంతరాయ రాకపోకల కోసం సదుపాయాలు కల్పించాలని, విశాఖపట్నం, విజయవాడలో డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్లు నిర్మించాలని ఎంపీలు కోరారు. ఈ భేటీలో కేంద్ర మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు, లావు శ్రీకృష్ణదేవరాయలు, తెన్నేటి కృష్ణప్రసాద్, కలిశెట్టి అప్పలనాయుడు, జనసేన ఎంపీ తంగెళ్ల ఉదయ్ ఉన్నారు.


కేంద్ర మంత్రి గడ్కరీకి వినతి పత్రం అందజేస్తున్న టీడీపీ ఎంపీలు

సాగునీటి ప్రతిపాదనల అమలుకు సహకరించండి

కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు టీడీపీ ఎంపీల వినతి


ఏపీ ప్రభుత్వం సమర్పించిన జల, సాగు నీటి సంబంధిత ప్రతిపాదనల అమలుకు సహకారం అందించాలని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు టీడీపీ ఎంపీలు విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు నేతృత్వంలో టీడీపీ ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయులు, కలిశెట్టి అప్పలనాయుడు, సానా సతీశ్... బుధవారం సీఆర్ పాటిల్‌తో భేటీ అయ్యారు. ఇటీవల కేంద్రం పునరుద్ధరించిన జల్ జీవన్ మిషన్‌ను రాష్ట్రంలో అమలు చేసేందుకు సహకారం అందించాలని కోరారు. పీఎంకేఎస్‌వైలోని 'హర్ ఖేత్ కో పానీ' కింద ఉపరితల చిన్న నీటిపారుదల పథకంలో ఏపీని చేర్చాలని కోరారు.

> "రాష్ట్ర అభివృద్ధి ప్రారంభ దశలో ఉంది. ఈ నేపథ్యంలో భూమిని ఎంత రేటుకు ఇస్తున్నారనేది చూడకూడదు. టీసీఎస్ లాంటి సంస్థ రాష్ట్రానికి రావడం వల్ల జరిగే ప్రయోజనాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలి. ఐటీ వృద్ధి కారణంగా హైదరాబాద్, బెంగళూరు నగరాలు ఎలా ఉన్నాయో చూస్తున్నాం కదా!."
>
> - ఏపీ హైకోర్టు

ప్రోత్సాహకాలిస్తే తప్పేంటి?

(మొదటి పేజీ తరువాయి)

ఇస్తున్నారనేది చూడకూడదని, టీసీఎస్ రాష్ట్రానికి రావడం వల్ల జరిగే ప్రయోజనాన్ని పరిగణనలోకి తీసుకోవాలని అభిప్రాయపడింది. ఐటీ వృద్ధి కారణంగా హైదరాబాద్, బెంగళూరు నగరాలు ఏ స్థితిలో ఉన్నాయో గమనిస్తున్నాం కదా అని వ్యాఖ్యానించింది. విశాఖలో టీసీఎస్‌కు నామమాత్రపు ధరకు భూకేటాయింపులు చేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిల్ విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. టీసీఎస్ సంస్థకు లీజు పద్ధతిలోనే భూమిని కేటాయిస్తున్నామని, సేల్ డీడ్ ద్వారా విక్రయిస్తున్నామన్న వాదనలో వాస్తవం లేదన్న ఎస్‌జీపీ వాదనను నమోదు చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ దశలో ఎలాంటి ఉత్తర్వులు అవసరం లేదంటూ విచారణను వాయిదా వేసింది. అయితే భూ కేటాయింపు ప్రక్రియ తామిచ్చే తుదితీర్పుకి లోబడి ఉంటుందని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. విశాఖపట్నంలో టీసీఎస్‌కు 21.16 ఎకరాలను రూ0.99 పైసలకే కేటాయిస్తూ రాష్ట్రప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్ 21న జీవో జారీచేసింది. దీన్ని సవాల్ చేస్తూ సొసైటీ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ ప్రాపర్టీ అండ్ ఎన్విరాన్‌మెంటల్ రైట్స్ (ఎస్‌పీసీపీఈఆర్) అధ్యక్షుడు నక్కా నమ్మి గ్రేస్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా, పిటిషనర్ తరఫున న్యాయవాది జడ శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపించారు. విశాఖ నడిబొడ్డున రూ.529 కోట్లు విలువ చేస్తే స్థలాన్ని టీసీఎస్‌కు చౌక రేటుకు సేల్ డీడ్ ద్వారా విక్రయించేందుకు ప్రయత్నిస్తుందని వాదించారు. ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్. ప్రణతి వాదనలు వినిపించారు. నిబంధనలకు లోబడి టీసీఎస్‌కు లీజు పద్ధతిలోనే భూమిని కేటాయిస్తున్నామన్నారు. భూకేటాయింపునకు బదులుగా ఆ సంస్థ రూ.1,370కోట్ల పెట్టుబడి పెట్టి, 12వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తుందని తెలిపారు. భూమిని టీసీఎస్‌కు విక్రయిస్తున్నామన్న పిటిషనర్ ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. పూర్తివివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని పేర్కొన్నారు.





ఏజీ దమ్మాలపాటి కుమార్తె మానస, సిద్ధార్థ నిశ్చితార్థ వేడుకలో ఆంధ్రజ్యోతి, ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ, ఆంధ్రజ్యోతి డైరెక్టర్ వేమూరి ఆదిత్య, వైస్ ప్రెసిడెంట్ శృతికీర్తి, ఏబీఎన్-ఆంధ్రజ్యోతి డైరెక్టర్లు భానుప్రకాశ్, అనూష, మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ దంపతులు.

హైదరాబాద్‌లో ఘనంగా ఏజీ దమ్మాలపాటి కుమార్తె నిశ్చితార్థం

కాబోయే జంటను ఆశీర్వదించిన భువనేశ్వరి, బ్రాహ్మణి

మాజీ సీజేఐ రమణ, 'ఆంధ్రజ్యోతి' ఎండీ రాధాకృష్ణ కూడా..

రాయదుర్గం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అడ్వకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్, నాగరాణి దంపతుల కుమార్తె మానస.. ఆర్ఎస్ కన్‌స్ట్రక్షన్ అధినేత శ్రీనివాస్, రాగిణిల కుమారుడు సిద్ధార్థల వివాహ నిశ్చితార్థం బుధవారం సాయంత్రం హైదరాబాద్ నానక్‌రాంగూడలో ఘనంగా జరిగింది. ఏపీ సీఎం చంద్రబాబు సతీమణి భువనేశ్వరి, మంత్రి లోకేశ్ భార్య బ్రాహ్మణి, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, 'ఆంధ్రజ్యోతి' ఎండీ వేమూరి రాధాకృష్ణ, ఆయన కుటుంబ సభ్యులు, పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఇతర ప్రముఖులు హాజరై.. కాబోయే జంటను ఆశీర్వదించారు.


నిశ్చితార్థ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి భువనేశ్వరి, ఐటీ, విద్యాశాఖల మంత్రి లోకేశ్ భార్య బ్రాహ్మణి..

వాదనలు ఇవాళ వినిపించాల్సిందే!

▸ లేదంటే వేరే మార్గాలు చూసుకోండి

▸ సీఐడీ మాజీ చీఫ్ సంజయ్ తరఫు న్యాయవాదులకు సుప్రీం స్పష్టీకరణ



న్యూఢిల్లీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఏపీ సీఐడీ మాజీ చీఫ్ సంజయ్ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై గురువారం వాదనలు వినిపించాల్సిందేనని.. లేదంటే ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని సుప్రీంకోర్టు ఆయన తరఫు న్యాయవాదులకు స్పష్టం చేసింది. అగ్నిమాపక శాఖలో నిరభ్యంతర పత్రాల(ఎన్వోసీ)ను ఆన్‌లైన్‌లో జారీచేసేందుకు అగ్ని-ఎన్వోసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ అభివృద్ధి, నిర్వహణ, 150 ట్యాబ్ల సరఫరా కాంట్రాక్టును అప్పటి జైళ్ల శాఖ డీజీ సంజయ్.. సౌత్రికా టెక్నాలజీస్ అండ్ ఇన్‌ఫ్రా సంస్థకు అప్పగించారు. పనులు జరగకపోయినా ఆ సంస్థకు రూ.59.93 లక్షల బిల్లులు చెల్లించేశారు. సీఐడీ తరఫున ఎస్సీ, ఎస్టీ చట్టంపై దళితులు, గిరిజనులకు అవగాహన సదస్సుల నిర్వహణ కాంట్రాక్టును క్రిత్వ్యాప్ టెక్నాలజీస్‌కు ఇచ్చి రూ.1.19 కోట్లు చెల్లించారు. సదస్సులు మొత్తం సీఐడీ అధికారులే జరిపారు. ఆ సంస్థకు బిల్లుల పేరిట దోచిపెట్టారు. ఖజానాకు దాదాపు రూ.2 కోట్ల నష్టం కలిగించారని రాష్ట్ర విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ప్రభుత్వానికి రెండు వేర్వేరు నివేదికలు సమర్పించింది. వాటి ఆధారంగా ఏసీబీ కేసు నమోదు చేయడం.. ప్రధాన నిందితుడిగా సంజయ్ పేరును చేర్చడం, ఆ కేసులో ఏపీ హైకోర్టు ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయడం తెలిసిందే. హైకోర్టు తీర్పును ఈ ఏడాది మార్చి 5న రాష్ట్రప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఆ పిటిషన్‌పై బుధవారం జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఎస్.వి.ఎన్. భట్టిలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. అయితే సంజయ్ తరఫు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ అందుబాటులో లేరని జూనియర్ న్యాయవాది తెలిపారు. విచారణను వాయిదా వేయాలని కోరారు. గతంలో కూడా ఇలాగే జరిగిందని రాష్ట్రప్రభుత్వం తరపు పు న్యాయవాది ఏఎస్ రాజు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. విచారణలో తీవ్ర జాప్యం చేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో గురువారమే(నేడు) వాదనలు వినిపించాలని.. లేనిపక్షంలో వేరే మార్గాలు చూసుకోవాలని సంజయ్ తరఫు న్యాయవాదులను ధర్మాసనం హెచ్చరించింది.

జైల్లో వంట కుదరదు

▸ రాజ్ కసిరెడ్డి పిటిషన్ డిస్మిస్

విజయవాడ, జూలై 30(ఆంధ్రజ్యోతి): విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న మద్యం కేసులో ప్రధాన నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డికి ఏసీబీ కోర్టులో చుక్కెదురైంది. జైలులో వంట చేసుకోవడానికి అనుమతి ఇవ్వాలని దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది. దీనికి సంబంధించిన తీర్పును న్యాయాధికారి పి.భాస్కరరావు బుధవారం వెలువరించారు. తనకు ఇంటి నుంచి భోజనం అనుమతించాలని గతంలో రాజ్ కసిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది. తర్వాత జైలులోనే వంట చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని మరో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన న్యాయస్థానం కొట్టేస్తూ తీర్పును ఇచ్చింది.

బాక్సులు బద్దలయ్యాయి

(మొదటి పేజీ తరువాయి)

ఏడాదిగా దాచిన ఈ నగదును సిట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. లిక్కర్ కేసులో నిందితుడైన వరుణ్ పురుషోత్తం(ఏ-40) ఇచ్చిన సమాచారం ఆధారంగా బుధవారం వేకువజామున వారు సోదాలు చేశారు. రాజ్ కసిరెడ్డి సూచనతో ఫామ్‌హౌస్‌లో 12 బాక్సుల్లో జాగ్రత్తగా భద్రపరిచిన రూ.11 కోట్ల నగదును సీజ్ చేశారు. ఇవి లిక్కర్ స్కామ్‌లో కసిరెడ్డి దాచి ఉంచిన ముడుపులేనని సిట్ ఆధారాలతో బయటపెట్టింది. నాడు తండ్రి అధికారాన్ని అడ్డు పెట్టుకుని వేల కోట్ల అవినీతికి పాల్పడిన జగన్‌పై 11 కేసులు నమోదు చేసిన సీబీఐ, ఆరు కేసులు పెట్టిన ఈడీ కూడా ఇన్ని కోట్ల రూపాయల నగదు సీజ్ చేయలేదు. దేశ చరిత్రలోనే ఇదే మొదటిసారి.



స్వాధీనం చేసుకున్న డబ్బు కట్టల వద్ద సిట్ సిబ్బంది

అరెస్ట్ చేసిన గంటల వ్యవధిలోనే...

మద్యం స్కాంలో రూ.3,500 కోట్ల ముడుపులు చేతులు మారినట్లు సిట్ నిర్ధారించింది. కుంభకోణం బయటకు రాగానే ఇందులో కీలకంగా ఉన్న కొందరిని పెద్దలు విదేశాలకు పంపించేశారు. వీరిలో కొందరికి దుబాయ్‌లో గోల్డ్ కార్డు కూడా ఇప్పించినట్లు తెలుస్తోంది. ఇలా విదేశాలకు పరారైన వారిలో ఏ-40 వరుణ్ పురుషోత్తంపై ఇప్పటికే లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. విజయవాడ కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో విదేశాల్లో ఉన్న నిందితులను రప్పించే యత్నాలను అధికారులు ముమ్మరం చేశారు. వరుణ్ పురుషోత్తం మంగళవారం రాత్రి దుబాయ్ నుంచి వస్తున్నట్లు తెలుసుకుని.. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అతడిని అరెస్టు చేశారు. వరుణ్ ఇచ్చిన సమాచారంతో బుధవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో శంషాబాద్ మండలం కాచారంలోని ఫామ్‌హౌస్‌లో దాడులు నిర్వహించారు. నగదు స్వాధీనం చేసుకుని విజయవాడకు తరలించారు. వరుణ్‌ను విజయవాడ సిట్ కార్యాలయానికి తరలించి విచారిస్తున్నారు.

కాఫీ షాపు నుంచి దుబాయి వరకు...

కేసు విచారణలో కీలకంగా ఉన్న వరుణ్ బయటపెడుతున్న విషయాలతో మద్యం కేసు మలుపులు తిరుగుతోంది. ఇప్పుడు వరుణ్ ఎవరనే దానిపై చర్చ జరుగుతోంది. సికింద్రాబాద్‌కు చెందిన వరుణ్ ఇంజనీరింగ్ చదివాడు. హైదరాబాద్‌లోని ఓ కాఫీ షాపులో నెలకు రూ.32 వేల వేతనంతో పనిచేసేవాడు. అతడిని ఓ ఎన్ఆర్ఐ డాక్టర్ కసిరెడ్డి బృందానికి పరిచయం చేసినట్లు సమాచారం. ఇలా కసిరెడ్డి డెన్‌లోకి ప్రవేశించిన వరుణ్ మద్యం ముడుపుల వసూళ్లలో కీలకంగా మారాడు. లిక్కర్ గ్యాంగ్‌లో కీలక సూత్రధారి రాజ్ కసిరెడ్డి.. ఎంపీ మిథున్ రెడ్డితో కలిసి ఆయన బినామీగా నడిపించిన ఆదాన్ డిస్టిలరీస్‌తో పాటు పుదుచ్చేరికి చెందిన లీలా డిస్టిలరీస్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా నున్నలో చిరునామా చూపించి వరుణ్‌ను మొత్తం వ్యాపారానికి ఇన్‌చార్జిగా నియమించారు. అతడి పేరుతో బ్యాంకు ఖాతా తెరిపించి రూ.10 కోట్ల వరకు చెక్ పవర్ కల్పించారు. ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ నుంచి లీలా డిస్టిలరీస్‌కు భారీగా మద్యం ఆర్డర్లు కట్టబెట్టారు. లీలా డిస్టిలరీస్ ద్వారా రూ.453.97 కోట్ల వరకు వ్యాపారం చేశారు. అందుకు ప్రతిఫలంగా 16 ఖాతాల్లోకి 52.78 కోట్ల ముడుపులు జమ చేశారు. అందులో 11 కోట్ల సొమ్ము అందుకున్న పొట్లూరి అంజిరెడ్డి, పియూష్ గడోడియా అనే వ్యక్తులు నోట్ల కట్టలు అట్టపెట్టెల్లో పెట్టి కసిరెడ్డికి అందజేశారు. అతడు వరుణ్ ద్వారా తన ఎదురు విల్లాలో ఉండే తీగల విజయేందర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డికి చెందిన వర్ధమాన్ ఇంజనీరింగ్ కళాశాలలో భద్రపరిచారు. అంతకుముందు పలుమార్లు లిక్కర్ ముడుపులకు సంబంధించిన సమావేశాలు నిర్వహించిన సులోచన వ్యవసాయ క్షేత్రంలోకి తర్వాత తీసుకెళ్లారు. అక్కడి సిబ్బందికి అనుమానం రాకుండా కళాశాలకు చెందిన ఏ-4 సైజ్ పేపర్లంటూ లోపల దాచారు. గత ఏడాది ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయాక డబ్బులు భద్రంగా దాచేసిన రాజ్ కసిరెడ్డి.. వరుణ్ పురుషోత్తంను దుబాయ్‌కి పంపించేశాడు. వీటికి సంబంధించిన ఆధారాలను సిట్ సంపాదించింది.

ఫైళ్లు, బియ్యం బస్తాల మాటున..

నగదు బయటపడ్డ ఫామ్ హౌస్ యజమాని కుటుంబానికీ, రాజ్ కసిరెడ్డి కుటుంబానికీ మధ్య సన్నిహిత సంబంధాలున్నాయి. ఈ ఫామ్ హౌస్ వర్ధమాన్ ఇంజనీరింగ్ కాలేజీ యజమాని తీగల బాల్‌రెడ్డి కుటుంబానికి చెందినది. ఆయన భార్య పేరిటే ఈ ఫామ్ హౌస్ ఉంది. తీగల బాల్‌రెడ్డి, రాజ్ కసిరెడ్డి సతీమణి దివ్యా రెడ్డి... ఇద్దరూ ఆరెట్ ఆస్పత్రిలో భాగస్వాములు కావడం విశేషం. ఈ పరిచయంతోనే... లిక్కర్ స్కామ్ నగదు దాచేందుకు వీరి ఫామ్‌హౌస్‌ను వాడుకున్నట్లు తెలుస్తోంది. ఫామ్ హౌస్‌లోని స్టోర్ రూమ్‌లో ఫైళ్లు, బియ్యం బస్తాల మధ్య అట్టపెట్టెల్లో ఈ నగదును దాచి ఉంచారు. పక్కా సమాచారంతో వెళ్లిన సిట్ అధికారులు రూ.11 కోట్ల నగదు గుర్తించి జప్తు చేశారు. ఈ వివరాలను ఈడీకి సిట్ తెలియజేసింది. ఐటీ కూడా దృష్టిసారించే అవకాశం ఉంది.

11 కోట్లను కోర్టులో భద్రపరచండి

▸ ఏసీబీ కోర్టులో మెమో దాఖలు చేసిన సిట్

విజయవాడ, జూలై 30(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మండలం కాచారంలోని ఫాంహౌస్ నుంచి స్వాధీనం చేసుకున్న మద్యం కుంభకోణం సొమ్ము రూ.11 కోట్లను కోర్టులో భద్రపరచాలని సిట్ అధికారులు కోరారు. ఈ మేరకు విజయవాడ ఏసీబీ కోర్టులో బుధవారం మెమో దాఖలు చేశారు. కేసులో ఏ-40గా ఉన్న వరుణ్ పురుషోత్తం ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా సుమతి ఫాంహౌస్‌లో అట్టపెట్టెల్లో దాచిన రూ.11 కోట్లు స్వాధీనం చేసుకొని, ప్రత్యేక వాహనాల్లో విజయవాడకు తరలించామని తెలిపారు. ఈ మొత్తం డబ్బును కోర్టులో భద్రపరచాలని, లేదా బ్యాంక్‌లో ఎఫ్‌డీ రూపంలో జమ చేయడానికి అనుమతించాలని కోరారు.

చాణక్యను నమ్మి మోసపోయా..

వరుణ్ పురుషోత్తం విచారణలో పలు విషయాలు వెల్లడించినట్లు తెలిసింది. తాను ఉన్నత విద్యావంతుడినని, బూనేటి చాణక్యను నమ్మి అన్నివిధాలా జీవితాన్ని కోల్పోయానని కంటతడి పెట్టుకున్నట్లు సమాచారం. తనకు తెలియని లిక్కర్ బిజినెస్‌లో దింపి ప్రభుత్వం మారగానే దుబాయ్‌కు తీసుకెళ్లాడని, సీఐడీ కేసు నమోదు చేసినప్పటి(2024 సెప్టెంబరు) నుంచి ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపానని వాపోయినట్లు తెలిసింది. తీగల సోదరులు కూడా చాణక్యతో తరచూ సమావేశం అయ్యేవారని, ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయిన తర్వాత దుబాయ్ వెళ్లేందుకు తమకు సహకరించారని వెల్లడించినట్లు సమాచారం. తమతో పాటు దుబాయ్ వచ్చిన బూనేటి చాణక్య సిట్ పిలుపుతో తిరిగొచ్చే సమయంలో.. 'ఇది నిలబడే కేసు కాదు.. వెంటనే బెయిల్ తీసుకుని తిరిగొస్తా.. మీ పేర్లు చేర్చినా, 90 రోజులు దాటినా ముందస్తు బెయిల్ వచ్చేస్తుంది.. అని ఇక్కడికి వచ్చాడు. అరెస్టై విజయవాడ జైల్లో ఖైదీలకు వంట చేస్తున్నాడు. దీంతో మాకు భయం పట్టుకుంది. రెడ్ కార్నర్ నోటీసు అనగానే అందరూ దుబాయ్ నుంచి వెనక్కి వద్దామని అనుకున్నాం. మిగతా వాళ్లు కూడా వచ్చేస్తారు' అని సిట్ అధికారులకు వివరించినట్లు తెలిసింది.

ప్రతినెలా 40 లక్షల ఖర్చు

రాజ్ కసిరెడ్డి గ్యాంగ్‌లోని కీలక వ్యక్తి తుకేకుల ఈశ్వర్ కిరణ్ కుమార్ రెడ్డి(ఏ-9) సహా నిందితుల్ని దుబాయ్‌లోని దమాక్ బేస్ ఏడ్జ్‌లో రెండు ఫ్లాట్లు అద్దెకు తీసి పెట్టాడు. విలాసవంతమైన ఫ్లాట్లలో నివసించేందుకు ఒక్కొక్కరికి తొమ్మిది వేల నుంచి పదివేల దిర్హమ్‌లు అంటే.. రూపాయల్లో రెండు లక్షల నుంచి 2.40 లక్షలు ఇచ్చేవాడని తెలిసింది. కిరణ్ కుమార్ ఒక్కడే వేరే చోట ఉంటున్నాడని, అందరికీ కలిపి ప్రతి నెలా 40 లక్షల వరకూ ఖర్చు వస్తోందని సమాచారం. రాజ్ కసిరెడ్డి, బూనేటి చాణక్య ఇప్పట్లో బెయిల్‌పై వచ్చే అవకాశం లేనందున అక్కడ ఖర్చు భరించలేక ఇతర నిందితులు తిరిగొచ్చే ప్రయత్నాల్లో ఉన్నట్లు సిట్ అధికారులకు సమాచారం అందింది.

ఆ 11 కోట్లతో నాకు సంబంధం లేదు

▸ బెయిల్‌ను అడ్డుకునేందుకు సిట్ ప్రయత్నం

▸ ఏసీబీ కోర్టులో రాజ్ కసిరెడ్డి అఫిడవిట్



విజయవాడ, జూలై 30(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మండలం కాచారంలోని ఫాంహౌస్ నుంచి సిట్ స్వాధీనం చేసుకున్న రూ.11 కోట్లతో తనకు ఎలాంటి సంబంధం లేదని మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి కోర్టుకు తెలిపారు. దీనికి సంబంధించిన అఫిడవిట్‌ను ఆయన తరఫు న్యాయవాది బుధవారం విజయవాడ ఏసీబీ కోర్టులో దాఖలు చేశారు. మద్యం కుంభకోణంలో సిట్ ఏప్రిల్ 22న తనను అరెస్టు చేసిందని, అప్పటి నుంచి విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నానని.. తనకు బెయిల్ రాకుండా అడ్డుకునేందుకు సిట్ ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. ఎక్కడెక్కడో పట్టుకున్న డబ్బును తనకు లింక్ చేసి కట్టుకథలు అల్లుతోందన్నారు. తీగల బాలిరెడ్డికి చెందిన ఫామ్‌హౌస్‌లో స్వాధీనం చేసుకున్న రూ.11 కోట్లు తనవేనని సిట్ నిరాధార ఆరోపణలు చేస్తోందన్నారు. బాలిరెడ్డికి ఆయన కుమారుడు విజయేందర్ రెడ్డికి అనేక వ్యాపారాలు ఉన్నాయని, ఇంజనీరింగ్ కాలేజీలు, డయాగ్నొస్టిక్ సెంటర్లు, ఆస్పత్రులు నడుపుతూ కోట్లాది రూపాయల లావాదేవీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. వారి ఆధ్వర్యంలో నడుస్తున్న ఆరెట్ ఆస్పత్రుల్లో తన భార్యకు చాలా స్వల్ప షేర్ ఉందని, అది తప్ప 'తీగల'తో తనకు ఎలాంటి సంబంధాలు లేవని రాజ్ కసిరెడ్డి స్పష్టం చేశారు.

12 బాక్సుల్లో 11 కోట్లేనా?

▸ మరో కోటి ఎవరు కొట్టేశారు: పేర్ని నాని



మచిలీపట్నం, జూలై 30(ఆంధ్రజ్యోతి): '12 డబ్బాల్లో రూ. 12 కోట్లు ఉండాలి కదా! రూ. 11 కోట్లే ఉన్నాయని చెబుతున్నారేంటి.? మిగిలిన కోటి ఎవరు కొట్టేశారు' అని మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నాని ప్రశ్నించారు. మాజీ సీఎం జగన్‌పై నిందలు వేయడానికే కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. బుధవారం తాడేపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, హైదరాబాద్‌లో రాజ్ కసిరెడ్డి రూ. 11 కోట్లు దాచుకున్నాడని, ఇప్పుడు ఆ నగదును స్వాధీనం చేసుకున్నామని చెబుతున్నారన్నారు. అతడిని ఓ లిక్కర్ డాన్‌గా పత్రికల్లో రాస్తున్నారని, అలాంటి వ్యక్తి రూ. 11 కోట్లను ఇంతకాలంగా హైదరాబాద్‌లోనే ఉంచుతాడా? అంటూ ప్రశ్నించారు. ఈస్కాంపై ఎలక్షన్ వచ్చేవరకు చార్జిషీట్ వేయరని చెప్పారు. ఈ కేసులో జగన్ పేరు చెప్పాలని వాసుదేవరెడ్డిని హింసిస్తే, ఆయన హైకోర్టులో కేసు వేశాడన్నారు. దీంతో ఆయనను విడిచిపెట్టారని చెప్పారు. విజయసాయిరెడ్డి అనుకూలంగా మారడంతో ఆయన్ను వదిలేశారన్నారు. చంద్రబాబు హయాంలో లక్షల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు.

మైహోమ్ నుంచి ఏ హోమ్‌కు!?

(మొదటి పేజీ తరువాయి)

కేటాయించారనే అనుమానాలు తలెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళితే...

ఉమ్మడి గుంటూరు జిల్లా దాచేపల్లి మండలం గామాలపాడు గ్రామంలో 919 ఎకరాల్లో సున్నపురాయి నిక్షేపాలు ఉన్నాయి. వాటి విలువ వేల కోట్లలోనే! రాష్ట్ర విభజన అనంతరం ఈ భూములను మైహోమ్ ఇండస్ట్రీస్‌కు కేటాయిస్తూ 2016 డిసెంబరు 12న ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇది... 'క్యాప్టివ్' మైనింగ్! అంటే... స్థానికంగా సిమెంట్ ప్లాంటును ఏర్పాటు చేసి, దానికోసం మాత్రమే సున్నపురాయిని ఉపయోగించుకోవాలి. మూడేళ్లలో అంటే 2019 డిసెంబరు నాటికి ఈ ప్లాంట్‌ను ప్రారంభించేలా గనుల శాఖతో మైహోమ్ ఇండస్ట్రీస్ ఒప్పందం కుదుర్చుకుంది. కానీ... గడువులోపు ఆ సంస్థ ప్లాంటు ఏర్పాటు చేయలేదు. దీంతో 2020 వరకు గడువును పొడిగించారు. అయినా ప్లాంటు ఏర్పాటుపై అడుగు కూడా ముందుకు పడలేదు. దీంతో మరోసారి 2023 వరకు పొడిగింపు ఇచ్చారు. అయినా ఫలితం లేదు. మరోసారి... 2024 జూలై 7 వరకు ప్రభుత్వం గడువు నిర్దేశించింది. ఈలోగా సిమెంట్ ప్లాంటు ఏర్పాటు చేయలని స్పష్టం చేసింది.

తెరపైకి మరో సంస్థ...

గనులశాఖతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు సిమెంటు కంపెనీ ప్రారంభించాల్సిన మైహోమ్ సంస్థ... 'రాధాంగ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్'ను తెరపైకి తెచ్చింది. "మాకు ఇచ్చిన సున్నపురాయి లీజును రాధాంగ ఇండస్ట్రీస్‌కు బదిలీ చేయండి' అంటూ నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్సీఎల్టీ)ని ఆశ్రయించింది. అక్కడ... అందుకు అనుకూలంగా అనుమతులు వచ్చాయి. ఆ వెంటనే గామాలపాడులోని 919 ఎకరాల సున్నపురాయి నిల్వలున్న భూముల లీజులను మైహోమ్ ఇండస్ట్రీస్ నుంచి రాధాంగ ఇండస్ట్రీస్ పేరిట మార్చాలని, లీజు కాలపరిమితిని 2067గా నిర్ణయించాలని గనుల శాఖ డైరెక్టర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. దీన్ని ఆమోదిస్తూ ప్రభుత్వం మంగళవారం జీవో 141 జారీ చేసింది.

ఏమిటీ చిత్రం?

'క్యాప్టివ్' అంటేనే షరతులకు లోబడి అని! దీని ప్రకారం మైహోమ్ తప్పనిసరిగా సిమెంట్ ఫ్యాక్టరీ పెట్టి, లీజుకు పొందిన సున్నపురాయిని దానికోసమే వాడాలి. అయితే... ఫ్యాక్టరీ పెట్టకపోగా, ఆ లీజులను మరో కంపెనీకి బదిలీ చేయాలని ఎన్సీఎల్టీని ఆశ్రయించడమే ఒక విచిత్రం! రాధాంగ ఇండస్ట్రీస్ 2023 మే 8న హైదరాబాద్ కేంద్రంగా రిజిస్టర్ అయింది. అంటే అది పుట్టి రెండేళ్లు! దాని చిరునామా కూడా మాదాపూర్ (హైదరాబాద్)లోని మైహోమ్ హబ్‌గానే చూపిస్తుండటం విశేషం. సిమెంట్ పరిశ్రమకు 'బంగారం'తో సమానమైన సున్నపురాయి లీజులను మైహోమ్ ఎందుకు వదులుకుంది? 'రాధాంగ ఇండస్ట్రీస్‌కే ఇవ్వాలని ఎందుకు కోరింది? ప్రభుత్వం ఎలాంటి అభ్యంతరం లేకుండా లీజులు ఎలా బదిలీ చేసింది? ఇవన్నీ ప్రశ్నలే! రాధాంగ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ 'క్లింకర్స్ అండ్ సిమెంట్' తయారీలో ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. రెండేళ్ల కింద ఆవిర్భవించిన ఈ కంపెనీకి ఎక్కడ సిమెంటు తయారీ ప్లాంట్లు ఉన్నాయో తెలియదు! మైహోమ్‌కు దాచేపల్లి మండలం గామాలపాడు గ్రామంలో 919 ఎకరాల లీజును 'క్యాప్టివ్' ప్రాతిపదికన కేటాయించారు. కానీ... రాధాంగకు బదిలీ చేస్తూ ఇచ్చిన ఉత్తర్వుల్లో 'క్యాప్టివ్‌'పై స్పష్టత లేకపోవడం గమనార్హం.

క్వార్ట్జ్ పరిశ్రమ పెట్టను




▸ ప్రతిపక్షాల విమర్శలతో కలత చెందా: వేమిరెడ్డి

నెల్లూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా సైదాపురంలో క్వార్ట్జ్ పరిశ్రమ స్థాపించాలన్న ఆలోచనను విరమించుకున్నట్లు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ప్రకటించారు. ఇటీవల క్వార్ట్జ్ విషయమై తనపై చేస్తున్న విమర్శలకు మనస్తాపానికి గురై ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. బుధవారం రాత్రి నెల్లూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ప్రజలకు సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చాను. ఆ ఉద్దేశంతోనే జిల్లాలో క్వార్ట్జ్ పరిశ్రమ నెలకొల్పాలనుకున్నాను. అయితే ఇటీవల ప్రతిపక్ష నాయకులు, కొన్ని పత్రికలు(ఆంధ్రజ్యోతి కాదు).. నేను క్వార్ట్జ్ రూపంలో వందల కోట్లు దోచుకుంటున్నట్లుగా అవాస్తవాలు ప్రచారం చేస్తున్నాయి. ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలనే విలేకరుల సమావేశం ఏర్పాటు చేశాను. కూటమి ప్రభుత్వ పెద్దల అనుమతితో రూ.400 కోట్ల పెట్టుబడితో ఇక్కడ పరిశ్రమ పెట్టాలని నిర్ణయించాను. నా ప్రతినిధులను చైనా పంపి పరిశ్రమ స్థాపనకు అవసరమైన ఏర్పాట్లన్నీ పూర్తి చేశాను. మన దగ్గర లభ్యమయ్యే క్వార్ట్జ్.. సోలార్ ప్లేట్స్, ఎలక్ట్రానిక్స్ పరికరాలకు ఏ విధంగా పనికి వస్తుందో అధ్యయనం చేయడానికి ఇప్పటి వరకు 19వేల టన్నుల క్వార్ట్జ్ కొనుగోలు చేసి చైనాకు ఎగుమతి చేశాం. ఇప్పటి వరకు పరిశ్రమ మొదలు కాలేదు.. మన క్వార్ట్జ్ ఎందుకు పనికి వస్తుందో అధ్యయనం జరుగలేదు.. అంతలోనే వందల కోట్లు దోచుకుంటున్నట్లు విమర్శించడం బాధ కలిగించింది. రాజకీయంగా నన్ను టార్గెట్ చేసుకున్న కొంత మంది నాయకులకు క్వార్ట్జ్ పరిశ్రమ ఆయుధంగా దొరికింది. వారికా అవకాశం ఇవ్వకూడదనే పరిశ్రమ స్థాపించాలన్న ఆలోచన విరమించుకుంటున్నాను' అని వెల్లడించారు. రాజకీయాలకు రాక ముందునుంచే తన సొంత డబ్బుతో సేవా కార్యక్రమాలు చేస్తున్నానని.. విమర్శలు తట్టుకోవడం తనకు చేతకాదని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నానని అన్నారు. జిల్లా ప్రజలకు మంచి చేయాలనే ఆలోచన నుంచి వెనకడుగు వేయనని.. మరో పరిశ్రమ స్థాపించడం ద్వారా ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని తెలిపారు. ఇకనుంచి క్వార్ట్జ్ పరిశ్రమకు, తనకు సంబంధం లేదని, ఇంకా ఎవరైనా తప్పుడు ఆరోపణలు, విమర్శలు చేస్తే వారి కర్మకే వదిలేస్తున్నానని వేమిరెడ్డి అన్నారు.

మధ్యవర్తిత్వం చక్కటి పరిష్కారం

▸ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి



మధ్యవర్తిత్వం ఓరియంటేషన్ కార్యక్రమంలో జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ రవినాథ్ తిల్హరి, జస్టిస్ ఎన్.జయసూర్య, జస్టిస్ టీసీడీ శేఖర్

అమరావతి, జూలై 30(ఆంధ్రజ్యోతి): వివాహ, వ్యాపార సంబంధ వివాదాలకు మధ్యవర్తిత్వం చక్కటి పరిష్కారమని రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి పేర్కొన్నారు. మధ్యవర్తి సమక్షంలో జరిగే చర్చలు గోప్యంగా ఉంటాయని, ఇక్కడలభించే పరిష్కారం శాశ్వతమని తెలిపారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న మీడియేషన్ ఫర్ నేషన్ క్యాంపెయిన్‌లో భాగంగా మధ్యవర్తిత్వంపై శిక్షణ పొందిన హైకోర్టు న్యాయవాదులకు బుధవారం ఒక్కరోజు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.రఘునందనరావు హాజరయ్యారు. జస్టిస్ ఎన్.జయసూర్య, జస్టిస్ టీసీడీ శేఖర్, సీనియర్ ట్రైనర్లు అనుజా సక్సేనా, ఎస్.అరుణాచలం పాల్గొన్నారు.

జగన్ అవినీతిపై 'సిట్' ఏర్పాటు చేయండి

▸ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు

▸ పిటిషనర్ అభ్యర్థనతో విచారణ వారం రోజులకు వాయిదా

అమరావతి, జూలై 30(ఆంధ్రజ్యోతి): 'మాజీ ముఖ్యమంత్రి జగన్ నేతృత్వంలోని వైసీపీ ప్రభుత్వ హయాంలో సహజ వనరులను కొల్లగొట్టడంతో రాష్ట్ర ఖజానాకు రూ.లక్షల కోట్లు నష్టం వాటిల్లింది. దీనిపై దర్యాప్తు చేసేందుకు సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తితో సిట్ ఏర్పాటు చేయండి' అని కోరుతూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. సీబీఐ, ఈడీ, ఆదాయపు పన్ను, రెవెన్యూ, రాష్ట్ర పోలీసులను సిట్‌లో సభ్యులుగా నియమించాలని పిటిషనర్ విన్నవించారు. ఆదాయనికి మించి ఆస్తులు కలిగి ఉన్న జగన్, తదితరులపై నిష్పాక్షిక దర్యాప్తునకు వీలుగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసేలా సీబీఐ, ఈడీని ఆదేశించాలని కోరుతూ ఢిల్లీకి చెందిన న్యాయవాది మెహెక్ మహేశ్వరి ఈ పిల్ దాఖలు చేశారు. కూటమి ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రాలను పిల్‌కు జత చేశారు. జీఏడీ ముఖ్యకార్యదర్శి, కేంద్ర హోం, ఆర్థిక వ్యవహారాల శాఖ కార్యదర్శులను ప్రతివాదులుగా చేర్చారు. ఈ పిల్ బుధవారం విచారణకు రాగా పార్టీ ఇన్ పర్సన్ మెహెక్ మహేశ్వరి ఆన్‌లైన్ ద్వారా స్పందిస్తూ... ప్రస్తుత పిల్‌లో స్వయంగా హైకోర్టుకు హాజరై వాదనలు వినిపిస్తానని, విచారణను వచ్చే వారానికి వాయిదా వేయాలని కోరారు. అందుకు అంగీకరించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం విచారణను వచ్చే బుధవారానికి వాయిదా వేసింది.

పిటిషన్‌లో ఏముందంటే....

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్న అవినీతిపై సీఎం చంద్రబాబు శాసనసభ వేదికగా శ్వేతపత్రాలు విడుదల చేశారు. గత ప్రభుత్వం ఖనిజాలు, గనులు, భూమి, అడవులను కొల్లగొట్టి ప్రభుత్వ ఖజానాకు రూ.లక్షల కోట్లు నష్టం చేసిందని అందులో పేర్కొన్నారు. 'విశాఖలో భూ ఆక్రమణల ద్వారా ఖజానాకు రూ.4,469 కోట్ల నష్టం జరిగింది. ఒంగోలులో కుటుంబ వివాదాలు, ఖాళీ స్థలాలు, ప్రభుత్వ భూములకు నకిలీ పట్టాలు సృష్టించి రూ.101 కోట్ల భూ కుంభకోణానికి పాల్పడ్డారు. తిరుపతిలో నిషేధిత జాబితా(22ఏ)లోని భూములను రిజిస్ట్రేషన్ చేయడం ద్వారా ఖజానాకు రూ.270 కోట్లు నష్టం వాటిల్లింది. చిత్తూరు జిల్లాలో ఎస్టేట్ అబాలిష్‌మెంట్ యాక్ట్‌ను ఉల్లంఘించి వ్యవసాయేతర భూముల్లో సొంత మనుషులకు పట్టాల కేటాయించడంద్వారా రూ.99 కోట్లు, అసైన్డ్ భూముల్లో ఇళ్లస్థలాలు కేటాయించడం, వివిధఅక్రమాల ద్వారా రూ.3వేల కోట్లు, వైసీపీ కార్యాలయాలకు భూముల కేటాయింపుతో రూ.300 కోట్ల అక్రమాలకు పాల్పడ్డారు' అని శ్వేతపత్రంలో పేర్కొన్న వివరాలను పిటిషన్‌లో పేర్కొన్నారు.

ఆ జీవోనూ సవాల్ చేయండి

▸ విజయవాడలో 'లులు'కు భూ కేటాయింపు వ్యవహారంపై పిటిషనర్‌కు హైకోర్టు ఆదేశం

అమరావతి, జూలై 30(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంతో పాటు విజయవాడలో లూలూ గ్రూపునకు భూమిని కేటాయిస్తూ జారీ చేసిన జీవోను కూడా సవాల్ చేయాలని పిటిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. ఆ తర్వాత పిల్‌పై పూర్తిస్థాయి విచారణ జరుపుతామని పేర్కొంది. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖ నగరంలో షాపింగ్ మాల్ ఏర్పాటుకు సంబంధించి 13.5 ఎకరాలను తక్కువ ధరకు రాష్ట్ర ప్రభుత్వం లులు సంస్థకు కేటాయించబోతుందని పేర్కొంటూ పాకా సత్యనారాయణ పిల్ దాఖలు చేశారు. ఈ పిల్ బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది అశోక్‌రామ్ వాదనలు వినిపించారు. లులు సంస్థకు 2018లో బిడ్డింగ్ ద్వారా భూమి కేటాయించారని తెలిపారు. 2019 నవంబరు 8న అప్పటి వైసీపీ ప్రభుత్వం భూ కేటాయింపులను రద్దు చేసిందని పేర్కొన్నారు. బిడ్లు ఆహ్వానించకుండా, సంస్థ చైర్మన్ ప్రతిపాదనల మేరకు సీఆర్‌జెడ్ నిబంధనలను ఉల్లంఘించి ఆ సంస్థకు తిరిగి భూమిని కేటాయించారని వివరించారు. విజయవాడలో కూడా లులు సంస్థకు భూమి కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించిందని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.... విజయవాడలో లులు గ్రూపుకు భూమిని కేటాయిస్తూ జారీ చేసిన జీవోను కూడా సవాల్ చేయాలని పిటిషనర్‌కు సూచించింది.

తురకా కిశోర్ మళ్లీ అరెస్టు

▸ జైలు నుంచి రాగానే అదుపులోకి రౌడీషీటర్

▸ గత ఏడాది ఏప్రిల్లో టీడీపీ నేత సిద్ధయ్యపై కిశోర్ దాడి...బాధితుడి ఫిర్యాదుతో కేసు

గుంటూరు/రెంటచింతల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రధాన అనుచరుడు, రౌడీ షీటర్, మాచర్ల మున్సిపాలిటీ మాజీ చైర్మన్ తురకా కిశోర్ బుధవారం గుంటూరు జిల్లా జైలు నుంచి విడుదలయ్యాడు. అయితే జైలు నుంచి బయటకు అడుగు పెట్టగానే హత్యాయత్నం కేసులో రెంటచింతల పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఎన్నికలకు ముందు గత ఏడాది ఏప్రిల్ 8న రెంటచింతల బస్టాండ్ సమీపంలో టీడీపీ నేత సన్నెగంటి సిద్ధయ్య కరపత్రాలు పంచుతూ.. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డికి ఓటేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తుండగా కిశోర్ అడ్డుకున్నాడు. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. కిశోర్ మారణాయుధంతో దాడి చేసి సిద్ధయ్యను తీవ్రంగా గాయపరిచాడు. నాడు వైసీపీ అధికారంలో ఉండడంతో ఫిర్యాదు చేయడానికి సిద్ధయ్య భయపడ్డాడు. ఈ ఘటనపై తాజాగా రెంటచింతల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.



జైలు వద్ద పోలీసు వాహనానికి అడ్డుపడుతున్న రౌడీషీటర్ తురకా కిశోర్ భార్య సురేఖ

దీనిపై మంగళవారం రాత్రి కిశోర్‌పై ఐపీసీ 307 సెక్షన్ కింద హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సీహెచ్ నాగార్జున చెప్పారు. బుధవారం గుంటూరు జిల్లా జైలు నుంచి బయటకు వచ్చిన కిశోర్‌ను వెంటనే ఈ కేసులో పోలీసులు అదుపులోకి తీసుకుని వాహనం ఎక్కించారు. అయితే అప్పటికే కిశోర్ భార్య సురేఖ తన ఇద్దరు పిల్లలు, కుటుంబ సభ్యులు, వైసీపీ ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, వైసీపీ నాయకులతో అక్కడకు చేరుకున్నారు. పోలీసు వాహనానికి వారంతా అడ్డుపడి హల్‌చల్ చేశారు. తన భర్తను వదిలివేయాలని, కేసు మీద కేసు పెట్టి బయటకు రాకుండా అరెస్టు చేస్తున్నారని సురేఖ ఆగ్రహం వ్యక్తంచేశారు.

బుద్దా వెంకన్న, బొండాపై హత్యాయత్నం వీడియో వైరల్

జగన్ హయాంలో స్థానిక ఎన్నికల సందర్భంగా మాచర్ల వెళ్లిన టీడీపీనేతలు బుద్దా వెంకన్న, బొండా ఉమా వాహనంపై తురకా కిశోర్ దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. జిల్లా జైలు వద్ద కిశోర్ కుటుంబ సభ్యులు చేసిన హంగామా తాలూకు వీడియోకు ఆనాటి అతడి అరాచకం వీడియోను ట్యాగ్ చేసి నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

కిశోర్‌పై ఎన్ని కేసులున్నాయ్?

▸ వివరాలతో అఫిడవిట్ వేయండి

▸ పల్నాడు జిల్లా ఎస్పీకి హైకోర్టు ఆదేశం

అమరావతి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత తురకా కిశోర్‌పై ఎన్ని కేసులు నమోదయ్యాయో వివరాలు తమ ముందుంచాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఘటనలు ఎప్పుడు జరిగాయి.. ఎప్పుడు ఫిర్యాదులు అందాయి.. ఎప్పుడు అరెస్టు చేశారు.. తదితర వివరాలను పట్టిక రూపంలో సమర్పించాలని పల్నాడు జిల్లా ఎస్పీకి స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఆగస్టు 4కి వాయిదా వేసింది. ఈ మేరకు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ సుమతితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. గుంటూరుజిల్లా జైలు నుంచి విడుదలైన తన భర్త కిశోర్‌ను పోలీసులు అక్రమంగా నిర్బంధించారని, కోర్టు ముందు హాజరుపరిచేలా వారిని ఆదేశించాలని కోరుతూ సురేఖ బుధవారం హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. పోలీసుల తరఫున ఎస్‌జీపీ విష్ణుతేజ వాదనలు వినిపించారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**, on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal, Guntur, Editor: **N.Rahul Kumar** Phone No: (0863)2512379,2512376, RNI no.APTEL/2003/9781. **Managing Director : Vemuri Radha Krishna**. Founder: K.L.N.Prasad.